# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 34** **సంచిక 7**

**జులై - 2023**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI
Since 1946

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

**Hyderabad - 500 020.**

Ph: 040 - 27612436, 27645538.

Editor: **V. ASWINI KUMAR**

Ph: 994 951 6567

**<u>చందా వివరాలు:</u>**

₹ 600/- (సంవత్సర చందా),

₹ 1200/- (రెండు సంవత్సరాలకు),

₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : వి. ఆశారాణి

**040-27645536**

**Scan QR to Pay**

**Misimi Publication**

LIBRARY OF CONGRESS

**LCCN 91-903060**

**UGC Care**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

**ISSN 2454-4329**

**misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## జులై నెల సూచికలు...


చంద్రయాన్ : అశ్వినీకుమార్... 3
మత సామరస్యం : డా. ఎం. వినోదిని... 5
కేతు విశ్వనాథరెడ్డి : డా. కె. నారాయణ... 10
గిరిజన వైద్యంలో పచ్చబొట్లు : డా. గడ్డం వెంకన్న... 11
క్యూబా - 1 : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు... 15
6th ఎలిమెంట్ - మానవతావాదం : డా. కె.వి.యన్.డి. వరప్రసాద్... 22
గ్రామ సాహిత్యం : భమిడిపాటి గౌరీశంకర్... 25
నవలాహృదయం : సి.ఎస్. రాంబాబు... 27
మాలపల్లి నవల - మానవ స్వీయోద్ధరణ : డా. జంధ్యాల కనకదుర్గ... 29
కథ రాయటం నేర్పిన 'నన్ను గురించి కథ వ్రాయవూ?' : డా. పొదిలి నాగరాజు... 34
ఈ విశిష్టుడు - దర్శక వరిష్ఠుడు : డా. వోలేటి పార్వతీశం... 40
ఎన్.టి.ఆర్. మానస పుత్రిక తెలుగు విశ్వవిద్యాలయం : డాక్టర్ టి. గౌరీశంకర్... 43
చిత్రగీతాలు జావళీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 53
భారత స్వాతంత్ర్య సమరం... రైల్వే స్టేషన్లు : రామవరపు వేంకట రమణమూర్తి... 57
'మట్టిబండి'లో మాణిక్యాలు : డా. గుమ్మా సాంబశివరావు... 61
తెలంగాణ కవయిత్రులు : ఆచార్య కరిమిండ్ల లావణ్య... 67
చలం - బ్రాహ్మణీకం : ముంగర జాషువా... 71
ఖాకీవనం : వి. రాజారామమోహనరావు... 75
చదవండి... : ***మిసిమి*** ... 78



కేతు విశ్వనాథరెడ్డి


మొదటి చాన్స్‌లర్ - ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్

**అట్టమీది బొమ్మలు**


**సహస్రదళ సూర్యం**



**ధృతరాష్ట్రుడు**
(ఖెమూర్ ఆర్ట్ – చిత్రకారుడు: ధర్మ)



**గాంధారి**
(ఖెమూర్ ఆర్ట్ చిత్రకారుడు: ధర్మ)


**చంద్రకాంత**

# చంద్రయాన్

ఎండలు బండలు పగులుతున్నాయి. ఎన్ని పనులున్నా ఇంటిపట్టునే పడి ఉండాలి. అలా పడి ఉండటం కష్టం కదా! ఆశ్రమంలో చెట్టు నీడల్లో నడక దారుల్లో తిరుగుతుంటే ఉదయాన్నే కోయిలలు కచేరీ పెడుతుంటాయి. ప్రక్కన నిర్జన భూమి నుంచి రెండో మూడో నెమళ్లు గోడ దాటి వస్తుంటాయి. వీటి నాట్యంలాంటి నడక – వాటి కచేరీలాంటి పాటలు వింటుండగానే ఎండ – వేడి పెరిగిపోతుంటాయి.

రాత్రి కలలు – ఎండాకాలం పెద్దగా రావు. కానీ ఇప్పటి పగటి ఆలోచనలు – కలలకంటే వింతగా ఉంటాయి. ఐ.పి.ఎల్. చూస్తుంటే ఒక వింత ఆలోచన వచ్చింది. ఈ మధ్యన అందరూ చంద్రయానం అంటున్నారు కదా – ఈ ఐ.పి.ఎల్. మూకల్ని అక్కడకు పంపించి ఆడమంటే ఎలా ఉంటుంది – భారరహిత స్థితిలో – బంతులేమిటి – పరుగులేమిటి? అంపైర్ల తెంపులేమిటి? ఆలోచనే అద్భుతంగా ఉంది – ఏ పిచ్చాడయినా సినిమాలో పెడితే బావుంటుంది! (అయినా కామెరూన్‌కి ఎందుకు రాలేదు ఈ ఆలోచన?) హీరో కొడితే విలన్ మనుషులు గాలిలో తేలుతుంటారు కదా – అక్కడి గ్రావిటీ పని చేయదా? అందుకే అందర్నీ చంద్రయాన్ చేయించాలి – కొట్టుకోండి – తన్నుకోండి – తమాషా చూస్తాం అని. హా! ఇక వేరే బ్రహ్మానందాలు ఎందుకు? చాలా హాస్యం చంద్రునిపై దుమ్మురేపుతుంది! స్పాన్సర్ చేయడానికి మస్కరుడున్నాడు కదా – ఇక ఆటగాళ్ల వేలమే ఆలస్యం! ఎవడో జోయి – ఫ్రీగా స్ట్రీమింగ్ చేయకపోడు – ఇప్పుడు టి.వి. రేట్లు బాగా పడిపోయాయి కూడా! ఒక గొప్ప అవిడియా – చంద్రమండలాన్నే మార్చివేస్తుంది నేస్తం – కాస్త ఆలోచించండి. ఏమిటో ఎండ వేడికి బుర్ర – వెర్రెత్తిపోతోంది! పోనీ మెట్రోలో పనికి పోదామంటే 20 కిలోమీటర్లు 50 రూపాయలు. ఆశ్రమం నుంచి హైటెక్ నాలుగు కి.లో.మీ. రూ. 150/- త్రిచక్ర వాహనం! అదేమిటయ్యా అంటే ఎండలంటాడు!

అలాగే అని ఎక్కి మాట కలిపితే గుండె పగిలే ఊసు చెప్తాడు. ఎలాగంటే – ఎలాగో పడిపడి – జె.బి.ఎస్.లో మారి – ఎక్స్ రోడ్‌లో దిగి – పని గూటికి 10.00 గం.లకు చేరితే అప్పటికీ తోటివారికి తెల్లవారదు. ఇదేమి న్యాయం చెప్పండి! అంత ఎండలోనూ ఓ సీ.సి. (సీనియర్ సిటిజన్) వస్తారు – 'అయ్యా! మే సంచిక ఇస్తారా' అని. అదిగో! అందుకోసమే ఈ ఇష్ట కష్టాలన్నీ అనుకుంటూ ఆయనతో నాలుగు మంచి మాటలు వింటూ మీకు జరిగింది చెప్తున్నా–

నిన్న ధ్వని ముద్రణ కోసం గాలి కేంద్రానికి వెళ్లాం నేను – రాంబాబు. అక్కడ 'గాలి' గుంపు చాలానే ఉంది. అటూఇటుగా మూడు గంటలు సాగిన ఆ కార్యక్రమంలో రెంటాల (నిలువెత్తు నీరసానికి సాక్షి – అనీ ఆయన పరిచయం చేసుకున్నారు) ఉక్కులాంటి గోపీ – ప్రధాన స్రవంతి – వీరి మార్కు – కార్యక్రమాన్ని నడిపే కార్యవర్ధి – సమయస్ఫూర్తి సందీపు – తమసోమా నాగ్ – ఇంకా కొత్త క్రేటా శ్రీహరి. అయితే ఈ గుంపు గాలిది కాదు – ఎన్నో విషయాల చర్చల మీద కూర్చున్నాం – టీ తెమ్మంటారా – (విత్తా – వితౌటా?) – కాదు బాబు వేడిగా ఉంటే చాలు – అలా మొదలయింది – కొత్త పదాల సృష్టిదాకా వెళ్లింది. ఏమిటో ఈ ఎండలు – ఇనర్షయా – మళ్లీ చిరచిర – (ఈ ఎండలో ఏదో చైతన్యం ఉంది – చిరచిరలాడుతుంటుంది – రాజారావు)

సరే! మనం దీనిని 'జడ చైతన్యం' అందాం – దానికి మిత్రులు రెండు మూడు అర్థాలో – వివరణలో

చెప్పారు – ఏమయినా ఒక కొత్త పదం – ప్రయోగంలోకి వచ్చింది – ఈ జడ చైతన్యాన్ని –
ఆ మూడు గంటల్లో 'మూడు'నుబట్టి వాడుకున్నాం – ధ్వని ముద్రణ కార్యక్రమం – ఒక నవ్వుల లయ విన్యాసం!
ఒకరిది – జె. ది వరద ప్రవాహం – ప్రధాన స్రవంతి కూడా కొట్టుకుపోయేంత వేగం – మరొకరిది కథల్లాంటి కబుర్లు – దీనికీ ముద్రణ గది నుండి – 'ఈయన అన్నీ నేర్చాడు – బ్రతకటం తప్ప' అని ముక్తాయింపు – చేర్చింది.
బ్రతకటానికా – బ్రతుకుతూ నేర్చుకున్నవి – పూర్ణమిదః – శూన్యమిదమ్ – ఎన్ని చర్చలో – చివరికి తర్వాత ఏమి చర్చించాలో – అనే చర్చకు విశ్రాంతినిచ్చి కుర్చీలు ఖాళీ చేసి "ఆముదం"కు వెళ్లాం కొత్త వాసన క్రేటాలో – ఆరుగురం –
గోపీ వళ్లో రాంబాబు – నీకెట్లుందోగాని పిల్లా నాకు భలేగా ఉందిలే – అని పాడుతూ –
ఏమిటి ఇక్కడ వంటనూనె – ఆముదమా? లోపల కిట్టీ పార్టీలు రెండు మూడు నడుస్తున్నాయి –
మా ఆరుగురు మిత్రులను అడిగాను – కిట్టీపార్టీలు మనకు ఉండవా? నావంక వింతగా చూసి –
వీరికి వడదెబ్బ కొట్టింది – మిత్రపక్షాలు తీర్మానించాయి!



ఎడిటర్‌తో ఎడమ నుంచి: గోపీచంద్, రెంటాల జయదేవ్, నాగేశ్వరరావు, సందీప్, రాంబాబు

కొసమెరుపు ఏమిటంటే– బ్లూ–డార్ట్ కుర్రాడు రాత్రి. 9.00 గం॥లకు చెక్కు పుస్తకం తెచ్చాడు – వచ్చే ముందు ఫోన్ చేసి ఆశ్రమం చేరే దారి అడిగాడు. రోడ్డు నుంచి 1/2 కి.మీ. లోపలికి రావాలి. సెక్యూరిటీ దాటి – ఆఫీసు, లిఫ్టు – ఇదీ విషయం. మళ్లీ అతన్ని గది కోసం వెతికే ఇబ్బంది తప్పించాలని లిఫ్ట్ దగ్గర నుంచున్నా – కటకటాల తలుపు తెరుచుకుని ఎదురుగా ఉన్న నాకంత దూరంలో నిలబడి 'సార్ – మీకు పాదాభివందనం' అంటూ వంగి నమస్కారం చేస్తే కంగారు పడటం నావంతయింది.

'ఏమిటి విషయం'? అతను చెప్పిన విషయం – చెప్తే ఆత్మస్తుతి అవుతుంది. ఆ భాగం వదిలేద్దాం (నాకో విషయం గుర్తొచ్చింది. Mr. Bond! Your pop... precedes you - బాండ్ సినిమాలో విలన్ అంటాడు).

జయరాం – బ్లూడార్ట్ కుర్రాడు తన కథ చెప్తాడు! రాజారావు అన్నట్లు ఈ ప్రపంచంలో ఎంతో దుఃఖం ఉంది! అంతులేని చింతలున్నాయి! ఆ కథ మరోసారి చెప్పుకుందాం!

తెలుగు విశ్వవిద్యాలయం గంగిశెట్టిగారి సమావేశానికి వెళ్లటానికి, ఎండకు దడిసి, (చూడండి! వానకు తడుస్తాం – ఎండకు దడుస్తాం!) ఉబర్‌లో ఎక్కాం చల్లగా – మామూలుగానే చోదకునితో సోది మొదలుపెట్టాను – అతను చెప్పింది విని – తను – తండ్రి కోసం కారు కొన్నాడు – దానికి ఇ.ఎమ్.ఐ. కట్టడానికి ఉబర్ నడుపుతున్నాడు – అంతవరకూ బాగానే ఉంది – కాని అతని ప్రధాన వ్యాపకం ఆడిటింగ్ – సియే చేసి – ఒక బాధ్యత కోసం ఉబర్ నడపటం – విని, మేము అవాక్కయిపోయాం!



# మత సామరస్యం

– ఎం. వినోదిని

'బ్రహ్మంగారు' అని తెలుగు సమాజం పిలుచుకునే పోతులూరి వీరబ్రహ్మంగారు సామాజిక ప్రజాచైతన్యం కోసం తన జీవితాంతం పనిచేశారు. ఆధ్యాత్మిక చింతనను, సామాజిక చైతన్యాన్ని మేళవించి తత్వబోధ చేశారు. సామాజిక పరిస్థితుల వెనక అన్న వాస్తవాలను, నైతిక విలువలను మంచి జీవనానికి అవసరమైన తాత్విక సారాన్ని ప్రజలకు బోధించాడు. ఆయన బోధనలన్నింటా సామాన్య జన హృదయం ప్రతిబింబించింది. పోతులూరి వీరబ్రహ్మం ఆధ్యాత్మిక మార్గంలో మానవ సమాజ అభ్యున్నతి కోసం కృషి చేశారు. సర్వమానవ సమానత్వాన్ని కాంక్షించి రచనలు చేశాడు. సాహిత్యంతో కలగలిసిన తత్వబోధన, భవిష్యత్తును గురించి చెప్పటంవంటి ప్రజారంజకమైన విధానంతో జనంలో విశేష ఆదరణ పొందాడు. సామాన్య ప్రజల హృదయాలను గెలవగలిగిన ఆయన బోధనలు – సామాన్యులకి దైవ వచనాలుగా స్వాంతన కలిగించాయి. అందుకే ప్రజలు ఆయన్ని కవిగానో, సంస్కర్తగానోకాక, తమ కష్టాలను తీర్చడానికొచ్చిన దేవుడిగా కీర్తించారు.

బ్రహ్మంగారు సంచారం ద్వారా విశేషమైన జ్ఞాన సముపార్జన చేసి ప్రజా చైతన్య దృక్పథంతో రచనలు చేశాడు. వచనం, ద్విపద, తత్వాలు, పద్యాలవంటి ప్రక్రియల్లో సాహిత్య సృజన చేయడం ద్వారా బ్రహ్మంగారిని చేయి తిరిగిన రచయితగా, పండితునిగా మనం అర్థం చేసుకోవచ్చు. ఆయన రచనలలో కాలజ్ఞానం, సిద్ధార్థ శతకం, కాళీ మకుటకందాలు, వీర కాళికాంబ శతకం, కాళికాంబ సప్తశతివంటివి ప్రధానమైనవి.

1. **కాలజ్ఞానం**: 'జరిగింది, జరుగుతున్నది, జరగబోయేది' – అంటే గతం, వర్తమానం, భవిష్యత్తులకు సంబంధించి కొన్ని ముఖ్య ఘట్టాలను, సామాజిక విషయాలను గురించి బ్రహ్మంగారు చేసిన రచన 'కాలజ్ఞానం'. ఈయన ఈ కాలజ్ఞానాన్ని వివిధ ప్రక్రియల్లో చెప్పాడు. కొంత భాగాన్ని వచన కాలజ్ఞానంగా, కొంత భాగాన్ని ద్విపదలుగా మరికొంత గోవింద నామాలుగా, పద్యాలుగా రచించాడు. ఈ కాలజ్ఞానంలో ఉన్న విషయాలకు ప్రచారం కల్పించేందుకు 'సౌజన్య పత్రికల' పేరిట రెండు ప్రతులను వెలువరించాడు.

2. **జీవైక్య బోధ :** జీవైక్య బోధ కాలజ్ఞానంలో 'ప్రాణి–పరమాత్మ' సంబంధం, ప్రాణి పరమాత్మలో ఐక్యత పొందే విధం ఎలా ఉంటుందో చెప్పాడు. దైవచింతన, ఆధ్యాత్మిక జీవనం, ధార్మిక దృక్పథాన్ని పెంపొందించేందు కోసం – మానవ జీవితానికి, దైవానికి, ప్రకృతికి ఉన్న సంబంధాలను ఈ కాలజ్ఞానంలో రచించి బోధించాడు.

3. **సిద్ధబోధం లేదా సిద్ధార్థ శతకం** : సిద్ధబోధం లేదా సిద్ధార్థ శతకం పేరిట బ్రహ్మంగారు 55 పద్యాలు రచించారు. ''ఈ గ్రంథమును సిద్ధార్థ శతకమనుటకంటే 'సిద్ధగురుబోధ' అనుటయే బ్రహ్మేందుని అభిమతము'' అని మఠం ఆస్థానకవి వివియల్ నరసింహారావు ఈ శతకం ముందుమాటలో చెప్పడాన్నిబట్టి మకుటంలోని 'సిద్ధా' అనే మాట 'సిద్ధయ్య'కు వర్తిస్తుంది అని తెలుస్తుంది.

4. **కాళీ మకుటకందాలు** : బ్రహ్మంగారు రచించిన నాలుగు శతకాల్లో మూడు శతకాల మకుటంలో 'కాళి' ఉంది. అందులో ఈ 'కాళీ మకుట కందాలు' ఒకటి. ఇందులో 72 పద్యాలున్నాయి. చదువు గురించి, జ్ఞానం గురించి, మనసు, మాటల గురించి, మానసిక స్థితుల గురించి, యోగం, యోగ సమాధి మొదలైన తాత్విక అంశాల లోతులను ఎరుక పరుస్తూ రచించిన పద్యాల సమాహారం ఇది.

5. **వీరకాళికాంబా శతకం** : ఈ శతకంలో 473 పద్యాలున్నాయి. వీటిలో మనసు మర్మం మొదలుకొని, గురులక్షణం, ఎరుక, సాధన, విగ్రహపూజ, కరుణ, మతం, తత్వసిద్ధివంటి అంశాలున్నాయి.

'కాళికాంబ! వీర కాళికాంబ!' అన్న 'మకుటం'తో ఈ పద్యాల రచన చేశారు.

6. **కాళికాంబా సప్తశతి** : బ్రహ్మంగారిలోని సంస్కరణ దృక్పథాన్ని స్పష్టంగా చూపించే రచన కాళికాంబాసప్తశతి. ఇందులో మొత్తం 701 పద్యాలున్నాయి. 'కాళికాంబ! హంస! కాళికాంబ!' అనేది ఈ శతక పద్యాల మకుటం. ఇందులోని పద్యాలన్నీ ఆటవెలది పద్యాలు. "కుల కక్షలతో కుళ్లిన సంఘాన్ని కూకటివేళ్లతో పెళ్లగించడం, మతాల మాలిన్యాన్ని ప్రక్షాళన చేయడం బ్రహ్మంగారి ప్రధాన లక్ష్యం" అని డా. టి. గౌరీశంకర్ కాళికాంబా సప్తశతి ముందుమాటలో చెప్పినట్టు – ఈ పద్యాలన్నీ సామాజిక సంస్కరణ దృక్పథంతో రచించినవి. ఈ శతకంలో బ్రహ్మంగారు దుర్మార్గపు పోకడలతో మత ఘర్షణలకు దిగుతున్న శైవ వైష్ణవ మతాల అతిపోకడలను ఘాటుగా విమర్శించాడు. విగ్రహారాధనను, డాంబిక ఆచారాలను, వైదిక మూర్ఖ ప్రబోధనలను తీవ్రంగా విమర్శించాడు. 'మతం మత్తు గూర్చే మార్గం కారాద'ని, 'ఇలకు దిగెడువేళ కులమెవ్వరికి లేద'ని విశ్వజనీన సమసమాజంలో కులమతాల చిచ్చుపెట్టే దుర్బుద్ధులను ఖండించాడు. కాళికాంబా సప్తశతి బ్రహ్మంగారి సామాజిక దృక్పథానికి ప్రతిబింబం మాత్రమే కాదు, వేమనవంటి సంస్కరణ దృక్పథంగల రచయితలకు కొనసాగింపు కూడా! ఈ సప్తశతి ద్వారా బ్రహ్మంగారు ప్రజలకు తార్కిక ఆలోచనను, జ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేశాడు. అట్టడుగు సమాజంలో జ్ఞానజ్యోతి వెలిగించి, వారి జీవితంలో భక్తితో పాటు జ్ఞానం సంస్కరణ కాంతులు నిండాలని ఈ పద్యాలను రచించాడు.

*సర్వ మతములందు సారమ్ము గ్రహియించి*
*ఐకమత్యమార్గ మనుసరించి*
*క్రించుదనము మాని ప్రేమించుకొన మేలు*
*కాళికాంబ! హంస! కాళికాంబ!*

– *(కాళికాంబ సప్తశతి, పద్యం–379)*

అన్ని మతాల్లో సారం మనుషులంతా ఐక్యంగా, ఉండటమేనని ఈ సారాన్ని గ్రహించి ఒకరిని ఒకరు కించపరుచుకోవటం మాని సాటి మనుషుల్ని ప్రేమించడం మంచిదని అంటున్నాడు.

*సర్వజీవులందు చైతన్య మొకడంచు*
*జాతి మతము లెంచి సణుగువారు*
*అందలేరు సచ్చిదానంద సౌఖ్యమ్ము*
*కాళికాంబ! హంస! కాళికాంబ!* – *(కా.స.శ : పద్యం–366)*

భిన్నమతాల కూడలి అయిన భారతదేశంలో – జాతి మతాల కారణంగా ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే సామాజిక విలువలున్నాయి. ఈ హెచ్చు తగ్గుల నెంచి నిత్యం బేరీజు వేసుకుంటూ బతికేవారు ముక్తిని, సౌఖ్యాన్ని అందుకోలేకపోతారు.

*మతము మత్తు గూర్చు మార్గమ్ము కారాదు,*
*హితము గూర్చ వలయు నెల్లరకును;*
*హితము గూర్చలేని మతము మానగవలె;*
*కాళికాంబ! హంస! కాళికాంబ!* – *(కా.స.శ.పద్యం– 694)*

'మతం మత్తు' అని కమ్యూనిజం చెప్పింది. ఈ మాట భారతదేశానికి 20వ శతాబ్దంలో వచ్చింది. కానీ బ్రహ్మంగారు 17వ శతాబ్దంలోనే 'మతం మత్తు గూర్చే మార్గం కారాద'ని చెప్పాడు. అప్పటికే సమాజాన్ని కలుషితం చేసే విషయాల్లో, ప్రజల్ని మత్తులోకి నెట్టే విషయాల్లో 'మతం' కీలక పాత్ర పోషిస్తుందని బ్రహ్మంగారు గుర్తించారు! అందుకే 'హితము' కూర్చలేని మతము వదిలేయాలని, దానికి దూరంగా బతకాలని హెచ్చరించాడు.

*మనుజులంద రేక మతమంచు తలచుమీ*
*హతములౌ నకృత్యతతు లవెల్ల*
*మతము తత్త్వ మెరుగుమా, చావులేకుండు*
*కాళికాంబ! వీరకాళికాంబ!* – *(వీ.కా.శ.పద్యం–397)*

మనుషులంతా ఒకటే మతం అని తలిస్తే అకృత్యాలు అన్నీ నశించి పోతాయి. అసలు మతాలన్నిటి స్వభావమూ – మానవులంతా ఒకటే అని చెప్పటమే. అది తెలుసుకుంటే మృత్యువును జయించినట్టే! ఇదే సర్వమానవాళికి అవసరం అన్నది బ్రహ్మంగారి బోధన.

*కులమతాల జాడ్యములలోన దపియించు*
*దీన జనుల సేద దీర్చువాడ;*
*మానవుండె ధరను మాధవుండను వాడు;*
*కాళికాంబ! హంస! కాళికాంబ!* – *(కా.స.శ: పద్యం– 700)*

బ్రహ్మంగారు కులమత వివక్ష లేని సమాజాన్ని కలగన్నాడు. అందుకే కులమతాల జాడ్యంవల్ల సమస్యలు ఎదుర్కొంటున్న దీనులను, సామాన్యులను ఆ సమస్య నుంచి కాపాడేవాడే నిజమైన దేవుడని చెప్పాడు. కింది కులాల దుఃఖాన్ని కష్టాన్ని తీర్చడానికి ఎవరు ముందుకొస్తారో వాడే దేవుడని ఎంతో స్పష్టంగా ప్రకటించాడు. అలా కులమతాలు కాకుండా మనుషులు మిగలాలని కోరుకున్నాడు.

***కులము మతము వాదములు తర్కమున బోవు***
***గురుకటాక్షమున్న నెరుక పోవు***
***నీ పదార్చనమున ప్రాప్తించు మోక్షంబు***
***కాళికాంబ! హంస! కాళికాంబ*** – *(కా.స.శ. పద్యం-99)*
***సర్వ మానవులను సమముగా ప్రేమించు***
***కులమతాల నెంచి కోపపడకు***
***కాపు జాతినెల్ల కరుణించు మనె శ్రుతుల్***
***కాళికాంబ! హంస! కాళికాంబ!*** – *(కా.స.శ. పద్యం- 296)*

కులం – మతం ఇక్కడ ప్రధానమైన వాదాలు. సమాజం ప్రతి విషయంలోనూ మనుషులను కుల మత దృష్టితో చూస్తుంది. కానీ నిజంగా మతం చెప్పేది కులాలు, మతాల వాదనలు కాదు. మత పెద్దలు శ్రుతులు, వేదాలు సర్వమానవ సమానత్వాన్ని బోధించాయని చెబుతుంటారు. కానీ ఆచరణలో సమానత్వం కనిపించదు. అలాంటి వాళ్ళనుద్దేశించి మానవులందరినీ సమంగా ప్రేమించమని, నీది తక్కువ కులం, నీది పరమతం అని కోపగించడం మంచిది కాదని అంటాడు. మతగ్రంథాలు మనుషుల్ని సమంగా చూడాలని, వ్యవసాయ వృత్తిని ఆచరించేవాళ్లని కరుణతో చూడాలని చెప్పాయని అంటున్నాడు బ్రహ్మంగారు.

'మనందరం ఆయా మతాలుగా విడిపోయాం – కానీ తరచి చూస్తే మనందరిదీ ఒకే మతం – అది మనిషి మతం – దేవుళ్ళు, మతాలు, భాషలు, ప్రార్థనలు, గ్రంథాలు ఇవన్నీ మనం మధ్యలో ఏర్పరచుకున్నవి – మన మధ్య మనమే గీతలు గీసి ఒకరి నుంచి ఒకరం వేరయ్యాం – మనుషులంతా ఒక్కటే అని నిజంగా మనం తెలుసుకోగలిగితే – ప్రపంచం ప్రశాంతమవుతుంది. మరణాన్ని సైతం మనం జయించగలుగుతాం' అని చెప్పడం ద్వారా మతంకన్నా మనిషి గొప్పవాడని తేల్చేశాడు. అందుకే –

***ఆత్మ చింతచేయు 'మల్ల అల్లా' యని***
***ఉల్లమందె తప్పుకొల్ల బోవు;***
***కొల్లబోవు గురుని – కొనియాడవచ్చునా?***
***కాళికాంబ! వీరకాళికాంబ!*** – *(వీ.కా.శ. పద్యం- 338)*

ఇస్లాంను సోదర మతంగా తలచిన బ్రహ్మంగారు మసీదులో ప్రార్థన చేసేవారినుద్దేశించి ఈ తాత్త్విక పద్యం చెప్పాడు. ఆత్మతత్వ విచారంలో 'ఘనమైన అల్లా'ను స్మరించుకుంటే చాలు – తనకు తాను తరచి చూసి తన తప్పులను మనసులోనే గుర్తించితే చాలు – అవన్నీ తొలగిపోతాయి. అల్లా వాటిని క్షమించేస్తాడు అంటున్నాడు. అయినా మనం చేసిన తప్పుల్ని మనవే గుర్తించి ఆత్మవిమర్శ చేసుకున్నా క్షమించమని దేవుణ్ణి మనం కొనియాడనవసరం లేదంటాడు. ఏ మతంలోనైనా – ఏ దేవుడైనా – ఒక మనిషి తన తప్పులు తాను తెలుసుకుంటే అదే గొప్ప మార్పని చెప్పటం మనకు తెలుసు. అట్లాంటి క్షమాగుణం కలిగి ఉండేదే మతం. క్షమించగలవాడే దైవం అని బ్రహ్మంగారి భావన.

***ఎన్ని మతముల గననేమి కనంబడు?***
***కంటిపాపలోనె కలదు మచ్చ;***
***మనసు నందులేక మతము నందేముండు?***
***కాళికాంబ! వీరకాళికాంబ*** – *(వీ.కా.శ. పద్యం- 404)*

లోకంలో ఎన్నో మతాలున్నాయి. ప్రతి మతానికి సిద్ధాంతాలు, ఆచారాలు ఉన్నాయి. వాటిలో మనకు కొన్ని తప్పు మరికొన్ని ఒప్పుగా అనిపించవచ్చు. అయితే చాలామంది ఆచరించే ఆ ఆచారాలు మనకు తప్పుగా కనిపిస్తున్నాయంటే లోపం ఆయా మతాల్లో కాక మన కంట్లోనే ఉందేమో! అసలు మాలిన్యం మన మనసులో ఉందేమో – లేకపోతే మతంలో ఏముంటుంది – అంటున్నాడు. ఆయా మతాలు అన్నీ కూడా అంతిమంగా మనిషిని – మనిషి ప్రేమించాలనే చెప్పాయి. కాని ఆచరణలో అది గతి తప్పింది.

మత సంస్కరణ మీద అనేక పద్యాలు రచించిన బ్రహ్మంగారు స్త్రీలపట్ల మతాలు అనుసరిస్తున్న తీరుని ఖండించాడు. ప్రపంచంలో ఏ మతమైనా స్త్రీని రెండవ తరగతి వ్యక్తిగా చూడటాన్ని సహించలేకపోయాడు. బ్రహ్మంగారికి స్త్రీల పట్ల ప్రేమ, గౌరవంతో పాటు తనదైన ఒక సైద్ధాంతిక అవగాహన ఉంది. అందుకే స్త్రీలను తల్లిగా ప్రేమించటం, గౌరవించటం గురించి మాట్లాడటమే కాదు, స్త్రీలకు అందకుండా చేసిన చదువు అవసరాన్ని చెప్పాడు.

***వెలదులకును వేద విద్యాధికారమ్ము***
***లేదటంచు బ్రహ్మలిఖితమంచు***
***నోరుతెరచి మరచినారు వాణివి నిన్ను***
***కాళికాంబ! హంస! కాళికాంబ!*** – *(కా.స.శ: 678)*

మత గ్రంథాలు చెప్పాయని స్త్రీలను విద్యకు,

ముఖ్యంగా వేదవిద్యకు దూరం చేశారు. ఏమంటే ఇది మత విధానం అని, దైవ నిర్ణయం అని చెప్పారు మత పెద్దలు. సర్వసతీదేవిని విద్యలకు దేవతగా ఆరాధిస్తూనే స్త్రీలకు విద్యను అందకుండా చేయడం స్త్రీలను అణిచివేయడానికి చేసిన ఒక కుటిల మాయ. ఇలాంటి ద్వైదీ భావ కుటిల రహస్యాన్ని బ్రహ్మంగారు బట్టబయలు చేశాడు. బ్రహ్మంగారు హిందూ మతం గురించి చెప్పినా, ఇతర మతాలలోనూ స్త్రీల పరిస్థితి ఇంతకన్నా భిన్నంగా ఏమీ లేదు. స్త్రీలకే కాదు శూద్రులకు, అంటరాని జాతులుగా, పంచములుగా వర్ణవ్యవస్థకు దూరంగా నెట్టివేయబడ్డ కులాలవాళ్ళకు కూడా చదువుకునే అర్హత లేదని మతం చెప్పిన సిద్ధాంతం. పూలే వంటి సంస్కర్తలు తొలి స్త్రీల పాఠశాలను ఏర్పాటు చేసేవరకు ఈ దేశంలో స్త్రీలకు విద్య అందుబాటులో లేదు. అంతకన్నా ముందు అక్కడక్కడా చదువుకున్న స్త్రీలు ఉన్నా వాళ్లు బ్రాహ్మణ, క్షత్రియ కులాలవాళ్లే! ఎక్కడో అరుదుగా శూద్ర స్త్రీలు చదువుకున్నారు.

ఇప్పటికీ స్త్రీల విద్య విషయంలో భారతీయ సమాజంలో ఎంతో మార్పు వచ్చినా ఇంకా స్త్రీలు కొన్ని రకాల చదువులకు వెళ్లడానికి, కొన్నిరకాల ఉపాధి అవకాశాలను చేపట్టడానికి అవకాశం లేదు. ఇలాంటి పురుషాధిక్య భావజాలాన్ని రూపొందించి, సమాజం అంతటా వ్యాపింప చేసిన నేరం మతాలది, మత గ్రంథాలది. దీన్ని బ్రహ్మంగారు చాలా స్పష్టంగా వ్యతిరేకించాడు.

బ్రహ్మంగారి సామాజిక దృష్టి – ఉన్నచోట నుంచి, తన చుట్టూ ఉన్న భౌతిక సమాజం మీదుగా భవిష్యత్తు కాలంలోకి ప్రయాణించింది. సామాజికాంశాలపట్ల, సమాజంలో రావాల్సిన మార్పుల పట్ల, సామాజిక అసమానతలపట్ల స్పష్టమైన అవగాహన ఉన్న బ్రహ్మంగారు – తన అవగాహనతో సాహిత్యాన్ని వాహికగా చేసుకొని సామాజిక మార్పు కోసం, సంస్కరణ కోసం రచనలు చేశాడు.

బ్రహ్మంగారు మత నియమాలకన్నా మానవ విలువలకే ప్రాధాన్యం ఇచ్చాడు. అందుకే ఆయన రచనలు, బోధనల్లోనే కాకుండా జీవితంలో కూడా స్త్రీలకు విలువైన స్థానం ఉంది. మతాల నియమాలకు అతీతంగా ఆయన తనతల్లి వీరపాపాంబకు తొలి జ్ఞానబోధ చేశాడు. భార్య గోవిందమ్మను తనతో సమానంగా గౌరవించాడు. గరిమిరెడ్డి అచ్చమ్మకు బ్రహ్మోపదేశం చేశాడు. అలాగే కూతురు వీరనారాయణమ్మను కూడా జ్ఞానం దిశగా నడిపించాడు. భార్య అనుమతి లేకుండా ఏ పనీ చేయలేదు. లోక సంచారానికి వెళ్లడం, సజీవ సమాధి ప్రవేశంవంటివి భార్య అనుమతితోనే చేశాడు. ఆమెను తన పసుపు, కుంకుమ, గాజులవంటివి తీయవద్దని చెప్పాడు. 'వైధవ్యం' పేరిట జరిగే దురాచారాన్ని ధిక్కరించాడు. ఇలా స్త్రీని ప్రత్యేక గౌరవ దృష్టితో చూసిన బ్రహ్మంగారి వ్యవహారశైలి ఆయన జ్ఞానవికాసానికి, ఔన్నత్యానికి ప్రతీక. మతం పేరిట స్త్రీలను చిన్న చూపు చూసే, అణిచివేసే నియమాలను బ్రహ్మంగారు స్వయంగా ధిక్కరించి, సమాజానికి కొత్త విలువలు నేర్పించాడు.

మతాల మధ్య ఎక్కువ తక్కువల పోటీ ఒకరి మీద ఒకరు దుమ్మెత్తిపోసుకునేదాకా, దాడులు చేసుకునేదాకా వెళ్లింది. ఈ ఘర్షణ దృక్పథం – ఈ హెచ్చుతగ్గుల గొడవ మతాల్లో లేదు – వాటిని చూసేవాళ్ళలోనే ఉంది. అసలు దృష్టి లోపం వాళ్ళదే – అందుకే "మతము మత్తు గూర్చు మార్గమ్ము కారాదు" అని బ్రహ్మంగారు బోధించారు. మతాల పేరిట జరిగే మూర్ఖ వ్యవహారాలను, వివాదాలను తీవ్రంగా ఖండించిన వీరబ్రహ్మం సర్వమతాల సమానత్వాన్ని మతాల మధ్య శాంతియుత సంబంధాలను కాంక్షించాడు. ఇస్లాం మతానికి చెందిన సిద్ధయ్యను – ప్రియశిష్యుడిగా స్వీకరించి తాను బోధించిన మతసమానత్వాన్ని, మతాలన్నీ ఒక్కటేనన్న సత్యాన్ని ఆచరణలో చూపాడు. బ్రహ్మంగారు ఈ రచనలు చేసేనాటికి దేశ రాజకీయ పరిస్థితి సుస్థిరంగా లేదు. కుల, మత ఆధిపత్య ఘర్షణల కారణంగా సమాజంలో ప్రశాంతత లేదు. జ్ఞానబోధ పేరిట మోసకారులు ఎక్కువైనారు. మనుషుల మధ్య, కుల మత వైరుధ్యాలు మరింత దూరాన్ని పెంచేశాయి. ఇటువంటి పరిస్థితుల్లో బ్రహ్మంగారు తన రచనల ద్వారా సమాజానికి వివేకం, మత సామరస్యం, సమానత్వం, జ్ఞానం అందించే ప్రయత్నం చేశారు. తనకన్నా ముందువాడైన వేమన సమాజాన్ని చూసిన తీరుగానే బ్రహ్మంగారు కూడా సంస్కరణాభిలాషతో, మార్పుని ఆశించి సమాజపు

అన్నిమూలాలను, అన్ని లోతులను తన సాహిత్యంలో స్పృశించాడు. సర్వ మత సామరస్యాన్ని బోధించాడు.

సూఫీల తరహాలో ప్రజల మధ్యకు వెళ్ళి దైవత్వం గురించి, జ్ఞానం గురించి బోధించిన బ్రహ్మంగారిని ప్రజలు ఆధ్యాత్మిక గురువుగా భావించారు, దేవునిలా కొలిచారు. చాలామంది ఆయన శిష్యులుగా మారిపోయి ఆయన వెంట నడిచారు. కులాలకు మతాలకు అతీతంగా అనేకమంది ఆయన మార్గాన్ని అనుసరించారు. ఆయన మానవీయ బోధనలతో పరివర్తన చెందిన అన్నాజయ్యలాంటి బ్రాహ్మణులు, కుల సమాజంలో అట్టడుగు కులంగా, అంటరాని కులంగా ముద్రవేయబడ్డ మాదిగ కులస్థుడైన కక్కయ్యలాంటి వాళ్ళు ఆయన శిష్యులయ్యారు. బ్రహ్మంగారికి ప్రియమైన శిష్యుడుగా ప్రసిద్ధికెక్కిన సిద్ధయ్య ఇస్లాం మతం ఆచరించే దూదేకుల కులస్థుడు. అదేవిధంగా స్త్రీలను కూడా తన శిష్యులుగా చేసుకొని అప్పటిదాకా సమాజంలో పేరుకొని ఉన్న అంటు, మైల, అపచారంవంటి మూఢవిశ్వాసాలను దాటి ఒక మానవీయ సందేశాన్ని తన శిష్యుల ద్వారా బ్రహ్మంగారు ఈ సమాజానికి అందించాడు. బ్రహ్మంగారు మతం గురించి, సాంఘిక దురాచారాల



పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి

గురించి బోధనలు చేశాడు. పద్యాలు రచించాడు. నూతన విలువలతో కూడిన సమాజాన్ని కలగన్నాడు. ఏ కవి అయినా, రచయితైనా, తాత్త్వికుడైనా సమాజాన్ని ఏ దృక్పథం నుంచి చూశాడన్నదాన్నిబట్టి వాళ్లు సమాజాన్ని అర్థం చేసుకోవటం, తిరిగి సమాజానికి ఏదైనా ఇవ్వటం జరుగుతుంది. బ్రహ్మంగారు సమాజానికి 'సమానత్వం' అనే 'జ్ఞానాన్ని' ఇచ్చే ప్రయత్నం చేశారు. 'ఎక్కువ, తక్కువల' అజ్ఞానపు చీకటిని పారదోలే ప్రయత్నం చేశాడు. వేమన సమాజాన్ని చూసిన తీరుగానే బ్రహ్మంగారు కూడా సంస్కరణాభిలాషతో, మార్పుని ఆశించి సమాజపు అన్ని మూలాలను, అన్ని లోతులను తన సాహిత్యంలో స్పృశించాడు.

డా. ఎమ్. వినోదిని. కడప. ఫోన్: 944 045 6087.

"... ప్రియమైన అశ్వినీకుమార్‌గారు, ఎన్నాళ్ళ నుండో రాయాలనుకుంటున్నానుగాని సోమరితనం వల్ల............ ఇకపోతే ***మిసిమి*** మే 2023 సంచిక బాగుంది. అందులోనూ మీ సంపాదకీయం ఇంకా బాగుంది. ఎవరి కష్టాలకు నష్టాలకు వారి బాధ్యతే ఎక్కువనే మీ మాటలు అక్షర సత్యాలు. సమస్య అహంకారము లేదా ఆత్మన్యూనతతోనే కదా వచ్చేది. ఇకపోతే ఇచ్ఛామతీ తీరాన పరామర్శ బాగుంది..."

*– మోక్షగుండం ఆనందకుమార్, హైదరాబాద్.*

"... ***మిసిమి*** మే 2023 సంచిక అంతా బుద్ధుని గురించే ఉంటుందని భావించాను. కానీ గొప్పగొప్ప రచనలు చదివించే భాగ్యం కల్పించారు. మాటా–మంతీ ద్వారా శారదా శ్రీనివాసన్‌తో మీరు గడిపిన క్షణాలు మాకెంతో ఆనందాన్ని కలిగించాయి. శారదగారి గొంతులో రసగుళికలున్నాయి. ఆ తల్లి మాటలలో మాధుర్యంతోపాటు ఆ పాత్రలకు తగినట్లుగా మాట్లాడటం భగవంతుడిచ్చిన వరం. 'కాలాతీత వ్యక్తులు' నవలలోని ఇందిర పాత్రలో జీవించిందామె. అప్పట్లో రేడియోవారికి ఉత్తరం కూడా వ్రాశాను. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ గురించి చదువుతుంటే రెక్కలు కట్టుకుని ఎగిరి వెళ్లేటంత ఉత్సాహం కలిగింది. మనసుకున్న రెక్కలు – ఎగిరే రెక్కలు లేవు కదా! శేషగిరిరావుగారు ప్రపంచ పర్యాటక దేశోత్తముడు. 'అక్షరమాల' గొప్ప వ్యాసం. చదవాలని తొందరగా ఉంది. ఆ వ్యాసం ద్వారా ఆ పుస్తకం చదవాలనే ఆసక్తి కలిగించిన గొప్ప రచన సుమా! కోలాచలం సీతారామయ్య గురించి ఈ తరంవారికి తెలియదు. తెలుగువారి గొప్ప మహనీయుల్లో వారొకరు. శ్రీ వేణుగోపాల్‌గారు మనస్సుకు హత్తుకునేలా రాయడంలో దిట్ట... కథన చక్రవర్తి శ్రీపాదవారి గురించిన వ్యాసం అద్భుతంగా ఉన్నది. ***మిసిమి*** వ్యాసాలన్నీ బాగానే ఉంటాయి. అదే ***మిసిమి*** ప్రత్యేకత. ధన్యవాదాలు..."

*– చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడేరు, భీమవరం. ఫోన్: 954 211 8184.*

# రాయలసీమకు వన్నె తెచ్చిన కేతు విశ్వనాథరెడ్డి

కేతు విశ్వనాథరెడ్డి ఇక లేరంటే నమ్మశక్యంగా లేదు. కేతు కడప జిల్లావాసి. తెలుగు లెక్చరర్స్‌గా పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. మాజీ ఎంపీ ఎదుల ఈశ్వరరెడ్డి, ఎన్. శివరామరెడ్డి, జె.వెంకట రామిరెడ్డిలాంటి రాజకీయ దురందులతో పాటు, గజ్జెల మల్లారెడ్డి, వైసీపీ రెడ్డిలాంటి సాహిత్యవేత్తలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. పార్టీ యెడల అకుంఠిత గౌరవభావం కలిగి ఉన్నారు. 'కడప గ్రామాలు - నామాలు' పేరుతో ఆయన పరిశోధన చేశారు. రాయలసీమ కథలకు ఆయన వన్నె తెచ్చారు. ఆయన కడప జిల్లా నుంచి ఎస్వీ యూనివర్శిటీకి ప్రొఫెసర్‌గా వచ్చారు. అదే సమయంలో నేను రాష్ట్ర విద్యార్థి బాధ్యతల నుంచి పార్టీ ఆదేశాల మేరకు తిరుపతిలో విద్యార్థి, యువజన సంఘాల నిర్మాణం బాధ్యతలను తీసుకున్నాను. అప్పుడు విద్యార్థి యువజన సంఘాలు బలహీనంగా ఉన్నాయి. అప్పుడే కేతు విశ్వనాథరెడ్డి పరిచయం అయ్యారు. ఆయన ద్వారా జియోగ్రఫీ ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డి, ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ మునిరత్నం రెడ్డి, కామర్స్ డిపార్టుమెంట్ హెడ్ ప్రొఫెసర్ కామరాజ్ పరిచయం అయ్యారు. వీరంతా ఏఐఎస్ఎఫ్ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలబడ్డారు. విశ్వనాథరెడ్డి గారితో పాటు డిగ్రీ కాలేజీ లెక్చరర్స్ భాస్కర్ నాయుడు, రామదాసు మా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలబడ్డారు. ఆనాడు పార్టీ కుటుంబాలతో సన్నిహితంగా ఉన్నారు. ఒక స్టేజీలో నేను నిత్యం విశ్వనాథరెడ్డిని కలిసేవాడిని.


కేతు విశ్వనాథరెడ్డి

నాకు పెళ్లి నిశ్చయం అయింది. కేతు విశ్వనాథరెడ్డితో నాకు మ్యారేజ్ ఫిక్స్ అయిందని చెప్పాను. అయితే వెంటనే "నువ్వు పెళ్లి చేసుకోవటానికి వీలు లేదు" అని కరాఖండిగా అన్నారు. ఈశ్వరరెడ్డిలాంటి వారి తరువాత నీవు రాయలసీమలో బాగా పని చేస్తున్నావని నేను నమ్మాను. నా నమ్మకాన్ని వమ్ము చేసి నువ్వు పెళ్లి చేసుకోవాలనుకున్నావ్ నీ పెళ్లికి నేను రాను అన్నారు. పెళ్లి గురించి నేను పార్టీవాళ్లతో మాట్లాడతాను. నువ్వు మాత్రం పెళ్లి చేసుకోవద్దు అన్నారు. ఆయన చెప్పినట్లే అప్పుడు పెళ్లికి రాలేదు. కొంత కాలం తరువాత పెళ్లైన పది రోజులకు తిరుపతి గాంధీ రోడ్డులో నేను, నా భార్యతో కలిసి వెళుతున్నాను. కేతు విశ్వనాథరెడ్డి వెనుక నుంచి వచ్చి నా భుజం తట్టి "ఏరా! బాగున్నావా!" అని అడిగారు. నేను మా ఆవిడ వసుమతిని పరిచయం చేశాను. అప్పుడు తానే స్వయంగా వసుమతితో "ఏవమ్మా! వీడిని నేను పెళ్లి చేసుకోవద్దు అని చెప్పాను. నా మాట వినకుండా పెళ్లి చేసుకున్నాడు'' అన్నారు. ''తరువాత నీ గురించి విచారించాను. అందరూ నువ్వు మంచి అమ్మాయివని చెప్పారు. చాలా సంతోషంగా ఉంది" అని మా ఇద్దరినీ ఇంటికి తీసుకెళ్లి రాత్రి భోజనం పెట్టి మా ఆవిడకు బట్టలు పెట్టి పంపించారు. అప్పటి నుంచి కుటుంబ సమేతంగా సంబంధాలు ఇంకా గట్టిబడ్డాయి. ఎప్పుడు పార్టీకి అవసరం అయినా వెన్నంటి నిలబడేవారు. ఆయన ఒక దఫా మా ఇంటికి వచ్చారు. మా అమ్మ ఆప్యాయతను చూసి చాలా సంతోషపడి అందరితో ఎంత అమాయకంగా, ఆప్యాయతగా ఉంటుందో నారాయణ వాళ్ల అమ్మను చూసి నేర్చుకోవాలని చెప్పారు. వసుమతి ఆదర్శవంతమైన గృహిణే కాకుండా ఉద్యమ లీడర్‌గా కూడా గట్టిగా పనిచేస్తుందని శ్లాఘించేవారు. అలాంటి సన్నిహిత రాజకీయ, కుటుంబాలరీత్యా, సామాజిక స్పృహతో అనుబంధం కలిగిన కేతు విశ్వనాథరెడ్డి మరణం చాలా బాధాకరం. వారి మరణం పట్ల నా తరుపున, కమ్యూనిస్టు పార్టీ తరుపున ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతున్నాను.

డా. కె. నారాయణ
కార్యదర్శి సీపీఐ జాతీయ సమితి

# గిరిజన వైద్యంలో పచ్చబొట్లు

– గడ్డం వెంకన్న

జానపద, గిరిజన సంప్రదాయంలో పచ్చబొట్లు అంతర్భాగం. నేటి యువతకు అవి ఒక ఫ్యాషన్. కొన్ని వేల సంవత్సరాల చరిత్ర పచ్చబొట్లకు ఉంది. వయోభేదం లేకుండా స్త్రీ, పురుషులు పచ్చబొట్లు వేయించుకోవడం ఆచారం. ప్రపంచ చరిత్రలో పచ్చబొట్లు ఒక పురాతన చిత్రకళగా ప్రాచుర్యం పొందాయి. నిజానికి ఈ పచ్చబొట్లు అలవాటు గిరిజన తెగలకు సంబంధించినదే అయినా క్రమేణా జానపదులు సైతం తమ సంస్కృతిలో భాగం చేసుకుని ఆచరించడం విశేషం.

పచ్చబొట్లు అనేవి ఒకరకమైన చిహ్నాలు. వ్యక్తుల అభిరుచుల మేరకు చర్మం పైన వివిధ భాగాలలో వేయబడుతాయి. ఒకరి శరీరం పైన ఉన్న పచ్చబొట్లను పరిశీలించి వారి అభిరుచులు, నడవడిని అంచనా వేయవచ్చు. ఎంతో ఘనమైన చరిత్ర, ప్రాశస్త్యం ఉన్న సంప్రదాయ పచ్చబొట్లు కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో ఆధునిక పద్ధతిలో యువత అభిరుచుల మేరకు మాత్రమే ఈ పచ్చబొట్లు టాటూస్ పేరు మీద వేయబడుతున్నాయి. ప్రాపంచిక ఆస్తులన్నీ పోగొట్టుకున్నా, ఎవరు కూడా తీసుకపోలేని, ఎత్తుక పోలేని ఆభరణాలు పచ్చబొట్లే అని నమ్మడాన్ని పరిశీలిస్తే పచ్చబొట్లు ప్రాధాన్యత అవగతమవుతుంది. అయితే కొన్ని దేశాల్లో మాత్రం పచ్చబొట్లను నిషేదించడంలో చాలామంది వీటిపై ఆసక్తి కనపరుచటం లేదు. ఈ పచ్చబొట్లు శరీరంపై ఉంటే కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు అనుర్హులుగా పేర్కొనడంతో ఉద్యోగార్థులు ఈ పచ్చబొట్లు జోలికి వెళ్లడం లేదు.

ఈజిప్టు నాగరికత ఎంత ప్రాచీనమైనదో పచ్చబొట్లు కూడా అంతే ప్రాచీనమైనవని పరిశోధకుల అభిప్రాయం. సుమారు నాలుగువేల సంవత్సరాలనాటి ఈజిప్టు మమ్మీలకు నైట్ దేవత చిహ్నాలైన పచ్చబొట్లు ఉన్నాయి. ప్రాచీన గ్రీకులు సంకేత సందేశాలు పంపేందుకు వార్తావారుల నున్నటి బోడిగుండ్లపై పచ్చబొట్లు చెక్కేవారు. జపనీలు వీటిని అత్యంత గౌరవంగా భావిస్తారు. డ్రాగన్ల అందమైన రూపాలు, పుష్పాలు, పక్షులు, ప్రకృతి దృశ్యాలను పచ్చబొట్లతో రూపొందించడం విశేషం. అయితే భారతదేశంలో ఈ పచ్చబొట్ల ఉనికి వందల యేళ్ళకు పైనుండే ఉంది. యుద్ధవీరులు, మల్లయోధులు శరీర పటుత్వం కోసం నరాలపై, మణికట్టుపై పచ్చబొట్లు పొడిపించుకునేవారు. జనసామర్ధ్యంగల ప్రాంతాలల్లో బిడ్డలు తప్పిపోయినట్లైతే సులభంగా గుర్తుపట్టేందుకు వీలుగా వారి చేతులపై వీటిని చిత్రీకరించుకునేవారు.

భిల్లా గిరిజన మహిళలు వివాహానికి ముందు, తెగకు చిహ్నంగా పక్షిరూపాన్ని పచ్చబొట్టుగా పొడిపించుకుంటారు. బస్తర్ ప్రాంతంలోని మురియా గిరిజన మహిళలు, అరుణాచల్‌ప్రదేశ్‌లోని 'అపాతాని' గిరిజన మహిళలు, సింగ్పో తెగ మహిళలు ప్రత్యేకంగా పచ్చబొట్లు పొడిపించుకోవడానికి ఇష్టపడతారు. అయితే ఈ తెగల్లో పెండ్లి కాని అమ్మాయిలు పచ్చబొట్లు ధరించకూడదనే నియమం ఉండటం గమనార్హం.

నాగాలాండ్‌లోని కొన్యాక్స్ గిరిజనులు యుద్ధంలో తమ పరాక్రమాన్ని తెలిపేందుకు వీలుగా ముఖంపై పచ్చబొట్లు వేసుకునేది. యుద్ధంలో వీరమరణం పొందితే వారి పరాక్రమాన్ని, వీరత్వాన్ని గుర్తించవచ్చని ఈ పచ్చబొట్లను బలానికి, ధైర్యానికి చిహ్నంగా భావిస్తారు. మొగలులపై విజయానికి చిహ్నంగా జార్ఖండ్ ముండా గిరిజనులు తమ నుదుటిపై మూడు సరళ నిలువు వరసల పచ్చబొట్లు పొడిపించుకోవడం విశేషం. ఒరిస్సాలోని కొటియా, ఖోంద్ గిరిజన మహిళలు తమ అందమైన ముఖంపైన గీతలను పచ్చబొట్ల ద్వారా వేసుకుంటారు. కాగా పశ్చిమ భారతదేశంలోని గిరిజనులు పచ్చబొట్లను గౌరవంగా చూస్తారు. గుజరాత్‌లోని రబారి మహిళలు

అలంకరణ కోసం, చికిత్స కోసం పచ్చబొట్లు వేయించుకుంటారు. అదేవిధంగా ఇక్కడి మెర్ గిరిజన మహిళలు అత్యంత ప్రీతిపదంగా మెడనుండి శరీరం అంతా విస్తరించి ఉండే విధంగా పొడిపించుకోవడాన్ని గమనిస్తే వారికి వీటిపై ఉన్న మక్కువ తెలువకనే తెలుసుకోవచ్చు. ఇంతటి ఔన్నత్యం, ప్రత్యేకతలు కలిగిన పచ్చబొట్లను పరిరక్షించడంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని తోటి గిరిజనులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అందుకే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలంలోని జానపద గిరిజన విజ్ఞాన పీఠం, తెలంగాణ రాష్ట్ర గిరిజన పరిశోధనా సంస్థ, హైదరాబాద్ వారి సహకారంతో "తెలంగాణ తోటి గిరిజనులు పచ్చబొట్లు'' అనే అంశంపై పరిశోధన చేపట్టడం జరిగింది. ఈ పరిశోధనలో భాగంగానే సేకరించిన సమాచారంతో ఈ వ్యాసాన్ని ముందుకు తీసుకురావడం జరిగింది.

తెలుగు రాష్ట్రాల్లో ఉన్న గిరిజనుల్లో ప్రత్యేకత గిరిజన తెగతోటి. కళాప్రదర్శననే వృత్తిగా చేపట్టి గోండు గిరిజనులకు ఆశ్రితులుగా ఉన్న వీరు చిత్రకళగా పేరొందిన పచ్చబొట్లను కూడా వేయడం ద్వారా గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్నారు. పచ్చబొట్లు కేవలం అలంకరణకే కాదు, ఆరోగ్యపరంగా కూడా దోహదపడతాయనే గిరిజనుల్లో విశ్వాసాన్ని పెంపొందిచడమే కాకుండా తమ వృత్తి నైపుణ్యాలతో ఆధునిక ప్రజల మనసును సైతం దోచుకుంటూ తమ ప్రతిభను చాటుతుండటం విశేషం.

తెలంగాణలో తోటి గిరిజనులు ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ వరంగల్ జిల్లాల్లో ఉన్నారు. అయితే ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో నివసించే కొన్ని తోటి గిరిజన కుటుంబాల వాళ్లే సంప్రదాయ పచ్చబొట్ల వృత్తిని చేపడుతూ సంస్కృతీ గిరిజనులుగా పేరొందారు. పురుషులు కథాగానం చేస్తూ గోండు గిరిజనులకు ఆశ్రితులుగా ఉండగా, మహిళల్లో కొందరు పచ్చబొట్లు పొడుస్తూ సంస్కృతీ వాహకులుగా ఉన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ పచ్చబొట్ల నైపుణ్య కళాకారులు రోజు రోజుకు తగ్గిపోతున్నారు, అయితే ఇప్పటికే ఈ కళనే వృత్తిగా స్వీకరించిన మహిళలు కూడా లేకపోలేదు. కాగా ఆదిలాబాద్ జిల్లా తోషం గూడానికి చెందిన మర్సుకోల కళావతి రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికై తోటి వారి చిత్రకళా నైపుణ్యాన్ని పరివ్యాప్తం చేసిన మహిళగా పేరొందింది.

పచ్చబొట్లు వేయడానికి సహజ సిద్ధమైన వనరులు ఉపయోగిస్తారు. పచ్చబొట్టునే చుక్కబొట్టుగా పిలుచుకునే తోటి గిరిజనులు అడవిలో లభ్యమయ్యే చెంగూరు చెక్క బెరడు (దీనినే పెద్దేగి చెక్క అని అంటారు)ను పచ్చబొట్లు పొడవడానికి ప్రధానంగా ఉపయోగిస్తారు. దీనితో పాటు ఆముదం దీపం వెలిగిస్తే వచ్చే మసి, రెండు సూదులు, రెండు చిన్న మట్టికుండలు ఉపయోగిస్తారు. ముందుగా చెంగూరు చెక్కను ముక్కలు ముక్కలుగా చేసి చిన్న కుండలో నీళ్లుపోసి నానబెడతారు. చెక్కలు నాని ఆకుపచ్చ రంగులోకి మారుతాయి. సూదులల్లో రెండు, మూడు, నాలుగు, అయిదు సూదుల కట్టలను వేరు-వేరుగా కట్టుకొని పచ్చబొట్టు ఆకారం లేదా మందంను బట్టి ఈ సూదులను ఉపయోగిస్తారు.

పచ్చబొట్లు పొడవడానికి ముందుగా శరీరానికి వేయించుకునే భాగంలో సంబంధిత పచ్చబొట్టు నకలును గీసుకుంటారు. ఆ తరువాత కావల్సిన విధంగా పచ్చబొట్లు పొడుస్తారు. పొడిచే విధానంలో కూడా ఆయా గూడాలు లేదా గ్రామాల్లోని ప్రజల నమ్మకం కూడా చాలావరకు దోహదపడుతుంది. ఫలానా తోటి మహిళ పచ్చబొట్లు వేస్తే చాలామందికి మంచి జరిగితే సదరు మహిళ హస్తవాసి మంచిదని, ఎప్పటికీ ఆ మహిళ తను గ్రామానికి రావాలని కోరుకుంటారు. కొన్ని-కొన్ని సందర్భాల్లో నమ్మకం ఉన్న తోటి మహిళ ఆ గ్రామానికి వచ్చేవరకు వేచి ఉండి పచ్చబొట్లు పొడిపించుకోవడం గమనార్హం.

తరతరాలుగా సంస్కృతిలో భాగంగా వస్తున్న ఈ పచ్చబొట్లు వివిధ రకాలుగా ఉన్నాయి. వీటిలో సంప్రదాయంగా వేసుకునేవి, అలంకరణ కోసం వేసుకునేవి, నమ్మకం కోసం చేసుకునేవి, ఆరోగ్యపరంగా నొప్పుల నివారణ కోసం వేసుకునేవి ఉన్నాయి. ఈ విధమైన పచ్చబొట్లను గోండు, కోలాం, తోటి, లంబాడ, ఎరుకల, మాలి, భగత, కోయ, కొండరెడ్డి, నాయకపోడు, గదబవంటి గిరిజన తెగల మహిళలు వేసుకుంటారు. వారు వేసుకున్న పచ్చబొట్లను చూసి వారు ఏ గిరిజన తెగకు

చెందినవారో గుర్తించవచ్చునంటే ఈ పచ్చబొట్లు ప్రత్యేకత ఎలాంటిదో చెప్పకనే చెప్పవచ్చు. అదేవిధంగా మైదాన ప్రాంతంలో నివసించే జానపదులు సైతం ఈ పచ్చబొట్లు వేసుకుంటారు. ఈ విధంగా పచ్చబొట్లు అనేవి జానపద, గిరిజన సంస్కృతిలో భాగంగా గుర్తించబడ్డాయి.

**సంప్రదాయ పచ్చబొట్లు:**

గిరిజన మహిళలు ఎక్కువగా సంప్రదాయ పచ్చబొట్లు పొడిపించుకుంటారు. కొన్ని గిరిజన తెగల్లో మహిళల నుదుట పచ్చబొట్టు పొడిపించుకోవడం ఆచారం. అదేవిధంగా కొన్ని గిరిజన తెగల్లో మహిళలు నుదుట పచ్చబొట్టు ఉంటేనే వివాహానికి అర్హులు. ఇలాంటి సంప్రదాయాన్ని పరిశీలిస్తే గిరిజనులు పచ్చబొట్లకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థం అవుతుంది. ముఖ్యంగా గోండు, కోలాం, తోటి, కోయ గిరిజన మహిళలు వారు ససంప్రదాయంగా జరుపుకునే పెండ్లి, దేవతల కొలుపుల సందర్భాలలో పచ్చబొట్లు తప్పనిసరిగా ఉండాలనే నియమం ఉంది. ఇలాంటి పచ్చబొట్లల్లో కొన్ని పురుషులు, మరికొన్ని మహిళలు ప్రత్యేకంగా వేసుకునేవి ఉండటం గమనార్హం. ససంప్రదాయ పచ్చబొట్లల్లో రాణి సింగార్, వీసింగ్, పొద్దు లేలేజి, కుండకేయి మనుగటి, తులసి చెట్టు, చుక్కబొట్టు, చిత్త, చోరి రెహవాల్, దండా రెహవాల్‌వంటి పచ్చబొట్లను గిరిజన సంప్రదాయంలో భాగంగా వేయించుకుంటారు.

**అలంకరణ పచ్చబొట్లు:**

ప్రతీ గిరిజన మహిళ అలంకరణ కోసం ఏదో ఒకరకమైన పచ్చబొట్టు వేయించుకోవడం పరిపాటి. ఈ రకమైన పచ్చబొట్లు గిరిజన మహిళలకు శరీర సౌందర్యాన్ని పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయి. అయితే ఇలాంటి పచ్చబొట్లు ఆ యా మహిళల ఇష్టం, అభిరుచిమేరకు వేయించుకుంటారు. అలంకరణ కోసం వేయించుకునే పచ్చబొట్లతో రామనరత్, చుమ్మర్, చంపుపుంగార్, రాణిసింగార్, రామబాషిన, నూతి అక్కాచెల్లెండ్ల బొమ్మలు, దేవుడి బొమ్మలు, ముగ్గులు, వివిధ రకాల పూలు, సీతమ్మ సింగారి, పోక పువ్వువంటి వివిధ రకాల పచ్చబొట్లను పొడిపించుకుంటారు.

**నమ్మకాల పచ్చబొట్లు:**

గిరిజన మహిళలు పచ్చబొట్లు వేయించుకుంటే మంచి జరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటామనే నమ్మకం ఉన్నది. సంతానం లేనివారు కొన్ని రకాల పచ్చబొట్లు వేయించుకుంటే మంచి జరుగుతుందనే నమ్మకం కూడా కలదు. ప్రతీసారి గర్భవిచ్ఛిత్తి జరుగుతూ గర్భం నిలువకపోతే, ఆ గర్భం నిలువాలని నిపుణులైన తోటి మహిళలతో ప్రత్యేకమైన పచ్చబొట్లు పొడిపించుకుంటారు. ఇలాంటి పచ్చబొట్లతో సంతానం కోసం సీత సహాని పచ్చబొట్లు, గర్భం నిలువడం కోసం కుసాకొక్కువాల్ పచ్చబొట్లు, కత్తెరశూల నొప్పికి రకశూల పచ్చబొట్లు పొడిపించుకుంటారు. ఇలాంటి పచ్చబొట్లు ఎవరుపడితే వారితో పొడిపించుకోకుండా నిపుణులు, అనుభవం ఉన్న తోటి మహిళలతో మాత్రమే పొడిపించుకుంటారు. ఇదేవిధంగా దుష్టశక్తులు దగ్గరకు చేరకుండా మిచ్చా పచ్చబొట్లు, దిష్టి తగలకుండా దిష్టి బొట్టు, తిండికి కొరత లేకుండా ఉండేందుకు జీవాగోడివంటి వివిధ రకాల పచ్చబొట్లు పొడిపించుకుంటారు.

**ఆరోగ్యపరమైన పచ్చబొట్లు:**

గిరిజన మహిళలు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా దీర్ఘకాలిక నొప్పుల నుండి ఉపశమనం పొందడానికి కొన్ని రకాల పచ్చబొట్లను పొడిపించుకుంటారు. ఈ రకమైన పచ్చబొట్లను గిరిజనేతరులు కూడా పొడిపించుకుంటారు. మందులకు సైతం తగ్గని ఎన్నో రకాల నొప్పులు పచ్చబొట్లు వేయించుకోడవంవల్ల తగ్గడాన్ని పరిశీలిస్తే పచ్చబొట్ల ప్రాధాన్యతో పాటు, అవి వేసే తోటి మహిళల నైపుణ్యంను కూడా అంచనా వేయవచ్చు. నొప్పుల నివారణలో భాగంగా మోచేయి నొప్పి, వీపునొప్పి, జబ్బ నొప్పి, బొటనవేలు నొప్పి, మోచేతి నొప్పి, చేతివేళ్ల నొప్పి, మడిమ నొప్పి, చేతిమట్ట నొప్పి, మోకాళ్ల నొప్పి, కంఠం నొప్పి వంటి పలురకాల నొప్పులకు మెసడబొట్టు, సూర్యచంద్రులు, ఘోక్, గోటిపెర్సువాల్‌వంటి పచ్చబొట్లు వేస్తారు. నొప్పులతో పాటుగా కన్నుగడ్డ, బొమ్మతీపి, చెవిపోటు, గుర్రం మూతులు, వరిబీజంవంటి వాటికి వివిధ రకాల పచ్చబొట్లు వేయడం ద్వారా ఆయా వ్యక్తులకు ఉపశమనం కలిగిస్తారు. ఆదేవిధంగా దెబ్బలవల్ల, వాపులవల్ల కలిగే నొప్పులకు కూడా ఈ పచ్చబొట్లు దివ్యౌషదంగా పనిచేస్తుండటం గమనార్హం. అయితే శరీరంలోని ఏ భాగంలోనైన పచ్చబొట్లు పొడవవచ్చుకాని

కంఠం మీద మాత్రం పచ్చబొట్టు పొడిస్తే ప్రాణ హాని ఉంటుందని అక్కడ పచ్చబొట్లు పొడవరు. ఈ విషయమై చాలా జాగ్రత్త వహిస్తారు.

ఈ విధంగా గిరిజనులు, జానపదులు వివిధ రకాలుగల పచ్చబొట్లు కేవలం అలంకరణ కోసమే కాకుండా, వివిధ రకాల రోగాలు నయం కావడానికి కూడా వేసుకుంటున్నారు. అందుకే ఈ ప్రక్రియ భారతీయ ఆక్యుపంక్చర్ విధానంగా రూపుదాల్చింది అనే విషయాన్ని బలపరచాలంటే వాటి మూలాల్లోకి వెళ్లి పరిశోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పచ్చబొట్లు వేసే విషయంలో కూడా నిపుణులకు గట్టి నమ్మకం ఉందనే విషయాన్ని గ్రహించాలి. అందుకే ఈ పచ్చబొట్లను ఎప్పుడు పడితే అప్పుడు పొడవకుండా సూర్యగ్రహణం రోజు మొదలుపెట్టి ఆ తర్వాతనే గ్రామాలు లేదా గుడాలకు బయలుదేరుతారు. దీంతో వారు కాలానికి ఇచ్చే ప్రాధాన్యత ఏ స్థాయిలో ఉంటుంది అర్థం చేసుకోవచ్చు. మరొకవైపు పచ్చబొట్లు వేయడానికి ఉపయోగించే సూదులను ఒకరికి వేసినంకా ఇంకొకరికి ఉపయోగించేటపుడు ఎటువంటి అంటువ్యాధులు రాకుండా ఉండేందుకై ఆ సూదులను ఉల్లిగడ్డలో అనేక పర్యాయాలు కుచ్చి శుభ్రపరచడం, వేసుకున్న వ్యక్తులకు ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండేందుకు వేసిన భాగంలో పసుపు, నూనె రాసి జాగ్రత్త తీసుకునే అలవాట్లు ఆదిమ సంస్కృతిలో భాగమే అయినా, అధునిక యుగంలోనూ ఆచరణీయమైనవే కావడం విశేషం. అయితే ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను అనుసరించి ప్రభుత్వం సంప్రదాయ పద్ధతిలో వేసే పచ్చబొట్లను నిషేదించిన నేపథ్యంలో పచ్చబొట్లు వేసే గిరిజన మహిళలు ఉపాధి కోల్పోయారు. పచ్చబొట్లు వేయించుకున్న యువకులకు సైతం పోలీసు తదితర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో పచ్చబొట్లు ఆటకంగా మారినందున యువకుల్లో వీటిపై ఆసక్తి తగ్గి పచ్చబొట్లు వృత్తినే నమ్ముకున్న తోటి గిరిజన మహిళలు నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ ఆ వృత్తి మానేసి ఇతర ప్రత్యామ్నాయ ఉపాధిని ఎంచుకున్నారు. అదేవిధంగా యువత కూడా ఇతర ఉపాధి రంగాలను ఎంచుకొని జీవనం సాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జానపద గిరిజన వైద్యంలోను, సంస్కృతిలోను భాగమైన పచ్చబొట్లు వేసే తోటి గిరిజన మహిళలను ఆదుకొని భావితరాలకు మన సంస్కృతిని అందించాల్సిన ఆవశ్యకత అందరిపైన ఉంది.

డా. గడ్డం వెంకన్న - వరంగల్లు. ఫోన్: 944 130 5070.



క్యూబా రాజధాని హవానా

# క్యూబా - 1

**- నిమ్మగడ్డ శేషగిరిరావు**

**నా మనసులో క్యూబా:**

ప్రపంచ చరిత్రలో విప్లవ వీరునిగా అమితంగా ప్రేమించబడే ఫైడల్ కాస్ట్రోని కన్న దేశం ఇది. ప్రపంచ వ్యాప్తంగా యువహృదయాలను చేబట్టిన ఛే గువేరాని దత్తు తీసుకున్న దేశం ఇది. ఆరు దశాబ్దాల పాటు అమెరికా నీడలో ఉంటూ కూడా దాని ధాటిని తట్టుకొని, తన ఉనికిని నిలబెట్టుకున్న కమ్యూనిస్ట్ దేశం ఇది. యునైటెడ్ స్టేట్స్‌కు (ఫ్లోరిడా) క్యూబాకి మధ్యగల దూరం 103 మైళ్ళు మాత్రమే.

మొదటిసారి క్యూబా వెళ్ళి, తిరిగి వచ్చేటప్పుడు ఇక్కడికి మరో వందసార్లయినా రావాలనిపించింది నాకు. 'క్యూబా' పేరే నా చెవులకి ఒక సంగీత ధ్వనిలా వినిపిస్తుంది. ఎన్నెన్నో విశేషాల కలబోత ఇది. ఇంగ్లీషు భాషలో 'క్యూట్' అనే పదానికి రూపంలా ఉండే ఈ చిన్ని ద్వీపం భూమి మీద వెలసిన స్వర్గమేమో అనిపిస్తుంది. ఇంపైన వర్ణచిత్రంలా అలరారే ఈ దేశంలో సంగీతానికి పెద్దపీట ఉంది.

ఈ దేశం, ప్రపంచానికి పంచదార పాత్ర. ఉత్తమ పొగాకు చుట్టల్ని (హవానా సిగార్స్) ప్రపంచానికి అందించిన దేశం. అత్యుత్తమమైన క్లాసిక్ కార్లు, రమ్, మొహితో, డైకిరిలాంటి కాక్‌టైల్స్, ప్రఖ్యాత సల్సా నృత్యానికి ఆద్యమైన ఛ-ఛ-ఛ, మాంబో నృత్య రీతులను ప్రపంచానికి పరిచయం చేసిన దేశం. కాని ముడిచమురు కోసం డాక్టర్లను మారకం చేసే వైనం మాత్రం ఇక్కడే చూస్తాము. ఏమైనా, సుందర సైకత తీరాలు, ఆకు పచ్చని లోయలు, అడవులు, కొండలతో నిండిన ఈ కరీబియన్ ద్వీపం ఉష్ణమండల స్వర్గం. మానవజాతి అభివృద్ధి సూచికల దృష్ట్యా పై స్థాయికి చెందిన దేశం కూడా.

**2018: వార్తలలో క్యూబా:**

గత కొద్ది వారాలుగా (2018లో) క్యూబా, వార్తలలోకి వచ్చింది. దీనికి కారణం రావుల్ కాస్ట్రో, (ఫైడల్ కాస్ట్రో సోదరుడు) మళ్ళీ ఎన్నికల్లో పోటీ చెయ్యకూడదని నిర్ణయించుకొనటమే. ఫైడల్ కాస్ట్రో అర్ధ శతాబ్దం, రావుల్ ఒక దశాబ్దం పాటు క్యూబాని పాలించారు. 60 ఏళ్ళ కాస్ట్రోల పాలన ఇప్పటితో ముగిసింది. యాదృచ్ఛికంగా, ఈరోజే నాలాగే పర్యాటన ఆసక్తి ఉన్న ఒక మిత్రురాలు, క్యూబా వెళ్ళి వచ్చి, కొన్ని ఫోటోలు పంపింది. అవి చూడగానే, నా క్యూబా పర్యటన (2009) జ్ఞాపకం వచ్చింది. అప్పటి నుండీ నాకు, చూసిన విశేషాలన్నిటి గురించి విస్తృతంగా నోట్స్ వ్రాసుకునే అలవాటుంది. వెంటనే నా పాత ట్రావెల్ డైరీ వెతికి దుమ్ము దులిపి ఆ యాత్రా విశేషాలను వివరంగా వ్రాయటానికి నిశ్చయించుకున్నాను.

ఈ మధ్యే చదివిన 'ఛే గువేరా జీవిత చరిత్ర' (రచయిత: జాన్ లీ ఆండర్సన్) కూడా మరో ప్రేరణ. దాంతో పాటుగా 'ఛే' రచించిన 'మోటార్ సైకిల్ డైరీలు' కూడా చదివాను. నా అభిమాన ట్రావెల్ పుస్తకాలలో ఇది ఒకటి.

**2009: మిత్రులతో క్యూబా పర్యటన:**

అది 2009 సంవత్సరం. 'క్యూబా' వెళుతున్నాము. మాతో కలసి రావటానికి ఆసక్తి ఉందా? అంటూ ఒక చిన్న మిత్రబృందం నుండి నాకు ఆహ్వానం వచ్చింది. వీళ్ళందరూ యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉంటున్న సైకియాట్రిస్టులు. విశిష్టమైన ఈ బృందంలో ప్రయాణానుభవం ఉన్నవారిని, అందరితోనూ సర్దుకుపోగలిగినవారిని మాత్రమే చేర్చుకుంటారు. "సరైన వ్యక్తితో ప్రయాణం స్వర్గతుల్యం. అదే ప్రయాణం సరైన వ్యక్తితో కానప్పుడు అది నరకప్రాయ"మని స్వానుభవంవలన నాకు తెలుసు.

సైకియాట్రిస్టు డా. చిత్ర మోహన్ ఈ బృందానికి నాయకుడు. ప్రయాణాలంటే అతనికి ఎంతో ఆసక్తి. ఎంతో కాలంగా మేమిద్దరం స్నేహితులమయినా, మా ఇరువురికీ ఒకే ఆసక్తి ఉందని అతనికి తెలియదు. కొన్ని నెలల క్రితం లండన్ నుండి ఇస్తాంబుల్ వరకు పద్దెనిమిది రోజుల పాటు ఒంటరిగా నేను రైలు మార్గం ద్వారా ప్రయాణం చేసిన విషయం అతనికి ఈ మధ్యే తెలిసిందట. నన్ను తన గ్రూపులోకి ఆహ్వానిస్తూ, క్యూబా దేశం ఇప్పుడిప్పుడే

తలుపు తెరచి, బయటి ప్రపంచాన్ని ఆహ్వానిస్తోందని, ఆ ప్రాంతం ఇంకా అమలినంగా, నిర్మలంగా ఉందనీ, విలాస యాత్రికులు దాన్ని పాడుచేయక ముందే మనం దానిని చూడాలని మోహన్ చెప్పాడు. ఫైడల్ కాస్ట్రో తరువాత, అతని సోదరుడు రావుల్ కాస్ట్రో అధ్యక్షుడుగా దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ విధానాలను సరళీకృతం చేయటానికి ప్రయత్నిస్తున్న సమయం అది.

యు.కె.లో పనిచేస్తున్న డోమింగో గొంజాలెజ్ అనే స్పానిష్ సైకియాట్రిస్టు, అతని భార్య 'పాట్రిషియా' ఈ ట్రిప్‌లో నా సహచరులు. క్యూబా జాతీయ భాష 'స్పానిష్' కావటంవల్ల డోమింగో ట్రాన్స్‌లేటర్‌గా కూడా మాకు ఉపయోగపడ్డాడు. 1492లో క్రిస్టఫర్ కొలంబస్, ఇండియాకు సముద్ర మార్గం అన్వేషించే క్రమంలో, అక్టోబర్ 27న 'క్యూబా'లో అడుగు పెట్టాడు. స్పెయిన్ నుండి క్యూబా చేరటానికి కొలంబస్‌కు ఎన్నో నెలలు పట్టింది. మాకు మాత్రం లండన్ గాట్విక్ ఎయిర్‌పోర్ట్ నుండి 'హవానా' చేరటానికి 10 గంటలు పట్టింది. ఇది మాకు సుదీర్ఘమైన కాలం. వీసా ప్రొసీజర్ చాలా సులభం. పేపర్ వీసా ఇస్తారు. క్యూబా దర్శించటం మీద అమెరికాలో నిషేధం ఉండటంవలన, ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని పాస్‌పోర్టు మీద స్టాంపు వెయ్యరని అనుకున్నాము.

**క్యూబా: చారిత్రక, భౌగోళిక ప్రాధాన్యత:**

16వ శతాబ్దపు ప్రారంభంలో క్యూబా, స్పానిష్‌వారి అధీనంలో ఉంది. నాలుగు శతాబ్దాల పాటు స్పానిష్ పాలన సాగింది. క్యూబాలో స్థావరమేర్పరచుకోవటంవలనే వీరు మెక్సికో, పెరూలను కూడా కైవశం చేసుకోగలిగారు. క్యూబా కరీబియన్ సముద్రంలో అతి పెద్ద దీవి అయినప్పటికీ, దాని సంస్కృతి, ప్రజల ఆచారాలు లాటిన్ అమెరికా దేశాలను పోలి ఉంటాయి. దక్షిణ, మధ్య అమెరికాలో స్పానిష్, పోర్చుగీసు మాట్లాడే దేశాలను లాటిన్ అమెరికా దేశాలని అంటారు. నేను ఈ వ్యాసంలో ఈ రెండు పదాల్ని "సౌత్ అమెరికా", "లాటిన్ అమెరికా" అనే పదాలను ఒకే అర్థంతో ఉపయోగిస్తున్నాను.

క్రీ॥శ॥ 1762లో బ్రిటీష్ వారు, స్పానిష్ వారి 'హవానా'ను ఆక్రమించుకున్నారు. ఒక సంవత్సరం తర్వాత, ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్‌లో ఉన్న ఫ్లోరిడా కోసం స్పానిష్ వారితో క్యూబాను మారకం చేసుకున్నారు. హోసె మర్తి, హవానా స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి 1895లో ప్రాణాలు కోల్పోయాడు. అతనిని 'క్యూబా' జాతిపితగా భావిస్తారు. హోసె మర్తి, ఫైడల్ క్యాస్ట్రోకు ప్రేరణ, ఆదర్శం.

క్యూబా రాజధాని 'హవానా' కరేబియన్ దీవులన్నిటిలో అతిపెద్ద పట్టణం. దీనిని క్రీ॥పూ॥ 1519వ సంవత్సరంలో సముద్రతీరాన, వెడల్పుగా ఉన్న లోతైన రేవు ప్రాంతంలో నిర్మించారు. ఓడ రవాణాకు అనుకూలమైన వ్యూహాత్మక భౌగోళిక లక్షణంవలన, దీనికి వాణిజ్య ప్రాధాన్యత సమకూడింది. ఓడరేవు చుట్టూ అనేక బలమైన రక్షణ భవనాలు నిర్మించారు. క్యూబా విప్లవానికి ముందే 'హవానా' ఎంతో అభివృద్ధి చెందిన నగరం. చారిత్రాత్మకమైన స్పానిష్ కట్టడాలు ఈ నగరానికి గర్వకారణం.

మేము హోటల్‌కి వెళ్ళే మార్గంలో 'ప్లాజా ఆఫ్ రివల్యూషన్' అనబడే చౌరస్తా చూశాము. అక్కడ ఒక పెద్ద భవనపు గోడ మీద విప్లవకారుడైన ఛే గువేరా చిత్రం సందర్శకులకు స్వాగతం పలుకుతుంది. క్యూబాలో కాస్ట్రోకంటే కూడా ఛే గువేరాను ఆరాధించేవాళ్ళు ఎక్కువేమోనని నాకనిపించింది.

**మేము చూసిన క్యూబా; ముందుగా హవానా:**

క్యూబాలో మేము 'నేషనల్ డి క్యూబా' అనే హోటల్‌లో బస చేశాము. అక్కడికి చేరుకునేసరికి సాయంత్రం అయింది. త్వరగా భోజనం చేసి పడుకోవాలని మా ప్లాన్. మా స్థానిక గైడు హోటల్ దగ్గరలోని 'గువాటో ట్యుఎర్టో' అనే ఒక రెస్టారెంటుకు వెళ్ళమని సూచించాడు. త్వరగా తినేసి వచ్చేద్దామని వెళ్ళాము. తీరా వెళ్ళాక అదొక అద్భుతమైన అనుభవంగా రూపుదిద్దుకుంది. రుచికరమైన భోజనం, మంచి క్యూబన్ కాక్‌టెయిల్స్, వీనుల విందైన సంగీతం అన్నీ సమపాళ్లలో సమకూరితే ఇంకేమి కావాలి?

ప్రత్యేకించి, ఇక్కడ నేను ఊహించని విశేషాలు కొన్ని జరగటంతో ఈ రెస్టారెంటు నా జ్ఞాపకాలలో నిలచిపోయింది. ఇక్కడి సర్వర్ ఒక మధ్య వయస్కుడు. మామూలుగా కనిపించే సర్వర్లకంటే భిన్నంగా చాలా తెలివైనవాడిలా, అనుభవజ్ఞుడిలా కనిపించాడు. అతను మమ్మల్ని ఎక్కడి నుండి వచ్చారని అడిగాడు, అతను

మాట్లాడిన విధానాన్నిబట్టి చాలా విద్యావంతుడిలా ఉన్నాడనుకున్నాను. స్టేజి మీద నిలబడిన గాయని ఆకర్షణీయమైన పాటలు అందుకొంది. "ఆమె ఎవరని" నా స్పానిష్ మిత్రుడు, డొమింగో ద్వారా సర్వర్‌ని అడిగాను. ఆమె ప్రసిద్ధి చెందిన టెలివిజన్ స్టార్ అని తెలిసింది. అతడు నా ముఖం మీద దాగని ప్రశ్నార్థకాన్ని గమనించి, ఆమె ఎంత ఖ్యాతి గడించినా తన ఉద్యోగం ద్వారా సంపాదించేది చాలా తక్కువనీ, అదనపు ఆదాయం కోసం బారుల్లో ప్రదర్శనలు ఇస్తూ ఉంటుందనీ చెప్పాడు. అప్పుడు నేను అతనిని 'మీకు కూడా వేరే ఉద్యోగం ఏమైనా ఉందా?" అని అడిగాను. అతడు తను "క్యూబాలో ఉన్న పెద్ద హాస్పిటల్‌లో న్యూరోసర్జన్" అని చెప్పాడు. నేను నోరు వెళ్ళబెట్టాను. అది అతడు గమనించి, తనే చెప్పుకొచ్చాడు. "వెయిటర్ ఉద్యోగంలో చాలా సుఖంగా ఉన్నానని, డాక్టర్‌గా వచ్చే ఆదాయంకంటే వెయిటర్‌గా ఎక్కువగా సంపాదిస్తానని, ప్రత్యేకించి విదేశీ పర్యాటకులు మంచి టిప్స్ ఇస్తారని" చెప్పాడు. అతను తన వృత్తిధర్మం నిర్వహిస్తున్నా, మేము మాత్రం న్యూరోసర్జన్ అయిన తోటి డాక్టర్‌తో, చదువుకు, వృత్తికి సంబంధం లేని పనులు చేయించుకుంటున్నందుకు బాధపడ్డాము. క్యూబాలో మాత్రమే కనపడే సామాజిక, ఆర్థిక పరిస్థితులతో మరువలేని తొలి పరిచయం నాకు ఇలా జరిగింది.

చాలా ఎత్తుగా, సముద్ర తీరం మీద ఉన్న 'నేషనల్ డి క్యూబా' హోటల్‌లో మేము మూడు రాత్రులు ఉన్నాము. 1930లో అమెరికా వారు నిర్మించిన ఈ భవనానికి దూలాలుగా మహాగని కలపను ఉపయోగించారు. ఎత్తైన సీలింగ్, అక్కడ నుండి వేలాడే ఆకర్షణీయమైన షాండ్లియర్లు, మంచి పాతకాలపు గట్టి ఫర్నిచర్‌తో లోపలి భాగం హుందాగా ఉంది. అయితే దాని నిర్వహణ అంతగా బాగున్నట్టు లేదు. ఏదైనా పెద్ద హోటల్ గ్రూపు దీనిని తీసుకుంటే, తన పూర్వ వైభవాన్ని తిరిగి పొంది, ప్రపంచ ప్రఖ్యాత హోటళ్ళలో ఒకటిగా నిలుస్తుందనుకున్నాను.

ఈ హోటల్ 1940, 1950 సంవత్సరాలలో ఒక వెలుగు వెలిగిందట. హవానాలో ప్రధానమైన కార్యక్రమాలన్నీ ఇక్కడే జరగటంతో, ఎంతోమంది దేశాధ్యక్షులు, ప్రధానులు, అంతర్జాతీయ ప్రముఖులు, ఎంతోమంది సంపన్న అమెరికన్లు ఇక్కడ ఆతిథ్యం పొందారట. వీరిలో విన్‌స్టన్ చర్చిల్, ఇందిరాగాంధి,




నిత్య పోరాటం



శక్తిమాన్ క్యాస్ట్రో

మార్లిన్ బ్రాండో, వాల్ట్ డిస్నీ, ఫ్రాంక్ సినట్రా, ఫ్రెంచి తత్త్వవేత్త జీన్‌పాల్ సార్త్రే, జేమ్స్ బాండ్ ఫేం అలెగ్జాండర్ ఫ్లెమింగ్, ఇంకా రష్యా వ్యోమగామి యూరి గగారిన్ కూడా ఉన్నారు. ఈ హోటలు క్యూబా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంతరించుకోవటమే దీని ప్రత్యేక ఆకర్షణ. ఇందులో కొంత భాగం పురావస్తు ప్రదర్శనశాల కూడా.

1960లో ఫైడల్ క్యాస్ట్రో ఈ హోటల్‌ను జాతీయం చేయక ముందు దీనిలో సుప్రసిద్ధమైన కాసినో ఉండేది. అక్కడికి అమెరికన్లు ఎక్కువగా వచ్చేవారట. ఒకవేళ ఫైడల్ కాస్ట్రో క్యూబా విప్లవంలో అమెరికాతో విజయం సాధించకపోతే ఈ హవానా, మరో లాస్ వేగాస్ అయి ఉండేది. 1946లో ఇక్కడ జరిగిన హవానా కాన్ఫరెన్స్ కోసం న్యూయార్క్, చికాగోలకు నుండి వచ్చిన అమెరికన్ – ఇటాలియన్ మాఫియా డాన్లు కూడా ఇక్కడ బస చేశారు. మారియోపూజో వ్రాసిన ప్రసిద్ధ నవల 'గాడ్ ఫాదర్'లోని చాలా దృశ్యాలకు స్ఫూర్తి ఈ హోటలేనని చెపుతారు.

ఈ హోటల్‌లో పెద్ద నృత్య, నాటకశాల ఉంది. ఆ రోజు అక్కడ ఫ్రెంచ్ వారి 'పారిసియన్ క్యాబరే షో' నడుస్తోంది. ఒక సాయంత్రం మేము ఆ ప్రదర్శన చూశాము. క్యూబా సాంస్కృతిక ఛాయలు సంతరించుకున్న ఈ పారిసియన్ షో చాలా బాగుంది. ఈ హోటల్లో ప్రత్యేకంగా 'క్యూబన్ సిగార్' షాపు ఉంది. మిత్రుడు డోమింగోకు క్యూబా దేశపు సిగార్లంటే ప్రత్యేకమైన ఇష్టం. వాటిల్లో కొహిబా, మాంటేక్రిష్టో, రోమియో అండ్ జూలియట్ అనేవి మూడు బ్రాండ్లు ప్రముఖమైనవి, ఖరీదైనవని కూడా డొమింగో చెప్పాడు. అయితే లండన్ ధరలతో పోల్చితే అవి పావువంతే. కొన్ని సిగార్లను ఇంగ్లండ్‌కు తీసుకెళ్ళి అమ్మితే క్యూబా ఫ్లైట్ టికెట్ ధర వచ్చేస్తుందని అతను నవ్వుతూ చెప్పాడు. ఆ తరువాత ఎన్నో ఏళ్ళపాటు, నా ప్రయాణాల్లో ఎన్నో హోటళ్ళలో, పై బ్రాండుల సిగార్‌లను, చాలా అనూహ్యమైన ధరలకు అమ్మటం నేను చూశాను.

మరుసటిరోజు మేము పాత హవానా నగరాన్ని సందర్శించాము. రంగు వెలసి, శిధిలావస్థలో ఉన్న పాత ఇళ్ళు, ఇప్పటికీ అదోవిధమైన అందంతో విలక్షణంగా కనిపించాయి. ఏళ్ళు గడిచినకొద్దీ రుచికరంగా తయారయ్యే ద్రాక్షరసంలా, ఈ పాత నగరం మమ్మల్ని ఆకట్టుకుంది. ఒక రోజంతా ఆ ప్రాంతంలో తిరిగినా తనివి తీరలేదు. శిధిలమవుతున్న పట్టణపు అంతఃసౌందర్యాన్ని ఆస్వాదించటానికి మరుసటిరోజు మళ్ళీ వెళ్ళాము. పాత హవానా, స్పానిష్ వారు అమెరికా ఖండంలో నిర్మించిన మొట్టమొదటి నగరం. అక్కడ ఇప్పటికీ ఆ కలోనియల్ వాతావరణం కనిపిస్తోంది. అటు తరువాత అమెరికా ఖండాలలో ఎన్నో గొప్ప నగరాలు నిర్మించబడినా, హవానా ప్రత్యేకత చెక్కుచెదరలేదు. ఫైడెల్ కాస్ట్రో 60 ఏళ్ళ పాలనలో, సమకాలీనమైన ఇతర పెద్ద నగరాలు ఎన్నో మార్పులకు గురైనా, హవానా మాత్రం కాలంలో ఘనీభవించింది.

చిన్న–చిన్న కొండరాళ్ళతో వేసిన ఇరుకు రోడ్లతో కలపబడిన ఎన్నో చౌరస్తాలను దాటుకుంటూ మేము నడుస్తూ పోయాము. అన్నింటికంటే పురాతనమైన చౌరస్తా పేరు 'ప్లాజా డి ఆర్మాస్'. ఇక్కడే హవానా నగరానికి పునాది వేయబడింది. ఇప్పటికీ ఇది సాంఘిక జీవనానికి కేంద్రంగా ఉంది. నేను చూచిన ఇలాంటి మరో 'స్క్వేర్', 'ప్లాజా వీజ'. రంగు రంగుల భవనాలతో, కేఫ్‌లతో చాలా చూడముచ్చటగా ఉంది. హార్బర్‌కు ఎదురుగా ఉన్న 'ప్లాజా డి సాన్‌ఫ్రాన్సిస్కో' మరొక ముఖ్యమైన 'స్క్వేర్'. ఇక్కడ 'ఫౌంటైన్ ఆఫ్ లయన్స్' ఉంది. అటుగా వెళ్ళే నావికులకు అది త్రాగు నీరు అందించేది ఆ రోజుల్లో.

ఇక్కడ నేను కలకత్తాకు చెందిన మదర్ థెరిస్సా విగ్రహాన్ని చూశాను. ఆ వీధికి కూడా ఆమె పేరే పెట్టారు. అక్కడకు దగ్గరలో ఉన్న పార్క్‌లో విశ్వకవి ఠాగూర్ బస్ట్‌సైజ్ విగ్రహాన్ని చూసి సంతోషపడ్డాను.

పురానా హవానాలో ఉన్న 'కథీడ్రల్ డి శాన్ క్రిస్టోబల్' మరో అద్భుత శౌధం. లాటిన్ అమెరికాలో ఉన్న పురాతన చర్చిలలో ఇది ఒకటి. క్రిస్టఫర్ కొలంబస్ పార్థివ దేహాన్ని 18, 19వ శతాబ్దాలలో స్పెయిన్‌లోని శవిల్‌కు తరలించటానికి ముందు, వంద సంవత్సరాల పాటు ఇక్కడ ఉంచారని మా స్థానిక గైడ్ చెప్పాడు.




క్యూబన్ అందాలు

ఏదైనా కొంచెం త్రాగుదామని, హోటల్ 'అంబోస్ మండోస్'వద్ద ఆగాము. హెమింగ్ వే తరచు ఇక్కడికి వచ్చేవాడట. చికాగోలో జన్మించిన నోబెల్ సాహిత్య అవార్డు గ్రహీత ఎర్నెస్ట్ హెమింగ్వేకు క్యూబాకు దగ్గర సంబంధం ఉంది. అతను ప్రపంచ యాత్రికుడు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఉన్నాడు. ఈ హోటల్‌లో అతను 'రూమ్ నంబర్ 511'లో బస చేసేవాడట. ఆ గది నుండి హవానా నగరం, సముద్రం అద్భుతంగా కనిపిస్తుంది. హెమ్మింగ్వే తన సుప్రసిద్ధమైన నవలల్లో ఒకటైన For whom the Bell Tollsను ఈ గదిలో ఉంటూనే వ్రాశాడని చెపుతారు. ఇది హెమ్మింగ్వే జ్ఞాపికలతో నిండి ఉన్న ఒక చిన్న గది. ఆ గదిలో మనం ఉన్నప్పుడు, అతను క్రింద రిసెప్షన్‌లో ఎవరినో కలుసుకోవటానికి వెళ్ళి, ఇప్పుడే తిరిగి వస్తాడన్నట్లుగా ఉంటుంది.

క్యూబా కాంగ్రెస్ బిల్డింగ్ 'ఎల్ కాపిటాలియో' చాలా పెద్ద భవంతి. అది వాషింగ్‌టన్ డి.సి.లోని కాపిటోల్ బిల్డింగ్‌కు దగ్గర బంధువులా ఉంటుంది. 20వ శతాబ్ద ప్రారంభంలో పంచదార వ్యాపారంవలన వచ్చి పడిన డబ్బుతో దాన్ని నిర్మించారు. తరువాత మేము చూసిన 'మోరో ఫోర్ట్'ను 1589లో హవానా సహజ ఓడరేవు ముఖద్వారాన్ని కాపాడటం కోసం నిర్మించారు. మా హోటల్ ముందుగా, సముద్ర తీరాన, ఎల్ మాలెకోన్ అనబడే పొడవైన మార్గం నడవటానికే నిర్మించబడింది. దాని వెంబడే మేము నడుస్తుండగా మా గైడ్, 1962 అక్టోబర్‌లో జరిగిన క్యూబా క్షిపణుల సంక్షోభం గురించి మాట్లాడాడు. ప్రపంచం మూడవ ప్రపంచ యుద్ధ భయంతో వణికిన సమయం అది. యు.ఎస్.ఎ, యు.ఎస్.ఎస్.ఆర్.లు అణుయుద్ధానికి సన్నద్ధమయ్యాయి. అప్పుడు క్యూబా ఒక కీలకమైన స్థానంలో ఉంది. అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెనడీ. సోవియట్ యూనియన్ జనరల్ సెక్రటరీ నికితా కృశ్చేవ్. అతి శక్తివంతులైన ఈ ఇద్దరు వ్యక్తులు న్యూక్లియర్ బాంబు మీటల మీద వేళ్ళు పెట్టుకుని కూర్చుని ఉన్నారు.

ఫైడల్‌కాస్ట్రో నాయకత్వంలో ఉన్న కమ్యూనిస్ట్ క్యూబా, యు.ఎస్.ఎ.కు ఎప్పుడూ పక్కలో బల్లెమే. ఎందుకంటే లాటిన్ అమెరికా దేశాలలో కమ్యూనిజం విస్తరించటానికి అదే దిశానిర్దేశం చెయ్యవచ్చు. ఆ భయంతోనే, సి.ఐ.ఎ. సంస్థ క్యాస్ట్రో మీద పదేపదే హత్యాప్రయత్నాలు చేసింది. అతని పాలనను అంతంచేసి, తమకు అనుకూలమైన వ్యక్తిని పదవిలో ఉంచాలనేది యు.ఎస్.ఎ. లక్ష్యం. సి.ఐ.ఎ. వారు కాస్ట్రో వ్యతిరేక శక్తులకు తర్ఫీదిచ్చి, 1961లో ఒక నౌకలో వాళ్ళను క్యూబా మీదకు దండయాత్రకు పంపింది. ఆ ప్రదేశాన్ని 'బే ఆఫ్ పిగ్స్' అంటారు. అయితే ఆ ప్రయత్నం విజయవంతం కాలేదు.

అమెరికా వారు పదేపదే దాడులు చెయ్యటంతో ఫైడేల్‌కాస్ట్రో, చే గువేరా తమ రక్షణ కోసం సోవియట్ యూనియన్‌తో చర్చలు జరిపారు. అదే సమయంలో సోవియట్ యూనియన్, అమెరికా పట్ల అసంతృప్తితో ఉంది. ఎందుకంటే యు.ఎస్.ఎ. తమ న్యూక్లియర్ మిస్సైల్స్‌ను టర్కీలో ఉంచింది. (టర్కీ యు.ఎస్.ఎ.కు

అనుకూల దేశం). క్యూబా పరిస్థితిని సోవియట్ యూనియన్ అవకాశంగా తీసుకుని, టర్కీలో మిస్సైల్స్ ఉంచిన యు.ఎస్.ఎ.కి సమాధానంగా, క్యూబాలో తమ మిస్సైల్స్‌ను ఉంచాలనుకుంది. దీనికి క్యూబా కూడా అంగీకరించింది. భవిష్యత్తులో దేశ రక్షణకు న్యూక్లియర్ ఆయుధాలు ఉండాల్సిన అవసరం ఉందని క్యూబా నమ్మింది. యు.ఎస్.ఎ. గూఢచార విమానాలు క్యూబాలో సోవియట్ న్యూక్లియర్ మిస్సైల్స్ ఉన్నట్లు గుర్తించాయి.

యు.ఎస్.ఎ. నౌకాదళం క్యూబాను చుట్టుముట్టినప్పుడు, అది ఒక సైనిక చర్యగా సోవియట్ యూనియన్ ప్రకటించింది. రెండు బలమైన దేశాల మధ్య సంప్రదింపులు సరిగా లేవు. ఇది ప్రపంచానికే ముప్పు తెచ్చే పరిస్థితి. కెనడీ, కృశ్చేవ్‌లలో ఎవరు మూర్ఖంగా న్యూక్లియర్ బటన్ నొక్కినా నిముషాల్లో ప్రపంచ వినాశనం తథ్యం. ఈ రెండు దేశాల ఆంతర్యాలేమిటో వారి సలహాదారులు కూడా అర్థం చేసుకోలేకపోతున్నారు. చివరగా రెండు మహాశక్తులు తమ న్యూక్లియర్ మిస్సైల్స్‌ను వెనుకకు తీసుకోవటానికి అంగీకరించటం యావత్ప్రపంచానికే ఒక పెద్ద ఊరట. అటు తరువాత వైట్ హౌస్, క్రెమ్లిన్‌ల మధ్య పటిష్టమైన సమాచార వ్యవస్థను నెలకొల్పారు.

హవానా నగరపు గాలిలో సంగీత తరంగాలు తేలియాడుతుంటాయి. ప్రతి కూడలిలోనూ రకరకాల సంగీతపు వాయిద్యాలు వినిపిస్తూ ఉంటాయి. క్యూబా వారి నిత్యజీవితంతో సంగీత, నృత్యాలు పెనవేసుకుని ఉంటాయనిపిస్తుంది. క్యూబాలో నా అనుభవం, అక్కడి ప్రజలవలన, ఎవరినైనా ఇట్టే ఆకట్టుకునే వారి సంస్కృతివలన అనుకున్న దానికంటే ఎన్నో రెట్లు ఆహ్లాదంగా ఉంది.

హవానా ఓల్డ్ టౌన్‌లో ఒక సాయంత్రం క్యూబన్ బార్లను అన్వేషిస్తూ వెళ్ళాము. 1950వ సంవత్సరం నాటికి ప్రపంచంలో పది ప్రముఖమైన కాక్‌టైల్ బార్ల లిస్టులో తప్పనిసరిగా ఉండేవి: లా బొడిగిటా డెల్ మీడియో; లా ఫ్లోరిడిటా. అమెరికన్ నోబెల్ గ్రహీత (సాహిత్యంలో) ఎర్నెస్టు హెమ్మింగ్వే "లా బొడిగిటాలో దొరికే నా మొహిటో, లా ఫ్లోరిడిటాలో దొరికే నా డైకిరీ" అంటూ, అవి రెండూ తనకెంత ప్రియమైనవో చెప్పుకుంటాడు. రమ్‌తో తయారయ్యే ఈ రెండూ పపంచ వ్యాప్తంగా కాక్‌టైల్స్ లిస్టలలో ప్రముఖంగా కనపడతాయి. క్యూబా వారి సాంప్రదాయిక డ్రింక్స్ ఇవి.

ఈ రెండు బార్లలోనూ మంచి ఉత్సాహపూరిత వాతావరణం ఉంది. అలంకరణంతా పురాతనంగా, 1950, 1960ల నాటి పురాతన కాలాన్ని తలపించేలా ఉంది. ఇక్కడి వచ్చి వెళ్ళిన ప్రముఖుల ఫోటోలన్నీ గోడల మీద ఉన్నాయి. ఈ బార్ల గురించి పాతరోజుల్లో వార్తాపత్రికల్లోను, మ్యాగజైన్లలోను వచ్చిన వార్తలను పటం కట్టి, గోడల మీద అమర్చారు.

నేను లా ఫ్లోరిడిటాలో ఎంతో కాలంగా పని చేస్తున్న ఒక ఉద్యోగితో సంభాషణ మొదలుపెట్టాను. అతనికి


క్యూబా

ఆ ప్రదేశం పూర్వాపరాలు తెలుసు. హెమ్మింగ్వే తరచు ఇక్కడికి వచ్చి కూర్చునేవాడని చెప్పాడు. అతని సలహామేరకు మేము ప్రత్యేకమైన 'హెమింగ్వే డైకిరి' ఆర్డర్ చేశాము. అందులో రమ్, లైమ్ జ్యూస్, చక్కెర హెమింగ్వేకు ఇష్టమైన పాళ్ళలో కలుపుతారు. అక్కడే భోజనం చేసి తీరికగా నడచుకుంటూ, లా బొడిగిటా లో మొహిటోలు రుచి చూద్దామని వెళ్ళాము. ఇది మరీ ప్రాచీనంగా కనిపించింది. టూరిస్టులు, స్థానికులు కూడా అందరూ డజన్లకొద్దీ మొహిటోలు పట్టించేస్తున్నారు. ఆ వెయిటర్ మాకు మొహిటో చేసేవిధానం చూపించాడు. కొన్ని పుదీనా ఆకులను నలగకొట్టి పొడవాటి గ్లాసులో వేసి, దాంట్లో రమ్ము, లెమన్ జ్యూస్, పంచదార వేసి మొహిటో తయారు చేస్తారు.

హవానాలో చివరి రాత్రి గడిపి, మొహిటోలు, డైకిరీలు తనివితీరా ఆస్వాదించి, క్యూబా అంతర్భాగంలోకి వెళ్ళే ముందు నా మిత్రులకు క్యూబా గురించి సంక్షిప్తంగా ఆరు 'సి'లలో చెప్పాను. అవి ఏమంటే కల్చర్, సిగార్స్, కాక్టైయిల్స్, క్లాసిక్ కార్లు, కాస్ట్రో, మరి కొంచెం ఎక్కువగా... ఛే గువేరా.

నావరకు నాకు బాగా నచ్చినవి క్యూబా వారి కాక్టైల్స్. మొహిటోలు, డైకిరీల తరువాత క్యూబా వారి లిబ్రేను చాలామంది ఇష్టపడతారు. మా మెడికల్ స్కూల్డేస్ నుండి, కొంచెం రమ్ము, కోక్, కొద్దిగా ఐస్ కలిపి ఒక డ్రింక్ చేసుకునేవాళ్ళం. అయితే అది క్యూబన్ లిబ్రే కాక్టైల్ అని అప్పట్లో తెలియదు. వ్యత్యాసం ఏమిటంటే 'హవానా క్లబ్ రమ్' బదులు భారతీయ ఓల్డ్మాంక్ రమ్, కోక్ స్థానంలో ఇండియన్ కోలా థమ్సప్ కలుపుకునేవాళ్ళం. ప్రసిద్ధమైన 'బకార్డి' రమ్ కూడా క్యూబా వారిదే. విప్లవం తర్వాత బకార్డి కుటుంబం వారు బయటకు వెళ్ళిపోయారు.

నేను ట్రావెల్ చేసిన సమయంలో దాదాపు అన్ని హోటళ్ళు, రెస్టారెంట్లు గవర్నమెంటు అధీనంలో ఉండేవి. టూరిజాన్ని అభివృద్ధి చెయ్యటానికి, ఇళ్ళల్లో నడిపే రెస్టారెంట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వాటిని 'పాలడోర్స్' అంటారు. నా అనుభవంలో అవే ఉత్తమమైన రెస్టారెంట్లు. ఆహారం రుచిగానూ, పరిసరాలన్నీ స్నేహపూర్వకమైన వాతావరణంతోనూ ఉంటాయి. క్యూబా వారి దైనందిన ఆహారం కోంగ్రీ లేదా మోరోస్ యా క్రిస్టియానోస్. వరి అన్నంతో బ్లాక్బీన్స్ని కలిపి చేస్తారు. ఒకవిధంగా ఇది మన 'దాల్ రైస్'/పప్పన్నంలాంటిది.

నాకు జల పుష్పాల ఆహారం (సీ ఫుడ్) చాలా ఇష్టం. నా ప్రయాణాల్లో ఎక్కడ కనిపించినా, ప్రత్యేకించి సముద్ర తీర ప్రాంతాల్లో వీటిని వెతుక్కుంటాను. సీ ఫుడ్స్లో లోబ్స్టర్ చాలా రుచికరమయిందే కాకుండా ఖరీదయింది కూడా. ప్రపంచంలో ఎక్కడైనా దాని ధర, దాని లభ్యతను బట్టి, రోజుకో విధంగా ఉంటుంది. అందుకే దాని ధరను మెను లిస్టులో పెట్టరు. ప్రయాణాల్లో లోబ్స్టర్ నాకొక విలాసవంతమైన ఆహారం. దాని ధర అందుబాటులో ఉంటే ఒక్కసారైనా రుచి చూస్తాను. నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే క్యూబాలో పోర్క్కంటే లోబ్స్టర్ చౌక. క్యూబా వారికి లోబ్స్టర్ విలువ తెలియకముందే నా కోరిక తీర్చుకోవాలని, అవకాశం దొరికినప్పుడల్లా తినగలిగినంత లోబ్స్టర్స్ తిన్నాను.

ట్రావెలింగ్లో ఉన్న గొప్పతనంలో ఒకటి ఏమిటంటే, విషయాలను మన కంటితో మనమే స్వయంగా చూడగలగటం. ఏక పక్షంగా ఉండే మీడియా లేదా రాజకీయ ప్రచారం దృష్టితో చూడక్కర్లేదు. ఈ విషయంలో క్యూబా మన కళ్ళు తెరిపిస్తుంది. క్యూబా అంతా ప్రభుత్వ కట్టడిలో ఉండే కమ్యూనిస్టు దేశంగా పాశ్చాత్య

మీడియా ప్రచారం చేసింది. మనంతట మనం క్యూబా వీధుల్లో తిరిగి చూస్తే, క్యూబన్లు ఎంత స్వేచ్ఛగా, ఆడుతూ పాడుతూ తిరుగుతుంటారో తెలుస్తుంది. వాళ్ళు రోజంతా ఆటపాటలతో సమయం గడుపుతూ, అప్పుడప్పుడూ మాత్రమే మిగతా పనులు చూసుకుంటారేమో ననిపిస్తుంది.

మరుసటిరోజు మేము వెళ్ళవలసిన నగరం శాంతాక్లారా. అది క్యూబా అంతర్భాగంలో ఉంది. విప్లవ సంకేతమైన ఛే గువేరాతో ఆ నగరానికి సంబంధం చాలా ఎక్కువ.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: ప్రొ. ఆదినారాయణ (భ్రమణ కాంక్ష)
జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)

# 6th ఎలిమెంట్ - మానవతావాదం

– కె.వి.యన్.డి. వరప్రసాద్

ఆధునిక తెలుగు కవిత్వం అప్రతిహతంగా ముందడుగు వేస్తున్న తరుణంలో అత్యాధునిక వెల్లివిరుస్తోంది. శ్రీశ్రీతో ఆధునిక తెలుగు కవిత్వం వచన గేయంగా ఛందోరహితంగా తన గమనాన్ని రూపొందించుకొంది. వస్తువు విషయంలో శ్రీశ్రీ చెప్పినట్లుగా విశృంఖలత్వాన్ని పాటిస్తోంది. మహాకవి శ్రీశ్రీ "కాదేదీ కవితకనర్హం" అని చెప్పిన దాన్ని ఆధునిక తెలుగు సాహిత్యంలోని ప్రక్రియలల్నీ పాటిస్తూ పరిపుష్టిని పొందుతున్నాయి. ముఖ్యంగా కవితా ప్రక్రియ వేగాన్ని ఇతర ప్రక్రియలు అందుకోలేక పోతున్నాయి. ఈ విషయలో కథలది ద్వితీయ స్థానం. కవిత్వానిది అద్వితీయ స్థానం.

వస్తు నవ్యత, భావనవ్యత, అభివ్యక్తి నవ్యత అనే మూడు గుణాలతో మువ్వా శ్రీనివాసరావుగారు తమ కవితా చైతన్య రథాన్ని పరుగులు తీయిస్తున్నారు. వారు రాసిన 6వ ఎలిమెంట్‌లో 78 శీర్షికలతో చక్కని కవిత్వాన్ని అందించారు. ఈయన కవితలకు శీర్షికలు చాలా అర్థవంతంగాను, విషయావగాహనకు దోహదపడేవిగాను, సముచితంగాను అనిపిస్తాయి. శీర్షికల దగ్గర నుంచి వస్తువు, భాష, అభివ్యక్తి విషయాలలో వీరిపై శ్రీశ్రీ ప్రభావం అధికంగా ఉంది. వీరిపై శ్రీశ్రీ ప్రభావాన్ని పరిశోధిస్తే ఎన్నో కొత్త విషయాలు తెలిసే అవకాశం ఉంది. ఈ విషయమై యువ పరిశోధకులు తమ దృష్టిని సారించవచ్చు. ఈయన కవితా సంపుటం శీర్షిక తెలుగులో కాకుండా ఇంగ్లీషులో ఉంది. ఇది శ్రీశ్రీ వైచిత్రియే. ఇంగ్లీషులో టైటిల్స్‌ను సందర్భానుసారంగా కవిత్వంతో కూడా ప్రయోగించడానికి శ్రీశ్రీ వెనుకాడ లేదు. అధివాస్తవికతను గురించి చెబుతూ శ్రీశ్రీ "కాకికేమి తెలుసు సైకో ఎనాలసిస్" అన్నాడు. అలాగే సిజర్స్ సిగరెట్టును "సిజరెట్టు" అనేవాడు. ఈ పోకడ మువ్వా శ్రీనివాసరావు గారిలో కూడా కనిపిస్తుంది. తొలిగా దర్శనమిచ్చే ''చికాగో గీతం''లో మనిషి ఆవేశపూరితుడైనప్పుడు ఆలోచనలు చుట్టుముట్టినప్పుడు సాధించవలసిన ఆశయమేదో తరుముకొని వస్తున్నప్పుడు మనిషి తనకు తెలియకుండానే ఉత్తేజపూరితుడైపోతాడు. కూర్చుని ఆలోచిస్తున్నంతసేపు మనస్సు ఎక్కడెక్కడో విహరిస్తున్నా మనిషి నిశ్చలంగా కనబడతాడు. ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చినప్పుడు సమస్యలకు ఒక పరిష్కారం కనుగొన్నప్పుడు కూర్చున్నవాడల్లా చైతన్యంతో ఉన్నచోటనే ఉండలేక లేచి నడుస్తాడు. ఇదే కొన్ని సందర్భాల్లో అయితే మనిషి ఆనందాన్ని పట్టలేక పాటలు పాడుకొంటూ నాట్యం చేసిన సందర్భాలు ఉంటాయి. ఈ విషయాన్ని మువ్వావారి మాటల్లో అక్షరాల పొందికతో నూతన అభివ్యక్తితో ఆయన మాటల్లోనే చూడండి.

***నీ రెపరెపల మెరుపులో / నీ ఉరుములురిమిన ఎరుపులో***
***రుధిర సముద్రాన్నై పులకించి పొంగుతాను***
***తెలియని ఆవేశమేదో / తెలియాల్సిన ఆశయమింకేదో***
***దేహమంతా ప్రసరించి / నాలో చైతన్యదీపాలను***
***తిరిగి ముట్టించుకుంటాను***

పై గేయంలో ''రుధిర సముద్రాన్నై పులకించి పొంగుతాను'' అన్న ఆ కవితామయ వాక్యం అత్యాధునిక కవితా ప్రపంచంలోనే ఒక నూతనమైన ఒరవడి. మొత్తం మనిషే ఆలోచనలలో వేడెక్కినప్పుడు అతనిలోని చైతన్యం రుధిర సముద్రమైపోతుందంటున్నాడు. మనిషి తలపెల్లా, నిలువెల్లా చైతన్యవంతుడైపోతాడు. ఆ చైతన్యం ఈ సమాజానికి అవసరమంటున్నాడు కవి. వందలాది సంవత్సరాలుగా బానిసత్వంలో మగ్గిపోయిన జనానికి ఆ చైతన్యం కలిగి ఎందరో పీడితులు, తాడితులు, బానిసలు ధిక్కార స్వరాన్ని బలంగా వినిపించి బానిస సంకెళ్లను తెంపి వేసిన క్షణాలను ప్రపంచానికి చాటి చెప్పిన చికాగో గడ్డను గురించి, ఆ చారిత్రక సన్నివేశాన్ని కవితాత్మకంగా మువ్వావారు చెప్పిన తీరు వినూత్నం. అక్కడే చెప్పిన "వస్తూనే రాక్షస పనిగంటలను తరిగి వేశారక్కడ" అనే కవితా వాక్యం హృదయ విదారకమైన మనిషి పడ్డ బాధలను, అనుభవించిన క్లేశాన్ని, బాధల సరిహద్దులు చెరిగిపోయిన తరువాత కనిపిస్తున్న ఆనందపు ఉషఃకాంతుల్ని ప్రస్ఫుటీకరిస్తుంది.

మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు ఏ దేశ చరిత్ర చూసినా దోచుకోవడమే. దోచుకొనేవాడు, దోచుకోబడేవాడు కనిపించే సమాజంలో దోచుకోవడాన్ని ఖండిస్తున్నాడు ఈ కవి. దోచుకోవడానికి కాలం చెల్లిపోయిందని గర్జిస్తూ ఉద్యమం ఇవ్వబోయే తీర్పును మార్పుగా అభివర్ణిస్తున్నాడు ఈ కవి. అణగద్రొక్కితే, బానిసత్వంలోకి నెట్టాలని చూస్తే "ఉద్యమం ఉడుకెత్తిన తరుణంలో మరింత ఎరుపెక్కక తప్పదు" అని

సవాల్ విసురుతున్నాడు సమాజానికి. అలాంటప్పుడే సమాజాన్ని నడిపించడానికి జార్జివాషింగ్టన్, మార్టిన్ లూథర్‌కింగ్, మహాత్మాగాంధీలు అవతరిస్తారని చెప్పకనే చెప్పాడు. ఆయన మాటల్లో అయితే ఇంకాస్త తీవ్రంగా కమ్యూనిష్టు భావజాలంతో –

***మార్క్సు ఏంగిల్స్‌నో / లెనిన్, మవో జెడాంగ్ నో / ప్రభవించక తప్పదు*** అని చెప్పాడు. అంటే మార్పుకి మార్పును తీసుకువచ్చే మహానీయులు ప్రభవించక తప్పదని తెగేసి చెప్పాడు. సమాజానికి నాయకుడు అవసరమైనప్పుడు పరిస్థితులు కాలంతో చేయికలిపినప్పుడు సమాజంలో నుంచే, సమాజంలో సమూలంగా మార్పును తీసుకువచ్చే ఉద్యమకారులు, మహానీయులు ఆవిర్భవిస్తారని చెప్పడం కనిపిస్తుంది. ఈ వచన గేయంలో ముగింపుగా చెప్పిన వాక్యం మకుటాయమానం. "గెలుపు చిగురించక తప్పదు" అంటూ ముగించడంలో "గెలుపు చిగురిస్తుంది" అని అనడమే కాకుండా గెలుపు చిగురించక తప్పదు అన్న భావన కనిపిస్తుంది. అంటే మార్పు కోసం చేసే ప్రయత్నం ఫలించక తప్పదు. ఆ ప్రయత్నం సత్ఫలితాన్ని చూస్తుంది. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్న లాక్షణిక సిద్ధాంతానికి ఈ వాక్యాన్ని మహోదాత్తమైన ఉదాహరణగా చెప్పవచ్చు. పై భారాన్ని మొత్తంగా ఆయన మాటల్లోనే చూసేద్దాం.

***నేడో, రేపో / ఓ 'చే' నో / ఛావెజ్ నో / పల్లవించక తప్పదు / గెలుపు చిగురించక తప్పదు***

''లావేగాన్'' అన్న కవితలో డబ్బు జోరుగా ఖర్చుపెట్టడమే ఆనందాన్నిస్తుందనీ, అదే ఆనందంగా జీవించడానికి ఉదాహరణగా భావిస్తూ ఒక యాంత్రికమైన ప్రజాజీవనాన్ని మాత్రమే చూడగలుగుతాం కానీ హృదయస్పర్శ, మానవతా దృష్టి, మానవీయకోణం అనేవాటిని దర్శించలేమని చెబుతూ మానవత్వం కోసం వెంపర్లాడడం 'లావేగాస్' కవితలో చూడవచ్చు.

***వాళ్ళక్కడ వెలుగుల వడియాలు పెట్టుకున్నారు***
***వందలకొద్దీ సూర్యుళ్ళనీ / వేలాది చంద్రుళ్ళనీ***
***ఒకే గ్రైండర్లో నూరి / వెలుగు వలయాల వడియాలు***
***పెట్టుకున్నారు...*** అంటూ

ఈ గేయంలో ***చీకటికి బట్టలిప్పి / చిందులేయిస్తారిక్కడ*** అనే మాట ఎంతో వైవిధ్యభరితమైన ప్రయోగం. అలాగే "జేబులో కరెన్సీకి రెక్కలు మొలిపిస్తారక్కడ'' అనడంలో 'లావెగాస్' నగరంలో ఖర్చు అపరిమితంగా చేస్తారు అనే విషయాన్ని తెలుగు జాతీయంతో అనుసంధానిస్తే "డబ్బు మంచినీళ్ళలా ఖర్చయిపోయిందని'' అనవచ్చు. మువ్వావారిలో శ్రీశ్రీ వైచిత్ర్యపు పోకడలున్నాయని అనుకున్నాం. ఇంగ్లీషు మాటల్ని తిరగాబోర్లాతో కొత్త అర్థాలు చెప్పడం ఇద్దరిలోను కనిపిస్తుంది.

***లాస్ వెగాస్ ఆట / వేగంగా లాస్ అవ్వడంమేలాగో***

అనడంలో ఇంగ్లీషు మాటలకు తెలుగు భావాల్ని పులిమి ప్రత్యయాలు అద్ది చెప్పినప్పుడు కొత్త అర్థం స్ఫురిస్తుంది. పాఠకులను అలరింపచేస్తుంది.

***మనసంతా ఖాళీ చేసుకొని / పర్సులనిండా కరెన్సీ నింపుకొని***
***వీధులనిండా విచ్చలవిడిగా వినోదిస్తున్న జనం*** అనడంలో మనిషికీ మనసుకు ప్రాధాన్యం లేని కేవల జనారణ్యాన్ని కవి తప్పుడు పడుతున్నాడు. ఈ కవి సామాన్యుని జీవనం గురించి

"కడుపు నిండా తిన్న కరెన్సీ అరగక" అన్న ప్రయోగ వైచిత్రి ఈయనను మహాకవిగా నిలబెడుతుంది. లాస్ వెగాస్‌లో విపరీతంగా జరిగే ఖర్చును గురించి చెబుతూ ఆయన ధనయాగమని, జనమే జయుడు చేసిన సర్పయాగమని వ్యంగ్యంగా చెప్పడంలోని అంతరార్థం వృథా ఖర్చులను నిరచించడమే. కలలు కనడం అనేది అభ్యుదయానికి సింహ ద్వారంగా డా. ఎ.బి.జె. అబ్దుల్ కలాంలాంటి మేధావులు ఎందరో చెప్పారు. నిజానికి కలగనడం పెద్ద సమస్యా కాదు, ప్రయత్నం కాదు. నిద్దురలో వచ్చేది కల. పగటివేళ ఒక ఆశయంతో ఆశయాన్ని నిజం చేసే ప్రయత్నమే కల. ఈ కల వ్యక్తిగత, సామాజిక అభ్యుదయానికి ఆవశ్యకమైంది. అలాంటి కల ఖరీదైపోయిందటున్నాడు ఈ కవి.

***కలగనడం అతి ఖరీదైపోయింది / ప్రాణంతో ఉండగానే***
***ఎవడో చర్మం వొలుస్తున్న వేదన / పలకరించి పోతుంటే***
***క్షణక్షణం ఉలిక్కిపడుతూ / ఇప్పుడు కలగనడం ఖరీదైపోయింది***

కల అనేది భవిష్యత్ కార్యాచరణ గురించిన ఒక ఆలోచన. ఆలోచన మనసులోనే పుట్టినా అది కార్యరూపం దాల్చేటప్పటికి స్పష్టంగా కళ్ళకు కనబడవలసిందే. ఈ విషయాన్ని మువ్వావారు ఎంతో రమణీయంగా, కమనీయంగా చెప్పారో క్రింది పంక్తుల్లో చూద్దాం.

***కలలు లోపల పుడతాయేమో కాని / పంచరాల్సింది బయటే*** ***అనడం కలలు పట్ల ఆయన దృష్టిని తెలుపుతుంది.***

"శాంతి అంటే యుద్ధం గెలిచాక వచ్చే శాంతి" అని ఈ గేయంలోనే శాంతి అంటే ఏమిటో కవి చక్కటి నిర్వచనం చెప్పారు.

"గిరగిరా తిరిగిరా" అనే కవితలో ఊరి నుండి మరో

ఊరు వెళ్ళే సందర్భంలో ఊరికి సంబంధించిన చిహ్నాలను, కొన్ని జ్ఞాపకాలను, ఫోటోలను తీసుకొని భద్రంగా దాచుకోమంటున్నాడు ఈ కవి. ఈ ఫోటోలు కెమెరాతో తీసేవికాదు. మనసుతో తీసేవి. దానిని ఆయన మాటల్లో చెప్పుకోవాలంటే ''జ్ఞాపకాలను మనసులలో పదిలపరచుకోవడమే" ఆ జ్ఞాపకాలనే కవి ఫోటోలు అన్నాడు. ఈ భావాల్ని ఈ క్రింది కవితలో గమనిద్దాం.

***ఊరు దాటేటప్పుడు / కొండమీది బండలను***

***ఒక్కసారి లోపలికి తీసుకో / గతకాలాన్ని ఫోటోలుగ తీసి***

***భద్రంగా దాచుకో***

"ప్రయాణం" కవితలో ***రెండు గడ్డకట్టిన యుగాల***

***నీటిరాళ్ళ మధ్య కనిపించే పాదమెవరిది?***

ఇక్కడ నీటి రాళ్లు ప్రయోగం కవి ప్రయోగ వైచిత్రిని తెలియజేస్తుంది. మంచుగడ్డలను నీటిరాళ్లుగా చెప్పడం ఒక నూతన అభివ్యక్తి. ఇలాంటివి ఈ 6వ ఎలిమెంట్‌లో ఎన్నో. తరతారాలుగా సామాజిక వర్గాల మధ్య కనిపిస్తున్న వివక్షను గురించి తీవ్ర ధిక్కార స్వరంతో కవి దళిత కవితా గర్జన చేస్తున్నాడు. వేలాది సంవత్సరాల నుంచి వివక్షకు గురౌతూ విసరివేయబడ్డట్టుగా జీవిస్తున్న దళితుల పక్షాన కవి మట్లాడుతూ కులవివక్షకు పరిష్కారం కూడా చక్కగా చెప్పడాన్ని క్రింది వచన కవితా భాగంలో చూద్దాం.

***ఎంత కాలం గురూ! ఇలా / తెల్లారి ఊధ్చే గొబ్బెమ్మల్లో పువ్వులా దేహంతో పాటు / దహించబడదాం / ఉరి బయట ఎప్పుడూ ఒకేలా / ఉన్న నొప్పులన్ని ఊళ్ళోనేకదా / నోళ్ళు తెరుచుకొనేది / చిరునామా చింపెయ్యకుండా / చింపెయ్యకుండా / చింతల గొంతులు మూసెయ్యకుండా / ఎంత కాలం గురూ/ అన్నీ నాతోనే వాగించావ్ / మరి / నీ సంగతి చెప్పవా?! అంతేలే గురూ!***

విషయం ఏమీ లేకుండా ఉన్న మాటల్ని, మమకారం కానీ, మాధుర్యంగానీ లేని మాటల్ని పొడి మాటలు అంటుంటుటాం. అలాగే అంతవరకూ ఎంతో బాగా చక్కగా మాట్లాడుకున్నవాళ్ళు స్పర్థలు వచ్చి మనసువిప్పి సరిగా మాట్లాడుకోనప్పుడు, మాట్లాడుకోవడం అనివార్యమైనప్పుడు ప్రశ్న, సమాధానం మాత్రమే కనిపిస్తుంది. కానీ ఆ మాటల్లో ఆత్మీయత లోపిస్తుంది. అలాంటి మాటల్ని పొడిమాటలు అంటాం. ఈ భావాల్ని ముప్పావారి అక్షరాల కూర్పులో చూద్దాం.

***ఎప్పుడూ మాట్లాడుకొనే / మాటలే అయినా***

***హృదయాలలో ముంచి తీసినప్పుడు / వెలుగును మోసుకొచ్చాయి***

***అవి నా గుండె గోడల కంటిన / చీకటిని దులిపేశాయి***

***అక్కడ / మౌనం కూడా నాతో మాట్లాడింది / వీడ్కోలు క్షణాలు / మళ్ళీ కలిసే క్షణాలెప్పుడని / లెక్కలు వేసుకొన్నాయి***

ప్రేమించుకోవడం అంటే బాహ్య సౌందర్యాన్ని ప్రేమించడం కాదని, ప్రేమను వెదుక్కునే సమయాన్ని వెదుక్కోవడమని, అంటే ఎక్కువ సమయం అందరితోను ప్రేమగా గడపమని ఈయన కవితల్లో చెప్పడం బాగుంది.

ఎటర్నల్ జర్నీ అనే కవితలో విశ్వరస్యపు ఉత్తరాలు, వెలుగుల ఉండలు అనడంలో ఉమర్ ఖయ్యాం భావన కనిపిస్తుంది. అంతము లేని ఈ భువనమంతా పురాతన పాంథశాల అన్నట్టు కవి చెప్పడం ప్రశంసనీయం.

ఈ కవితలో భావనాబలంతో పాటు "మాటల నడకల చప్పుడు, ధ్వని దూరలేని శూన్యకుడ్యాలు అనడం" గొప్ప విషయం. అలాగే చీకటి తిరుగు ప్రయాణమవడం అనేది భావవైచిత్రి. అలాగే దేహాన్ని ప్రాణంపై పెట్టిన పేపర్ వెయిట్‌తో పోల్చడం అత్యంత వినూత్నమైన అభ్యివ్యక్తి. మరణించిన మనిషిపట్ల సానుభూతి చూపడం సమాజంలో ఉన్నదే. అంతేగాకుండా "చచ్చినోడి కళ్ళు చారెడేసి" అన్నట్లుగా ఉంటుంది. మరణించిన వ్యక్తి గురించి, ప్రాణంలేని దేహం గురించి ఈయన చెప్పిన తీరుకు శెహభాష్ అనాల్సిందే.

***విడిచిన వెంటనే / దేహం పవిత్ర పదార్థమవుతుంది***

ప్రాణం పోయిన తర్వాత ఇచ్చే గౌరవంకంటే ప్రాణమున్న మనిషికి విలువ ఇవ్వమని, అతని పట్ల సానుభూతి చూపించమని చెప్పడం. ఆయనలోని మానవతా దృష్టికి పతాకస్థాయి. "దేహమే చిరునామాగా ఉన్నప్పుడే గుర్తించే రోజు కోసం" అనడంలో దానిని గమనించవచ్చు. అలాగే ఆధిపత్య ధోరణి గురించి అణదొక్కబడుతున్న నిస్సహాయలను గురించి, కనుమరుగవుతున్న మానవత్వం గురించి, చక్కటి అభివ్యక్తితో శ్రీ ముప్పా శ్రీనివావసరావు కవితలు రాశారు. వీరి కవితలలో గొప్పగా చదివించే గుణం ఉంది. ఏ కవితను తడిమి చూసినా మనిషి, మనసు, హృదయం, ఆలోచన, అభ్యుదయం, అభివృద్ధి కనిపిస్తాయి. శాంతి సందేశాన్ని సమైక్య భావనలను ధ్వనింప చేస్తాయి. ఏ కవితను పట్టి చూసినా ఆయన భావాల్లోని గాఢత స్పష్టమౌతుంది. మొత్తంగా మనిషి మానవాభ్యుదయమే ముప్పాగారి కవితావస్తువు.

డా. కె.వి.యన్.డి. వరప్రసాద్
రాజమహేంద్రవరం. ఫోన్: 949 092 1345.

# గ్రామ సాహిత్యం

**– భమిడిపాటి గౌరీశంకర్**

గతంలో సాహిత్య ప్రక్రియలనగా జానపదకళా రూపాలే... పద్య, గద్య, సాంఘీక నాటక, నాటికలు మూలం గ్రామీణం. ఆదరించిన జనం గ్రామీణ సమూహం. తిరుపతి వెంకటకవులు, గబ్బిట వంటి వారి నుంచి నిన్న మొన్నటి ఈలపాటి, పీసపాటి వరకు గ్రామీణ ప్రాంతీయుల ఆధారాభిమానమువలననే **''స్వర్ణ కంకణాధారులు''** కాగలిగారనటంలో అతిశయోక్తి కాదు.

కళారూపాలకు స్రష్టలు, ద్రష్టలు, ప్రయోక్తలు, భోక్తలు గ్రామీణులే. ఈ కళారూపాల నుంచి పెంపొందినవే నేటి నాగరిక కళలు సాహిత్య రూపాలైన పాట, కథ, విప్లవం, తెగింపు, పోరాటం, గేయం, నాటిక, నాటకం, సినిమాలువంటివి పుట్టినవే గ్రామీణ ప్రాంతం నుంచి అలసి, సొలసిన జనానికి ఆట, పాట, వినోదం అందించేవి. ఈ సాహిత్యమయమైన కళారూపాలే సంస్కృత భూయిష్టమైన నాటకాలు గ్రామీణ వాసన నొక్కని సాహితీ పిపాసులు, పండితుల కోసమే సృజించబడినవి. కాని కాలక్రమంలో ఇవి సైతం పల్లె ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆయా ''జానపద'' భాషల్లోకి తమ రూపాలను మార్చుకొన్నాయనడానికి అనేక ఉదాహరణలున్నాయి.

మనిషి మనుగడ కోసం పదిమందితో కలసి పనిచేయడం నేర్చిన నాటి నుంచే కళలు ఆవిర్భవించాయి. ఆ **''కళలు''**కు సాహితీ గుభాళింపులను **''మట్టి వాసన''** నుంచే అద్దటం ప్రారంభమైన స్థలము గ్రామీణమే. కాలక్రమంలో **''పాతకళలు'' ''కొత్త కలర్‌ను''** సంతరించుకొన్న పాత రూపు రేఖలు అంతరించలేదు. అంతరించదు కూడా. సంగీతం, నాటకం, ఒగ్గు కథలు, బుర్రకథలు, యక్షగానాలు, భాగోతం, హరికథలు, సుద్దులు, జముకుల, జంగం, వీధినాటకాలు, తోలుబొమ్మలాట, వాలకాలు ఇలా ఎన్నెన్నో కళారూపాలు గొప్ప దార్శనికత నిండిన సాహిత్యం గ్రామీణులు ముంగిట నుంచే ఆవిష్కరించబడినది. ఇందుకు కాల, మాన, రాజకీయ, భౌగోళిక, చారిత్రిక, కౌటుంబిక అంశాలు హేతువులయినాయి. గ్రీసు దేశంలో గ్రామీణ ప్రాంతంలో ఇలియడ్, ఒడస్సీవంటి గాథలను హోరీమర్ డాయిలనేవారు ప్రదర్శిస్తుండేవారు. గ్రామీణ ప్రాంత వర్గపోరాటాలకు చిక్కని, చక్కని సాహిత్యపు సొబగులద్ది వీటిని రూపొందించేవారు. రామాయణంలో కూడా కుశలవులనే పేరుగల ''కుశలవులు రామాయణం'' గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం గానం చేసేవారనే ప్రసక్తి ఉంది. ఈ గ్రామీణ సాహిత్యంలో ఓ గొప్ప అంశం అంతర్లీనంగా ఉండేది. అది సంఘర్షణ. ఇది అనేక విధాలుగా గోచరమయ్యేది. ప్రధానంగా 3 రకాలుగా దీనిని వర్గీకరించవచ్చు. 1. ప్రకృతి మనిషికి మధ్య 2. మనగడ – వస్తు సంచయానికి మధ్య 3. తన జాతి సంవర్ధనం కోసం ఏర్పరుచుకొనే సంబంధాల్లో (ఆర్యగణాల నాయకుడైన ఇంద్రునికి, ప్రకృతికి మధ్య వేల సంవత్సరాల పాటు జరిగిన యుద్ధం).

గ్రామీణ సాహిత్యంలో గొప్ప సరదా అయిన వాస్తవ స్థితిగతులకు రూపమైన వాలకాలు గొప్ప వ్యంగ్యాత్మకమైన సాహితీ సృజనను చేశాయి. ఉదాహరణకు విశాఖ, శ్రీకాకుళం జిల్లాల పల్లె ప్రాంతాల్లో గైరమ్మ సంబరాల్లో ఈ ప్రక్రియను ఎక్కువగా చూడవచ్చు.

హనుమంతుడు లంకాదహనానికి గుర్తుగా ఒకనికి తాటాకు కట్టి గెంతులు వేస్తూ జనం మధ్య ఒక 'అల్లి' ఏర్పరుస్తారు. ఈ సందర్భంలో అమ్మవారి గుణగణాలను కీర్తిస్తూ ఉంటాడు. వాడికి తాటాకులు కట్టారనే సామెత ఇక్కడ నుంచే వచ్చింది. కొంతమంది దీనిని 'కమ్మవాలకం' అంటారు. (కులం పేరుతో కాదు తాటాకులు కట్టటం చేత (కమ్మలు) అని పేరు) ఈ ప్రక్రియలో గొప్ప వ్యంగ్యాత్మకమైన సంభాషణలను, అప్పటికప్పుడు చెబుతారు. అదేవిధంగా 'సుద్దులు' అనేది ఓ గొప్ప సాహితీ కళారూపం యాదవ గణం పశువుల కంచెల కోసం గొప్ప గొప్ప యుద్ధాలు చేశారు. వాటిని గ్రంథస్తం చేస్తే ''భారతమంత'' అవుతుందని అంటారు. **'యాదవ భారతం ఎద్దుబరువ'**ని సామెత అందునుంచే పుట్టినది (కాటమ రాజులు కథ, అగు మంచి కథ అనేది గ్రంథస్తమైనవి.

ఈ సుద్దులకు ఒక ప్రత్యేకమైన, నిర్ణీతమైన ఛందస్సు ఉంది (కూన పదం) కథకు ముందు ఉపోద్ఘాతంగా 'సుద్దు' ఉండేది. అనగా సూక్తి. జానపద ఛందస్సులో **"పదం"** చాలా ప్రసిద్ధమైనది. అన్నమయ్య, క్షేత్రయ్య, తదితరుల 'పద' రచనలో ప్రసిద్ధులు, పదాలలో చాలా రకాలున్నాయి. సాహిత్యం గ్రామీణ ముంగిట్లోంచి ఎన్ని హొయలు పోయిందో! గొల్ల సుద్దులన్నీ "కూనపదాలే" గొఱ్ఱల కాపరులు మందలు వేసిన వేళ తెల్లవార్లు వీటిని పాడుతూనే ఉంటారు. ''హరి హరీ నారాయణ ఆదినారాయణ''... అని మొదలుపెట్టి చిలువలు పలువలుగా కృష్ణలీలలను కర్ణపేయింగా గానం చేశారు. "యాదవుడి గోవులన మాధవుడు గాయగ, మాధవుడు మచ్చావతారదైనాడు'' అనే దశావతార సంకీర్తనం సాగుతుంది. ఈ పదాల వెనుక నిర్దేశమైన ఛందస్సు గొప్ప తార్కికత, వేమన, సుమతీ, శతకాలంలోని (శిష్టసాహిత్య రూపాలు) పూర్వ పక్ష సిద్ధాంత సమన్వయాలతో ద్వంద్వాత్మకంగా ఉంటాయి. మనుషులందరిదీ ఒకటే కులం "యాదవకులం" అందరూ "ఎఱ్ఱగొల్లలే" అనే పురాణ తర్కంలో సిద్ధాంతీకరించటం ఇందులో చూడవచ్చు. గ్రామీణుల నోట్లో ఇదీ అని చెప్పలేని సాహితీ సంపదకు ఇదో తార్కాణం ''భామాకలాపం''వలెనే "గొల్లకలాపం" అనేది కూడా ఓ ప్రక్రియ.

క్రమేణ తమదైన సొంత సంప్రదాయము నుండి భాష, వృత్తి, మతములు మొదలైనవానిలో ఏదో ఒక కారణముగా, సమూహముగా ఏర్పడి నివాసములుండిన జనపదములలో ఉండేవారు ''జానపదులు''. జానపదాలువారు సృష్టించుకొన్న (సాహితము) సాహిత్యము. ఇది అనంతమైనది.

"ఒక జాతి" చరిత్ర సమగ్రముగా తెలుసుకోవాలంటే శిష్టసాహిత్యముకన్నా జానపద సాహిత్యమే ఎక్కువగా తోడ్పడునని" డా. బిరుదురాజు రామరాజుగారి మాట. ఆచార వ్యవహారములు, విందులు, వేడుకలు, ఆటలు - పాటలు, అనుబంధాలు, సుఖదుఃఖాలు, సంయోగ వియోగములు, సౌందర్య సౌభాగ్యములు, వీరగాధలు, కన్నీటి బాధలు ఈ విధముగా సమస్తమైన జాతీయ జీవితములు తెలుగు జానపద సాహిత్యంగా పల్లెల ముంగిట్లో నుంచి బయలుదేరింది. వీటన్నింటిని రికార్డు చేసినది సి.పి. బ్రౌన్ జె.ఎ. బోయిల్ అనే ఆంగ్లేయులంటేనే గుండె కలుక్కుమంటుంది. ఇవన్నీ కథలు, సామెతలు పొడుపు కథలుగా తెలుగు గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ పొందాయి, పొందుతున్నాయి. పురాణ కథలు, ఇతిహాసములు, జానపద కథలుగా వర్గీకరించడినాయి. స్థలము, వ్యక్తి, సంఘటలకు సంబంధించిన కథలు, సామెతల కథలు ఇలా చెప్పుకుంటేపోతే బోలెడంత సాహిత్యం ఇక్కడ నుంచే సృజించబడినది. ఇవి కాక "యక్షగానములు" గొప్ప ప్రక్రియలుగా ఖ్యాతినొందినవి. క్రీడాభిరామమున జక్కుల పురంది విప్రనారాయణ చరిత్ర (1545) సుగ్రీవ విజయం (1568)వంటి 17వ శతాబ్దమున యక్షగానములలో పాటు కన్నడ దేశము నుంచి కూడా కొన్ని తంజావూరు ప్రాంతము నుండి (స్వర్ణ యుగకాలం) కొన్ని తెలుగునాటకు దిగుబడి అయినవి. దాదాపు 500 యక్షగానములు ముద్రితములు ఇంకా మరో 50 మూలబడి ఉన్నవి. ఆ సంపదను గ్రామీణ సాహితీ సొత్తుగా నేడైనను భద్రపరిచే బాధ్యత ప్రభుత్వాలు, సంస్థలు తీసుకుంటే బాగుంటుంది. రోమ్ నాగరికత కున్నంత గొప్ప సాహితీ చరిత్ర కలిగిన ఈ గ్రామీణ సంపదను చరిత్ర శిధిల పొరల్లో కలిసిపోకుండా కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వర్తమానంలో... కేంద్ర సాహిత్య అకాడమీ ఇటువంటి బృహత్తర ప్రయత్నానికి నడుం బిగించడం సాహసోపేతమైన క్రియ. ప్రస్తుతం అనేక ప్రచార సాధనాల వలన పెరుగుతున్న వేగవంతమైన అధునాతన సాంకేతిక ప్రక్రియలు చేత సాహిత్యం గ్రామీణం నుంచి క్రమంగా దూరమవుతున్నది. సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన సాహిత్యం భావి గ్రామీణ తరానికి తెలియజేసి వారిని ఈ మహాయజ్ఞంలో చేయూతనిచ్చేవారికి, సంధానకర్తలుగా మార్చుకోవలసిన తరుణమిదే. ఇటువంటి కార్యక్రమాలను ప్రతి జిల్లాలోను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. ఆ దిశగా మరింత కృషి సహాయ సహకారాలను అందించవలసిన అవసరాన్ని ఈ వ్యాసం తెలియజేస్తుంది. ఆ దిశగా కార్యక్రమ ప్రణాళికలను మనమంతా రూపొందించుకుందాం.

భమిడిపాటి గౌరీశంకర్
నరసన్నపేట. ఫోన్: 949 285 8395.

## హృదయాల్ని తాకే

# నవలాహృదయం

– సి.ఎస్. రాంబాబు

సృజనాత్మక రచయితలు విమర్శలూ, సమీక్షల జోలికి పోరు. వారి దృష్టిలో అది వారి సృజనకు ఆటంకం.

ప్రతి రూల్‌కూ exception ఉన్నట్లు సీనియర్ కథకుడు వి. రాజారామ్మోహనరావు కొన్ని సంవత్సరాలుగా నవలలను పరిచయం చేస్తూ వచ్చారు. ఇప్పటికి వాటి సంఖ్య 140 సమీపానికి వచ్చింది. వారు తాను పరిచయం చేస్తున్న నవలలకు పెట్టుకున్న పేరు నవలా హృదయం. ఇందులో ఏ మాత్రం అవాస్తవం లేదు. సమీక్షలన్నీ పొగడ్తలుగా మారిపోయాక, విమర్శంతా మార్క్సిస్టు దృక్పథంగా మారిపోయాక తెలుగులో విమర్శ గతి తప్పింది. సహవాసి నూరేళ్ళ తెలుగు నవల పరామర్శ తర్వాత అంత ఉధృతంగా విమర్శను పారించింది, పాలించింది రాజారామ్మోహనరావుగారే. నవలగా సాటిలేనిది అని ఈ పుస్తకం అని అంటూనే నవల చదివిన పాఠకుడికి కలిగే అసంతృప్తిని వ్యక్తీకరించటంలో వెనకడుగు వేయలేదు.

నవలను స్థల కాలాదుల కూడలిలో నిలబెట్టి మరీ విశ్లేషిస్తారు. క్లాసిక్స్ అని చెప్పుకునే వాటిలోని వైరుధ్యాలను వివరించటంలో ఆయన మొహమాటపడలేదు.

పుస్తకం లోపలికి వెళ్ళేముందు ఈ పుస్తకం నవలా హృదయం – *3*. ఇందులో 67 నవలలను విశ్లేషించారు. విశ్లేషణకు ఎంచుకున్న నవలల ప్రాతిపదికేమిటో ఆయన చెప్పలేదు. చాలావరకు పాపులర్ నవలలు, రచయితల పాపులారిటీకి ఆయన ప్రాధాన్యం ఇచ్చినట్టనిపించింది.

ఎంచుకున్న నవలను విశ్లేషించటంలో ఆయన కొన్ని సూత్రాలు పాటించారు. అప్పటి సామాజిక పరిస్థితులను ఆ నవల ఎంతవరకూ ప్రతిబింబించింది. పాత్రలను మలిచిన తీరు, కథనంలో రచయిత ప్రదర్శించిన నైపుణ్యం, పాఠకుల ఆదరణ.. వీటి బేరీజుగా ఆయన విశ్లేషించారు. రాజారామ్మోహనరావుగారి కథలెంత సమ్మోహనమో విశ్లేషణ కూడా అదే స్థాయిలో ఉంది. అయినా అప్పుడు పేరొందిన నవలలు ఇప్పటి పాఠకులకు అంత ఆసక్తి కలిగించవు అని పరోక్షంగా చెబుతారు. కొన్ని నవలలు గందరగోళంగా ఉన్నప్పుడు ఆ గందరగోళం విశ్లేషణలో కూడా చోటుచేసుకోవటమో వింత.

పాపులర్ నవలలను ఈయన ఎలా విశ్లేషించాడా అన్న ఆసక్తితో చూస్తాం. కథా, కథనాలు బానే ఉన్నా పాఠకుడికి చేరని నవలలూ ఉన్నాయి. అలాంటివాటిని పరిచయం చేయటంలో ఆయన ఎక్కువగా శ్రమ పడ్డారనిపిస్తుంది.

ఆకట్టుకునే నవలలు తక్కువవటంతో నవలా పాఠకులు నీరసించిన ఈ సమయంలో ఈ నవలల పరిచయం పాఠకుడికి ఎంతో ఉపయుక్తం. అయితే పరిచయం చేసిన నవలలన్నీ అందుబాటులో ఉన్నాయా అనేది అనుమానం.

ముందు చెప్పుకున్నట్లు పాపులర్ రచయితల నవలల్లోని గందరగోళాన్ని గ్రంథకర్త చూపుతాడు.

చలం మైదానం ఎందుకు గొప్ప నవలో చెబుతూనే "స్త్రీల పట్ల గూడుకట్టుకున్న ఆయన ఆవేదన, ఆక్రోశాలు మైదానం నవలకి సరైన ముగింపు పలకలేకపోయాయి" అంటారు. అలాగే మైదానం నవలపై వచ్చిన విమర్శను కూడా ప్రస్తావిస్తారు. మైదానం నవలలోని పాత్రలకు ఆకలిదప్పులు, జీవావసరాలుండవా అన్న గట్టి విమర్శను మన ముందుంచుతారు. జీవితం చక్కటి సెలయేరులా సౌందర్యం, ఉత్సాహం కలగలుపులా ఉండాలని, ఓ దివ్యలోకంలా భాసించాలని చలంగారు కన్న కల మైదానం అంటారు.

ఈ పుస్తకంలో చోటుచేసుకున్న నవలల్లో కొన్ని చెప్పుకుంటే "*రాజశేఖర చరితము, వేయిపడగలు, నారాయణరావు, మాలపల్లి, అతడు – ఆమె,*

చిల్లర దేవుళ్ళు, చివరకు మిగిలేది, అసమర్థుని జీవనయాత్ర, చంఘీజ్ ఖాన్, పెంకుటిల్లు, అల్పజీవి, హిమజ్వాల, కాలతీత వ్యక్తులు, మట్టిమనిషి, స్వేచ్ఛ, అంతర్ముఖుడు వంటి ప్రముఖ నవలలున్నాయి.

మరీ అంతగా తెలియని నవలా రచయితలవీ మరికొన్నున్నాయి.

ఏ రచనకయినా చదివించే గుణం ప్రాణం. అది ఏమాత్రం లోపించినా వెంటనే పట్టుకుంటారు గ్రంథకర్త.

అంపశయ్య నవలను విశ్లేషిస్తూ మళ్ళీ తిరిగి చదవాలనిపించింది అని చెప్పినవారు అరుదంటారు. చైతన్య స్రవంతి శిల్పంలో వచ్చిన మరో నవల చివరకు మిగిలేది నవలా విశ్లేషణలో ఓ మాటంటారు.

"చివరకు మిగిలేది నవలా మధుర పానీయం కాదు. చాలా ఘాటైన, గాఢమైన కషాయం" అంటారు.

అలాగే అసమర్థుని జీవయాత్ర నవలను విశ్లేషిస్తూ "చివరి ప్రకరణమంతా ఏదో ప్రయోగంలా గందరగోళంగా ఉంటుంది" అంటారు.

చైతన్య స్రవంతి శిల్పంలోని జటిలత అది అని పేర్కొంటారు. ఈ నవలల వైశిష్ట్యం వివరిస్తూనే వాటిలోని సంక్లిష్టతను గ్రంథకర్త పట్టుకుంటారు.

అలాగే ప్రతి నవలకున్న సామాజిక, చారిత్రక సందర్భాన్ని స్పష్టంగా వివరిస్తారు. వేయిపడగలు, నారాయణరావు, మాలపల్లి, అడవి నవలలు అందుకు తార్కాణంగా నిలుస్తాయి. ఆయా రచయితల దూరదృష్టిని చూపుతారు. అడవి నవల రచయిత వసంతరావు దేశపాండే కొన్ని సంవత్సరాల శ్రమ ఫలం అంటారు. సభ్యసమాజం మధ్య చాలామంది దృష్టికి రాని వ్యవస్థ తెలుస్తుందంటారు.

వేయిపడగలు ఎంత ప్రాచుర్యం పొందిందో అంత క్లిష్టమైన నవల. చిన్న పరిశీలన చేస్తారు గ్రంథకర్త "విశ్వనాథవారు తన చుట్టూ సంప్రదాయం పేరున ఎందరో స్త్రీలు పడుతున్న అగచాట్లను, గృహహింసను గుర్తించకపోవటం, సనాతన ధర్మానికే పరిమితం కావడం దురదృష్టం" అంటారు. అయినా వేయిపడగలు చదివితే ఎంతో కొంత విజ్ఞానవంతులమవుతాం అని ప్రకటిస్తారు.. అల్పజీవి పట్ల కూడా కొంచెం అసంతృప్తి వ్యక్తపరుస్తారు గ్రంథకర్త. తను సృష్టించిన పాత్ర గురించి రచయితే ఎటూ నిర్ణయించకోలేకపోవటం విచిత్రమే అంటారు. అలా అని రాజారామ్మోహనరావుగారు అన్నీ విమర్శలే చేశారనుకోకండి. నవలల్లోని హత్తుకునే అంశాలు చెబుతునే చిన్న-చిన్న లోపాలను కూడా గమనించి మనతో పంచుకుంటారు.



ఈ వ్యాసాలన్నీ రాయటానికి కారణం వాసిరెడ్డి నవీన్ అని పేర్కొంటారు. తెలుగు నాడి పత్రికకు రాయటం తన ప్రోత్సాహంతో ఈ విశ్లేషణలు ప్రారంభించానంటారు. అనంతర కాలంలో చతుర మాసపత్రికలో వెలువడ్డాయి. ఇప్పుడు **మిసిమి** పత్రికలో ప్రచురింపబడుతున్నాయి.

ఇన్ని వ్యాసాలు ఒకే చోట చదువుకోవటం మనసుకు ఆహ్లాదం కలిగించే విషయం. ఈ విశ్లేషణలు తప్పకుండా మూల రచనలను వెతికేలా చేస్తుంది. ప్రతి నవల విశ్లేషణ పాఠకులకో వరం. ఒక సమగ్రతను కలిగున్న వ్యాసాలివి.

వీటిని ప్రచురణ కాలంబట్టి కాకుండా ఆ నవలలు వెలువడిన కాలం ఆధారంగా వరుస క్రమంలో ఉంచితే బావుండేది కదా అని అనిపిస్తుంది. ఈమధ్య కాలంలో

ఎవరూ చేయని ప్రయత్నం చేసిన రచయిత రాజారామ్మోహనరావుగారిని అభినందించితే సరిపోదు. ఈ వ్యాసాలన్నీ యువతరం చదవాలి. తెలుగు సామాజిక చరిత్రను నవలలు ఏ విధంగా చిత్రించాయో అర్థం చేసుకుంటారు.

"నవలాహృదయం లోని అరవైఏడు పుస్తక పరిచయాలన్నీ అరవైఏడు నవలలు చదివిన అనుభూతిని కలిగిస్తాయంటే ఆశ్చర్యం లేదు."

* * *

***నవలా హృదయం - 3***

కాపీలను అనల్ప బుక్స్ వారి నుంచి కొనుక్కోవచ్చు.
సంప్రదించవలసిన ఫోన్: 709 380 0303.

సి.యస్.రాంబాబు
హైదరాబాద్.
ఫోన్: 837 481 8961.

# మాలపల్లి నవల మానవ స్వీయోద్ధరణ

- జంధ్యాల కనకదుర్గ

పరాయి పాలనలో మగ్గుతున్న భారతీయులు తమ విముక్తికై బ్రిటిష్ వారి యొక్క అన్ని వలస దేశాలలోవలె తమకు స్వయం ప్రతిపత్తిగల స్వరాజ్యం కావాలని కోరారు. దానికి వారు అజ్ఞానపు మూఢాచారాలను పాటించే భారతీయులకు ఇంకా స్వాతంత్ర్య అర్హత లేదని పేర్కొన్నారు. బ్రిటిష్ వారిచేత చెప్పించుకోవటానికి ముందే భారతీయులకు స్వీయ సంస్కరణ అవసరమని స్వాతంత్ర్యోద్యమ నాయకుడైన తిలక్ భావించాడు. అందుకే వందేమాతరం ఉద్యమంలో భాగంగా ఆంధ్రదేశంలో కూడా విదేశీ వస్త్ర, వస్తు బహిష్కరణ, అస్పృశ్యతా నివారణ, జాతీయ విద్యవంటి విషయాలను బిపిన్ చంద్రపాల్ ప్రచారం చేయటం జరిగింది. మతాన్ని పెనవేసుకొని ఉన్న వర్ణవ్యవస్థ, అస్పృశ్యతవంటి మూఢాచారాలను రూపుమాపే మతసంస్కరణలు జరగాలని జాతీయోద్యమ నాయకులు భావించారు. అందుకే బ్రహ్మసమాజం, ఆర్యసమాజం, దివ్యజ్ఞాన సమాజం, వివేకానందుడు వంటివారు మతసంస్కరణలకై ప్రచారం చేశారు. సమాజంలోని వర్ణవ్యవస్థ, అస్పృశ్యత మానవోద్ధరణకు ఆటంక విషయాలని, ప్రజలు ఎవరికి వారే స్వీయసంస్కరణకై ఉత్తేజితులు కావాలని మతసమాజాలు భావించాయి. ఆ క్రమంలోనే ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజ సభ్యులైన కందుకూరి వీరేశలింగంగారు వర్ణవ్యవస్థ, అస్పృశ్యత, స్త్రీల విషయంలో ఉన్న వివక్షా సంస్కృతిని వ్యతిరేకిస్తూ మతసంస్కరణలను ప్రచారం చేశారు. మత సాంఘిక సంస్కరణలను బోధించగలరుగాని వాటిని వంటబట్టించుకొని స్వీయసంస్కరణ చేసుకోవాల్సినవారు ప్రజలే. దేశానికి స్వాతంత్ర్యం రావాలంటే భారతీయుల స్వీయసంస్కరణ ప్రధాన విషయమైంది. ప్రజలందరిలో అటువంటి చైతన్యం కలిగించటానికి ఉపయోగపడే ప్రధాన సాధనం సాహిత్యమే. అందుకే దేశ స్వాతంత్ర్యార్థతకై స్వీయోద్ధరణకు పెద్దపీటవేసింది - మాలపల్లి - నవల. దీనిని సంఘసంస్కర్తయైన ఉన్నవ లక్ష్మీనారాయణగారు 1921సం. రాయవెల్లూరు జైల్లో ఉన్నప్పుడు రచించారు. జాతీయోద్యమ కాలంనాటి భారతదేశంలోని రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలో పాదుకొన్న అస్పృశ్యతా నివారణ దిశగా స్వీయోద్ధరణ, సంఘోద్ధరణ ప్రధానంగాగల పంచమోద్యమం, కార్మికోద్యమాలకు బాటలువేస్తూ చేసిన రచన - మాలపల్లి - నవల. స్వీయోద్ధరణకు భగవద్గీత సారాంశాన్ని అనుష్ఠానవేదాంతంగా భావించిన ఉన్నవవారు నిష్కామకర్మతో సత్యజ్ఞానయుత సాత్వికగుణ సంపన్నుడుగా రామదాసు పాత్రను మానవ స్వీయోద్ధరణకై ప్రయోగాత్మకంగా చిత్రీకరించటం జరిగింది. ఆ పాత్ర ద్వారానే ఖైదీలుగా ఉన్న పంచముల సంఘోద్ధరణ కూడా జరిగేటట్టు చేశాడు. హిందూ దేశ మతం అజ్ఞాన మతం అనేవారికి చెంపపెట్టుగా హైందవ ధర్మాలలోని సర్వమత సమానత్వాన్ని రామదాసు తెలియచేశాడు.

1921లో రాజకీయంగా స్వరాజ్య సాధనకై అహింసాయుత సత్యాగ్రహం చేయాలని గాంధీ పిలుపునిచ్చాడు. అహింసా ధర్మమే మానవ స్వీయోద్ధరణకు, సంఘోద్ధరణకు, దేశ స్వాతంత్ర్య సాధనకు ఆచరణీయమగు మార్గమని - మాలపల్లి - నవల కూడా తెలియచేసింది. భారతీయుల స్వీయ సంస్కరణ, సంఘ సంస్కరణయే స్వాతంత్ర్య సాధనకు అర్హతను కలిగించిందనే ఊహతో దేశస్వాతంత్ర్యాన్ని ముందుగానే భావించిన క్రాంతదర్శి మాలపల్లి నవలా రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ. ఈ నవలను చదువుతున్నప్పుడు నెల్సన్ మండేలా చెప్పిన - ఏ దేశం యొక్క స్వరూప స్వభావాలను తెలుసుకోవలన్నా, ఆ దేశంలోని జైళ్ళల్లో కొన్నాళ్ళు

గడపాలనీ, ఉన్నత పౌరులను, కడగొట్టు జాతులను చూసే తీరులో ఆ దేశస్థితి అర్థమౌతుందని – అనే మాటలు గుర్తుకు వస్తాయి. భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా గుంటూరు జిల్లా పల్నాడులోని అటవీ భూములలో వేసే పుల్లరి అనే పన్నుకు వ్యతిరేకంగా ప్రాంతీయ ఉద్యమం జరిగింది. ఆ సందర్భంలో పొన్నెకంటి హనుమంతును బలితీసుకొన్న బ్రిటిష్ ప్రభుత్వం, ఉన్నవ లక్ష్మీనారాయణను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. జైల్లో ఉన్నప్పుడు ఉన్నవవారు పొందిన అనుభవాలనే ఈ మాలపల్లి నవలలో పాఠకుల ముందుంచారు. బ్రిటీష్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న అటవీ భూములు, బీడుభూములను సాగు చేయించి ఆ పంటల లాభాలను జమీందారుల ద్వారా శిస్తుల రూపంలో వసూలు చేసుకొనే ఎత్తుగడలో భాగంగా పంచముల చేత పనులు చేయించుకోవటానికి వారిని నేరస్థ జాతులనే ముద్ర వేసి అక్కడ వ్యవసాయం చేయించేవారు. దాని ఫలితంగా ఊళ్ళో స్థానికులకు వ్యవసాయ పనులు దొరక్క కుటుంబ పోషణకై దొంగతనాలు చేయటం మొదలుపెట్టటం, తిరిగి వారిని అధికారులు సెటిల్మెంట్లకు పంపటం రివాజుగా మారిన సాంఘిక వ్యవస్థ అది. ఆ విషయాలనే ఖైదీలు తమని జైలుకు తీసుకురావటంలోని కుట్రలను రామదాసుతో చెప్పుకుంటారు. సాలె పని చేసుకొనే మాలలు, చర్మకారి వృత్తి చేసుకొనే మాదిగలు సంచార జాతులైన ఎరుకలు, యానాదులను డబ్బు కోసం దొంగతనాలు చేస్తారంటూ వారిని నేరస్థ జాతుల కింద బ్రిటిష్ ప్రభుత్వం వారు పరిగణించి వారిని నిర్బధించటానికి సి.టి. యాక్టును 1871లో ప్రవేశపెట్టారు. క్రిమినల్ ట్రైబల్ యాక్టు కింద నేరస్థ జాతుల వారిని సెటిల్మెంట్లలలోను, అక్కడి నుండి ఏదో వంకన వారిని జైళ్ళకు పంపటం జరిగేది. బహుశ జైల్లో అటువంటివారిని గురించిన ఎరుకతోనే ఉన్నవ వారు పంచముల స్వీయసంస్కరణ అవసరమని భావించి ఉండవచ్చు. అంతేకాక ఐకమత్యంతో స్వరాజ్య సాధనకై గాంధీ పిలుపునిచ్చిన సత్యాగ్రహోద్యమ నిర్మాణ కార్యక్రమాలలో హరిజనులను కలుపుకుపోవటం కూడా ముఖ్యమైన విషయం. వృత్తిపరమైన వివక్షతో ఆంక్షలున్న సమాజంలో రాజకీయపరంగా హరిజనోద్ధరణ ముఖ్యమైంది. ఎవరిని ఎవరూ ఉద్ధరించటం కష్టసాధ్యమని అందరికీ తెలిసిన విషయమే. అందుకే ఉన్నవ వారు హరిజనుల స్వీయోద్ధరణకు ప్రాధాన్యతనిచ్చి రాసిన నవల ఇది. 1921 నాటి రాజకీయ – ఆర్థిక నేపథ్యంలో ఉన్న చారిత్రక వాస్తవమైన సామాజిక వ్యవస్థను ప్రతిఫలింప చేసిన నవల. ఉన్నవవారు ఐర్లాండులో బారిష్టరు చదవటం, 1917లో రష్యాలోని సోషలిష్టు విప్లవ ప్రభావం ఉండటం చేతనే సంగదాసు పాత్ర ద్వారా బోల్షె విజం గురించిన ప్రస్తావన జరిగింది. ఆ క్రమంలోనే కార్మికోద్యమ అవసరాన్ని తెలియచేయటం అర్థమౌతుంది. భారతదేశంలో వ్యవసాయ కూలీలతో పాటు మిల్లులో పనిచేసే కార్మికుల ఉద్యమంగా భావించాలి. అదే సమయంలో దేశవ్యాప్తమైన కాంగ్రెస్ యూనియన్ అతివాదులు, మితవాదులుగా విడిపోవటం జరిగింది. ఇటువంటి రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థ నేపథ్యంలోనే పుట్టిన నవల మాలపల్లి.

గుంటూరు జిల్లాలోని ఉండవల్లికి సమీపంలో ఉండే మంగళాపురం అనే గ్రామంలో పిత్రార్జితంగా వచ్చిన కాస్త పొలాన్ని తన కష్టంతో అభివృద్ధి చేసుకొని భార్యాబిడ్డల ఆకలిని తీరుస్తూ ఎవరితోను వైషమ్యం లేకుండా జీవితాన్ని గడుపుతుంటాడు మాలదాసరియైన రామదాసు. ఆతనికి సంగదాసు, వెంకటదాసు, రంగడు అనే ముగ్గరు కొడుకులు, జ్యోతి అనే కూతురు ఉంటారు. వీరితో పాటు రామదాసు మేనల్లుడు అప్పాదాసు ఉంటాడు. సంగదాసు ఆ ఊరి భూస్వామియైన చౌదరి యింట్లో పాలెజీతగాడుగా ఉంటాడు. అచలబోధలలోని సర్వమానవ సమానాభివృద్ధిని కాంక్షించే మనస్తత్వంకలవాడు సంగదాసు. చౌదరి భార్య మహలక్ష్మి, కొడుకు రామానాయుడు, ఆతని భార్య కమల, ఆతని తమ్ముడు కొడుకైన వెంకటయ్య ప్రధానంగా సంచరించే అగ్రవర్ణాలకు చెందిన పాత్రలు నవలలో తారసపడతారు. పుస్తక పఠనం చేయగల సంగదాసు పంచముల జ్ఞానవికాసానికై పాఠశాల పెట్టాలని, పంచములకు దేవాలయం కట్టించాలని, బావులను త్రవ్వించాలని భావిస్తాడు. పంచములు ఆత్మగౌరవంతో బతకగల స్థితిలో ఉండాలని బెజవాడలో జరుపుకున్న ఆదిమాంధ్ర సభలో సంగదాసు తదితరులు తీర్మానాలను చేసుకొంటారు. ఈ సభకు అగ్రవర్ణాల వాళ్ళు కూడా హాజరయ్యారు. పంచములు పొలం పనులు చేసి కూలి

కింద తాము పండించిన పంట ధాన్య మార్పిడి ఉండేది. కానీ దాని బదులు డబ్బు కూలి ఇవ్వాలని భూస్వామ్యులు నిర్ణయించటంతో, పెరిగిన ధరలకు తిండిగింజలు కొనలేని కూలీలందరు నిరసన చూపిస్తూ కార్మికోద్యమాన్ని ప్రారంభించాలనుకొంటారు. అంతేకాదు. తన పొలంలోని పనులకు కూలీలను రాకుండా చేసింది సంగదాసు అని భావించిన చౌదరి ఆతనిని చంపుతాడు. ధనబలంతో కేసులేకుండా చేసుకోగలగుతాడు కాని, ఆ ఊరిలోని పంచములు సంగదాసు హత్యకావింపబడినచోట సంగపీఠాన్ని కట్టిస్తారు. ఈ రకంగా అమరజీవియైన సంగదాసు స్ఫూర్తితో సంగపీఠ మందిరంలో పాఠశాలను పెట్టటం, జ్యోతి అప్పాదాసులు అందులో పాఠాలు చెప్పటం జరుగుతున్న సమయంలో చౌదరి దావావేసి అవినీతి వ్యవస్థను ఆసరా చేసుకొని రామదాసు యొక్క ఆస్తిని తన అధీనంలోకి వచ్చేటట్టుగా చేసుకొంటాడు. సంగదాసు మరణానంతరం వెంకటదాసు యిల్లు వదిలి వెళ్ళిపోతాడు. కొడుకు ఎక్కడకు వెళ్ళింది రామదాసుకు తెలియలేదు. కష్టాలలో ఉన్నా స్థితప్రజ్ఞతతో పాటు ఎవరిని ద్వేషించే మనస్తత్వం లేని రామదాసు బట్టల వ్యాపారి దగ్గర కమిషన్ పనికి ఒప్పుకోవటం, ఆ వ్యాపారి యింట్లో జరిగిన దొంగతనానికి రామదాసుకు సంబంధం ఉందనే నెపంతో పోలీసులు రామదాసును ఆతని కుటుంబాన్ని సెటిల్మెంటుకు తరలించటం జరిగింది. జ్యోతి మీద కన్నేసిన బ్రిటిష్ అధికారులు క్రీస్తు బోధలకు వెళ్ళనందుకు రామదాసును ఆతని భార్యతో సహా గుంటూరు జైలుకు పంపటం, అక్కడి నుండి నిడదవోలు జైలుకు పంపటం జరిగింది. ఆ జైల్లో ఉంచబడిన దిగువ జాతులు నేరస్థులుగా తయారుకాబడి, దాన్నే జీర్ణింప చేసుకొన్న వారిలో స్వీయ సంస్కరణ దిశగా అడుగులు వేసేటట్టు చేయగలిగాడు రామదాసు. భగవద్గీత బోధించినట్టుగా కర్మసన్యాసం అంటే కర్మను వదిలిపెట్టటం కాదని భావించిన రామదాసు నిష్కామ కర్మను పాటించటం, జైలులో దుర్గంధాన్ని, అసౌకర్యాన్ని ఆత్మసంయమన యోగంతో సహించటం, మానసిక పద్మాసనాన్ని వేసుకొని ఇంద్రియ నిగ్రహాన్ని అలవరచుకోవటం చేసేవాడు. అవకాశం ఉన్నా ప్రలోభానికి లోను కాకుండా అరిషడ్వర్గాలను జయించగల సాత్విక గుణాన్ని పెంపొందించుకొనే రీతిగా అనుష్ఠాన వేదాంతాన్ని ఆచరణలో పెట్టటంగా రామదాసు స్వీయోద్ధరణ స్పష్టమైతుంది.

మాలలలో వైష్ణవ మత శాఖకు చెందిన సాతానిగా పరిగణింపబడే మాలదాసరియైన రామదాసు యొక్క సాహచర్యంలో ఆతనితో జరిగిన చర్చల సారాంశంలో దయ, సత్యశౌచాలు, జ్ఞానం, అహింస విలువలను గ్రహించి అజ్ఞానాన్ని పోగొట్టుకునే విధంగా పంచములు స్వీయసంస్కారాన్ని అలవరచుకుంటారు. ఆ స్వీయ సంస్కరణల ద్వారా సంఘోద్ధరణ జరిగి దేశస్వాతంత్ర్యానికి అర్హత ఏర్పడినట్లు, చివరికి స్వాతంత్ర్యాన్ని సాధించినట్లుగా నవల ముగించటం జరిగింది. హిందూ దేశ మతం అజ్ఞాన మతం అనే బ్రిటీష్ వారికి హైందవ ధర్మాలలోని అనుష్ఠాన వేదాంతాన్ని, ఆధ్యాత్మిక భావ సంగతిని ఆచరణీయం చేయగలుగుతుందని భావింపచేసే రచన యిది. సామాజిక ఆంక్షలకు గురియైన పంచముల సామాజిక జీవన విధానానికి నేపథ్యపు కారక శక్తులుగా ఉన్న రాజకీయ –ఆర్థిక వ్యవస్థల స్వభావాన్ని అగ్రవర్ణాల వారు అర్థం చేసుకొని తమతో సమానమైన సామాజిక జీవన విధానాన్ని పంచములు గడపగలిగే స్థితిలో ఉండేటట్లుగా చేయూతనిచ్చినప్పుడే భారతీయులు ఐకమత్యంతో స్వాతంత్ర్య సాధనను సుసాధ్యం చేసుకోగలరని ఈ నవల వల్ల అర్థమౌతుంది. పంచములు జంతుహింస చేసి మాంసాన్ని అమ్మటం, జంతు చర్మాలతో చెప్పులు కుట్టి జీవనం చేయటంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్రత చోటుచేసుంటుంది. ఆ కంపు పంచముల వంటికి పట్టటం వారిని దూరంగా ఉంచటం, ధనవంతులైన అగ్రవర్ణాలు వారిని బావుల్లో నీళ్ళు కూడా తోడుకోనీయకపోవటంతో పంచములు సమాజానికి మరింతగా దూరమయ్యారు. మాలదాసరియైన రామదాసు కూడా ఆ వాతావరణంలోని గబ్బును భరించలేక వారిని శుభ్రతను పాటిస్తే బాగుండనని అనుకొంటాడు. అందుకే సంగదాసు పంచముల కోసం బావిని తవ్వించాడు. బీదలైన పంచముల వృత్తివెనుక ఉన్న అశౌచస్థితిని ధనవంతులు, అగ్రవర్ణాలు అర్థం చేసుకోలేకపోవటానికి ప్రధాన కారణం వర్గస్థితి, వర్ణస్థితి కారణం అని అర్థమౌతుంది. అంతేకాక, జైల్లో మలమూత్రాదులు శుభ్రం చేసుకోవటానికిగాని, స్నానపానాదులకుగాని నీటిసౌకర్యం లేనప్పుడు ఖైదీలు



ఉన్నవ లక్ష్మీనారాయణ

శుభ్రతను పాటించే అలవాటును మరిచిపోయిన సంగతిని తెలుసుకున్న రామదాసు, శరీరశౌచంతో పాటు ఆత్మపారిశుధ్యం తనకు కలిగిందని అంటాడు. అయితే ఆ జైల్లోనే నీటివసతి ఉన్న బ్యారెక్సుకు మార్చినప్పుడు అదే అలవాటును కొనసాగిస్తున్న ఖైదీలకు స్నానం చేయటాన్ని వారికి అంతకు మునుపున్న అలవాటును తిరిగి చేసుకోమంటాడు. శుచి మనస్సును జ్ఞానమార్గానికి మళ్ళిస్తుందనీ, అప్పుడు సత్యంబోధ పడుతుందని, దానివల్ల మానవుల మధ్యన ప్రేమ ఏర్పడి ఐకమత్యం అభివృద్ధి చెందుతుందని చెప్పాడు. జ్ఞానంతో రజస్తమోగుణులు సాత్వికగుణాన్ని పొందాలనుకోవటంగా పంచమ సంఘోద్ధరణ జరిగి అందరి మధ్యన ఐకమత్యం పెరిగితే అదే స్వాతంత్ర్య సాధనకు బాటలు వేస్తుందని రచయిత భావించాడు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ప్రధానంగా స్వీయసంస్కరణ జరగాల్సిన అవసరాన్ని గుర్తించిన ఉన్నవ లక్ష్మీనారాయణగారు ఈ నవలా రచనకు పూనుకొన్నట్టు అర్థమౌతుంది.

ఖైదీలు దొంగచాటుగా పొగాకును తెప్పించుకొని పంచుకొనే క్రమంలో కొట్లాడుకోవటం, అవినీతి ఆశ్రితపక్షపాతంగల అవినీతి జైలు అధికారుల అండదండలతో క్రమక్రమంగా వారిలో మానవత్వం నశిస్తోందని భావించటం, ఉరిశిక్ష వేయటం ఆటవిక న్యాయమని, తలారికి రామదాసు బోధించటంవంటి సందర్భాలలోను, శాకాహారియైన రామదాసు అహింసకు, హింసకు ఉన్న తారతమ్యాన్ని ఖైదీల చేత గుర్తింపచేసే క్రమంలో స్వార్థంతో కూడుకొన్నది హింస అని, లోకకల్యాణం కోసం చేసే హింస తక్కువ హింస అని చెప్పి, ఖైదీలు సత్యం, అహింసయే పరమ ధర్మమని భావించేటట్టు చేసాడు. దాని ఫలితంగా ఖైదీలు ఖద్దరును తయారు చేయటం మొదలుపెట్టారు. ఆరకంగా ఖైదీలైన నానా జాతుల పంచములు స్వీయోద్ధరణకు పూనుకోవటం, ఖద్దరు తయారీ ఉద్యమంలో భాగస్వాములవటం, అంతిమంగా దేశస్వాతంత్ర్య సాధనకు బాటలు వేశారని అర్థమౌతుంది. కామక్రోధమదమాత్సర్యాలనే అరిషట్వర్గాలవంటి అంతశ్శత్రువులను జయించుకుంటూ సాత్వికుడైన రామదాసు త్రిగుణాతీతుడిగా ప్రజల చేత భావింపబడతాడు. మోహం అజ్ఞానమని కమలామోహనుల సంబంధం వ్యక్తినాశనానికి దారితీసిందని, జ్యోతి అప్పాదాసుల ప్రేమ మానసిక భావసంబంధమై శారీరక సంబంధాలకు తావులేనిదై జన్మలబంధమై శాశ్వతత్వంతో లోకకల్యాణకారకమౌతుందనే స్పృహను కూడా యువతకు కల్గిస్తూ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని కూడా కలిగించగల నవల యిది. పంచములు స్వీయసంస్కరణ దిశగా సాగటంతో వారిస్వీయోద్ధరణ పంచమోద్యమంలో ప్రతిఫలించింది.

జైళ్ళలో అధికారులు ఖైదీలకు వరి అన్నం పెడతామనే ఆశ చూపించి వీళ్ళచేత దొంగతనాలు చేయించేవాళ్ళు. అందుకే తక్కెళ్ళ జగ్గడు బ్రిటిష్ ప్రభుత్వం కింద పనిచేసే అవినీతి అధికారులకంటే తాము చేసే బందిపోట్ల దొంగతనాలు తక్కువే అంటాడు. జగ్గడు రామదాసుతో కష్టపడే బీదలే దేవతలని, వారి శ్రమ మీద ఆధారపడే ధనవంతులు, అగ్రవర్ణాలవారే రాక్షసులని నిర్ధారించి భగవద్గీతలోని దైవాసుర సంపద్వి భాగానికి కొత్త భాష్యాన్ని చెప్పాడు. ఆ తక్కెళ్ళ జగ్గడనే బందిపోటు దొంగ ఎవరో కాదని, సంగదాసు మరణానంతరం యింటి నుంచి పరారైన తన కొడుకు వెంకటదాసే అని రామదాసుకు తెలుస్తుంది. బ్రిటీష్ ప్రభుత్వంలో సి.టి. యాక్టు కింద జరిగే అన్యాయాలను తట్టుకోలేక కుటుంబ పోషణ చేసుకోలేని నానాజాతుల వ్యవసాయ కూలీలు, తక్కువ వేతనాలనిచ్చి ఎక్కువ శ్రమ దోపిడికీ వివక్షకు గురియౌవుతున్న మిల్లుకార్మికులు జగ్గడి అనుచరవర్గంగా మారుతారు. సమాజంలోని వర్ణవ్యవస్థకు మూలకారణం వర్గవ్యవస్థ అని భావించిన వెంకటదాసు పరిష్కారంగా ధనవంతుల ధనాన్ని దోపిడి చేసి బీదలకు పంచిపెట్టగలిగితేనే సామాజ ఆర్థికస్థితిలో సమతూకం (తక్కెడ) ఏర్పడుతుందని భావించి బందిపోటు దొంగగా మారి తక్కెళ్ళజగ్గడి అవతారమెత్తటం, పోలీసులు తమ

అధికార బలంతోను ఆధునిక ఆయుధాలతో ఆతనిని చచ్చేటట్టుగా గాయపరచి, బంధించి రామదాసు ఉన్న జైలుకే తీసుకురావటం, ఆ జైల్లోనే రామదాసు భార్య, వెంకటదాసు ఉరఫ్ తక్కెళ్ళ జగ్గడు మరణించటం జరుగింది. దేశంలోని ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు తొలగించేందుకు ధర్మకన్నాలను ప్రత్యామ్నాయంగా తక్కెళ్ళ జగ్గడు భావిస్తాడు. సంగదాసు బలిదానం, వెంకటదాసు బందిపోటుగా బలి అవ్వటం కలిసి వెరసి వర్గరహిత సమాజాన్ని కోరుకొని, సంఘోద్ధరణకై కృషి చేయటం జరిగింది. రామదాసుకు వేసిన ఆర్నెల్ల శిక్షకు ముగింపుకు పూర్వమే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లుగా రచయిత భావించటంతో నవలా కథాంశం ముగిన్తుంది. సెటిల్మెంట్లలోనివారు, జైళ్ళల్లోనివారు స్వాతంత్ర్య రాగానే విడుదల అవుతారు.

చౌదరి మరణానంతరం తమకు సంక్రమించిన ఆస్తిని రామానాయుడు పంచములకు వృత్తివిద్యలను నేర్పే కార్మిక కళాశాలకు, వెంకటయ్య సంగపీఠమునందలి పంచముల విద్యాలయానికి రాసియివ్వటం జరిగింది. రామానాయుడి భార్య కమలను లేపుకెళ్ళిన వారి చుట్టమైన మోహనరావు కూడా ఆతని యొక్క చివరి క్షణంలో రామానాయుడికి చేసిన ద్రోహానికి పశ్చాత్తప్తుడై తన ఆస్తిని కార్మిక పాఠశాలకు వీలునామా రాసి పంపుతాడు. పంచములు స్వీయోద్ధరణ చేసుకొనే అవకాశం వారికి ఉండే విధంగా అగ్రవర్ణాలు పంచములకు ఆర్థిక సహకారాన్ని అందించటమే వారి అభివృద్ధికి బాటలు వేయగలుగుతుందని అర్థమయేటట్లుగా పంచమోద్యమం కార్మికోద్యమం విజయవంతమవటం, పంచములలోని వివిధ వృత్తులవారు కార్మిక కళాశాలలో చేరి స్వీయోద్ధరణ దశకు చేరుకొన్నారని అర్థమౌతుంది. అందుకే నవలకు సంగ విజయమనే పేరు కూడా ఉంది.

కార్మికోద్యమం విజయవంతమయి సోషలిస్టిక్ ప్రజాస్వామ్యానికి బాటలు వేస్తుందనే స్పృహను కలిగించే నవల మాలపల్లి. ఆనాడు సమాజంలోని అన్ని వర్గాలవారు అన్ని కులాలవారు ఐకమత్యాన్ని పెంపొందించుకోవటానికి వీలుగా పల్నాడులోని మాండలిక వ్యవహార భాషలో




ఈ నవలను రాయటంతో ఇది ఒక ప్రత్యేకతను సంతరించుకొంది. భారతదేశ స్వాతంత్ర్య సాధనోద్యమానికి రథసారథివంటి రచన కావటం చేతనే బ్రిటిష్ ప్రభుత్వపు నిషేధానికి గురి అవ్వటం జరిగిందని, ఆనాటి యువత సాంఘిక వివక్షను తోసిరాజని ఐకమత్యాన్ని పెంపొందించుకొని సత్యాగ్రహోద్యమ బద్ధకంకంకణు కాగలిగేట్లు చేసి ఉంటుందని అనిపించకమానదు. అదే దృష్టితో ఆంధ్రవిశ్వవిద్యాలయం 1927లో పాఠ్యాంశంగా పెట్టడం, ప్రభుత్వం తిరిగి నిషేధించటమే స్వాతంత్ర్య సాధనలో ఈ మాలపల్లి రచనకున్న చైతన్యపు విలువలను తెలియచేస్తుంది. మాలపల్లి నవల మహిమాన్వితమైన తరతరాల సాహిత్య సంపద. సంగదాసు చర్చలలోని బోల్షివిజం, రామదాసు బోధనలలో ఉండే గాంధీ సర్వోదయ భావన, జగ్గడి మాటల్లోని కమ్యూనిజంలోని సామ్యవాదాల విలువలను అవగాహన చేసుకొనే వీలును కల్పించిన నవల మాలపల్లి. స్వాతంత్ర్యానంతరం భారతదేశపు సోషలిస్టిక్ ప్రజాస్వామ్యం ఏర్పడటానికి దారిదీపమైన నవల మాలపల్లి అని కూడా అనిపిస్తుంది. జీవితంలోని సామాజిక అనుభవాలలో కలిగే నవరసాల అనుభూతులను పండించి శాంతిప్రదాయియైన నవల ఇది. అహింసను ఆయుధంగా చేసుకొని దేశస్వాతంత్ర్యాన్ని సాధిస్తే, మాలపల్లి నవల 75 ఏళ్ళు గడిచిన స్వాతంత్ర్యానంతరం కూడా అహింసాయుత సమాజం స్వాతంత్ర్య పరిరక్షణకు అవసరమనే స్పృహను కలిగించే నవల కాబట్టి 100 ఏళ్ళనాటి నవల అవశ్య పఠనీయమైనది.

జంధ్యాల కనకదుర్గ
గుంటూరు. ఫోన్: 949 114 0299.

# కథ రాయటం నేర్పిన 'నన్ను గురించి కథ వ్రాయవూ?'

– పొదిలి నాగరాజు

"పాత్ర చిత్రణను మరింత ముందుకు తీసుకపోయి, పాత్ర చిత్రణ కోసం మాత్రమే కథలు రాసిన రచయిత బుచ్చిబాబు. తన దృష్టిని ఆకర్షించిన తాత్విక సిద్ధాంతాల సూత్రాల వెలుగుతో పాత్రల్ని విశ్లేషించటం బుచ్చిబాబుకు చాలా ఇష్టమైన విధానం. బుచ్చిబాబు కథా వస్తువులో చాలా భాగం జీవితంలో నుంచి కాకుండా అతని చదువులో నుంచి వచ్చినట్లుగా లోతుగా పరిశీలిస్తే అర్థమౌతుంది". వల్లంపాటి వెంకటసుబ్బయ్య తన నవలా శిల్పం (పు.120)లో చెప్పిన మాటలివి. బుచ్చిబాబు గొప్ప కథా రచయిత అనటానికి ఈ మాటలు అక్షరాలా సరితూగుతాయి. కథ రాయటానికి కథా రచయితకు వస్తువుతో పాటు పాత్ర చిత్రణా ముఖ్యమైందే. కథా రచయితకు కథలో పాత్రల్ని మనసుతో కదిలించటం తెలిసుండాలి. అంతేకాదు కథలోని పాత్ర పాఠకుడితో మిత్రునిలా మాట్లాడినట్లుండాలి. కథా రచయిత కథలో పాత్రచేత వ్యాఖ్యానాలు చేయించకుండా సమకాలీన సామాజిక విషయాలలోని వాస్తవికతను కళ్ళముందుంచే ప్రయత్నం చేయాలి. పాఠకుడికి అవసరమైన జీవన విధానాలను, సంస్కరణ భావాలను గుండెకు తాకేలా సూచన చెయ్యాలి. బుచ్చిబాబు 1946లో రచించిన 'నన్ను గురించి కథ వ్రాయవూ?'లో ఇలాంటివెన్నో పుష్కలంగా అందుతాయి. ఈ కథలో ప్రధానపాత్రలు రెండు. ఒకటి నేను అనే బుచ్చిబాబు. రెండవది కుముదం. ఈ రెండు పాత్రలే పాఠకుడితో మాట్లాడుతూ కథనంతా నడిపిస్తాయి. ఈ రెండు పాత్రల అభిప్రాయాలూ, ఆదర్శ భావజాలాలు కథ రాసే, రాయాలనుకునే రచయితలకు కథనెలా రాయాలి? ఎవరికోసం రాయాలి? అసలెందుకు రాయాలి? అనే విషయాలను సమకాలీన సామాజిక విషయాలతో కలుపుకుంటూ చర్చిస్తూ వుంటాయి. ఈ కథలో కుముదం కథా వస్తువుకు అర్హతలేని కథా వస్తువు. బుచ్చిబాబు సంఘసంస్కరణ, విప్లవ భావజాలాలతో ఆదర్శవంతమైన కథ రాయాలనుకునే కథా రచయిత. కథ రాయటానికి పనికిరాని కుముదం బుచ్చిబాబు కనిపించిన ప్రతీసారి 'నన్ను గురించి కథ వ్రాయవూ?' అని కథ చివరి వరకూ అడుగుతూనే ఉంటుంది. సంస్కరణ భావజాలంగానీ, సమకాలీన ప్రభావంకానీ, విప్లవ స్వరంగానీ లేని కుముదం కథ రాయటానికి అనవసరమైన వస్తువని బుచ్చిబాబు కథ చివరివరకూ కుముదానికి చెబుతూనే ఉంటాడు. ఈ ఇద్దరూ భౌతిక, మానసిక అనుభవాలతో, అనుభూతులలో చర్చించే ప్రతి అంశమూ సమకాలీన కథారచయితలకే కాకుండా భావితరం కథా రచయితలకూ కథ రాయటానికి అవసరమైన కొలమానాలను తెలియజేస్తాయి. రెండు వేరువేరు జీవితాలు సంఘర్షించిన జీవన సిద్ధాంతాల అసంపూర్ణ ఫలితాల సారాంశమే బుచ్చిబాబు 'నన్ను గురించి కథ వ్రాయవూ?' కథ.

నేను అనే బుచ్చిబాబు మామగారింట్లో కుముదం కుటుంబం అద్దెకుంటుంది. బుచ్చిబాబు తనకు పన్నెండు సంవత్సరాల వయసులో అద్దెడబ్బులు అడగటానికి కుముదం వద్దకు వెళ్తాడు. అప్పుడు కుముదానికి పది సంవత్సరాలు. బుచ్చిబాబుకు ఊహల్లో పాత్రలను చిత్రించి కథలు చెప్పటం అలవాటు. అవన్నీ వినే అలవాటున్న కుముదం ఓ రోజు బుచ్చిబాబును 'నన్ను గురించి కథ చెప్పవూ?' అని అడుగుతుంది. ఊహల్లో నుంచి పాత్రను పట్టుకొచ్చి కథలు చెప్పే బుచ్చిబాబుకి కళ్ళెదుటున్న కుముదం గురించి కథ చెప్పటం ఎలాగో తెలియక నీ గురించైతే కథ చెప్పలేనంటాడు. తర్వాత బుచ్చిబాబుకు ఇరవై సంవత్సరాల వయసులో రెండవసారి అద్దెడగటానికి

కుముదం ఇంటివద్దకొస్తాడు. కుముదానికప్పుడు పద్దెనిమిది సంవత్సరాలు. కొత్తగా పెళ్ళై ఉంటుంది. కొత్త పెళ్లికూతురైన కుముదం 'నన్ను గురించి కథ వ్రాయవూ?' అని అడుగుతుంది. అప్పుడప్పుడే ఉన్నత విలువలతో ఒక క్రమ సిద్ధాంతాన్ని నమ్ముకొని రచనలు చేయటం మొదలుపెట్టిన బుచ్చిబాబు కుముదంలాంటి సాధారణ స్త్రీగురించి కథ రాయటానికి ఇష్టపడడు. పైగా ఆధునిక భావజాలాలతో ముందుకెళ్లటానికి గట్టిగా ప్రయత్నిస్తున్న ఆనాటి సమకాలీన స్త్రీల దృక్పథాలేవీ కుముదంలో కనిపించకపోవటం కూడా బుచ్చిబాబు కుముదం గురించి కథను రాయక పోవటానికి కారణం. అందుకే కుముదంతో నీ గురించి కథ రాయలేనని చెబుతాడు.

మరో నాలుగు సంవత్సరాలకు బుచ్చిబాబు కుముదాన్ని కలుసుకుంటాడు. కుముదం ఒక బిడ్డకు తల్లి. కొంత జీవితాన్ని కొత్త కోణం నుంచి చూసుంటుంది. ఈ సృష్టిని కొనసాగిస్తున్న మాతృమూర్తులలో తానూ చేరటం మూలాన బుచ్చిబాబుతో "నన్ను గురించి కథ వ్రాయవూ?" అని అడుగుతుంది. ఆ సమయంలో బుచ్చిబాబుకు కుముదంలోని అందం కనిపించినంతగా ఆమెలోని మాతృత్వం కనిపించదు. పైగా పెళ్లిచేసుకొని బిడ్డను కనటం ప్రతి స్త్రీకి సర్వసాధారణమైన విషయమే. కాబట్టి కుముదంలో తనకు కావలసిన, తనకు అవసరమైన కథావస్తువుగానీ, లక్షణంగానీ ఏమీ లభించక పోవటంతో అప్పుడు కూడా కుముదం గురించి కథ రాయటాన్ని నిరాకరిస్తాడు. తర్వాత ఆరుసంవత్సరాలకు బుచ్చిబాబు కథా రచయితగా అంతో ఇంతో పేరు సంపాదించుకుంటాడు. కుముదం ముగ్గురు బిడ్డల తల్లై ఉంటుంది. అద్దెదబ్బులే మళ్ళీ ఇద్దరినీ కలుపుతుంది. భారతీయ సాంప్రదాయ స్త్రీ రూపానికి ప్రతిరూపమైన కుముదం పరిపూర్ణ మాతృమూర్తిత్వం పొంది ఉంటుంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా ఒక స్త్రీ పవిత్రంగా సాధించాల్సిన సంసార జీవన సాఫల్య ఫలితాన్ని పొందిన కుముదం బుచ్చిబాబుతో ఇప్పుడైనా 'నన్ను గురించి కథ వ్రాయవూ?' అని అడుగుతుంది. దేశమంతా సమసమాజ నిర్మాణం కోసం పాటుపడుతూ, స్వేచ్ఛాస్వాతంత్ర్యం కోసం పరితపిస్తూ, ఎవరి స్వేచ్ఛలో వారు తమ జీవిత రేఖాచిత్రాన్ని రూపొందించుకోవటానికి పోరాటాలను చేస్తూవుంటే కుముదం మాత్రం నానమ్మల



బుచ్చిబాబు

దారిలో నడుస్తూ ఆచార సాంప్రదాయ సరస్సులలో మునుగుతూ, మునకలేస్తూ ఉంది. అలాంటి కుముదం గురించి కథెలా రాయటమని కథ రాయమన్న కుముదం కోరికను కొట్టిపారేస్తాడు.

చివరిసారిగా బుచ్చిబాబు అద్దెడగటానికి కుముదం వద్దకెళ్తాడు. కుముదం న్యూమోనియా జబ్బుతో ఆసుపత్రిలో మంచంపై తెల్లగుడ్డను ఒంటి నిండా కప్పుకొని చావు కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. అప్పటికి కుముదం నలుగురు బిడ్డల తల్లి. చివరి అమ్మాయి పేరు స్వరాజ్యం. తాను చేయలేక మిగిలిపోయిన కార్యాలన్నింటికీ గుర్తుగా, తాను కోరిన సమాజాన్ని తయారుచేసే మహిళగా రూపాంతరం చెందాలని తన చివరి కూతురికి స్వరాజ్యం అని పేరు పెడుతుంది. ఈ విషయాన్ని బుచ్చిబాబుకు గుర్తుచేస్తుంది. చావుకు దగ్గరగా ఉన్న కుముదం కడసారి కోరికగా బుచ్చిబాబుతో 'నన్ను గురించి కథ వ్రాయవూ?' అంటుంది. సమాధానం చెప్పలేక మౌనంగా ఉన్న బుచ్చిబాబును చూసి నీవు ఇప్పటికీ పెళ్ళిచేసుకోకుండా ఉండటానికి కారణం నన్ను ప్రేమించడం వల్లేనని చెప్పి కుముదం కన్నుమూస్తుంది. కుముదం ఆఖరి పలుకులు బుచ్చిబాబు హృదయాంతరాలను కదిలిస్తాయి. తనకే తెలియక దాగివున్న తన ప్రేమ రహస్యాన్ని బట్టబయలు చేస్తాయి. కుముదం చివరి మాటల్నే బుచ్చిబాబు అనుక్షణం తలచుకుంటూ అల్లాడిపోతుంటాడేగానీ కుముదం గురించి కథ రాయటానికి సిద్ధపడడు. కథ పూర్తవుతుంది.

"ప్రపంచాన్ని పరిశీలిస్తూ వ్యక్తుల మంచిచెడ్డలని, వింత ప్రవర్తనని ప్రేక్షకుడిగా అనుభవించి అర్థం చేసుకొని, అలా సంపాదించిన ఆంతరంగిక జ్ఞానాన్ని నా తాత్విక దృష్టితో మేళవించి వార్థక్యంతో మహత్తర గ్రంథం వ్రాసి మరణించాలని నా ఆదర్శం" అంటాడు బుచ్చిబాబు. తన

రచనా వ్యాసంగంపై బుచ్చిబాబుకు ఒక సిద్ధాంతం ఉందని ఈ మాటలవల్ల తెలుస్తుంది. తన సిద్ధాంతాలకు అనుగుణంగానే తన రచనా విధానమంతా కొనసాగిందని ఆయన రచించిన ఏ రచన చదివినా తెలుస్తుంది. ఇటువంటి వాటిల్లో ఒకటే 'నన్ను గురించి కథ వ్రాయవూ?' కథ. ఈ కథలో ప్రధాన పాత్రలు కథకుడిగా బుచ్చిబాబు. కథావస్తువుగా కుముదం. కథంతా వీరిద్దరిదే. కథలో వీరి పాత్రపోషణంతా ఆరుగంటలు, ఆరువందల మాటలూ, ఐదు సందర్భాలు. కాలం తక్కువే అయిన కథకు కావలసిన ముడిసరుకు ఎక్కువే. 'నన్ను గురించి కథ వ్రాయవూ?' అని కుముదం బుచ్చిబాబును అడిగినప్పుడల్లా బుచ్చిబాబు ఆమె శరీర సౌందర్యాన్నే చూస్తుంటాడు. ఆమె మనసును తాకి కథ రాయాలన్న ప్రయత్నమే చేయడు. ఎందుకంటే ఆమె స్త్రీ. అందమైన స్త్రీ. తాను ప్రేమించీ తనకు దక్కని స్త్రీ. ఒక సాధారణ లక్షణాలున్న స్త్రీ. చివరిసారిగా కుముదం చనిపోతూ "నాకు నిర్విచారం. ఈ ప్రపంచం నాదైతేగా విచారానికి – నువ్వుమాత్రం....." అని కుముదం బుచ్చిబాబును ఉద్దేశించి చెబుతుంది. ఆ మాటలతో మదనపడిన బుచ్చిబాబు తొలిసారి కుముదం హృదయావేదనను స్పృశిస్తాడే తప్ప అప్పుడు కూడా కథ మాత్రం రాయడు. అయితే కథలో వీళ్ళిద్దరి కలయికతో జరిగిన ప్రతి చర్చా సమయం, సంభాషణ కథా రచనకు ఎలాంటి వస్తువు కావాలో నిర్ణయింపబడుతూ ఉంటుంది. బుచ్చిబాబుకు కథమీదున్న అభిప్రాయాలు కథానుకూలంగా పాఠకుడితో పంచుకుంటుంటాడు. కథలో కాలాన్నిబట్టి, మారుతున్న తన వయసునుబట్టి బుచ్చిబాబు కథమీద తనకున్న అభిప్రాయాన్ని మార్చుకుంటూ ఉంటాడు. కథలో భాగంగా ఆనాటి సమకాలీన రచయితల్లో చాలామంది కథారచయితలు సమాజంలోని ఏదో ఒక వస్తువును ఇతివృత్తంగా చేసుకొని దానికి వర్ణనలను అద్దుకుంటూ కథ రాసే విధానానికి స్వస్తి చెప్పమంటాడు. అదే సమయంలో ఆధునిక భావజాలాలతో సమకాలీన సమాజంలోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాల కోసమే కథ రాయాలని హెచ్చరిస్తుంటాడు. ఇదే ధోరణితో 'నన్ను గురించి కథ వ్రాయవూ' కథంతా నడుస్తూ ఉంటుంది.

ముత్యాల కోసం సముద్రంలో మునిగేవారికి మునిగిన ప్రతిసారి ముత్యపు చిప్పలు దొరకనట్లే కథా రచన చేయాలనే దృష్టితో 'నన్ను గురించి కథ వ్రాయవూ?' కథ చదివితే కథారచన చేసే, చేయాలనుకునే ప్రతి రచయితకూ కథ చదివిన ప్రతిసారి ఏదో ఒక కొత్త విషయం వస్తువుపరంగా అందుతూనే ఉంటుంది. సామాజిక మార్పు కోసం తపనపడే యువ కథా రచయితకు ఉండవలసిన లక్షణాలన్నీ కథలో బుచ్చిబాబుకి ఉంటాయి. సంసార పంజరం నుంచి ఎగిరిపోయి స్వేచ్ఛగా జీవించాలనే కోరికతో కుముదం ఉంటుంది. ఇద్దరిదీ వైవిధ్యమైన జీవిత అనుభవాలతో కూడిన ఆధునిక భావజాలాల సాంఘిక సృష్టేనని కథ చదివితేగానీ తెలియదు. ఒకే విధమైన అభిప్రాయాల సారాంశాన్ని వివిధ కోణాల నుంచి చూపించే నైపుణ్యం బుచ్చిబాబుకే సొంతం. అటువంటి కథను రాయగలిగినవాడు బుచ్చిబాబే.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య తన కథాశిల్పంలో బుచ్చిబాబు కథారచనపై మాట్లాడుతూ "బుచ్చిబాబు కథ రచనలో ఎంతో శ్రద్ధ తీసుకునేవాడు. కథావస్తువు స్ఫురించగానే కథ రాసేవాడు కాదు. నిజంగా జరిగిన విషయం అపూర్వమైనదైనా కొంత వడపోత, చిత్రిక అవసరమని భావించేవాడు. ఇతివృత్తాన్ని కొంతకాలం మనసులోకి ఇంకనిచ్చి దానికి కథాస్వరూపం ఏర్పడేవరకూ వేచివుండేవాడు." కథా రచయితకు ఉండవలసిన మంచి లక్షణం కూడా ఇదే. ఈ శిల్పమే 'నన్ను గురించి కథ వ్రాయవూ'లో కనిపిస్తుంది. ఏ కథా రచయితకైనా వయసుతో పాటు అభిప్రాయాలు, ఆలోచనలూ మార్చుకుంటుంటాడు. అయితే వాటి వికాసం మాత్రం తన చుట్టూ ఉన్న సామాజిక వాతావరణాన్నిబట్టి కాలాన్నిబట్టి మారుతూ ఉంటుంది. కథా రచయితగా స్థిరపడాలనుకునే రచయిత ఎలాంటి మార్పులకు లోనవుతూ తన రచనా విధానాన్ని మెరుగుపరచుకుంటాడో 'నన్ను గురించి కథ వ్రాయవూ?'లో బుచ్చిబాబు నాలుగు సందర్భాల ద్వారా తెలియజేశాడు. ఇదంతా కథ రచయితకు సూచన మాత్రమే. అందరికీ ఇదే కథా ప్రస్థాన చారిత్రక నేపథ్యం ఉండకపోవచ్చు. కానీ ఒక ఆధునిక కథారచయిత అనుసరించాల్సిన సరైన మార్గం మాత్రం ఇదేననిపిస్తుంది. బుచ్చిబాబుకు పన్నెండు సంవత్సరాల వయసు నుంచే ఊహల్లో పాత్రలనల్లుకొని కథలు చెప్పటం అలవాటు. అందుకే కుముదం తొలిసారి 'నన్ను గురించి కథ చెప్పవూ?' అని అడుగుతుంది. దీనితో ఊహల్లో కథలు

తయారు చేసుకొనే బుచ్చిబాబుకు ఉన్నట్టుండి తన కళ్ళ ముందు కనిపించే కుముదం గురించి కథ చెప్పలేకపోతాడు. కారణం "ఆమె నిజంగా మనిషి. ఊహల్లో వ్యక్తికాదు." అందుకే బాల కథకుడైన బుచ్చిబాబు వాస్తవ కథను చెప్పమనగానే ఉక్కిరిబిక్కిరైపోతాడు. కల్పనల్ని అల్లుకుంటూ కథలు చెప్పే బుచ్చిబాబు అల్లటానికి అవకాశం లేని వాస్తవికత గురించి కథ చెప్పలేక కుముదం వద్ద మౌనంగా ఉండిపోతాడు. ఇది కథలు రాసే చాలామంది రచయితల ప్రాథమిక స్థాయి. ఈ స్థాయిలో ఏ రచయితైనా ఎన్నెన్నో ఊహల్తో కథను రసవత్తరంగా రాయాలనుకొంటాడు. బలమైన అక్షరశక్తినంతా ఒడగట్టి, తన పాండిత్యాన్నంతా ప్రదర్శిస్తూ కథ రాయటానికి భగీరథ ప్రయత్నం చేస్తాడు. అలా రాసిన కథలో ఇతివృత్తం బలంగా ఉండవచ్చేమోగానీ అనుభవపూర్వకమైన విశేషాలకు ఎటువంటి తావుండకుండా పోతుంది. ఇది కొత్త కథా రచయిత గమనించడు. ఇదే అనుభవం కథలో పన్నెండు సంవత్సరాల బుచ్చిబాబుకు మొదటి అనుభవంగా చిత్రించబడింది. ఇది మొదటి సందర్భం.

బుచ్చిబాబు ఇరవై సంవత్సరాల వయసులో రెండవసారి కుముదాన్ని కలుసుకుంటాడు. పద్దెనిమిది సంవత్సరాలున్న కుముదానికి పెళ్ళై ఉంటుంది. బుచ్చిబాబు అప్పటికి కథారచయితగా ఒకటీ రెండూ కథలు రాసి ఉంటాడు. తాను కథారచయితన్న విషయం ఎవరికీ తెలీదు. కుముదానికి కూడా. కథారచనపట్ల ఇంకా పరిపక్వత సాధించని బుచ్చిబాబుని కుముదం కొత్తగా కాపురానికొచ్చిన సందర్భంగా "నన్ను గురించి కథ వ్రాయవూ?' అని అడుగుతుంది. సమకాలీన సమాజాన్ని పరిశీలిస్తూ సంఘసంస్కరణ భావజాలంతో ఏర్పాటు చేసుకున్న తన సిద్ధాంతాలకనుగుణంగా కథా రచన చేయాలనే బుచ్చిబాబుకు కుముదంలాంటి ఒక సామాన్య స్త్రీగురించి కథ రాయటం నచ్చదు. అంతేకాకుండా నిండు యౌవనంలో ఉన్న బుచ్చిబాబుకు చూసిన వెంటనే తన అందంతో ఆకర్షించుకునే కుముదంలోని 'నన్ను'లో సౌందర్య ఛాయలే కనిపిస్తాయి తప్ప అంతకుమించి ఇంకేమీ కనిపించదు. ఆమె తపనపడుతున్న స్వేచ్ఛా సంకలిత హృదయావేదనేదీ బుచ్చిబాబును స్పృశించదు. స్త్రీని అంగాంగ వర్ణన చేస్తూ కథ రాయటం ఆధునిక లక్షణాలకే కాదు తన ఆదర్శ సిద్ధాంతాలకే విరుద్ధం కాబట్టి బుచ్చిబాబు కుముదంలో 'ఎటు చూసినా నీలో కథ రాయటానికి కావలసిన వస్తువేదీ కనిపించటంలేదు. అందువల్ల నీ గురించి కథ రాయటం కుదరదని తెగేసి చెబుతాడు. ఇది సామాజిక పరిణామ వికాస నిర్మాణాన్ని కోరుకునే కథా రచయితకున్న సమకాలీన దృక్పథమే. దీనితో పాటు కథాకాలానికి యువకథా రచయితపై సమాజానికున్న దృష్టి ఎలాంటిదో కూడా తెలియజేశాడు. "ఇరవై సంవత్సరాల యువక అజ్ఞానంలో ఉన్న నన్ను ఎన్నుకోతగ్గ రచయితగా ఈ సంఘం గుర్తించదని నా భయం. ముదుసలే జ్ఞాని కాగలడని భారతీయుల వెర్రి నమ్మకం.'' ఈ వేదనా పరంపరలో ఉన్న ఒక యువకథా రచయితకు సాధారణ స్త్రీ లక్షణాలున్న కుముదం గురించి కథరాస్తే తన కథను ఎవరు ఆదరిస్తారు. తనకెంతమంది పాఠకులు తయారౌతారు. ముదుసలులు రాసిన కథలే కథలని భీష్మించుక కూర్చున్న నాటి సమకాలీన సమాజపు పాఠకులను ఒక యువకథారచయిత ఎటువంటి వస్తువును తీసుకొని కథనురాసి వాళ్లను మెప్పించగలడు. ఒక యువ కథా రచయిత సామాజికాంశాలను పరిశీలన చేసి, వాటిని జీర్ణింపజేసుకొని, వాస్తవికతను జోడించి కథనెంత అద్భుతంగా రాసినా ఆ కథను అంతే లోతుగా చదివి అవగాహన చేసుకొని కథారచయితకు సమాజంపై ఉన్న లోతైన దృష్టిని గుర్తించే లోతైన పాఠకులు సమకాలంలో లేరని బుచ్చిబాబు ఆవేదనతో కథాంతరంగా తెలిపాడు. ఇటువంటి పాఠకులున్న కాలంలో గొప్ప కథారచయితగా స్థిరపడాలనే ఆశయ సిద్ధాంతాలున్న బుచ్చిబాబుకు కుముదం గురించి కథ రాయటం చవకబారు కథగా అనిపించుకుంటుందేమోనని "నీలో ఏముందని నీ గురించి కథ రాయమంటావు?" అంటాడు.

'నాలో ఏముండాలి?' అని కుముదం బుచ్చిబాబును ప్రశ్నిస్తుంది. స్త్రీ వ్యక్తిత్వాన్ని వస్తువుగా చేసుకొని కథ రాసే అలవాటు లేని కథా రచయితలందరికీ కుముదం వేసిన సూటి ప్రశ్న సమాధానం కోసం తడుముకోవాల్సిన పదునైన శరంలాంటిదే. అయితే కథాపరంగా బుచ్చిబాబు కుముదానికి సమాధానంగా "ఒక ప్రత్యేకత, అందరిలోనూ లేని ఏ ఒక్క విశేషమైనా సరే'' అని అంటాడు. సమకాలీనంగా పరుగెత్తుకొస్తున్న అభ్యుదయాన్ని అందిపుచ్చుకొని, సంస్కరణ భావజాలాలతో

పరిస్థితులనెదిరిస్తూ స్త్రీలు సాధిస్తున్న విజయాలలో కుముదం ఛాయలు లేకపోవటంవల్ల తాను కుముదం గురించి కథ రాయకపోవటానికి కారణమేనని కథాగమనం ద్వారా మనకర్థమవుతుంది. ఒకవేళ బుచ్చిబాబు కుముదం గురించి కథ రాయవలసి వస్తే ఆమెలో ఎలాంటి ధిక్కరణ భావజాలాలు ఉండాలో కూడా తెలియజేశాడు. "సంఘాన్ని ధిక్కరించి సాంప్రదాయాలపై విప్లవం చేసి, ఇతరులకి అవగాహనకాని కొత్త విలువలని సాధించి పొందిననాడే ధన్యజీవి. వ్యర్థజీవులు సంఘం అల్లిన వలలో చిక్కుకొని, మర్యాద పేరు చెప్పుకొని కుళ్ళిపోతారు. స్థాపితమైన ఆదర్శాలపై విప్లవం చేసిననాడు సంఘాన్ని తనవైపుకు మరల్చయత్నిస్తాడు. కాబట్టి సంఘాభివృద్ధి అలాంటి వాళ్లపై ఆధారపడుతుంది". ఇటువంటి ఆశయ సిద్ధాంతాలున్న వారు ఎవరైనా సరే వారి గురించి కథ రాయాలి – అంతేగానీ సాంప్రదాయ ముసుగులో అల్లాడుతూ మర్యాదల కోసం పరితపించే నీలాంటి స్త్రీ గురించి కథరాయటం కుదరదని చెప్పి బుచ్చిబాబు అక్కడి నుండి వెళ్ళిపోతాడు. యువకథా రచయితలతో సాగే సాంఘిక పరిణామ స్థితిగతులలో సామాన్యమైనదేదీ తనకథా వస్తువుకు పనికిరాదని కథారచయితల గురించి బుచ్చిబాబు వివరించిన రెండవ సందర్భం ఇది.

మరో నాలుగు సంవత్సరాలకు బుచ్చిబాబు కుముదం తిరిగి కలుసుకుంటారు. బుచ్చిబాబు అప్పటికి కథా రచనపై కొంత అనుభవాన్ని పొందుంటాడు. కుముదం ఒక బిడ్డకు తల్లై ఈ దేశ స్త్రీజాతి పరమార్థతను చాటుంటుంది. ఇద్దరూ కలిసి కుముదం ఇంటి పంచలో మాట్లాడుకుంటుండగా కుముదం ఉన్నట్టుండి పైకి లేస్తుంది. వెంటనే ఆమె పైట జారుతుంది. అది చూసిన ఆదర్శ భావజాలాల కథారచయిత బుచ్చిబాబు హృదయం ఒక సామాన్య యువకునిలాగే ప్రవర్తిస్తుంది. ఇది గమనించిన కుముదం సిగ్గుపడదు. బుచ్చిబాబు మీద కోపం రాకపోగా సంఘసంస్కరణలో భాగంగా ఆదర్శవంతమైన కథ రాయాలనుకునే ఆధునిక భావికథారచయితలో ఇలాంటి స్పందన కలగటం కుముదానికి నవ్వును తెప్పిస్తుంది. కుముదం ఆ ధ్యాసను మళ్ళించటానికి "ఉద్యోగం ఏమైనా చేస్తున్నావా?" అని బుచ్చిబాబును అడుగుతుంది. 'ఏమీ లేదు – కథ వ్రాయటం మొదలు పెట్టాను" అన్న మాట వెంటనే కుముదం 'నన్ను గురించా' అని అంటుంది. దానికి సమాధానంగా ఎటువంటి తిరుగుబాటు ఛాయలు లేని 'నీ గురించి కథెలా రాయమంటావు' అంటూ ఆమె శారీరక ఎత్తుపల్లాలను చూస్తూ తనకు లభించని కుముదం అందాన్ని ఉద్దేశించి మాట్లాడతాడు. తన మనసు లోతుల్లోని విశేషాలను గుర్తించక శరీర అంగాలకు లోనై ఆ సంఘటనే తలచుకొంటూ తనవైపు చూసి మాట్లాడుతున్న వికల మనస్కుడు బుచ్చిబాబుతో కుముదం "సృష్టిలో నేనెంతో అల్పురాలనని తోటివాడైన నీకే తోచినపుడు సృష్టి ముందు నేనేం తిరుగుబాటు చెయ్యగలను" అని గుండె లోతులకు తగిలేలా మాట్లాడుతుంది కుముదం. ఈ మాటతో బుచ్చిబాబు ఇంటికెళ్తానని బయలుదేరుతాడు. అయితే తనలో కలిగిన మనో వికారమే కుముదంలో కూడా కలిగి ఉంటుంది కాబట్టి ఖచ్చితంగా నన్ను వెనక్కి పిలుస్తుందని అనుకుంటాడు. కానీ బుచ్చిబాబు బింబాన్ని పవిత్రతో మనసులో దాచుకున్న కుముదం అతన్ని వెనక్కి పిలవదు. అలా తనను పిలవని కుముదంపై విరక్తి చెంది ఇలాంటి కుముదాన్ని గురించి ఏ కథ వ్రాయనూ?' అని వెళ్ళిపోతాడు. యౌవనంలోని కోరికల్ని బలపరచి కర్తవ్యాన్ని బలహీన పరిచే విధానానికి అడ్డుకట్ట వేయాలన్న సందేశమే ఈ ఘట్టం. ఇది మూడవ సందర్భం.

ఆరు సంవత్సరాల తర్వాత బుచ్చిబాబు, కుముదం కలుసుకుంటారు. అప్పటికే బుచ్చిబాబు రకరకాల జీవితానుభవాల్ని చవిచూసి చాలా కథలు, వ్యాసాలు రాసుంటాడు. కుముదం ముగ్గురు బిడ్డల తల్లి. ఇద్దరూ వేరువేరు దారుల్లో వారివారి జీవితాల్ని సానబండపై అరగదీసినవాళ్ళే. అందుకే ఈ ఘట్టంలో వీరిద్దరి మధ్య సాగే చర్చ చాలా పదునుగా ఉంటుంది. స్వేచ్ఛాస్వాతంత్ర్య విషయాలు, గాంధీజీ సిద్ధాంతాలు, బానిసత్వపు బాధలు, సంఘ సంస్కరణకు కావలసిన ఆయుధాలు మొదలైన సమకాలీన సామాజిక అంశాలన్నీ చర్చించుకుంటారు. ఇవన్నీ కథా రచనకు అవసరమనే ధోరణిలోనే మాట్లాడుకుంటారు. బతుకుతెరువు కోసం దేవులాడి దేవులాడి నిరుద్యోగ జీవితంపై విరక్తి కలిగిన బుచ్చిబాబు, ముగ్గురు బిడ్డలతో స్త్రీ జీవిత సారాన్ని అనుభవించి సంసార జీవితంపై విరక్తి కలిగిన కుముదం ఎంతో అమూల్యమైన సందేశ సారాంశాలను వివరిస్తారు. కుముదంలో స్వేచ్ఛపట్ల కలిగిన మార్పు బుచ్చిబాబును ఆశ్చర్యచకితుణ్ణి

చేస్తుంది. ఏ చలనం లేని కుముదం ఉన్నట్టుండి సంచలనంగా మారటం గుర్తించిన బుచ్చిబాబు కుముదం గురించి కథ రాయలేనని వెళ్ళిపోతాడు. ఇది నాల్గవ సందర్భం.

మరో నాలుగు సంవత్సరాలకు కుముదం, బుచ్చిబాబు చివరిసారిగా కలుసుకుంటారు. బుచ్చిబాబు జీవితాన్ని అన్నికోణాల నుంచి దర్శించిన తాత్త్విక కథా రచయిత. కుముదం నలుగురు బిడ్డల తల్లి. తన ఆఖరు అమ్మాయికి స్వరాజ్యం అని పేరు పెట్టుంటుంది కూడా. దేశాన్ని దాస్యం నుంచి విముక్తి కలిగించే స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం జరిగే ఉద్యమంలో పాల్గొనే స్త్రీగా ఎదగటానికీ, తనను సంతాన యంత్రం నుంచీ, సంసార పంజరం నుంచి విముక్తి కలిగించే చివరి సంతానానికి సంకేతంగా మిగలాలనీ, ఈ రెండు ఆశయాల సాధన కోసం కుముదం ఆ పాపకు స్వరాజ్యం అని పేరు పెట్టిందని కథాగమనంవల్ల తెలుస్తుంది. అద్దె డబ్బులు అడగటానికి వచ్చిన బుచ్చిబాబు కుముదాన్ని ఆసుపత్రిలో కలుసుకుంటాడు. కుముదం న్యూమోనియా జబ్బుతో ఆసుపత్రి మంచంపై ఒళ్ళంతా తెల్లగుడ్డ కప్పుకొని లేవలేని స్థితిలో పడుకోనుంటుంది. బుచ్చిబాబును చూసిన కుముదం చివరిసారిగా 'నన్ను గురించి కథ వ్రాయవూ?' అని అడుగుతుంది. అంతటితో ఆగకుండా "నువ్వెందుకు పెళ్ళి చేసుకోలేదో నాకు తెలుసు – నా కోసం" అంటుంది. ఎన్నో యేళ్ల నుంచి భౌతిక శరీరానికి అంతుచిక్కకుండా తన హృదయాంతరాలలో దాగిన వాస్తవాన్ని కుముదం బయటపెట్టటంతో బుచ్చిబాబు కన్నీళ్లతో కళ్ళను తడుపుతాడు. కుముదాన్ని చూసిన ప్రతీసారి అతనిలో కనిపించే ఆమె సౌందర్య రహస్యం కుముదానికి తెలీదనుకునే బుచ్చిబాబుకు ఈ మాట బుద్ధిని తెప్పిస్తుంది. కుముదం లోతైన మనసును తాకలేని ఆదర్శ కథా రచయిత బుచ్చిబాబు పశ్చాత్తాపంతో కుంగిపోతుంటే చివరిమాటగా కుముదం బుచ్చిబాబుతో ''నాకు నిర్విచారం. ఈ ప్రపంచం నాదైతేగా విచారానికి – నువ్వు మాత్రం" అని చెప్పకుండానే కుముదం కన్నుమూస్తుంది. ఇక తెరవదు. ఈ సంఘటన బుచ్చిబాబు మనసును కోలుకోలేని తియ్యని గాయంతో నింపుతుంది. కుముదం కథ రాయమని అడిగిన ప్రతి సందర్భాన్ని బుచ్చిబాబుకు గుర్తుచేస్తుంది. అవి వరుసగా.....

1) చిన్నతనంలో వాస్తవికతను గురించి కథ రాయమని చెప్పింది. 2) కొన్నేళ్ల తర్వాత యౌవనంలో ఉన్న యువ కథా రచయితకు దాస్య జీవితానికి దారిచూపే యువతి ప్రేమకన్నా సమాజ పరిణామ వికాసమే చాలా గొప్పదని దానిని సాధించటానికి కథారచన చేయమనింది. 3) మరో నాలుగేండ్లకు బానిసత్వం లేని సమాజాన్ని సృష్టించే భావజాలాలతో కథా రచన చేయమనింది 4) స్వరాజ్యం కోసం త్యాగం చేసే జీవితాలను ఆధారంగా చేసుకొని ఆదర్శవంతమైన కథలు రాయమని హెచ్చరించింది. 5) చివరిసారిగా పవిత్రతను కాపాడే కథను రాయమంది. ఇన్నిరకాలుగా నాకు కథా పాఠాలు నేర్పిన కుముదం నా జీవితంలో మరపురాని అనుభవం. ''తనని గురించి కథ వ్రాయమంది. ఆరుగంటల పరిచయంతో ఆరువందల మాటలతో, నా ప్రపంచాన్ని తలక్రిందులుచేసి, నా జీవిత పరమావధినే తారుమారు చేసిన కుముదాన్ని గురించి ఏం కథ వ్రాయనూ" అంటూ బుచ్చిబాబు కథ చివరిగా మనతో కుముదం గురించి మనసువిప్పి మాట్లాడుతాడు. ఒక కథా రచయిత ఆదర్శవంతమైన కథ రాయాలనుకోవటం మంచిదే. అటువంటి వస్తువు కోసం పరితపిస్తూ అన్వేషించటం కూడా అవసరమే. కానీ ఆ వస్తువు ఫలానా అయివుండాలని ఊహించుకుంటూ కళ్ళముందు కనిపిస్తున్న సమసమాజానికి అవసరమైన వాటిని, అభివృద్ధి చేయాల్సిన వాటిని నిర్లక్ష్యం చేయటం కథకుడి లక్షణం కాదు. సమాజంలో కుముదంలాంటి వస్తువులెన్నో ఆత్మతో కదులుతూ కళ్ళ ముందే తిరుగుతూ ఉంటాయి. వాటి నాడి తెలుసుకొని వాటికి ఊపిరిపోసి సాహిత్య సమాజంలో వాటిని అంతర్భాగం చేయాల్సిన బాధ్యత రచయితకు ఉంది. ఇదే బుచ్చిబాబు ఈ కథ ద్వారా పాఠకులకు చెప్పాలనుకున్నది. అవార్డులు, రివార్డులు, ప్రోత్సాహక బహుమతులు ఆధారంగా వచ్చే కథల్లో గొప్ప గొప్ప కథా అంశాలు ఉండవచ్చేమోగానీ కథెలా రాయాలో, దేనిగురించి రాయాలో అసలెందుకు రాయాలో నేర్పిన కుముదంలాంటి వ్యక్తులు ఉండకపోవచ్చు.

డా. పొదిలి నాగరాజు
కుప్పం. ఫోన్: 905 203 8569.



# ఈ విశిష్టుడు - దర్శక వరిష్టుడు

**- వోలేటి పార్వతీశం**

అఖండమైన కాలప్రవాహాన్ని మీరూ గమనించే ఉంటారు కదా! ఈ ప్రవాహానికి మొదలు ఎక్కడా? అంటే మనం చెప్పలేము. పోనీ తుది ఎప్పుడూ? అంటే అదిమాత్రం చెప్పగలమా? అది చెప్పనూ లేము. ఇదీ చెప్పనూలేము. ఈ సమస్యను అధిగమించడానికే అఖండమైన కాలాన్ని మనకు ఖండ ఖండాలుగా విభజించుకొన్నాం. క్షణాలో, నిమిషాలో, గంటలో, రోజులో, వారాలు, నెలలు, సంవత్సరాలు అంటూ కొన్ని కొలమానాలు ఏర్పరచుకొన్నాం. ఈ ఉపకరణంవల్లనే మనకు కాలమానం తెలిసి వచ్చింది. ఇలా ప్రవహించే ఈ కాలంలో పుట్టి, అదే కాలంలో కలిసిపోయే వ్యక్తులు కోటానుకోట్లమంది ఉంటారు. కానీ ఈ కోట్లమందిలో కొంతమంది మాత్రం, అనంతంగా సాగే ఈ ప్రవాహం ప్రక్కన గట్లపైకి ఎక్కి నిలిచిపోతుంటారు. ఒక నన్నయ్యలాగా, ఒక అన్నమయ్యలాగా, ఒక వివేకానందునిలాగా, ఒక గాంధీమహాత్మునిలాగా. ఇటువంటివాళ్లు కాలాతీత వ్యక్తులు. ఈ వ్యక్తుల నేపథ్యాలు ఏవైనా కావచ్చు. వాళ్లు కృషి చేసిన రంగాలు ఏవైనా కావొచ్చు. మారుతున్న ప్రజానీకం అంతరంగాలపైన చిరస్థాయిగా నిలిచిపోతుంటారు.

ఏదో ఒక సందర్భం చూసి, ఈ సమాజం వాళ్లని గుర్తు చేసుకుంటూ ఉంటుంది. స్ఫూర్తి పొందాలనో, అనుసరించాలనో ప్రయత్నం చేస్తూ ఉంటుంది. అలా ఇప్పుడు మనం గుర్తు చేసుకుంటున్న వ్యక్తి నందమూరి తారక రామారావు - సందర్భం, శతజయంతి సమాపనోత్సవం కనుక. కృష్ణాజిల్లాలో, నిమ్మకూరు అనే చిన్న గ్రామంలో పుట్టిన ఈ చిన్నోడు ఇంత పెద్దవాడు అవుతాడని అప్పుడు ఎవరనుకున్నారు కనుక. తెలుగు వాళ్లు ఎవరైనా సరే, ఎక్కడున్నా సరే, ఆయన తెలిసి ఉండాల్సిందే. అదే ఆయన సముపార్జించుకొన్న ఘనత. బహుశః తల్లి కృష్ణ భక్తురాలు కామోసు, పిల్లవాడికి కృష్ణుడి పేరు పెట్టాలని ఉవ్విళ్లూరింది. కానీ మేనమామ ససేమిరా అన్నాడు. రాముడి పేరు పెట్టమని సలహా ఇచ్చాడు. అతని మాట నెగ్గింది కూడాను. కానీ విచిత్రమేమిటంటే ఆ చిన్నవాడు పెరిగి పెద్దయ్యాకా, రాముడు, కృష్ణుడూ కూడా తనే అయ్యాడు. వాళ్ల అమ్మకి, మేనమామకి మాత్రమే కాదు. లోకానికి కూడానూ. ఇదొక అపురూపమైన సంఘటన కదూ! చిన్నప్పటి నుంచీ నటన అంటే అనురక్తి కారణమేమో రంగస్థలంపైన, వెండితెరపైనా నటుడై రాణించాడు. విద్యావంతుడైన ఈ నటుడు, చలన చిత్రాలలో నటన కోసం, ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా తృణప్రాయంగా వదిలేశాడు. నందమూరి నాయకుడు.

కేవలం నాయక పాత్రలలోనే కాదు ప్రతినాయక పాత్రలలోనూ నటించాడు. రావణుడైనా, కీచకుడైనా ఆయనే. అశోకుడైనా చంద్రగుప్తుడైనా ఆయనే. బడిపంతులైనా, బండోడైనా ఆయనే. అసలు రాజైనా, పేదైనా కూడా ఆయనే కదా! నిజానికి ఒక్క మాటలో చెప్పాలంటే వెండితెరకు వెలుగై వ్యాపించినది ఆయనే. సాంఘికాలు, జానపదాలు, పౌరాణికాలు, చారిత్రకాలు ఇలా అన్నిరకాల నేపథ్యాలతో దాదాపు మూడు వందలకు పైగా చిత్రాలలో నటించి నందమూరి నటరత్నమై వెలిగారు.

నటునిగా సముపార్జించుకున్న అనుభవసారాన్ని పటిష్ఠమైన పునాదిగా మలచుకొని, దర్శకత్వ శాఖలో ప్రవేశించి, అక్కడ కూడా ఒక ధవళసుధాసౌధమై నిలిచినాడు. తాను ఎన్ని రకాల నేపథ్యాలు ఉన్న చిత్రాలలో

నటించారో, అన్నిరకాల నేపథ్యాలూ ఉన్న చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఏడు పౌరాణిక చిత్రాలకు, నాలుగు సాంఘిక చిత్రాలకు, నాలుగు చారిత్రక చిత్రాలకు, ఒక జానపద చిత్రానికి, మొత్తంగా పదహారు చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. అంటే దర్శకునిగా కళాసరస్వతికి ఆయన షోడశోపచార పూజ నెరిపినవాడు. 1961వ సంవత్సరంలో దర్శకత్వ ప్రస్థానం ప్రారంభించిన యన్.టి.ఆర్. 1992 వరకు ఆ ప్రయాణం సాగించారు. అంటే మూడు దశాబ్దాలకు పైబడి చలనచిత్ర వినీలాకాశంలో తన జయకేతనాలు ఎగుర వేశారు. సినిమా అన్నది ప్రధానంగా వినోదం కోసమే అయినా, ఆయనకు సమాజం పట్ల ఎంతటి శ్రద్ధ ఉన్నదో వారు దర్శకత్వం వహించిన సాంఘిక చిత్రాల ఇతివృత్తాలు గమనించినప్పుడు మనకి సుస్పష్టంగా అర్థమౌతుంది. రంగస్థలం పైకి కన్యాశుల్కం నాటకం ఎంతటి ప్రభావాన్ని చూపిందో చలనచిత్ర సీమలో వరకట్నం సినిమా అంతటి సమాంతర ప్రభావాన్ని చూపింది. వరకట్న సమస్య వల్ల ఎన్ని కుటుంబాలు చితికిపోతున్నాయో, ఎంతమంది ఆడపిల్లల జీవితాలు నలిగిపోతున్నాయో గమనించాకా ఆయన చాలా వ్యాకులత చెందారు. ఈ దురాచారాన్ని రూపుమాపడం యన్.టి.ఆర్. తన బాధ్యతగా భావించారు. అందుకే అందరిలో ఒక వివేచన కలిగించేలా ఆ చిత్రాన్ని తీశారు. అలాగే *తల్లా! పెళ్లామా!* చిత్రం ద్వారా కుటుంబ వ్యవస్థ ఛిద్రమైపోకుండా ఉండాలంటే, ప్రతి మగవాడు తన సంసారంలో ఒకవంక భార్య పట్ల, మరొకవంక తల్లి పట్ల ఎటువంటి గౌరవాన్ని చూపాలో, ఎటువంటి బాధ్యతను నిర్వర్తించాలో పోషించి మరీ చూపించారు. ఆ క్రమంలోనే వచ్చిన మరో కుటుంబ కథాచిత్రం *తాతమ్మ కల*. అలనాటి కుటుంబ వ్యవస్థకు ముఖ్యంగా ఉమ్మడి కుటుంబ జీవనానికి అద్దంపడుతుంది. ఆ రోజుల్లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చాలా అరాచకంగా సాగిన సందర్భాలు సమాజానికి తెలుసు. దుర్భరమైన ఆనాటి పరిస్థితిని గమనించిన యన్.టి.ఆర్. ఆలోచనాత్మకమైన అస్త్రాన్ని సంధించినట్లు, తాతమ్మ కల చిత్రాన్ని తీశారు. అటు తర్వాత ఆయన తీసిన కుటుంబ కథాచిత్రం చండశాసనుడు. ఈ చిత్రంలో కౌటుంబికమైన బంధాలను, బాంధవ్యాలను కరుణార్ద్రంగా ఆవిష్కరించారు. కుటుంబంలో ఏర్పడే మానసిక సంఘర్షణలను దాటి, భావోద్వేగాలను పదిలం చేసుకోవలసిన ఆవశ్యకతను వివరించారు.

దర్శకత్వ శాఖలోనికి, ఈ విశ్వవిఖ్యాత నటసార్వభౌముని ప్రవేశం, సీతారామ కళ్యాణం చిత్రంతో ప్రారంభమైంది. అయితే ఇక్కడ మనం ఒక చిన్న తమాషాను గమనించాలి. సినిమా ప్రారంభంలో అందులో నటించిన తారాగణం, పనిచేసిన సాంకేతిక నిపుణుల బృందం, ఈ అందరి పేర్లను ప్రకటించడం అంతవరకు ఉన్న పద్ధతి. అయితే *సీతారామ కళ్యాణం* చిత్రంలో యన్.టి.ఆర్. దర్శకుడిగా తన పేరును ప్రకటించుకోలేదు. పైగా చివరన దర్శకుని పేరు ప్రకటించవలసిన సందర్భంలో 'తలిదండ్రుల పాదాలకు సమర్పణం' అనే వాక్యంతో పాటు తమ్మునితో కలిసి, తమ తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న దృశ్యాన్ని చూపిస్తారు. ఇది చాలా విలక్షణంగా అనిపిస్తుంది. అలాగే *గులేబకావళి కథ* అనే చిత్రంలో కూడా పేర్లనూ చూపే క్రమంలో నిర్మాత పేరుతో ముగిస్తారు. దర్శకుని పేరు ప్రకటించిన సందర్భం లేదు. ఇక దర్శకునిగా తెరపైన తన పేరును ప్రకటించిన తొట్టతొలి సినిమా *శ్రీకృష్ణ పాండవీయం*. ఈ చిత్రం 1962 వ సం.లో విడుదలైంది. అంటే కాలగమనంలో ఈ సినిమాకి షష్ట్యబ్ది పూర్తి కూడా పూర్తైపోయింది. నందమూరి తారక రామారావు ఒక ధీమాన్యుడైన దర్శకుడని చెప్పుకోవడానికి *శ్రీకృష్ణ పాండవీయం* అనే చిత్రం ఒక ప్రబలమైన సాక్ష్యం. రామాయణ భారత భాగవతాది గ్రంథాలపైన ఆయనకు విశేషమైన మక్కువ అని మనకు తెలిసున్నదే. ఆపైన కళాశాల విద్యలో విశ్వనాథ సత్యనారాయణగారి శిష్యరికం ఈ మక్కువకు బహుశః మరింతగా పాదులు తీర్చి ఉండవచ్చు. ఈ నేపథ్యం వల్లనే ఆయనలోని దర్శకత్వ ప్రతిభ మనకు ద్యోతకమౌతుంది. 'మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాన్తాని' అనేది శాస్త్ర వచనం. యన్.టి.ఆర్. ఈ మాటను చలన చిత్రానికి కూడా అనువర్తింప చేశారు. పౌరాణిక చిత్రానికి ఆయన పరోక్షంగా కావ్యగౌరవాన్ని ఆపాదించారు. కావ్యం మంగళకరంగా ప్రారంభం కావాలని, మంగళకరమైన అంశాలను చెబుతూ ముందుకు సాగాలని, శుభప్రదమైన సంఘటనతో కావ్యం ముగించాలని, సారస్వత వ్యాకరణం చెబుతుంది. దీనిని దర్శకత్వంలోనూ ప్రవేశపెట్టి తానొక ప్రతిభాసమున్మేషిగా

నిలిచినవాడు తారక రాముడు. ఈ కారణంగా కావ్యాన్ని దృశ్యకావ్యంగా మలచిన ఘనత ఆయన ఖాతాలోకి చేరింది. ఒకటి, రెండు కీలకమైన అంశాలను మీకు జ్ఞాపకం చేస్తాను.

పాండవీయం చిత్రంలో తొలి దృశ్యంలో పాండు కుమారులు నివాసముండే ఒక వసతి గృహ అంతర్భాగం, అందునా మిద్దె మీద ఉండే భాగంలోని వసారా కనిపిస్తూ ఉంటుంది. ఆకాశం కనబడుతూ ఉండే, ఈ నిశ్చల దృశ్యంలోని శ్రీకృష్ణుడు ప్రత్యక్షమౌతాడు. అత్తా! అంటూ కుంతీదేవిని సంబోధిస్తాడు. చిత్రాన్ని వీక్షిస్తున్న ప్రేక్షకునికి, సినిమా ఆరంభంలోనే భగవద్దర్శనమయింది. అంటే మంగళాదీని. సరే, ఆ పైన కథాక్రమం మొదలౌతుంది. కొన్ని సంఘటనల అనంతరం సినిమా రుక్మిణీ కళ్యాణ ఘట్టానికి చేరుతుంది. పోతనామాత్యుడు, భాగవతంలో ఎంత రసరమ్యంగా వర్ణించి చెప్పాడో, సినిమాలో కూడా యన్.టి.ఆర్. అంత అద్భుతంగానూ రూపుదిద్దారు. నారద ప్రేరణతో కృష్ణునిపై మరులుగొన్న రుక్మిణి, అగ్నిద్యోతనుడనే విప్రవరుణ్ణి, రాయబారిగా పంపుతుంది. దర్శకుడు యన్.టి.ఆర్. రుక్మిణిలోని డోలాయమాన మనఃస్థితిని పరమాద్భుతంగా చిత్రీకరించారు. రుక్మిణీ కృష్ణులు కళ్యాణం జరుగుతుంది. ఆ కళ్యాణ దృశ్యమే చలనచిత్ర ప్రదర్శనలో విరామ సందర్భం. ఇది మంగళ మధ్యాని. ఇక చిత్ర ప్రదర్శన రెండవ భాగం ప్రారంభమై కథాగమనం, పతాకస్థాయిలో చేరే సమయానికి, ధర్మరాజు తన అనుజునులతో కలిసి రాజసూయ యాగం నిర్వహిస్తాడు. అగ్రపూజ అందించవలసిన సందర్భం. భీష్మాచార్యుని సూచనతో ధర్మరాజు, శ్రీకృష్ణునికి అగ్రపూజ అందించేందుకు ఉపక్రమిస్తాడు. అభ్యంతరాలు చెప్పిన శిశుపాలుని వధ జరుగుతుంది. యజ్ఞకుండం బీటలువారి, అగ్నిహోత్రం మధ్యస్థంగా భగవానుడి విశ్వరూప సాక్షాత్కారం జరుగుతుంది. యజ్ఞవేదిక వద్దనున్నవారు, ఇటు చలనచిత్ర ప్రదర్శనలో ప్రేక్షకులై ఉన్నవారు అందరూ విశ్వరూప సందర్శనం చేస్తారు. ఇది మంగళాన్తాని. ఇలా శ్రీకృష్ణ *పాండవీయం* చిత్రం మంగళకరంగా ప్రారంభమై మంగళకర ఘటనతో కొనసాగి, శుభప్రదమైన అంశంతో ముగుస్తుంది. ఈ చిత్రానువాదం నందమూరి తారక రాముని అసాధారణ దర్శకత్వ ప్రతిభకు అద్దం పడుతుంది. ఇక్కడ ఇంకొక విశేషాన్ని కూడా మనం మననం చేసుకోవాలి. ఈ సన్నివేశ చిత్రీకరణ దర్శక శ్రేష్ఠుని ప్రతిభకు గీటురాయి. రుక్మిణి సందేశాన్ని శ్రీకృష్ణునికి విన్నవించడానికి అగ్నిద్యోతనుడనే విప్రప్రముఖుడు ద్వారకా నగరాన్ని చేరతాడు. రుక్మిణి మరులుగొన్న విషయాన్ని భగవానుడి ముందు ఆవిష్కరిస్తాడు 'మా యుపాధ్యాయులు యాన పెండ్లియగు; దప్పదు'' అని ఒక నిశ్చయాన్ని ప్రకటిస్తాడు. ఈ సందర్భంలోనే ఒక పద్య చిత్రీకరణ, దర్శకుడైన రామారావు సృజించిన ఒక అద్భుతం. 'అంకిలి సెప్పలేదు' అన్నది పోతనగారి పద్యం. ఇక్కడ చెప్పబడుతున్నవి రుక్మిణి మాటలు కానీ, చెబుతున్నది అగ్నిద్యోతనుడు. అందుచేత ఈ పద్యంలోని మొదటి పాదం తృతీయ పురుషలోనూ, మిగిలిన మూడు పాదాలు ప్రథమ పురుషలోనూ సాగినట్టనిపిస్తోంది. ఈ కీలకాన్ని యన్.టి.ఆర్. పట్టుకున్నారు. మొదటి పాదాన్ని అగ్నిద్యోతునుడి కోసం పి.బి. శ్రీనివాస్ చేత పాడించారు. మిగిలిన మూడు పాదాలను పి. సుశీల చేత పాడించారు. తెరపైన రుక్మిణి స్వయంగా తానే విన్నవిస్తున్నట్టు చిత్రీకరించారు. అగ్నిద్యోతనుడితో ఆరంభమైన పద్యం రుక్మిణి విన్నవింపుతో ముగుస్తుంది–

***అంకిలి సెప్పలేదు; చతురంగ బలంబులతోడ నెల్లి యో***
***పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా***
***వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే***
***యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్***

చిత్రీకరణలో అగ్నిద్యోతనుడిగా ఉన్న వంగర వెంకట సుబ్బయ్యతో ప్రారంభమౌతుంది. ఓ పంకజనాభ అనేసరికి అతడు అంతర్ధానమై రుక్మిణి వేషంలో ఉన్న కె.ఆర్. విజయ ప్రత్యక్షమౌతుంది. పోతనగారి పద్యాన్ని ఇంత నిశితంగా పరిశీలించి, చిత్రీకరించిన మరో దర్శకుడు మనకి కానరాడు. పద్యాన్ని అక్షరాక్షరంగా మూర్తిమంతం చేసిన దర్శకుని ప్రతిభ అనన్య సామాన్యం. ఇది బహుధా ప్రశంసనీయం.

పాత్రల స్వభావమెరిగి, పాత్ర పోషణ చేయగలిగిన బుద్ధి కుశలత తారక రాముని సొంతం. అందుకే ఆయన నటించిన చిత్రాలన్నీ చిరస్మరణీయాలు. శ్రీకృష్ణుడి పాత్రలో దక్షిణ నాయకత్వాన్ని ప్రకటించడం, భీమసేనుడైనప్పుడు ఔద్ధత్వాన్ని ఆవిష్కరించడం. రాముని పాత్రలో మర్యాదా పురుషోత్తముపై మెలగడం, భీష్మునిగా వేషం కట్టినప్పుడు,

*మిగతాది 52వ పుటలో...*

# ఎన్.టి.ఆర్. మానస పుత్రిక
# తెలుగు విశ్వవిద్యాలయం

*- టి. గౌరీశంకర్*

ప్రపంచ పటంపై తెలుగు పతాకాన్ని రెపరెపలాడించిన మహనీయుడు, ఉత్తరాదిన 'మదరాసీలు'గా మాత్రమే గుర్తింపబడిన తెలుగు జాతిని 'తెలుగువారి'గా పరిచయంచేసి, తెలుగు అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని చాటిచెప్పిన మహానుభావుడు, తెలుగుల ఆత్మగౌరవాన్ని కాపాడి, ఇనుమడింపజేసిన మహాపురుషుడు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు. తన అసమాన నటనా కళా చాతుర్యంతో సినిమా నటునిగా శిఖరాగ్రం చేరినవాడు. అనూహ్యమైన రీతిలో రాజకీయ రంగప్రవేశం చేసి, 'తెలుగుదేశం' పేరిట ప్రాంతీయ రాజకీయ పార్టీని స్థాపించి, అఖిలాంధ్ర ప్రజల ఆదరాభిమానాలను చూరగొని, నీరాజనాలు అందుకొన్నవాడు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా తనదైన శైలిలో పరిపాలన కొనసాగించి జననేతగా ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయినవాడు.

సినిమా రంగం ఒక కన్నుగా, రాజకీయ రంగం రెండో కన్నుగా వెలుగొందిన ఆయనకు తెలుగు భాషా సంస్కృతులు మూడో కన్ను. త్రినేత్రుడయిన ఆ పరమశివుని మూడో కన్ను ఈ సృష్టిని లయింపజేయడానికి అయితే, ఈయన మూడో కన్ను జ్ఞాననేత్రం. ఆ అంతర్నేత్రంతో తెలుగు జాతి గత చరిత్రను దర్శించారు. తెలుగు భాషా సాహిత్యాలు, సంస్కృతీ సంప్రదాయాల గరిమను గమనించారు. వాటిని మహోజ్జ్వలంగా వెలిగింపజేసి, ఆ తెలుగు వెలుగులను ప్రపంచానికి పంచాలని అభిలషించారు. ఒక నూతన శకాన్ని సృష్టించాలన్నది ఆయన మహదాశయం. తెలుగంటే ఆయనకు వల్లమాలిన ప్రేమ, తెలుగు సాహిత్యమంటే ఆయనకు ఎనలేని అభిమానం, తెలుగు సంస్కృతి అంటే విపరీతమైన గౌరవాదరం. అందుకే ఆయన తన రాజకీయ పార్టీకి 'తెలుగుదేశం' అనే పేరు పెట్టారు. ఆనాటి ఆంధ్రప్రదేశ్



మొదటి చాన్స్‌లర్ - ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్

రాష్ట్రానికి 'తెలుగునాడు' అనే పేరు పెట్టాలన్న తన మనోగతాన్ని అనేక సందర్భాల్లో ప్రకటించారు కూడా. ఇంతగా తెలుగును ప్రేమించే వ్యక్తి తన కట్టు, బొట్టు, నుడికట్టుతో తెలుగుదనం ఉట్టిపడేలా ఉండేవాడు. తెలుగు భాషలోని తేనెపట్టును, తెలుగు సాహిత్యంలోని ఔన్నత్యాన్ని, తెలుగు సంస్కృతిలోని ప్రత్యేకతను, తెలుగు విజ్ఞానంలోని విశిష్టతను, తెలుగు కళలలోని వైవిధ్యాన్ని పదిలపరచాలనీ, వీటిని రానున్న తరానికి వారసత్వ సంపదగా అందించాలనీ ఆయన సంకల్పించారు. ఆ సంకల్పం నుంచి అంకురించిన ఆనాటి మొలక ఈనాడు మానుగా ఎదిగిన 'తెలుగు విశ్వవిద్యాలయం'. ఆనాడు క్షీరసాగర మథనంలో నుంచి వెలువడిన అనేక అద్భుతావహమైన వస్తువులలో దివ్యశక్తులు కలిగినవి కొన్నే. అదేవిధంగా ఎన్.టి. రామారావు మేధోమథనంలో నుంచి వచ్చిన అనేక ఆలోచనల్లో తెలుగు విశ్వవిద్యాలయ స్థాపన అన్నది ఒకటి. అందుకే దీనిని ఎన్.టి.ఆర్. మానస పుత్రికగా అభివర్ణించారు విజ్ఞులు. తెలుగు భాషాసాహిత్య సంస్కృతులలో, కళా విజ్ఞాన రంగాలలో బోధన, పరిశోధన, ప్రచురణ మొదలైనవి ఉదాత్త స్థాయిలో కొనసాగించడానికి కార్యక్షేత్రంగా ఒక ఉన్నత విద్యాసంస్థ ఆవశ్యకతను ఆయన స్వప్నించారు. ఆ కలల సాకారమే 'తెలుగు విశ్వవిద్యాలయం'. దీనిని ఎంతో మహోన్నతంగా దిద్దితీర్చాలని ఆయన ఆకాంక్షించారు. ఆనాడు ఆయన నాటిన బీజమే ఈనాటి 'తెలుగు విశ్వవిద్యాలయం' అనే ఈ భూజము.

1981లో ఎన్.టి. ఆర్. నిర్మాణ దర్శకత్వంలో వచ్చిన 'వీరబ్రహ్మేంద్ర స్వామి' సినిమా ద్వారా ఆయనకు ఎదురైన కొన్ని చేదు అనుభవాలు ఆయన రాజకీయ జీవితానికి నాంది పలికాయి. తత్పర్యవసానంగా 1982 మార్చి 29వ

తేదీన ఆయన 'తెలుగుదేశం' పేరుతో ఒక రాజకీయ పార్టీని స్థాపించారు. తదాదిగా ఆయన తెలుగునాట అలుపెరుగని యోధునిలా అవిశ్రాంతంగా పర్యటించి, ప్రజలందరినీ సమ్మోహితుల్ని చేశారు. దాని ఫలితంగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, అసాధారణ రీతిలో గెలుపొందారు. 1983 జనవరి 9వ తేదీన ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 1983 నుంచి 1989 వరకు ఆయన పూర్తిస్థాయి ముఖ్యమంత్రిగా కొనసాగారు. అయితే మధ్యలో 1984లో తెలుగుదేశం పార్టీలోని నాదెండ్ల భాస్కరరావు తిరుగుబాటు చేసి నెల రోజుల పైచిలుకు ముఖ్యమంత్రిగా పనిచేయడం ఒక చిన్న చీకటి అధ్యాయం. తిరిగి రామారావు మళ్ళీ ముఖ్యమంత్రి పదవి పగ్గాలు చేపట్టి 1989 దాకా పూర్తిస్థాయి ముఖ్యమంత్రిగా పనిచేశారు. తిరిగి రెండవసారి అంటే 1994 నుంచి 1995 వరకు ఎన్.టి. రామారావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పాలన కొనసాగించారు.

ఎన్.టి.రామారావు 1983లో రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాగానే రాష్ట్రంలోని కళాకారులంతా సంతోషించారు. సంబరాలు జరుపుకొన్నారు. మా కళాకారుల కుటుంబానికి చెందిన ఒక కళాకారుడు తొలిసారిగా రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం మాకు గర్వంగా ఉందని చెప్పుకొన్నారు. కానీ రామారావు రాష్ట్రంలోని సంగీత, నాటక, సాహిత్య అకాడమీలను రద్దు చేసేటప్పటికీ అదే కళాకారులు ఆయనను నిందించారు. ఆవేదనతో రగిలిపోయారు. ఆనాటి సంగీత అకాడమీ ఛైర్మన్‌గా ఉన్న మంగళంపల్లి బాలమురళీకృష్ణ ''ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అడుగు పెట్టను, కచేరీలే చేయను" అని ప్రతిజ్ఞ చేశారు. పూర్వం నుంచి రాష్ట్రంలో తెలుగు సాహిత్యానికి సంబంధించి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ, కళలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ నృత్య అకాడమీలు చాలా ఏళ్ళుగా పనిచేస్తున్నాయి. మొదటి ప్రపంచ తెలుగు మహాసభల తీర్మానం మేరకు ఏర్పడిన అంతర్జాతీయ తెలుగు సంస్థ, ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలలో స్థిరపడిన తెలుగువారికి భాషాసాంస్కృతిక సేవలు అందించడానికి పనిచేస్తోంది. 1957లో మద్రాసులో ఏర్పాటై, తెలుగు జాతి చరిత్ర, సంస్కృతి మొదలైనవాటిపై అధ్యయన, పరిశోధనలు జరిపి తెలుగులో విజ్ఞాన సర్వస్వాలు రూపొందించి, ముద్రిస్తూ వస్తున్న 'తెలుగు భాషాసమితి' ఉంది. పైన పేర్కొన్న వాటిల్లో అంతర్జాతీయ 'తెలుగు సంస్థ', 'తెలుగు భాషా సమితి' మినహా మిగతా అకాడమీలన్నీ రవీంద్రభారతి ఆవరణలోని 'కళాభవన్' భవన సముదాయంలో పనిచేస్తూ ఉండేవి. 'తెలుగు భాషా సమితి' ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని ఆంధ్ర మహిళా సభ కాలేజీ పక్కనున్న భవనంలో ఉండేది. ఆ భవనానికి పక్కన ఉన్న స్థలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంవారితో కుదుర్చుకొన్న ఒప్పందం మేరకు ప్రభుత్వ నిధులతో 'తెలుగు భవనం' పేరుతో కట్టుకొన్న సొంత భవనంలో 'అంతర్జాతీయ తెలుగు సంస్థ' పనిచేస్తుండేది. అంతకు పూర్వం ఈ సంస్థ 'బర్కత్‌పుర'లోని అద్దె భవనంలో ఉండేది.

ఈ అకాడమీల పనితీరుపై ఆయనకు అందిన సమాచారం మేరకు వాటిని అధ్యయనం చేయాలనుకొని నార్ల వెంకటేశ్వరరావుతో ఏకసభ్య సంఘాన్ని నియమించారు. నార్ల సంఘం అకాడమీల తీరుతెన్నులను పరిశీలించి అకాడమీల రద్దుకు సిఫారసు చేస్తూ నివేదికను సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగానే ఎన్.టి. రామారావు అకాడమీలను రద్దు చేశారు. కళాకారుల నుంచి వ్యతిరేకత రావడంతో ఇటు రామారావు, అటు నార్ల వెంకటేశ్వరరావు విచికిత్సలతో పడ్డారు. ఆనాడు సమాచార, సాంస్కృతిక శాఖ కమీషనర్, కార్యదర్శిగా పనిచేస్తున్న ఐ.ఏ.ఎస్. అధికారి పి.వి.ఆర్.కె. ప్రసాద్‌ను సంప్రదించారు. దానితో 'కళాపీఠం' అని ఒక పీఠాన్ని నెలకొల్పి ఈ కార్యక్రమాలన్నీ దాని ద్వారా నిర్వహించాలనుకున్నారు.

మన దేశంలో నానాటికీ ఆవిష్కృతమవుతున్న అధునాతన శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలోని నూతన పరిశోధనలకనుగుణమైన విద్యావిధానం ఈ తరానికి అందించి, వారిని రానున్న కాలంలోని సవాళ్ళను ఎదుర్కోవడానికి సమాయత్తపరిచే విశ్వవిద్యాలయాలు అనేకం అవతరించాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో మన భారత దేశాన్ని అగ్ర దేశాల సరసన సమస్థాయిలో నిలబెట్టాలనీ, అగ్రగామిగా పురోగమింపజేయాలనీ మన దేశంలోని విద్యావ్యవస్థ వివిధ రకాల కొత్త కోర్సులను రూపొందించి కసరత్తు చేస్తోంది. అయితే ఇవన్నీ స్వీయ

భాషా సంస్కృతుల అధ్యయన పరిశోధనలకు భిన్నమైనవి. ఇవి నాణేనికి ఒకవైపు మాత్రమే. అయితే, ఎన్టీఆర్ మరొకవైపు దృష్టి సారించారు.

బహుభాషా సంస్కృతుల సమ్మిళితమైన మన దేశంలో ఎవరికి వారు తమతమ మాతృభాషా సంస్కృతులను కాపాడుకొంటూనే విజ్ఞాన సముపార్జనకు అవసరమైన విదేశీ భాషలను కూడా అభ్యసిస్తూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాలి. ఆ క్రమంలోనే మన తెలుగు జాతి కూడా సుమారు మూడువేల సంవత్సరాల చరిత్ర కలిగిన తన ఉనికిని, దాదాపు రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు భాషను, రమారమి ఒక్క వేయి సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యాన్ని కాపాడు కోవలసిన బాధ్యత ఉంది. అందుకు వీటి మూలాలలోకి వెళ్ళి, లోతైన అధ్యయన, అధ్యాపనలు చేయవలసి ఉందని ఎన్.టి. ఆర్. గుర్తించారు. ప్రపంచ భాషా సాహిత్యాలకు ధీటుగా దీనిని పరిపుష్టం చేయాలని భావించారు. అందుకు ఒక నిర్మాణాత్మకమైన ప్రాతిపదికపై ఒక సువిశాలమైన, సుస్థిరమైన వేదికను కల్పించాలని అనుకొన్నారు. మన దేశంలో భాషాపరమైన సంప్రదాయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ముఖ్యంగా దక్షిణాదిన తమిళనాడులోని తంజావూరులో 'తమిళ విశ్వవిద్యాలయం' అప్పటికే ఏర్పడి పనిచేస్తోంది. అనంతర కాలంలో కర్ణాటకలోని హంపిలో 'కన్నడ విశ్వవిద్యాలయం' నెలకొన్నది.

'తెలుగు విజ్ఞాన పీఠం' తెలుగు భాషా సాహిత్య, సంస్కృతుల సర్వతోముఖ వికాసానికి వాటిల్లో అధ్యయన, అధ్యాపనలు కొనసాగాలనీ, బోధన, పరిశోధన, ప్రచురణ లక్ష్యాలుగా ఏర్పడినప్పటికీ ఒక విశ్వవిద్యాలయ స్థాయిని పొందడానికి ఆనాటి లోకాయుక్త జస్టిస్ ఆవుల సాంబశివరావు నేతృత్వంలో ఒక కమిటీని ప్రభుత్వం నియమించింది. దీనిలో నాగార్జున విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ రాజారామ్మోహన్‌రాయ్, ప్రొఫెసర్ జి. రామిరెడ్డి, ప్రొఫెసర్ టి. వాసుదేవ్, ప్రొఫెసర్ భద్రిరాజు కృష్ణమూర్తి మొదలైన విద్యావేత్తలు, ఆచార్యవర్యులు, మేధావులు తమ తమ సూచనలు, సలహాలను అందించారు. ఆ మేరకు పైన తెలిపిన భాషావిశ్వవిద్యాలయాల స్థాయిలో తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించాలని భావిస్తూ 'తెలుగు విజ్ఞాన పీఠాన్ని' 'తెలుగు విశ్వవిద్యాలయం'గా చట్టపరంగా తీసుకొని వచ్చింది. 1985 సెప్టెంబర్‌లో రూపొందించబడిన తెలుగు విశ్వవిద్యాలయం చట్టం ఇంగ్లీషులో తయారు చేయడం జరిగింది. ఇది ఆంధ్రప్రదేశ రాష్ట్ర శాసనసభలో ప్రవేశ పెట్టబడి ఆమోదం పొందవలసి ఉంది. కానీ తెలుగు భాషా ప్రేమికుడు, తెలుగు భాషాభిమాని అయిన నందమూరి తారక రామారావు ఇంగ్లీషులో ఉన్న ఈ చట్టాన్ని తెలుగు భాషలోకి మార్చి శాసనసభలో ప్రవేశపెట్టాలని ఆదేశించారు. అయితే మర్నాడు జరిగే శాసనసభలో ప్రవేశపెట్టనున్న ఈ బిల్లును ఆంగ్లం నుంచి తెలుగులోకి మార్చాలన్న ఆదేశం ముందు రోజు సాయంత్రం అందింది. ప్రత్యేకాధికారిగా ఉన్న ఆచార్య తూమాటి దొణప్ప అంతర్జాతీయ తెలుగు సంస్థలో డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ముదిగొండ వీరభద్ర శాస్త్రిని, ఈ వ్యాసకర్త అయిన నన్ను పిలిచి తెల్లవారేలోగా దీనిని తెలుగులోకి మార్చి శాసనసభకు అందించాలని కోరారు. అప్పుడు శాస్త్రిగారు, నేను హుటాహుటిన చంచల్‌గూడ ప్రభుత్వ ముద్రణాలయానికి వెళ్ళి ఆ రోజు తెల్లవార్లూ అక్కడే కూర్చొన్ని ఉదయానికల్లా ఆ పని పూర్తి చేశాం. శాస్త్రిగారు తెలుగులోకి అనువదించి చెపుతూ ఉంటే నేను తెలుగు షార్ట్‌హాండ్ తెలిసినవాణ్ణి గనక చకచకా రాసి, అక్కడి ముద్రణాలయంలోని వారికి ఇవ్వడం, వారు కంపోజింగ్ చేసి, ప్రూఫ్‌లు ఇవ్వడం, వాటిని సరిదిద్దడం అలా జరిగిపోయింది. ఆ రోజుల్లో లెటర్ ప్రెస్ మాత్రమే ఉండేది. ఇంకా ఆఫ్‌సెట్ ప్రింటింగ్ విరివిగా రాలేదు. అందునా అది ప్రభుత్వ ముద్రణాలయం. ఇది ప్రభుత్వ ఆదేశంతో కూడిన పని అయినందువల్ల, ఉన్నతాధికారుల ఉత్తర్వులు ఉన్నందువల్ల అక్కడి సిబ్బంది యావన్మంది పూర్తిగా సహకరించారు. వారి సహకారంవల్ల, మా వేగంవల్ల సుమారు ఇరవై, ముప్పయి పుటలతో కూడిన తెలుగు విశ్వవిద్యాలయం చట్టం ఆంగ్లంలో నుంచి తెలుగులోకి ముస్తాబయింది. 1/8 డెమ్మీ సైజులో పుస్తక రూపంలో పిన్నింగ్‌తో కావలసిన ప్రతులు తయారయ్యాయి. అప్పుడు తెల్లవారు ఝామున నాలుగైదు గంటలు కావస్తోంది. ఉదయం 8.00 గంటలకు దానిని అసెంబ్లీలో అందజేయాలి. ఆ రోజు జరిగే సమావేశంలో ఆనాటి విద్యాశాఖామంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు దీనిని ప్రవేశపెడతారు. కాబట్టి ఆఘమేఘాల మీద దానిని అక్కడి వారికి అందజేయడం, సభలో చట్టం ప్రవేశపెట్టడం, శాసనసభ ఆమోదం పొందడం అన్నీ జరిగిపోయాయి.

ఈ పనిలో ఆనాటి అంతర్జాతీయ తెలుగు సంస్థలోని గుమాస్తా స్థాయి, అటెండర్ స్థాయి సిబ్బంది బాగా తోడ్పాటును అందించారు.

ఆ విధంగా శాసన సభలో చట్టపరంగా ఆమోదం పొందిన తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భావాన్ని G.O. Ms No. 494, Education (UE), 27th November, 1985, ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ప్రకటించడమైనది. అయితే ఇది 1985 డిసెంబర్ 2వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని ఆ ఉత్తర్వులో పేర్కొనడమైనది. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ చట్టం ద్వారా తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పడింది. 1985 చట్టం నెంబర్ 27 ద్వారా ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్-ఛాన్స్‌లర్‌ను నియమించవలసిన ఆగత్యం వచ్చింది. అంతకు పూర్వమే ప్రభుత్వం 1984లో స్థాపించిన 'తెలుగు విజ్ఞాన పీఠాన్ని' తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనం చేయడంతో తెలుగు విజ్ఞాన పీఠానికి ప్రత్యేకాధికారిగా కొనసాగుతున్న ఆచార్య తూమాటి దొణప్పనే తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్-ఛాన్స్‌లర్‌గా ప్రభుత్వం నియమించింది. దానితో 1986 జనవరి 8వ తేదీన ఆచార్య తూమాటి దొణప్ప తెలుగు విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ పదవిలో, ఆయన మూడేళ్ళపాటు అంటే 1989 జూన్ 20వ తేదీవరకు కొనసాగారు.

తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు విజ్ఞాన పీఠం విలీనం కావడంతో అంతకు పూర్వం ఈ పీఠంలో విలీనమైన అకాడమీలు, సంస్థలు అన్నీ విశ్వవిద్యాలయంలో కలిసిపోయాయి. ఆయా అకాడమీలు, సంస్థలకు సంబంధించిన స్థిరచరాస్తులు విశ్వవిద్యాలయానికి సంక్రమించాయి. సిబ్బంది యావన్మంది విశ్వవిద్యాలయంలో విలీనమయ్యారు. తెలుగు విజ్ఞాన పీఠం ఏర్పడినప్పుడు అది అంతర్జాతీయ తెలుగు సంస్థకు సంబంధించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలోని 'తెలుగు భవనం'లోనే పనిచేస్తూ ఉండేది. అటు అకాడమీల కళాభవన్‌లోని సిబ్బందితో, ఇటు అంతర్జాతీయ తెలుగు సంస్థ సిబ్బందితో తెలుగు విజ్ఞాన పీఠం కొంతకాలం పాటు తన కార్యకలాపాలను నిర్వహిస్తూ వచ్చింది. తనలో విలీనమైన అకాడమీలు, సంస్థల పూర్వపు కార్యక్రమాలను యథాతథంగా కొనసాగించాలన్న నియమం మేరకు ఈ కింది కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చింది: గ్రంథ పరిష్కరణ, గ్రంథ ప్రచురణ, రచయితల గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయం, నిఘంటువులు, పదకోశాల నిర్మాణం, పురస్కారాల ప్రదానం, తెలుగు మహనీయులపై స్మారకోపన్యాసాలు, శతజయంతులు, సదస్సులు, రచయితల సభలు, తెలుగులో విజ్ఞాన సర్వస్వాలు బ్రిటానికా, అమెరికా నా స్థాయిలో తయారు చేయించడం, కళోత్సవాలు, సంగీత, నృత్య, నాటక పోటీలు, కళా ప్రదర్శనలు, చిత్రలేఖనం, శిల్పకళా వర్క్‌షాప్‌లు, రాష్ట్రేతర తెలుగు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణా శిబిరాలు, తెలుగు పాఠ్య పుస్తకాల నిర్మాణం, అనువాదం, అక్కడి పాఠశాలకు, సాంస్కృతిక సంస్థలకు ఆర్థిక సహాయం, భవన నిర్మాణానికి గ్రాంట్లు మంజూరు చేయడం, రాష్ట్రేతర, విదేశాలలోని తెలుగు పిల్లలు మన రాష్ట్రంలో చదువుకోవడానికి వీలుగా ఆయా వృత్తి విద్య కోర్సులలో ప్రత్యేక కోటా కింద సీట్ల కేటాయింపు, ఇతర రాష్ట్రాలలోని ఉన్నత విద్యాసంస్థలు, విశ్వ విద్యాలయాలలో తెలుగులో అధ్యయన, అధ్యాపన, పరిశోధనలు జరగడానికి వీలుగా అక్కడ తెలుగు పీఠాలు నెలకొల్పడం, అక్కడి తెలుగు సంస్థల వార్షికోత్సవాలు, తెలుగు పర్వదినాలు, ప్రత్యేక సందర్భాలలో ఇక్కడి నుంచి తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక, కళా బృందాలను అక్కడికి పంపి కళా ప్రదర్శనలను ఏర్పాటు చేయడం, బయటి రాష్ట్రాల్లోని తెలుగు మహనీయుల పేరిట లఘు గ్రంథాలు రచింపజేసి, ముద్రింపించడం, తెలుగు సృజనాత్మక ప్రక్రియలలో పోటీలు నిర్వహించి రాష్ట్రేతరాంధ్రులలో తెలుగు భాషాభిమానాన్ని పెంపొందింపజేయడం, హైదరాబాదులోని ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే తెలుగేతర ఉద్యోగులకు తెలుగు నేర్పించే కోర్సు నడపడం, తెలుగు మహాసభలు నిర్వహించడం, కళాకారులకు, కళాబృందాలకు రైల్వే కన్సెషన్లు ఇప్పించడం. వీటితోపాటు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సహకారంతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ, సమాచార, పౌర సంబంధాల శాఖ సమన్వయంతో 'తెలుగు విజ్ఞాన పీఠం' ఉగాది ఉత్సవాలను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణోత్సవాలను రవీంద్రభారతిలో కిటకిటలాడే ప్రేక్షకుల నడుమ అత్యంత వైభవోపేతంగా నిర్వహించేది. ఈ సందర్భంగా ఆయా రంగాలలోని ప్రముఖుల్ని ఎంపిక చేసి సత్కరించేది. ఆనాటి ఆంధ్రప్రదేశ్ ఆంధ్ర, తెలంగాణ,

రాయలసీమ - మూడు ప్రాంతాలతో కూడి ఉండేది. తెలుగు విశ్వవిద్యాలయం యావత్ తెలుగు జాతి ప్రజల కోసం ఏర్పాటు చేయబడింది. అందువల్ల తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన ప్రాంగణం హైదరాబాదులో ఉన్నప్పటికీ కోస్తాంధ్ర, రాయలసీమలో కూడా ప్రాంగణాలను నెలకొల్పి, అక్కడి వారికి సేవలను అందించాలని ప్రభుత్వం భావించింది. ఆ మేరకు ఒక ఉత్తర్వును జారీ చేసింది. G.O, Ms. No. 11, Education (UE), 7th January, 1986 ద్వారా ప్రధాన ప్రాంగణం హైదరాబాదులో, రాయలసీమకుగాను కర్నూలు జిల్లాలోని శ్రీశైలంలో, ఆంధ్రా ప్రాంతానికిగాను తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణాలు నెలకొల్పాలని పై ఉత్తర్వులో పేర్కొంది.

ఆ మేరకు ప్రభుత్వ స్థాయిలో చర్యలు చేపట్టి, ఇతర ప్రభుత్వశాఖల సహకారంతో శ్రీశైలంలో దేవస్థానానికి సమీపంలో, రాజమండ్రిలో బొమ్మూరు ప్రాంతంలో విశ్వవిద్యాలయ ప్రాంగణాల భవన సముదాయ నిర్మాణానికి కావలసిన ఎకరాల్లో స్థలం సేకరించడం జరిగింది. ఇక హైదరాబాదు ప్రాంగాణానికి 'తెలుగు భవనం', 'కళాభవనం' చాలదనే దృష్టితో పబ్లిక్ గార్డెన్స్‌లోని సరూబాగ్ (ప్రస్తుతం ఉన్న)లో భవన నిర్మాణం చేయాలని భావించింది. వాస్తవానికి సరూబాగ్‌లో 'తరతరాల తెలుగు జాతి' పేరుతో బృహత్తరమైన సంగ్రహాలయం (మ్యూజియం) నిర్మించాలన్న ప్రతిపాదన 1975లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభల కాలం నుంచే నలుగుతున్న విషయం. చివరికి అది ఇట్లా పరిణమించింది. పైన తెలిపిన 1986 జనవరి 7వ తేదీ నాటి ఉత్తర్వు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు 1986 ఏప్రిల్ 10వ తేది ఉగాది పర్వదినంనాడు శ్రీశైలం ప్రాంగణానికి శంకుస్థాపన చేశారు. ఆనాడు తెల్లవారు ఝామునే అక్కడ శంకుస్థాపన చేసి, ఉదయం 9.00 గంటలకు రవీంద్రభారతిలో జరిగే ఉగాది ఉత్సవాలకు హెలికాప్టర్‌లో తిరిగి వచ్చి, సకాలంలో ఉగాది కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇది ఆయనకు తెలుగు భాషా సంస్కృతుల పట్ల ఉన్న ప్రేమాభిమానాలకేగాక ఆయనలోని చిత్తశుద్ధి, నిబద్ధత, పట్టుదల, సమయపాలన, సంకల్పబలం మొదలైన విశిష్ట గుణాలకు ప్రతీక. అదే విధంగా మరో వారం రోజులలో అంటే 1986 ఏప్రిల్ 13వ తేదీ శ్రీరామనవమినాడు రాజమండ్రిలోని బొమ్మూరు



గవర్నర్‌ను ఆహ్వానిస్తూ చాన్స్‌లర్

ప్రాంగణానికి ఎన్.టి. రామారావు విచ్చేసి శంకుస్థాపన చేశారు. అయితే ఈ ప్రాంగణాలకు కేటాయించిన స్థలాలు ఆనాడు నిర్మానుష్య ప్రదేశంలో ముళ్ళకంపలు, దిబ్బలు, ఎగుడు దిగుళ్ళతో అస్తవ్యస్తంగా ఉండేవి. అయితే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చి స్వయంగా శంకుస్థాపన చేస్తుండడంతో ఆ ప్రాంతాలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి. ప్రభుత్వ యంత్రాగం యావత్తు దిగి పనులు మొదలుపెట్టాయి. అందులో ప్రధాన పాత్ర తెలుగు విశ్వవిద్యాలయానిది కాబట్టి పనిభారం అధికంగా విశ్వవిద్యాలయం సిబ్బందిపై పడింది.

అయితే అప్పుడే పురుడు పోసుకొని కన్ను విప్పుతున్న తెలుగు విశ్వవిద్యాలయంలో కొత్తగా బోధన, బోధనేతర ఉద్యోగాల భర్తీ కాలేదు, ఇంకా నియామకాలు జరగలేదు. పోస్టుల మంజూరీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం, ఇతర విశ్వవిద్యాలయాల నుంచి కొందరు ఆచార్యులను డెప్యుటేషన్‌పై తీసుకోవడం, తెలుగు భాష సాహిత్యం, సంస్కృతి, కళలు మొదలైన అంశాలలో బోధన, పరిశోధనలు కొనసాగించడానికి వీలుగా కొత్త కోర్సుల రూపకల్పన, పాఠ్యప్రణాళికల తయారీ మొదలైనవి చేపట్టడం, ఇందుకు సంబంధించి ఆయా రంగాలలో నిష్ణాతులను సంప్రదించడం, ప్రముఖులతో కమిటీలు వేయడంవంటి పనులు ముమ్మరంగా జరుగుతున్న కాలమది. కాబట్టి పనులు చేయడానికి అప్పటికి అక్కడ ఉన్నది కేవలం అకాడమిలు, సంస్థలు విలీనం కావడం ద్వారా వచ్చిన సిబ్బంది మాత్రమే. అయితే వీటిల్లో అంతర్జాతీయ తెలుగు సంస్థ మౌలికంగా పూర్వం నుంచి విద్యాత్మక కార్యక్రమాలు, కోర్సులు, బోధన కొనసాగిస్తున్నందువల్ల అక్కడి సిబ్బందిలో కొందరు

అకడమిక్ సిబ్బంది ప్రొఫెసర్, లెక్చరర్ స్థాయివాళ్ళు ఉన్నారు. మిగతావాళ్ళు పరిపాలనాపరమైన సిబ్బంది. కాబట్టి ఆనాటి కార్యక్రమాల నిర్వహణలో అటు అకాడమీల సిబ్బంది, ఇటు సంస్థల సిబ్బందే ముమ్మరంగా పాల్గొని పనులు చేసేది. ఆ విధంగా శ్రీశైల ప్రాంగణం, రాజమండ్రి ప్రాంగణం శంకుస్థాపన సందర్భంలో ఈ సిబ్బంది అహోరాత్రులు నిర్విరామంగా శ్రమించడం జరిగింది. రాజమండ్రి ప్రాంగణానికి అస్తవ్యస్తంగా, అడ్డదిడ్డంగా, ఎగుడు దిగుళ్ళలో, రాళ్ళురప్పలతో, పిచ్చిమొక్కలతో, ముళ్ళకంపలతో కీకారణ్యంలా ఉన్న స్థలాన్ని చదునుగా, సమతలంగా, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా తయారు చేయడానికి స్థానిక రాజకీయ నాయకులు, పురప్రముఖుల సహకారంతో, వ్యవధి తక్కువగా ఉన్నందువల్ల రాత్రింబవళ్ళు కూలీలనుపెట్టి పనిచేయించవలసి వచ్చింది. ఎంతగా పనివాళ్ళు చేసినా పైన అధికారులు, ఉద్యోగుల పర్యవేక్షణ ఒకటి ఉండాలి కదా! ఏదైనా లోపం జరిగి లోటుపాట్లు కలిగితే జవాబుదారీతనం వీరిదే కదా! అందువల్ల తెల్లవారితే శంకుస్థాపన అనగా ముందు రోజు రాత్రంతా తెల్లవారుఝాము దాకా మేము కంటిమీద కునుకు లేక ఉండి పనులు పురమాయించడం జరిగింది. ఈ సందర్భం, నన్నయ భారతంలోని 'కుమారాస్త్ర విద్యా సందర్శన' ఘట్టంలోని ఒక సన్నివేశాన్ని స్ఫురణకు తెస్తుంది. కౌరవ పాండవులు ద్రోణుని వద్ద సకల అస్త్ర శస్త్ర శాస్త్ర విద్యలు అభ్యసించిన అనంతరం, వారు నేర్చిన విద్యా నైపుణ్యాన్ని ధృతరాష్ట్రాది రాజ ప్రముఖులు, అంతఃపుర కాంతలు, పౌరజనం ఎదుట ప్రదర్శింప చేయాలని ద్రోణుడు భావిస్తాడు. అందుకు ధృతరాష్ట్రుడు అనుమతిస్తాడు. విశాలమైన మైదానంలో వేదికకు ఏర్పాట్లు జరుగుతుంటాయి. కీకారణ్యంలాంటి ఆ ప్రదేశాన్ని సుందరమైన సువిశాల వేదికగా మలిచే సందర్భంలో నన్నయ ఆదిపర్వంలోని, షష్ఠాశ్వాసం ప్రారంభ వచనంలో ఇలా వర్ణిస్తాడు –

*"... ... ... నపాకృత వృక్షగుల్మ వల్మీక వల్లీకంబును నంగీకృత పూర్వోత్తర ప్లవంబును సమీకృత నిమ్నోన్నత ప్రదేశంబును దూరీకృత కంటక పాషాణ శల్య శకలంబును విరజీ కృత రజో ధూసర స్థలంబును విరచిత బహు విధ ప్రేక్షాగారాంచిత మణిమయ ప్రపంచంబును నానా ధ్వజనవ పల్లవ రంభాస్తంభ తోరణ చందన మాలా లంకృత ద్వార దేశంబును బ్రతి దిశ నిర్వర్తిత శాంతికబలి విధానంబునుంగాఁ జేయించినన్..."*

ఈ రకంగా శ్రీశైలం, రాజమండ్రి ప్రాంగణాలు ప్రాణంపోసుకొన్నాయి. అయితే హైదరాబాదులోని ప్రధాన ప్రాంగణం పనిచేసే కళాభవన్, తెలుగు భవనం ఒక విశ్వవిద్యాలయం అవసరాలను తీర్చేటంత విశాలమైనవి, విస్తృతమైనవి కావు. దానికి కొన్ని ఎకరాల స్థలం కావాలి. ప్రభుత్వం ఆలోచనలో పడింది. కానీ దానికి సమయం పడుతుంది. కానీ వెంటనే విశ్వవిద్యాలయానికి తరగతి గదుల భవనం, గ్రంథాలయ భవనం, పరిపాలనా భవనం, విద్యార్థుల వసతి గృహం, బోధనా సిబ్బందికి గదులు, ప్రచురణల విక్రయాల గదులు – ఇలా చాలా అవసరాలకు భవన సముదాయాలు కావాలి. విశ్వవిద్యాలయంలో పీఠాలు, కేంద్రాలు, శాఖలు ప్రయోగశాలలువంటివి రూపుదిద్దుకొంటున్నాయి. కొత్త కోర్సులు ప్రారంభమయ్యాయి. కొత్తగా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు జరుగుతున్నాయి. తరగతులు నడపడానికి గదులు లేనందువల్ల ఆనాడు బొగ్గులకుంటలోని ఆనాటి ఆంధ్ర సారస్వత పరిషత్తు ఈనాటి తెలంగాణ సారస్వత పరిషత్తులో కొన్ని గదులు అద్దెకు తీసుకొని మొదటి బ్యాచ్ తరగతులు ప్రారంభించడమయింది. ఆ తరువాత పద్మారావునగర్‌లోని ఒక భవనం అద్దెకు తీసుకొని కొంతకాలం తరగతులు నడపడమయింది. ఈ నేపథ్యంలో అసలు తెలుగు భవన ప్రాంగణంలోనే, తెలుగు భాషాసమితి పూర్వపు కార్యాలయ భవనం ఉన్నప్పటికీ ఇంకా కట్టుకోవడానికి చాలినంత ఖాళీ స్థలం ఉండడంవల్ల అందులోనే ఒకటి ప్లస్ ఆరు అంతస్థుల భవనాన్ని కట్టాలని భావించారు. అందుకుగాను 1986 అక్టోబర్ 15వ తేదీన ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు తెలుగు భవన ప్రాంగణంలోకి విచ్చేసి అక్కడ ఆరు అంతస్థుల భవనానికి శంకుస్థాపన చేశారు. ఆనాడు సెక్రటేరియట్ దగ్గర నీలం సంజీవరెడ్డి తెలుగు విజ్ఞాన పీఠానికి వేసిన శంకుస్థాపన ఫలకానికి పట్టిన దుస్థితే, ఈ శంకుస్థాపన ఫలకానికి పట్టింది. పొయ్యిలో పిల్లి లేవలేదు అన్నట్లు ఇక్కడ ఆరు అంతస్థుల భవనమూ లేవలేదు. చివరికి పబ్లిక్ గార్డెన్స్‌లోని సరుబాగ్‌లో 'తరతరాల తెలుగుజాతి సంగ్రహాలయా'నికి, అనుకొన్న స్థలంలో ప్రస్తుతం ఉన్న 'లలిత కళాక్షేత్రం' భవనం నిర్మించబడింది. ఈలోగా ప్రభుత్వం మారింది.

ముఖ్యమంత్రులు మారారు. పరిస్థితులే మారిపోయాయి. ప్రభుత్వ వ్యవస్థలో కనిపించే పెద్ద లోపం ఒక రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులను, మరో రాజకీయ పార్టీ అధికారంలోకి రాగానే వాటిపట్ల అంత శ్రద్ధ పెట్టకపోవడం, తమదైన స్వీయముద్రను వేసి పూర్వపు అడుగు జాడలను తుడిచేయడం ఈనాడు అంతటా కనిపించేదే.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చట్టపరంగా 1985 డిసెంబర్ 2వ తేదీన ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్-ఛాన్సలర్‌గా ఆచార్య తూమాటి దొణప్ప 1986 జనవరి 8వ తేదీన పదవీ బాధ్యతలు చేపట్టి మూడేళ్ళపాటు అంటే 1989 జూన్ 20వ తేదీవరకు కొనసాగారు. ఆ తరువాత 1989 జూన్ 21వ తేదీ నుంచి 1992 నవంబర్ 4వ తేదీదాకా అంటే మూడేళ్ళపాటు డాక్టర్ సి. నారాయణరెడ్డి రెండవ వైస్-ఛాన్సలర్‌గా నియమితులై కొనసాగారు.

ఎన్.టి. రామారావు తెలుగు భాషాభిమానం ఎంతటి తీవ్ర స్థాయిలో ఉండేదో అనడానికి ఆయన వైస్-ఛాన్సలర్, రిజిస్ట్రార్ అనే పదవుల పేర్లను తెలుగులోకి మార్చారు. వైస్-ఛాన్సలర్ అంటే కులపతి అనీ, రిజిస్ట్రార్ అంటే కుల సచివులు అనీ వ్యవహరించేవారు. సాధారణంగా దేశంలోని విశ్వవిద్యాలయాలకు ఆయా రాష్ట్రాల గవర్నర్లు ఛాన్సలర్‌గా ఉంటారు. వారి ద్వారా ఎన్నుకోబడే సీనియర్ ప్రొఫెసర్లు వైస్-ఛాన్సలర్లుగా నియమింపబడతారు. కానీ తెలుగు విశ్వవిద్యాలయానికి ఆనాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్.టి. రామారావు తానే ఛాన్సలర్‌గా ప్రకటించుకొన్నారు. ఛాన్సలర్ హోదాలో 1989లో ఆయన తెలుగు విశ్వవిద్యాలయం మొట్టమొదటి స్నాతకోత్సవాన్ని (Convocation) జరిపించారు. అప్పటికి డా. సి. నారాయణరెడ్డి రెండవ వైస్-ఛాన్సలర్‌గా ఉన్నారు. ఎన్.టి. రామారావు ఛాన్సలర్‌గా, డాక్టర్ సి. నారాయణరెడ్డి వైస్-ఛాన్సలర్‌గా జరిగిన తెలుగు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం 'నభూతో-న భవిష్యతి'. ఎందుకు ఈ మాట అనవలసి వచ్చిందంటే, సామాన్యంగా విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాలు బ్రిటీష్ కాలం నాటి పద్ధతులలో జరుగుతుంటాయి. ఇంకా అలాగే జరుగుతున్నాయి కూడా. సెనేట్ సభ్యులు పొడువాటి వైలెట్ కలర్‌లో ఉండే సిల్కు గౌన్లు తొడుక్కొని నెత్తి మీద వెడల్పాటి నల్లటి టోపీ, దానికి



ఎన్.టి.ఆర్., శంకర్‌దయాళ్ శర్మ, గుమ్మడి

వెలాడే ఓ కుచ్చు - ఇలా వేషధారణ ఉంటుంది. ఇక వేదిక పైకి వచ్చాక "I declare the convocation" అనీ, హాలులో అంశాలవారీగా కూర్చొని ఉన్న సంబంధిత విద్యార్థులు, వారి అంశం ప్రకటించగానే గుంపుగా లేచి నిలబడడం "I do promise" అని ప్రమాణం చేయడం - ఇదంతా ఒక నాటకీయంగా జరిగిపోతుంది. కానీ ఎన్.టి. రామారావు దీనికి ఇష్టపడలేదు. ఈ ప్రక్రియ అంతా దేశీయ పద్ధతిలో తెలుగులో జరిపించాలని ఆదేశించారు. అప్పుడు వైస్-ఛాన్సలర్‌గా ఉన్న డాక్టర్ సి. నారాయణరెడ్డి Convocation Procedure పుస్తకాన్ని మొత్తం తెలుగులోకి అనువదింపజేసి, ముద్రింపించారు. ఇక Robes (రోబ్స్) అనబడే ఆ గౌన్లను Half-white ఖద్దరు గుడ్డతో అదే రోబ్ నమూనాలో కుట్టించి, దానికి సన్నటి జరీ లేసును అంచుగా కుట్టించి కొత్త పద్ధతిలో దేశీయ రీతిలో తయారు చేయించారు. ఇక తలపై టోపి విషయానికి వస్తే, ఎన్.టి. రామారావే స్వయంగా తెల్లకాగితంపై పెన్సిల్‌తో 'కృష్ణాపత్రిక' వ్యవస్థాపకుడు ముట్నూరి కృష్ణారావు తలపాగాను పోలిన విధంగా నమూనాను గీసి ఇచ్చారు. ఆ సందర్భంలో డా. సి. నారాయణ రెడ్డి, ఆనాటి రిజిస్ట్రార్ కీ.శే. ఎన్. శివరామమూర్తి, ఈ వ్యాసకర్త అయిన నేను అక్కడ ఉన్నాం. రామారావు తాను నటించే పౌరాణిక చిత్రాలలోని కృష్ణుడు, రాముడు, భీముడు, అర్జునుడు, దుర్యోధనుడు, భీష్ముడు వంటి తాను ధరించే పాత్రల కిరీటాలను ఆయన ఈ విధంగానే సెట్లో కూర్చొని తెల్ల కాగితంపై పెన్సిల్‌తో గీసి ఇచ్చేవారనీ, అదే మూసలో కిరీటాలు తయారు చేసేవారని అక్కడి జనాలు చెప్పుకొనేవారు. ఆ రకంగా తెలుగు విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం కొత్త తరహాలో తయారైన గౌనులు,

తలపాగాలతో, మొత్తం తెలుగు మాటలలోనే కొనసాగింది. రవీంద్రభారతిలో జరిగిన ఈ స్నాతకోత్సవానికి ఆనాటి భారత ఉప రాష్ట్రపతి డాక్టర్ శంకర్‌దయాళ్ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్.టి. రామారావు ఛాన్సలర్‌గా, డాక్టర్ సి. నారాయణరెడ్డి వైస్-ఛాన్సలర్‌గా ఉండి దీనిని నడిపించారు. సభాప్రాంగణంలో గ్రేస్ కమిటీ సమావేశం కావడం, గౌరవ డాక్టరేట్ పట్టాల చిట్టాను ఆమోదిస్తూ సంతకాలు చేయడం, సిండికేట్ సభ్యులతో, స్వర్ణపతక దాతలతో, ముఖ్యఅతిథితో గ్రూప్ ఫోటో తీసుకోవడం, అనంతరం బారులుగా నిలబడి పోలీసు బ్యాండ్ మేళం మోగుతుంటే ఊరేగింపుగా హాలులోకి రావడం, వేదిక పైకి ఎక్కి వారి-వారి ఆసనాలలో ఆసీనులు కావడం, ఇక డిగ్రీలు ప్రకటించడం, ఆయా శాఖల విద్యార్థులను, ఆయా శాఖల పీఠాధిపతులు పరిచయం, వేదిక పైకి రావడం, వారు వచ్చి ముఖ్యఅతిథి చేతుల మీదుగా పట్టా తీసుకోవడం. గౌరవ అతిథులను సత్కరించి గౌరవ డాక్టరేట్లు అందజేయడం, తొలుత వైస్-ఛాన్సలర్ నివేదిక చదవడం, చివరన ముఖ్య అతిథి స్నాతకోత్సవ అభిభాషణ అనంతరం, స్నాతకోత్సవానికి ముగింపు వాక్యాలు పలకడం, చివరన వేదికపై ఆసీనులై ఉన్నవారంతా మళ్ళీ బారులుగా తీరి, పోలీసు బ్యాండ్ మోగుతుండగా హాలు నుంచి నిష్క్రమించడం - ఇదంతా తెలుగులోనే కొనసాగింది. ఇక్కడ హాలులోకి వెళ్ళేప్పుడు ఛాన్సలర్, వెనుక వైస్-ఛాన్సలర్, ఆ వెనుక ఇతర సభ్యులు ప్రొటోకాల్ ప్రకారం నిలబడి ముందుకు సాగుతారు. తిరిగి బయటకు వచ్చేప్పుడు మాత్రం మొదటివారు చివరికి, చివరివారు మొదటికి మారుతారు. అంటే ముఖ్యఅతిథి వెళ్ళేటప్పుడు మొదటగా ముందు నిలబడితే, వచ్చేటప్పుడు చివరికి నిలబడి ఉంటాడు. పట్టాలు, డిగ్రీలు కూడా తెలుగులోనే ఉండేవి. అయితే తెలుగేతర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్ళినప్పుడు భాషా సమస్య తలెత్తకుండా సర్టిఫికెట్స్‌లో పై నున్న తెలుగు విషయం కింద ఇంగ్లీషులో కూడా ఇవ్వబడింది. అయితే ఇప్పటికీ కూడా గౌన్లు, తలపాగాలలో తెలుగుదనం, సర్టిఫికెట్లలో తెలుగు భాష కనబడుతున్నప్పటికీ, స్నాతకోత్సవ ప్రక్రియ మాత్రం ప్రస్తుతం తెలుగులో కాకుండా ఇంగ్లీషులో కొనసాగుతుంది. అందుకు కారణం రామారావు అనంతరం రాష్ట్ర గవర్నర్లు ఛాన్సలర్లు కావడం.

'తెలుగు విజ్ఞాన పీఠం' 'తెలుగు విశ్వవిద్యాలయం'గా నామాంతరం చెందింది. చట్టపరంగా రూపొందింది. అయితే దేశంలోని విశ్వవిద్యాలయాలన్నింటికీ ఆయా రాష్ట్ర గవర్నర్లు ఛాన్సలర్లుగా ఉండడం ఆనవాయితీ. ఇందుకు భిన్నంగా తెలుగు విశ్వవిద్యాలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు ఛాన్సలర్‌గా కొనసాగడం చర్చనీయాంశంగా మారింది. వివాదానికి తెరతీసింది. ఇది యు.జి.సి (University Grants Commission) నిబంధనలకు విరుద్ధమనే విమర్శ వచ్చింది. 1989లో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ అనంతరం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. పూర్వపు సంప్రదాయాన్నిబట్టి తెలుగు విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి హోదాలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఛాన్సలర్‌గా కొనసాగారు. దీనివల్ల సాంకేతికపరమైన ఇబ్బందితో తెలుగు విశ్వవిద్యాలయానికి యు.జి.సి. గుర్తింపు రావడం కష్టమయ్యింది. అప్పుడు వైస్-ఛాన్సలర్‌గా ఉన్న డాక్టర్ సి. నారాయణ రెడ్డి డాక్టర్ మర్రి చెన్నారెడ్డికి సన్నిహితుడు కావడంవల్ల ఈ సున్నితమైన విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించడంతో సమస్యను అర్థం చేసుకొన్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఛాన్సలర్ పదవినుంచి తప్పుకోవడం, అప్పటి రాష్ట్ర గవర్నర్ తెలుగు విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్ కావడం జరిగింది. దీనితో 1990లో తెలుగు విశ్వవిద్యాలయానికి University Grants Commission (UGC) గుర్తింపు లభించింది. అప్పటికి ఇంకా పొట్టి శ్రీరాములు పేరు పెట్టబడలేదు. ఇది 1996లో జరిగింది. వరంగల్‌లోని 'జానపద, గిరిజన విజ్ఞాన పీఠం' కూడా ఏర్పడలేదు. కూచిపూడిలోని సిద్ధేంద్ర కళాక్షేత్రం, హైదరాబాదులో ఎ.ఆర్.కృష్ణ ఆధ్వర్యంలో నడిచిన రిపర్టరీ - నాటక ప్రయోగశాలవంటివి కూడా తెలుగు విశ్వవిద్యాలయంలో కలిసిపోయాయి.

తొలిదశలో అంటే 1985 నుంచి 1992 ప్రాంతంలో లోగడ చెప్పినట్లు 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాలు', 'ఉగాది పర్వదినాలు', 'రవీంద్రభారతి'లో తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగేవి. ఆ కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తెలుగు విశ్వవిద్యాలయం ఛాన్సలర్‌గా ఎన్.టి. రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యేవారు. సాహిత్యం, సంగీతం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం మొదలైన పలు కళారంగాలలో

నిపుణులు, నిష్ణాతులైనవారిని తెలుగు విశ్వవిద్యాలయం ఎంపిక చేసి సత్కరింపజేసేది. ఆ సందర్భంగా ఆయా కళాకారులను సన్మానించే సమయంలో వారికి సన్మాన పత్రాలను తయారుచేసి, వాటిని చదివే బాధ్యత ఆచార్య దొణప్పగారు ఈ వ్యాసకర్తకు (నాకు) అప్పగించేవారు. ఆచార్య దొణప్పగారి తరువాత ఆచార్య సి. నారాయణ రెడ్డి హయాంలో కూడా ఆ పని నేనే చేస్తూ వచ్చాను. ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే, ఆయా కవులు, రచయితలు, కళాకారులు వారి గురించిన సమాచారాన్ని, జీవిత విశేషాలను, సాధించిన విజయాలను, వారి-వారి రంగాలలో వారి శేముషీ వైదుష్యాలను అనేక పుటలలో విస్తారంగా రాసి పంపేవారు. కానీ వేదికపై వాటిని పేజీలకొద్దీ చదవలేము. కనీసం ముప్పయి, నలభైమంది సన్మానింపబడేవారుంటారు. కార్యక్రమం అంతా రెండు గంటల్లో పూర్తి చేయాలి. అందువల్ల సన్మాన పత్రం ఒక పెద్ద పేజీకి మించకుండా ఉండాలి. దానిని అందంగా, రంగుల్లో ఆకర్షణీయంగా ముద్రింపించి, గోల్డ్ ఫ్రేములో పెద్ద ఫోటో రూపంలో ఇచ్చేవారు. ఇక అందులోని భాష ఆలంకారిక శైలిలో, విశేషణాలతో వినసొంపుగా ఉండాలి. సన్మాన పత్రాల ఒరవడి అందరికీ తెలిసినదే. అందునా ఎన్.టి.ఆర్. సమక్షంలో చదివి వినిపించేది. ఆయన అనేక పౌరాణిక పాత్రలను ధరించి, పౌరాణిక రచనా శైలిని, కావ్యభాషను ఆపోశనం పట్టినవారు. కాబట్టి రచన విషయంలో జాగ్రత్త వహించి, వాటిని తిరిగి ఆచార్య దొణప్ప, ఆచార్య నారాయణ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళి శంఖంలో పోసిన తీర్థం చేసుకొనేవాణ్ణి. ఇదంతా ఒక ఎత్తు అయితే, ఇక వేదికపై చదవడం మరొక ఎత్తు. సత్కరింపబడే వ్యక్తి పేరు పిలవగానే వచ్చి వేదికపై ఒక ప్రత్యేక ఆసనంలో కూర్చోవడం జరుగుతుంది. వెంటనే ముఖ్యఅతిథిగా ఎన్.టి. రామారావు, వైస్-ఛాన్సలర్, ఇతర అతిథులంతా వచ్చి చుట్టూరా నిలబడి ఒకరు దండవేయడం, ఒకరు శాలువా కప్పడం, ఒకరు జ్ఞాపికను బహూకరించడం, ఒకరు సన్మానపత్రం అందజేయడం,



గవర్నర్‌తో కులపతి ఎన్.టి.ఆర్.

ఒకరు పారితోషికం ఇవ్వడం, ఒకరు చందన తాంబూలాలు సమర్పిస్తూ, పన్నీరు చిలకరించడం – అలా జరిగిపోతూ ఉండేది. ఇది కొన్ని సెకండ్లు లేదా మహా అయితే రెండు మూడు నిమిషాల్లో జరిగిపోయేది. ఇక నేను వేదికపై పోడియంవద్ద నిలబడి సన్మాన పత్రం చదువుతూ ఉండేవాణ్ణి. అయితే ఇక్కడ ఆ సన్మాన ప్రక్రియ పూర్తి అయ్యేలోగా నేను చదవడం పూర్తి చేయాలి. లేకపోతే వాళ్ళంతా వాళ్ళ పని పూర్తిచేసి, అలా నిష్క్రియగా చేతులు వాల్చి నిలబడి ఉంటే, నేను ఇంకా చదువుతూనే ఉండడం సముచితంగా ఉండదు. పైగా నారాయణ రెడ్డి నా వైపు అలా చూసి, సైగ చేసేలోగా నేను చదవడం పూర్తి చేయాలి. కానీ ఇప్పుడు చాలా సన్మాన సభల్లో ఇలానే జరుగుతూ ఉంటుంది. అందరూ చదవడం పూర్తయ్యే దాకా నిలబడే ఉండవలసి వస్తోంది. ఒకరిద్దరైతే ఫరవాలేదు. ముప్పయి నలభైమంది ఉన్నప్పుడు ఇది అందరికీ ఇబ్బందిగాని అనిపించవచ్చు. అటువంటి సందర్భంలో ఎవరి ఆసనాల్లో వారు కూర్చొని, సన్మానింపబడే వ్యక్తి ప్రత్యేక ఆసనంలో కూర్చొని, సన్మానపత్రం పూర్తిగా చదివాకే అతిథులు లేచి వచ్చి సన్మానిస్తే ఇబ్బంది అనిపించదు. ఇది ఆ రోజుల్లో నాకు కత్తి మీద సాములాగా ఉండేది. అవతల వ్యక్తులు చాలా గొప్పవాళ్ళు, వారి గురించి ఎంతో చెప్పవలసి ఉంటుంది. కానీ అది సమయం కాదు. అందువల్ల ఈ సన్మాన పత్రాలన్నింటిని చిన్న పుస్తకాలుగా అచ్చువేసి, హాలులో అందరికీ పంచి పెట్టేవాళ్ళం. అయినప్పటికీ కొందరు నా దగ్గరకు వచ్చి మా గురించి ఇంకా చాలా చెప్పాల్సింది అనేవారు. ఇక సన్మాన గ్రహీతలకు ఇచ్చే పారితోషికం నోట్ల రూపంలో, కాకుండా నాణేల రూపంలో. వెల్‌వెట్ గుడ్డతో కుట్టించిన సంచులలో పోసి, ఒక మూటలా అందించేవారు. ఆనాడు రాజదర్బారుల్లో రాజులు ముత్యాలు, రతనాలు, కాసులు సంచుల్లో పోసి అందించినట్లుగా. ఆ దృశ్యమంతా అలనాటి శ్రీకృష్ణదేవరాయల భువన విజయంలోని సత్కార సంరంభాన్ని స్ఫురణకు తెచ్చేది. ఇది ఎంతో నయన

మనోహరంగా, నేత్ర పర్వంగా, కన్నుల పండువుగా ఉండేది. ఇక కరెన్సీ నోట్లను, నాణేలుగా మార్చడానికి విశ్వవిద్యాలయం సిబ్బంది వారం, పది రోజుల ముందుగానే రిజర్వు బ్యాంకు చుట్టూ తిరిగి సంపాదించేవారు. ఈ కార్యక్రమాలలో విశ్వవిద్యాలయంలో పనిచేసే కుమారి బి. విజయశ్రీ సభారంభంలో పాడే "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అన్న ప్రార్థనా గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. ఎన్.టి. రామారావు ఆమె పాటకు పరవశించి, నోరారా 'తెలుగు తల్లి' అని పిలిచి పూలదండతో సత్కరించేవారు. ఇదీ ఆనాటి వైభవం.

ఆనాడు ఎన్.టి. రామారావు బీజా వాపనం చేసిన తెలుగు విశ్వవిద్యాలయం అనంతర కాలంలో పల్లవాంకుర దశ నుంచి మొలకై, మొక్కయి, చెట్టయి, మానయి, శాఖోపశాఖలుగా విస్తరించింది. తెలుగు భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, లలిత కళలు, జానపద విజ్ఞానం మొదలైన అంశాలలో బోధన, పరిశోధన, ప్రచురణ పరమ లక్ష్యాలుగా, హైదరాబాదు ప్రధాన ప్రాంగణంగా, ఉభయ తెలుగు రాష్ట్రాలు అటు రాజమండ్రి, శ్రీశైలం, కూచిపూడి, ఇటు వరంగల్‌లలో ఏడు పీఠాలు, ఆరు కేంద్రాలు, పదిహేడు శాఖలతో ముప్పయి ఎనిమిదేళ్ళుగా కృషి చేస్తోంది. నాలుగు దశాబ్దాలకు చేరువలో ఉంది. దేశంలోని ఏ విశ్వవిద్యాలయంలో లేని విధంగా, తొలిసారిగా జ్యోతిషం, జానపద కళలువంటి అంశాలలో డిగ్రీ, స్నాతకోత్తర స్థాయిలో కోర్సులు నిర్వహిస్తోంది. ఈనాడు అమెరికా, మలేషియావంటి దేశాలలో తెలుగు కోర్సుల నిర్వహణ కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఆనాడు 2004లో 'సిలికానాంధ్ర'తో చేయి కలిపి చేసుకొన్న ఒప్పందంతో, ఇవాళ అక్కడ తెలుగు ఎంతగానో వెలుగుతోంది. అయితే అక్కడి తెలుగు భాషాభిమానులు, తెలుగు ప్రేమికులు, తెలుగు ఆరాధకుల పట్టుదల, శ్రమ, నిర్విరామ కృషివల్ల ఈనాడు సిలికానాంధ్ర తెలుగు బడి ద్వారా అక్కడి తెలుగు వారి ఇళ్ళలో తెలుగు భాషాజ్యోతులను వెలిగిస్తుంది. సిలికానాంధ్ర ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయ ప్రతిపత్తిని పొంది అమెరికా అంతటా విస్తరిస్తోంది. అయితే ఈ ప్రస్థానానికంతటికీ ఆనాడు తొలి అడుగు వేసింది, వేయించింది నందమూరి తారక రామారావు. ఆయనే దీనికి మూలం, ఎదిగిన చెట్టు ఎదురుగా మన కళ్ళకు కనిపిస్తుంది. కానీ ఆ చెట్టు నిలబడడానికి మూలమైన వేర్లు మాత్రం చెట్టు అడుగున, భూమి లోపల కళ్ళకు కనిపించకుండా లోలోతుల్లో ఉంటాయి. తెలుగు భాషా పరంగా ఎన్.టి.ఆర్. ఆశలు, ఆశయాలు, లక్ష్యాలు, ధ్యేయాలు అన్నీ తెలుగు విశ్వవిద్యాలయం అనే చెట్టు వేర్లే. అవి బలంగా, దృఢంగా ఉన్నంత కాలం చెట్టు పచ్చగా పరిమళిస్తూనే ఉంటుంది. అయితే ఆ చెట్టు ఎదుగుదలకు కావలసిన ఎరువు వేసి, నీరు పోసి, సూర్యరశ్మిని అందించేవారందరో ఉన్నారు. వారందరూ చిరస్మరణీయులే. అయితే నందమూరి తారక రామారావు మాత్రం నిత్యస్మరణీయులు, ప్రాతఃస్మరణీయులు.

డాక్టర్ టి. గౌరీశంకర్ - హైదరాబాదు. ఫోన్: 944 096 9130.

*40వ పుట తరువాయి...*

## ఈ విశిష్టుడు - దర్శక వరిష్ఠుడు

కురువంశ పరిరక్షణ కోసం దార్శనికతను ప్రదర్శించడం, సుయోధన సార్వభౌమునిగా పాత్రపోషణ చేయవలసి వచ్చినప్పుడు రాజసాన్ని, దర్పాన్ని అహంకారాన్ని సమ్మిళితం చేసి ప్రేక్షకులను విస్మయావిష్టులను చేయడం, ఇటువంటివన్నీ నందమూరి నాయకుని, పాత్ర పరిశీలనా నైశిత్యానికి ఆనవాళ్లు. కనుకనే యన్.టి.ఆర్. విశ్వవిఖ్యాత నటసార్వభౌముడైనాడు.

సమాంతరంగా దర్శకత్వ శాఖలో కూడా యన్.టి.ఆర్. పూర్ణకళాప్రదీపకుడైనాడు. ముఖ్యంగా భారత, భాగవత, రామాయణాది గ్రంథాలపైన ఆయన నిశిత పరిశీలనాసక్తి, తాను ఈ శాఖలో రాణించడానికి ప్రత్యేకమైన సోపాన పంక్తిని కూర్చింది. సన్నివేశ కల్పనలోనూ, సంభాషణాపూర్వకంగా తెరకు అనువదించడంలోనూ, ఆయా పాత్రల ఆహార్యం విషయంలోనూ వారి పరిశోధనాపటిమ అనన్య సామాన్యం. ప్రతి సన్నివేశమూ అటు సామాన్యులకు, ఇటు ధీమాన్యులకు కూడా, అవగతమయ్యేలా అర్థవంతం చేయడం రామారావుగారు సాధించుకున్న ఘనత నటనలో విశిష్టుడు, ఈ దర్శక వరిష్ఠుడు. చలనచిత్ర వినీలాకాశంలో నిత్యం వెలుగులీనే విజయోత్సవ చిత్ర నక్షత్ర దీపధారి. ఆయన సర్వోన్నత సృజన పథవిహారి.

డా. వోలేటి పార్వతీశం, హైదరాబాద్. ఫోన్: 944 003 1213.

## చిత్రగీతాలు
# జావళీలు

– ఎమ్. పురుషోత్తమాచార్య

### 40. రమ్మంటె రావేమిరా

చిత్రం : పలనాటి యుద్ధం (1966)
రచన : కొసరాజు
సంగీతం : ఎస్. రాజేశ్వరరావు
గానం : పి. సుశీల
నృత్యం : ఎల్. విజయలక్ష్మి



**హమీర్–ఆది**

*రమ్మంటె రావేమిరా నా రాజా*
*రమ్మంటె రావేమిరా రతిరాజా ॥ర॥*
*కిలకిల చిరునవ్వు చిలికింపవేలరా ॥ర॥*

1. *కమ్మని నీ మోవి కందిపోయినదేర*
*చెలియలు ఏమేమి జేసిరొ కసిదీర*
*ఉదయచంద్రుని ఠీవి ఒలకబోసెదవౌర*
*మనసార తమిదీర చేరదీసి కోర్కెదీర్పవేలర ॥ర॥*

2. *నిన్న రాతిరి కలలో నీ సోయగము చూచి*
*నిదురపట్టక గడియ యుగము చేసితివౌర*
*సాసాసా నిరిసదపమప దాదాదా మదపమపగమ*
*రీసా మగమ దాదా నిదని సారి నీస దానిపామ గమరిస*
*వట్టి మాటలు గావు ఒట్టువేయుదు రారా*
*సుకుమార రణధీర ఏలుకోర జాగుసేయనేలర ॥ర॥*

ఆధునిక మహాభారతమని ప్రసిద్ధి వహించిన పలనాటి వీరచారిత్రక కథ ఇది. బ్రహ్మనాయని కొడుకు బాలచంద్రుడు సుబ్బాయి అనే నర్తకీమణితో చెలిమి చేస్తూ ఆమె ఆటపాటలలో మునిగిపోయిన దృశ్యంలో సుబ్బాయి చెలికత్తెలతో కలిసి అభినయించిన నృత్యగీతమిది. సుబ్బాయి పాత్రను ఎల్. విజయలక్ష్మి,బాలచంద్రుని పాత్రను హరనాథ్ అభినయించారు.

సినీజానపదకవిబ్రహ్మగా పేరు తెచ్చుకున్న కొసరాజు రాఘవయ్య చౌదరిగారు ఈ జావళిని రాయడం ఒక గొప్ప విశేషం. చరణాల చివరి పాదాలను ముక్తాయిగా మలుచుకుంటూ అంత్యప్రాసను పాటించారు. చరణాలలోని మిగతా పాదాల్లో ఏ పాదానికి ఆ పాదంలో యతిని పాటించారు. ముఖం చిన్నబుచ్చుకున్నట్లున్న ప్రియుడిని బుజ్జగించి కారణమడుగుతూనే అన్యకాంతా మాత్సర్యాన్ని ప్రదర్శించారు. మోవి కందిపోయిందంటే, ఎవరో వనితలు కసిదీర ఏమేమో చేశారనే అనుమానం వెలిబుచ్చుతున్నది. కలలో కనిపించి అల్లరి పెట్టాడనే మాటను ఒట్టువేసి చెబుతానంటూ జాతి సహజమైన వగలు కురిపిస్తున్నది. తనకు నిద్రపట్టకుండా చేసిన అతని శృంగారరూపాన్ని,చిలిపి చేష్టల్ని ఉటంకిస్తూ ఇంత ప్రేమ ఉన్న ప్రియుడు ఇంకా జాగేల చేస్తున్నాడని వాపోతున్నది.

సాలూరివారికి బాగా ఇష్టమైన రాగాల్లో 'హమీర్ రాగం' అతిప్రియమైనది. ఆయన స్వరాలు సమకూర్చిన సినిమాల్లో తప్పకుండా వినిపించే రాగమిది. 'నీ మధుమురళీగాన, జోజోజోల' వంటి పాటలను గమనిస్తే అర్థమవుతుంది. ఈ పాటను కూడా ఆ రాగలక్షణాలతో సంప్రదాయబద్ధంగా స్వరపరిచారు. ఈ లక్షణాలను కొందరు శుద్ధసారంగ్ రాగంగా చెప్పుకునేంత సాన్నిహిత్యం ఈ రెండు రాగాలలో కనిపిస్తుంది. పాడుతున్నప్పుడు తబలతో అనుసరించడం,బిట్వర్క్ ఇచ్చేటప్పుడు మృదంగాన్ని వినియోగించడం ఆయన చేసే ప్రయోగాలలో అతి ముఖ్యమైనది. ఈ విషయాన్ని 'ప్రళయపయోధిజలే' పాటలో బాగా గమనింపవచ్చు. చరణాలకు ముందు వినిపించే బిట్‌వర్క్‌లో వైవిధ్యం తప్పకుండా ఉండడం ఆయన 'సంగీతముద్ర' అనే చెప్పాలి.

ప్రారంభంలో మృదంగవిన్యాసం రెండు ఆవర్తాలలో వినిపించారు. మరో రెండు ఆవర్తాలలో వయొలిన్స్, వీణ, వేణువులతో బిట్‌వర్క్ ఇచ్చాక ఆధారషడ్జమం మీద ముగించారు. 'రమ్మంటె' అనే పల్లవిని గాయని పైషడ్జమంలో సమంనుంచి ప్రారంభించారు. మూడుసార్లు మూడు రకాల సంగతులతో 'రావేమిర' ను పలికించడం సుశ్రావ్యంగా ఉంది. 'రతిరాజ' దగ్గర చిన్న ఆలాపనతో పల్లవిని ముగించగా సమం నుండి కోరస్‌వారు ఆలాపనను అందుకున్నారు. కోరస్,మృదంగం కలిపి ఒక ఆవర్తం అయిన తరువాత రెండవ ఆవర్తాన్ని గాయని అందుకుని చక్కని రాగాలాపన ఇచ్చి పల్లవిని ఎత్తుకున్నారు. 'రావేమిరా'ను పంచమం దగ్గర వదిలేశాక బిట్‌వర్క్ మొదలైంది. మొదట మృదంగం అర ఆవర్తం,తరువాత

సితార్ ఒక ఆవర్తం,తిరిగి మృదంగం ఒక ఆవర్తంలో చక్కగా వినిపించారు. అప్పుడు మొదటి చరణాన్ని ముందుగా సాకీలో లయ నడుస్తూ ఉండగానే 'కమ్మని నీ మోవి' అనే పాదాన్ని మధ్యమం నుంచి గమ్మత్తుగా పాడారు. రెండోసారి లయతో కుదురుగా ఒక అక్షరం జాగా వదిలి మధ్యమం నుంచి 'కమ్మని నీ మోవి' పాడుతూ రెండు పాదాలను పాడారు. రెండో పాదాన్ని రెండోసారి ఏ మార్పు లేకుండానే పాడారు. మూడో పాదాన్ని రెండోసారి పాడుతున్నప్పుడు 'ఒలకబోసెద'ను 'గామప' అని తారస్థాయిలో మృదుసంగతితో పాడారు. చివరి పాదాన్ని పాడుతూ 'చేరదీసి' నుండి ముక్తాయి ధోరణిలో ద్రుతగతిన అందంగా పాడి పల్లవిని అందుకున్నారు.

తరువాత సితార్, వైబ్రోఫోన్‌లతో వైవిధ్యమైన బిట్టును ప్రారంభించి 5 ఆవర్తాలలో మృదంగగతిని పంచుకుంటూ వినిపించారు. వెంటనే సాభిప్రాయంగా అంటే,నిషాదం మీదినుండి 'నిన్న రాతిరి' ఎత్తుకుని భావాభినయం కోసం ఆపగా సితార్‌పై తరబ్ వినిపించి పూలవానను స్ఫురింపజేశారు. తరువాత ఒక అక్షరం జాగా వదిలి లయయుక్తంగా 'నిన్న రాతిరి'ని ఎత్తుకుని రెండోసారి 'రాతిరి' దగ్గర చిన్న సంగతిని వినిపించారు. రెండో పాదాన్ని రెండు సార్లు పాడారు. మూడో పాదం 'వట్టి మాటలు కావు'ను ఒక అక్షరం జాగా వదిలి తారస్థాయి గాంధారంలో పాడి ఆపగా అర ఆవర్తంలో వేణువుతో గమ్మత్తైన బిట్టు ఇచ్చారు. వెంటనే బృందంవారు రెండు ఆవర్తాలలో కల్పనాస్వరాన్ని ఆలపించారు. ఈ ఆలాపనాసమయంలో, చిత్రసన్నివేశంలో నర్తకి తల్లి దగ్గరికి వెళ్ళి మంచినీళ్ళు త్రాగినట్లు చూపారు. ఇది బోగంమేళంవారి నృత్యప్రదర్శనల్లో సహజంగా జరిగేదే. స్వరం కాగానే తిరిగి నర్తకి అభినయంలోకి ప్రవేశించింది. అప్పుడు గాయని మళ్ళీ అదే పాదాన్ని పాడి చివరి పాదంలోని 'ఏలుకోర' దగ్గరినుంచి ముక్తాయి పద్ధతిలో ద్రుతగతిలో పాడి చరణం ముగించి పల్లవిని అందుకున్నారు. చివరి 7వ అక్షరం మీదినుండి మృదంగవాద్యం ఒక ఆవర్తంలో చక్కని ముక్తాయింపును ఇచ్చింది. తరువాత మధ్యమశ్రుతిలో 'నాగిని' నృత్యసంగీతాన్ని ప్రారంభించారు. పూర్తిగా వేణువు వాద్యం పైననే బిట్టును రూపొందించి 12 ఆవర్తాలలో పూర్తి చేశారు. దాంతో పాటంతా ముగిసింది.

## 41. కొనుమిదే కుసుమాంజలి

**చిత్రం : శ్రీకృష్ణతులాభారం (1966)**
**రచన : సముద్రాల**
**సంగీతం : పెండ్యాల**
**గానం : పి. సుశీల**
**నృత్యం : ఎల్. విజయలక్ష్మి**



**తెలంగ్-ఆది**

*కొనుమిదే కుసుమాంజలి*
*అమరుల ప్రణయాంజలి ॥కొను॥*
*రసికా నటలోకసార్వభౌమా*
*నాదలోల విజయగోపాల ॥కొను॥*

1. *కాళియఫణిరాజు పడగలపైన*
*కాలి యందియలు ఘల్లుమన*
*లీలానాట్యము చేసి చూపిన*
*తాండవకృష్ణా జోహార్ జోహార్ ॥కొను॥*

2. *నీ మధుమురళీ గానము విన్నా*
*భామలు మోహము మీరి దీనలై*
*రారా మదిని వగదీర మరులు నెరవేర*
*మనసు తనివార కౌగిలీనీర*
*నెరా దొరా మాపై నెనరు గొనర*
*మారుకేళి దేలుపుమను మగువల*
*మహానందమయమౌ,లయోల్లాసగతుల*
*దివ్యరాసకేళి మహిమ జూపి మురియజేసి*
*నిరవధిసుఖమొసగిన*
*ఘనశ్యామ సత్యభామ పరంధామ ॥కొను॥*

సత్యభామ కోరికను మన్నించి, పారిజాతవృక్షాన్ని తేవడానికి శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి స్వర్గలోకానికి వచ్చినప్పుడు రంభ చేసే స్వాగతనృత్య గీతమిది. రంభగా ఎల్. విజయలక్ష్మి, ఇంద్రునిగా రాజనాల అభినయించారు. జమున, ఎన్టీఆర్ నాయికానాయకులు.

'కొనుము ఇదే=కొనుమిదే' ప్రయోగంలో ఏకవచనం ధ్వనిస్తున్నది. రచనలోని విశేషణాలు, సంబోధనలు అన్నీ శ్రీకృష్ణుని పరంగానే ఉన్నాయి. పాట చివరలో మాత్రం 'సత్యభామ' పదం నామమాత్రంగానే ఉండిపోయింది. అంతేకాని, సత్యభామను స్తుతించినట్లుగాని, స్వాగతించినట్లుగాని ఎక్కడా ప్రస్తావన లేదు. ప్రధానంగా శ్రీకృష్ణలీలా విలాసాన్ని మాత్రమే పాటలో వర్ణించారు. పల్లవిలో అంత్యప్రాస కనిపిస్తున్నది. మొదటి చరణంలో

కొద్దిగా ప్రాస ఉంది. రెండవ చరణంలో పాక్షికంగా ప్రాస కనిపించింది. మిగతా రచన అంతా స్వేచ్ఛగా సాగింది. అనుపల్లవిలో శ్రీకృష్ణుడిని 'రసికా నటలోకసార్వభౌమ' అని సంబోధించడం కొంచెం కొంటెతనంగా అనిపిస్తుంది. రసికులకు, నటులకు అందరికీ సార్వభౌముడట ఆయన. 'జోహార్' పదప్రయోగం వీరికీ ఇష్టమే. మొదటి చరణంలో కాళియమర్దన ఘట్టాన్ని ప్రస్తావించి దాన్ని లీలానాట్యంగా సంభావించడం హుందాగా ఉన్నది. రెండో చరణంలో శ్రీకృష్ణుని మురళీగానానికి పరవశించిన గోపికల అభీష్టాన్ని లయోల్లాసగతులలో, రాసకేళి రూపాన తీర్చి, నిరవధిక సుఖాన్ని అందించిన ఘనశ్యాముడిని ప్రస్తుతించిన తీరు చాలా హృద్యంగా ఉంది. ఈ చరణంలోని రచనలో ధారాశుద్ధి మహోదాత్తంగా కనిపిస్తున్నది.ఏ బిట్‌వర్క్ లేకుండా ప్రశాంతంగా పల్లవి ప్రారంభమైంది. అతీత విధానంలో 8వ అక్షరం మీదుగా 'కొనుమిదే' పల్లవి గాంధారం నుంచి మొదలైంది. ప్రారంభంలోనే 'కుసుమాంజలి'ని పాడేప్పుడు 'లి' అక్షరాన్ని 'దా... నిస నిసపా' అంటూ చతుశ్రుతి దైవతాన్ని అన్యస్వరంగా వినిపించారు. పాట చివరలో కూడా ఇదే 'లి' అక్షరాన్ని 'దానిస' అంటూ ఈ దైవతంలోనే ముగించడం విశేషం.

పల్లవిలోని మొదటి పాదాన్ని రెండుసార్లు రెండు రకాలుగా పాడారు. తరువాతి పాదాన్ని పాడాక అనుపల్లవిని ఒకసారి పాడి పల్లవిని అందుకున్నారు. తరువాత మూడు ఆవర్తాలలో వయొలిన్స్, సితార్, వేణువుల బిట్టు సాగాక రెండు ఆవర్తాలలో నృత్యాచార్యులు జతులను కొనగోలుగా వినిపించారు. మొదటి చరణం 'కాళియఫణిరాజు'ను సమం నుంచి ఒక అక్షరం జాగా వదిలి పంచమం నుండి ప్రారంభించారు. మొదటి పాదాన్ని రెండుసార్లు పాడి, రెండవ పాదాన్ని అందుకున్నాక తబలా విన్యాసాన్ని అర ఆవర్తాన్నే వినిపించడంవల్ల ఆదితాళపు అక్షరకాలం దెబ్బతిన్నది. ఇది కావాలని చేసిందో, రికార్డులోగాని సినిమాలోగాని కట్ అయిందో కాని, ఇదొక్కటే చిన్న లోపంగా భావించాల్సి వస్తున్నది. మిగతా పాటంతటిని అక్షర కాలంలో చెక్కుచెదరకుండా నడిపించారు. ప్రత్యక్షానుభవం ఉన్నవాళ్ళు తప్ప ఎవరూ దీన్ని వివరించలేరు. తరువాతి పాదంలోని 'చూపిన' తరువాత మూడు ఆవర్తాలలో కేరళ డ్రమ్స్ వినిపించడం అక్షరబద్ధంగా ఉంది. దీని తరువాత మళ్ళీ 'లీలానాట్యము' అందుకుని పాడారు. మొదటి చరణాన్ని ముగించి పల్లవిని అందుకున్నాక 'కుసుమాంజలి' దగ్గర 'పమగస గమపని సరినిస' అనే సంగతిని అందంగా వినిపిస్తూ రాగంలో లేని చతుశ్రుతి రిషభాన్ని స్పృశించారు. రెండో చరణం ముందు బిట్‌వర్క్ ధోరణిని మార్చారు. వాద్యసంగీతాన్ని అతీత విధానంలో అంటే, 8వ అక్షరం నుంచే ప్రారంభించారు.

నాలుగు ఆవర్తాలలో స్వరసంచారపు బిట్‌వర్క్‌ను, 3 ఆవర్తాలలో నృత్యాచార్యుని జతుల కొనగోలును రూపొందించారు. తరువాత ఒక అక్షరం జాగా వదిలి 'నీ మధుమురళీ' చరణాన్ని పైషడ్జమం నుంచి ప్రారంభించారు. 'దీనలై' తరువాత రెండు ఆవర్తాలలో వేణువు బిట్టును ఇస్తూ,మళ్ళీ చతుశ్రుతి రిషభాన్ని స్పృశించినారు. అప్పుడు మళ్ళీ చరణం ఎత్తుకున్నారు. తరువాత 'రారా' నుంచి ఎక్కడా జాగా వదిలిపెట్టకుండా చకచకా చరణం చివరిదాకా పాడుకుంటూ వెళ్ళారు. 'నెరా, దొరా' తరువాత 'మాపై నెనరుగొన' దగ్గరి నుంచి మిశ్రం ధోరణిలో ద్రుతగతితో పాడుతూ చివరి పాదాన్ని ముక్తాయిగా చేసి మనోహరంగా పాడారు.

చివరలో పల్లవిని పాడేప్పుడు 'ప్రణయాంజలి'ని తారస్థాయిలో 'సరిగమాగారిసా' అనే స్వరసంపుటిని రాగస్వరూప వైలక్షణ్యంతో పాడి, 'కుసుమాంజలి'ని చతుశ్రుతి రిషభంలో పలికిస్తూ ముగించారు. తరువాత ఆరు ఆవర్తాలలో వీణ, సితార్, వయొలిన్స్‌తో బిట్టును ఇచ్చారు. 7వ ఆవర్తం నుండి మూడు ఆవర్తాల పాటు వేణువుపై చక్కని స్వరాలను వినిపిస్తూ పాటనంతటిని ముక్తాయితో ముగించారు.

### 42. అందెలు పలికెనులే

**చిత్రం : భక్తపోతన (1966)**
**రచన : సి.నారాయణరెడ్డి**
**సంగీతం : ఎస్.రాజేశ్వరరావు**
**గానం : ఎస్.జానకి**
**నృత్యం : పద్మిని**

**కాఫీ & వలజి–ఆది**

*అందెలు పలికెనులే నా ॥అం॥ ఔరా*
*ఇందరు రసికులు ముందర నిలువగా ॥అం॥*

1. *నందనవీధుల నటియించే సుర*
*చందనగంధులు పందెము వేయగ*
*మందిరమున శ్రీరామచంద్రుని*
*సందిట వెలసిన జానకి మురియగా ॥అం॥*

2. మందహాసముల చిందెను కవిరాజు
మంజుహాసములు చిలికెను మహరాజు
మధురభాగవత సుధలొలికించిన
మహనీయుడు దీవనలందించగా ॥అం॥

చిత్రంలో రాజనర్తకి భోగినీదేవి శ్రీరామాలయంలో నృత్యం చేస్తున్న సన్నివేశంలో ఈ పాటను చిత్రించారు. భోగినీదేవిగా పద్మిని, పోతనగా గుమ్మడి, శ్రీనాథునిగా ఎస్వీరంగారావు, సింగభూపాలునిగా బాలయ్య అభినయించారు.

పల్లవి, మొదటి చరణాలలో సుశ్రావ్యమైన ప్రాస నియమాన్ని చక్కగా పాటించారు. చెండవ చరణంలో యతి నియమాన్ని తీసుకున్నారు. రసికుల ముందర నిలుచున్న నర్తకి అందెలు అందంగా పలికాయి. స్వర్గంలో నందనోద్యానంలో విహరించే దేవతా స్త్రీలు పందెం వేస్తున్నట్లుగా వర్ణిస్తూనే ఆలయంలో శ్రీరాముని చెంతన ఉన్న సీతమ్మ మురిసేట్టుగా అందెలు పలికాయని కవి వర్ణించారు. శ్రీనాథుడు, సింగభూపాలుడు, పోతనకవి ప్రోత్సాహకరంగా స్మితవదనులై యుండగా అందెలు పలికాయట.

ఈ పాటను సాలూరివారు కాఫీ, వలజి రాగాలలో బాణీ చేశారు. అయితే రెండవ చరణం మధ్యలో ఇచ్చిన అర ఆవర్తపు బిట్టు వలన ఆదితాళపు స్వరూపం చెదిరిపోయింది. అనుకునే చేసివుండవచ్చు, లేక సాంకేతిక లోపమూ కావచ్చు. ప్రారంభంలో నృత్యాచార్యులు, గాయనీమణి ఇద్దరు కలిసి రెండు ఆవర్తాలలో జతులను కొనగోలుగా చెప్పారు. తరువాత 5 ఆవర్తాలలో సితార్, వయొలిన్స్, వీణలతో బిట్టును ఇచ్చారు. అప్పుడు ఒక అక్షరం జాగా వదిలి కాకలి నిషాదం నుంచి 'అందెలు పలికెనులే' అనే పల్లవి ప్రారంభమైంది. 'పలికెనులే' కాగానే వీణపై 'పపదనిస' అని పలికించారు. మొదటి పాదాన్ని రెండు రకాల సంగతులతోనూ, రెండో పాదాన్ని రెండు విభిన్న సంగతులతోనూ పాడారు. 'పలికెనులే' పదాన్ని మూడు వేర్వేరు రీతులుగా పాడారు. తరువాత వయొలిన్స్, వీణ, వేణువులు బిట్సును విభజించుకుంటూ 5 ఆవర్తాలలో వినిపించి పైషడ్జమంలో వదిలేయగా ఒక అక్షరం జాగా వదిలి 'నందనవీధుల' అనే మొదటి చరణాన్ని కైశికనిషాదాన్ని కలుపుతూ 'దనినన' బాణీలో ప్రారంభించారు. రెండుసార్లు పాడాక రెండో పాదం పాడినప్పుడు 'వేయగ' దగ్గర ఒక ఆవర్తంలో వయొలిన్స్ బిట్ ఇచ్చారు. తరువాత మళ్ళీ మొదటి రెండు పాదాలు పాడుతూ మిగతా భాగాన్ని పాడిగించారు. 'శ్రీరామచంద్రుని' దగ్గర ఒక ఆవర్తంలో బిట్టును ఇచ్చారు. మళ్ళీ మూడవ పాదాన్ని పాడాక నాలుగవ పాదాన్ని లయవాద్యరహితంగా సాకీలాగా ఆలపించినా అంతర్లయను పాటించారు. పల్లవిని ఎత్తుకుని మొదటి పాదాన్ని పాడాక నృత్యాచార్యులు జతులను ఒక ఆవర్తంలో చెప్పారు.

పల్లవిని 'పలికెనులే' దగ్గర వదిలేశాక రెండో చరణానికి ముందు రెండు ఆవర్తాల బిట్టు ముగిశాక మూడవ ఆవర్తం నుండి ఆరు ఆవర్తాల పాటు వీణ, వయొలిన్స్, వేణువులతో రాగాన్ని మార్చి 'వలజి' రాగపు స్వరాలను వినిపిస్తూ పైషడ్జమంలో వదిలేశారు. వలజి రాగాన్నే హిందూస్తానీ సంప్రదాయంలో 'కళావతి' అని పిలుస్తారు. ఒక అక్షరం జాగా వదిలి 'మందహాసములు'ను 'గాపదానిసా' బాణీలో ప్రారంభించారు. రెండో పాదం చివర 'చిలికెను మహరాజు'ను వాద్యాలు రిపీట్ చేయడం అర ఆవర్తంలోనే జరగడంవలన ఇప్పటిదాకా నడిచిన ఆదితాళపు అక్షరకాలం చెదరిపోయింది. ఇటువంటి శాస్త్రీయ రచనలలో ఇలా అర ఆవర్తం జొరబడడం సంప్రదాయాభిమానులకు కొంచెం నిరాశను కలిగిస్తుంది. 'మందహాసము' పదాన్ని రెండోసారి అందమైన మార్పుతో పాడారు. 'సుధలొలికించిన' దగ్గర చిన్నపాటి ఆలాపనను రెండు ఆవర్తాలలో చేసి తిరిగి 'మధుర భాగవత'ను అందుకున్నారు. మళ్ళీ చివరి పాదాన్ని లయవాద్య సహకారం లేకుండా సాకీగా పాడుతూ 'దీవన' దగ్గర కాకలినిషాద ప్రారంభంతో కాఫీరాగంలోకి చక్కగా ప్రవేశించడం హృద్యంగా ఉంది.

చివరలో పల్లవిని ఎత్తుకుని 'పలికెనులే' దగ్గర మరో క్రొత్త సంగతిని వినిపించారు. తరువాత రెండు ఆవర్తాలలో గాయని, నృత్యాచార్యులు కలిసి జతులు పలికారు. చివరగా 8 ఆవర్తాలలో తబల, మృదంగం సంయుక్త వాదనతో పాటు వాద్యస్వర సంపుటిని క్రమంగా వేగాన్ని పెంచుతూ, భావావేశపూరితంగా వినిపిస్తూ పాటనంతటినీ ముగించారు.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్: 939 661 1905.



పీటర్‌మారిట్జ్‌బర్గ్ రైల్వే స్టేషన్ - సౌత్ ఆఫ్రికా

# భారత స్వాతంత్ర్య సమరం... రైల్వే స్టేషన్లు

– రామవరపు వేంకట రమణమూర్తి

భారత స్వాతంత్ర్య పోరాటం ఒకప్రక్క భారత యువకుల విప్లవ పంథాను ప్రపంచానికి తెలియజేస్తే, గాంధీజీ రాకతో ప్రపంచానికే తెలియని నూతన "సత్యాగ్రహ" యుద్ధనీతిని అందించింది. తరువాత కొన్ని దేశాలు ఇదే సత్యాగ్రహ బాటలో నడిచి వలస పాలనకు చమరగీతం పాడాయి. ఆనాటి స్వాతంత్ర్య సమర కాలంలో కొన్ని సంఘటనలు వలన కొన్ని రైల్వే స్టేషన్లు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిల్చిపోయాయి. అటువంటి సంఘటనలు, ఆయా రైల్వేస్టేషన్లు గురించి ఒకసారి జ్ఞాపకం చేసుకుందాం.

ఒక రైల్వే స్టేషన్‌లో జరిగిన ఒక సంఘటన మన దేశ చరిత్రలోనే కాదు, ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానం ఆక్రమించింది. ఇది కూడా ఒక విదేశీ గడ్డపై జరిగింది. ఇది గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఉండగా జరిగిన సంఘటన. నల్ల జాతీయుడైన గాంధీజీని తెల్ల జాతీయులు రైలులోని ఫస్ట్ క్లాసు కంపార్డుమెంటు నుండి బలవంతంగా దింపివేసారు. ఆ సమయంలో ఆత్మాభిమానం దెబ్బతిన్న గాంధీజీ ఆలోచన నుండి పుట్టిందే "సత్యాగ్రహ ఉద్యమం". ఈ సంఘటన "దక్షిణాఫ్రికాలోని "పీటర్స్ మారిట్స్ బర్గ్" రైల్వే స్టేషన్‌లో జరిగింది. ఈ సంఘటన 1893 జూన్ 7 న జరిగింది. ఆ తరువాతి చరిత్ర అందరికీ తెలిసిందే కదా! ఇక ఇదే సంవత్సరం అంటే 1893 అక్టోబర్ 4 న ఆంధ్ర దేశంలో రాయలసీమలోని "గుంతకల్లు" రైల్వే స్టేషన్ దగ్గర ఒక సంఘటన జరిగింది. గుళ్ళపాళెం హంపణ్ణ గుంతకల్ స్టేషన్ వద్ద గేట్ కాపలాదారునిగా ఉండేవాడు. ఆంగ్లేయ సైనికుల పటాలం అక్కడ మిలటరీ బంగళాలో దిగింది. ఇద్దరు సైనికులు ఆరోజు సాయంత్రం ఆ దారిలో వెళ్తున్న ఇద్దరు స్త్రీలపై అత్యాచారం చేయబోయారు. అప్పుడు హంపణ్ణ వారిని గేట్‌మేన్ గదిలో ఉంచి రక్షణ కల్పించాడు. దీనికి కోపగించిన ఆ సైనికులు హంపణ్ణను తుపాకీతో కాల్చి పారిపోయారు. వైద్యానికి గుత్తికి తరలింపబడిన హంపణ్ణ అక్కడ మరణించాడు.

దీనిపై కేసు నడిచినా ఆంగ్ల ప్రభుత్వం మాత్రం సైనికుల పక్షం వహించింది. అయినా గుత్తి కేశవ పిళ్ళె, ఆనాటి హిందూ దినపత్రిక హంపణ్ణ తరుపున నిలిచి గుత్తిలో హంపణ్ణ స్మారకం నిర్మించారు. విద్వాన్ విశ్వం హంపణ్ణను కీర్తిస్తూ "ఒకనాడు" అన్న పద్య కావ్యం రచించాడు. ఆనాటి నుండి హంపణ్ణ రాయలసీమ ప్రాంత దేశభక్తులకు ఆదర్శవ్యక్తిగా నిలిచాడు.

ఇదీ భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో గుంతకల్ రైల్వే స్టేషన్ ప్రస్తావన.

దాదాపు 19 సం॥ వయస్సులో ముజఫర్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్ హత్య కేసులో నిందితుడు అయినవాడు బెంగాల్ విప్లవ వీరుడు ఖుదీరాం బోస్. బాంబు దాడి అనంతరం ప్రఫుల్ల కుమార్ చాకీ, ఖుదీరాం బోస్‌లు ఎవరి దారిన వారు తప్పించుకున్నారు. ఖుదీరాం బోస్ రాత్రంతా దాదాపు 25 కి॥మీ॥ నడిచి "వైనీ" రైల్వే స్టేషన్ చేరుకున్నాడు. కాని అనుకోని పరిస్థితుల వల్ల పోలీసులకు చిక్కిపోయాడు. ఖుదీరాం బోస్‌ను ఆంగ్ల ప్రభుత్వం ఆగస్టు నెల 11 వ తేదీ 1908 న ఉరి తీసింది.






కుదీరాం పూసా బోస్ రైల్వే స్టేషన్ - బీహార్




వాంచీ మణియాచ్చీ జంక్షన్ - తమిళనాడు

బీహార్ సమస్తిపూర్ జిల్లాలో ఉన్న వైనీ రైల్వే స్టేషన్‌ను నేడు ఖుదీరాం బోస్ పూసా రైల్వే స్టేషన్ అని ప్రభుత్వం మార్చింది.

భారత స్వాతంత్ర్య సమర విప్లవ వీరులలో ప్రత్యేక స్థానం ఉన్నవాడు వీర్ సావర్కర్. లండన్‌లో ఇండియా హౌస్ సారధ్యంలోలోని విప్లవ వీరుల్లో ఒకరు మదన్‌లాల్ డింగ్రా. ఇతను లండన్‌లో సర్‌కర్జన్ విల్లీని 1909 జూలై 1 న పిస్తోల్‌తో కాల్చివేసాడు. ఆ తరువాత జరిగిన సంఘటన కారణంగా ఇండియా హౌస్‌లోని విప్లవ వీరులు తలో చోటికి తప్పించుకున్నారు. పారిస్ చేరిన వీర్ సావర్కర్‌కు అక్కడ ఎక్కువ రోజులు ఉండబుద్ధి కాలేదు. శ్యాంజీ కృష్ణ వర్మ, మేడమ్ కామా వంటివారు వలదని సలహా ఇచ్చినా సోవర్కర్ పారిస్ నుండి లండన్‌కు బయలుదేరాడు. రైలుబండి లండన్ విక్టోరియా స్టేషన్‌లో ఆగగానే ఆంగ్ల ప్రభుత్వం ఇతనిని అరెస్టు చేయడం జరిగింది. ఈ సంఘటన 1910 మార్చి 13 న జరిగింది. అనంతరం సోవర్కర్ ద్వీపాంతర వాస శిక్షలో భాగంగా అండమాన్ సెల్యులార్ జైలుకు పంపబడ్డాడు.

గదర్ వీరుడు బిషన్ సింగ్ కెన్యా దేశంలో చేసిన సాహసచర్య గురించి కొంత జ్ఞాపకం చేసుకుందాం. ఈయన నేతృత్వంలో కెన్యా - టాంగనీకాల మధ్య రైల్వే లైను విచ్ఛిన్నం చేయడానికి కుట్ర జరిగింది. ఈ రైల్వే లైను మార్గం ద్వారా బ్రిటిష్ సైనికులకు ఆహార సరఫరా జరిగేది. రాం చంద్, కేశవ్ లాల్, ఎమ్.ఎన్. సాల్వే, లాల్ చంద్‌లతో కలసి బిషన్ సింగ్ రైల్వే లైను విచ్ఛిన్నం కోసం ప్రయత్నించాడు. పట్టుబడిన వీరందరినీ ప్రభుత్వం కోర్టు మార్షల్ చేసింది. రామ్‌చంద్ మినహా నలుగురికీ మరణశిక్షలు విధింపబడ్డాయి. బిషన్ సింగ్‌ను 1915 డిసెంబర్ 3 న కెన్యా దేశంలోని ముంబాసాలో ఆంగ్ల ప్రభుత్వం ఉరి తీసింది.

తమిళనాడులోని తిరునల్వేలి కలెక్టర్ అయిన రాబర్ట్ ఆషేను విప్లవ వీరుడు వాంఛీ అయ్యర్ తుదిముట్టించాలని ప్రయత్నించాడు. కొడైకెనాల్‌కు తన కుటుంబంతో సహా వెళ్ళబోతున్న కలెక్టర్ ఆషే తరువాత రైలు కోసం "మనియాచీ" రైల్వే స్టేషన్‌లో ఎదురు చూస్తున్నాడు. ఆ సమయంలో మొదటి తరగతి రైలుపెట్టెలో ప్రవేశించి వాంఛీ అయ్యర్ పిస్తోల్‌తో కలెక్టర్ ఆషేను కాల్చివేసాడు. తాను పారిపోయి స్టేషన్‌లో ఉన్న టాయ్‌లెట్‌లో దూరి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన 1911 జూన్ 11 న జరిగింది. ఆనాటి వాంఛీ అయ్యార్ సాహసచర్యకు గుర్తుగా నేడు మనియాచ్చి రైల్వే స్టేషన్‌ను "వాంఛీ మనియాచ్చి జంక్షన్" అని పేరు పెట్టడం జరిగింది.

స్వాతంత్ర్య సమర చరిత్రలో చీరాల-పేరాల ఉద్యమం అనగానే మనకు గుర్తుకు వచ్చే దేశభక్తుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు. చీరాల - పేరాల ఉద్యమంలో భాగంగా ప్రజలు 1921 ఏప్రిల్ 25 రాత్రిన రెండు ఊర్లు ఖాళీ చేసి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన "రామ నగర్"కు చేరుకున్నారు.




దుగ్గిరాల గోపాలకృష్ణయ్యను అరెస్టు చేసిన బరంపుర్ రైల్వేస్టేషన్




గోమో రైల్వే స్టేషన్ - జార్ఖండ్

విజయవంతంగా సాగుతున్న చీరాల-పేరాల మున్సిపాలిటీ వ్యతిరేక ఉద్యమానికి తరువాత రోజుల్లో నిధుల కొరత వచ్చింది. అందుచేత ఒరిస్సాలోని బరంపురంలో 1921 సెప్టెంబర్ చివర్లో జరుగుతున్న "ఆంధ్ర మహాసభల"కు గోపాలకృష్ణయ్య వెళ్ళారు. నిధుల కోసం ప్రయత్నించారు.

ప్రభుత్వం గోపాలకృష్ణయ్య బహిరంగ సభలో ఉపన్యసించరాదని శాసించింది. అయినా ఆయన ప్రసంగించారు. అక్టోబర్ 1 న బరంపురం రైల్వే స్టేషన్‌లో తిరుగు ప్రయాణం కోసం గోపాలకృష్ణయ్య ఎదురు చూస్తున్నారు. రైలు ఎక్కే ముందు ప్రభుత్వం ఆయనను బరంపురం రైల్వే స్టేషన్‌లో అరెస్టు చేసింది. ఆ తరువాత జరిగిన సంఘటన వలన చీరాల-పేరాల ఉద్యమం ఆగిపోయింది. ఇలా బరంపురం రైల్వే స్టేషన్‌లో జరిగిన అరెస్టు చీరాల-పేరాల ఉద్యమానికి ఆటంకం కలిగించింది.

ఈ 1921 వ సంవత్సరంలో ఇంకొక సంఘటన జరిగింది. ఇదే కేరళ రాష్ట్రంలో మలబార్ తిరుగుబాటు లేదా మొప్లా తిరుగుబాటు. ఇది వలస పాలకుల రాజనీతి, భూస్వాములకు వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమం.

తీవ్రస్థాయిలో జరిగిన ఈ ఉద్యమం బ్రిటిష్ వారిచే అణచివేయబడింది. ఉద్యమం చివరి రోజుల్లో ఒక సంఘటన జరిగింది. ఈ సమయంలో 1921 నవంబర్ 10 న దాదాపు వంద మంది విప్లవకారులను రైలులో తిరూరు రైల్వే స్టేషన్ నుండి పొదనూర్‌లో ఉన్న సెంట్రల్ జైలుకు పంపబడ్డారు. ఈ రైలుపెట్టెకు కిటికీలు లేవు. బందీలకు ఊపిరి ఆడలేదు. రైలు పొదనూర్ స్టేషన్‌కు చేరింది. రైలుపెట్టె తెరిచారు. ఆ వంద మంది బందీలలో దాదాపు డెబ్భై మంది చనిపోయారు. ఇది చరిత్రలో "మలబార్ వేగన్ ట్రాజెడీ"గా నిల్చిపోయింది.

భారత దేశ స్వాతంత్ర్య విప్లవ చరిత్రలో చెప్పుకోదగిన సాహసచర్య "కకోరి కుట్ర కేసు" లేదా "కరోరీ రైలు దోపిడీ". ఇది 1925 ఆగస్టు 9 న జరిగింది. విప్లవ వీరులు విప్లవచర్యల నిధుల కోసం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు 16 కి॥మీ॥ దూరంలో ఉన్న కకోరీ రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వారి ధనాన్ని దోపిడీ చేసేరు. ఇందులో ప్రధానంగా పది మంది విప్లవ వీరులు పాల్గొనారు.

ఈ కకోలీ రైలు దోపిడీ సందర్భంగా ప్రభుత్వం నలుగురిని ఉరి తీసింది. అందులో నాయకుడైన రాంప్రసాద్ బిస్మిల్ ఇంకా ఠాకూర్ రోషన్ సింగ్, రాజేంద్ర లాహరీ, అసాఫకుల్లా ఖాన్ ఉన్నారు. మిగిలిన వారికి వివిధ రకాల శిక్షలు పడ్డాయి. ఇందులో పాల్గొన్న చంద్రశేఖర్ ఆజాత్ తప్పించుకున్నా 1931 ఫిబ్రవరి 27 న అలహాబాద్‌లో ఆంగ్లేయులతో పోరాట సందర్భంగా తనను తాను కాల్చుకున్నాడు.

నేతాజీ పేరు తెలియని భారతీయుడు ఉండడు. మన దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ తన ప్రయత్నాలు విదేశాలలో చేయాలని ఆశించారు. అందుకోసం ఆయన మారువేషంలో జార్ఖండ్‌లో ఉన్న గోమో రైల్వే స్టేషన్‌కు 1941 జనవరి 18 న రాత్రికి చేరుకున్నారు. అక్కడ నుండి ఆయన రైల్లో బయలుదేరి తప్పించుకుని చివరకు జర్మనీ చేరారు. దీనినే చరిత్రలో "మహా నిష్క్రమణం" అని అన్నారు. నేతాజీ అదృశ్యం కావడంతో సంబంధం ఉన్న ఈ రైల్వే స్టేషన్‌ను నేడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ గోమో జంక్షన్ అని పిలుస్తున్నారు.

ఆంధ్ర రాష్ట్రంలో క్విట్ ఇండియా సందర్భంగా తెనాలిలో 1942 ఆగస్టు 12న ఉద్యమకారులు తెనాలి రైల్వే స్టేషన్‌పై దాడి చేసారు. ఆ సమయంలో పోలీసులు కాల్పులు చేసారు. ఈ కాల్పులలో తమ్మినేని సుబ్బారెడ్డి,




తెనాలి రైల్వే స్టేషన్

గాలి రామకోటయ్య, ప్రయాగ రాఘవయ్య, శ్రీగిరి లింగం, జాస్తి అప్పయ్య, మాజేటి సుబ్బారావ్, లక్ష్మీనారాయణ మరణించారు. ఇంతేకాదు ఇంకొక విషయం ఉంది. అల్లూరి సీతారామరాజు విప్లవంలో ప్రముక పాత్ర వహించిన అగ్గిరాజు గురించిన విషయం ఇది. ప॥గో॥ జిల్లా భీమవరం తాలూకా కుముదవెల్లి గ్రామానికి చెందినవారు వేగిరాజు సత్యనారాయణ రాజు. ఈయన కలకత్తా వెళ్తూ రైలులో అల్లూరి సీతారామరాజు గురించి విన్నారు. రాజు గురించి విని ప్రభావితుడై అన్నవరం రైల్వే స్టేషన్‌లో దిగి 1923 మే నెలలో విప్లవ సైన్యంతో కలిసిపోయాడు. చరిత్రలో "అగ్గిరాజు"గా నిలిచిపోయాడు.

భారత మాజీ రాష్ట్రపతి, స్వాతంత్ర్య సమరయోధుడు అయిన వి.వి. గిరి గారు ఆ రోజుల్లో కార్మిక నాయకునిగా ప్రసిద్ధి పొందారు. రైల్వే కార్మికుల హక్కుల కోసం పోరాడారు. ఆనాటి బెంగాల్ - నాగపూర్ రైల్వే అంటే నేటి ఎస్.ఇ. రైల్వేలోని ఖర్గపూర్ పట్టణంలోని రైల్వే కార్మికుల తరఫున సమ్మె చేయించారు. ఇది 1927 ఫిబ్రవరి 12 న జరిగింది. ఇది 1927 మార్చి మధ్యలో వరకు సాగింది. అంతేకాదు మన దేశంలోని రైల్వే శాఖలకు ఎన్నింటికో ఆయన కార్మికుల సంఘాల తరఫున నాయకత్వం వహించారు.

చరిత్ర చదివినవారు ఒక విషయం అంగీకరిస్తారు. భారతదేశంలో రైల్వే వ్యవస్థ వచ్చాక ఒకరకంగా మన భారతీయుల ఏకీకరణ జరిగింది. ఇది పరోక్షంగా స్వాతంత్ర్య సమరానికి ఊత మిచ్చింది.

ఇంతవరకు మనం స్వాతంత్ర్య సమరం - రైల్వే స్టేషన్లు అన్న విషయంలో కొన్ని సంఘటనలు, అంశాలు మాత్రమే తెలుసుకున్నాం. చరిత్రను శోధిస్తే ఇంకా చాలా విషయాలు తెలుస్తాయి. సమయాభావం వలన అన్నింటినీ చర్చించడం సాధ్యం కాదు.

రామవరపు వేంకట రమణమూర్తి
విశాఖపట్నం. ఫోన్: 944 079 8301

## మట్టిలో మాణిక్యం

ఆంధ్రనాటక రంగం ఉత్తమ నటీనటుల పంట. ఎంతమంది ఈ రంగానికి ఆస్తిపాస్తులను ధారపోశారో, ఎంతమంది వారివారి వృత్తులను చూసుకుంటూ ఈ కళారంగానికి సేవ చేశారో, ఎంతమంది తమ సర్వస్వాన్నీ, జీవితాన్నీ ఈ కళకే అంకితం చేశారో ఒక్కసారి వెనుదిరిగి చూసుకుంటే తెలుగుదేశపు ప్రతి చిన్న పట్టణంలోనూ మట్టిలో మాణిక్యాల్లా నటరత్నాలు మనకు కనిపిస్తారు. అలాంటి నటరత్నం నరకుల వీరభద్రరావుగారు.


నరకుల వీరభద్రరావు

కపిలవాయి రామనాథశాస్త్రి, మద్దాలి శేషగిరిరావు, బెల్లంకొండ సుబ్బారావు, కొచ్చర్లకోట సత్యనారాయణ, మహిపాల వెంకటరామన్న, మాధవపెద్ది వెంకట రామయ్య మొదలైన మేటి నటులతో *సతీసావిత్రి, పాండవోద్యోగ విజయం, బొబ్బిలియుద్ధం, పాదుకా పట్టాభిషేకం, చిత్రనళీయం, లవకుశ, చింతామణి* మొదలైన అనేక నాటకాలలో వాల్మీకి, ఇంద్రుడు, భీముడు, దశరథుడు, యమధర్మరాజు, బిల్వమంగళుడు మొదలైన అనేక ప్రసిద్ధ పాత్రలను ధరించి అటు ప్రేక్షకులనే కాకుండా, మేటి నటులచేత కూడా సెహభాష్ అనిపించుకున్న ఉత్తమ నటులు నరకుల వీరభద్రరావుగారు. వీరభద్రరావుగారి నివాసం పశ్చిమగోదావరి జిల్లాలోని కొవ్వూరు. 1904లో నరసింహస్వామి, శ్రీమతి చెంచమ్మగార్లకు జన్మించారు. *సతీసావిత్రి* లో యమధర్మరాజు *ఉద్యోగ విజయాల్లో* భీముడు పాత్రలు వీరభద్రరావుగారు ధరిస్తున్నారంటే కొవ్వూరు తాలూకా ప్రజలందరూ కదిలి వచ్చేవారు. భావయుక్తంగా పద్యాలను విడమరిచి చదవడం, విశాలమైన నేత్రాలతో భావాలను ప్రస్ఫుటం చేయడం, క్రమశిక్షణతో నాటక ప్రదర్శనలను రక్తిగా నడిపించడం వారికి బాల్యం నుంచీ అలవడ్డాయి. దాదాపు 73 సంవత్సరాల వయస్సులో కూడా మైక్ అవసరం లేకుండా వేలాది ప్రేక్షకులలో చిట్టచివర ఉండేవారికి కూడా స్పష్టంగా వినిపించే గంభీర మధుర స్వరం వీరభద్రరావుగారిది. వీరభద్రరావుగారు కేవలం కళాదృష్టితో, తృష్ణతో నాటక రంగాన్ని ఆరాధించారు.

**నటరత్నాలు** - *మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి*

# 'మట్టిబండి'లో మాణిక్యాలు

– గుమ్మా సాంబశివరావు

*ఒక అందమైన పోయెం అంటే / దానికి ఒక గుండె కావాలి / అది కన్నీరు కార్చాలి / పీడితుల పక్షం వహించాలి / మనిషి ఋణం తీర్చుకోవాలి"* – *గుంటూరు శేషేంద్రశర్మ.*

ఈ మాటలు డా. నాగభైరవ ఆదినారాయణగారు రచించిన మట్టిబండి దీర్ఘకవితకు అన్ని విధాలా అన్వయిస్తాయి. ఆదినారాయణగారు అధ్యాపకులుగానే కాకుండా, పరిశోధకులుగా, బహుప్రక్రియా రచయితగా ప్రసిద్ధులు. ప్రస్తుతం వీరి కలం నుంచి వెలువడ్డ మహత్తర కావ్యం మట్టిబండి. రూపంలో చిన్నదైనా సారంలో అపారమైంది. 'వాక్యమ్ రసాత్మకమ్ కావ్యమ్' అన్న పలుకులకు మట్టిబండి అక్షరాక్షర నిదర్శనం.

కర్షక జీవితం మీద రచించిన ఈ పుస్తకాన్ని కవిగారు "కర్షకుల హర్షమే ధ్యాసగా జన ప్రయోజనమే శ్వాసగా, ఆచార్య రంగ అంతరంగమే భాష"గా జీవించిన కీ.శే. పాటూరి రాజగోపాలనాయుడుగారికి అంకితం చేయటంతో బంగారానికి తావి అబ్బినట్లయింది.

ఉపాధ్యాయుని పుత్రునిగా పుట్టి పెరిగిన ఆదినారాయణగారు పల్లె జీవితాన్ని అనుభవించినవారు కావటంతో వారిలో మట్టి పరిమళాలు ఇప్పటికీ పదిలంగా ఉండటం ప్రశంసనీయం. మట్టిబండి అనే ఈ కావ్యం ఊహాలోకంలో నుంచి ఊడి పడింది కాదు. అనుభవించి, పలవరించిన అద్భుత రచన. 'కవిరేవవిజానాతి కవేః కావ్యపరిశ్రమ" అంటారు. అలాగే ఆదినారాయణగారి మట్టిబండి కావ్యాన్ని చదివినప్పుడు "కృషిక ఏవ విజానాతి కృషికస్య పరిశ్రమః" అన్న మాటలు చెప్పాలనిపిస్తున్నది. కర్షక జీవితానికి కావ్యరూపాన్ని అందులోను దీర్ఘ కవితా రూపాన్ని అందించిన నాగభైరవవారు కవిగా విరాట్ రూపాన్ని ప్రదర్శించారని పలకటం సముచితం.

రైతు జీవితం మీద ఇంతకు ముందు ఎంతోమంది కవులు రచనలు చేశారు. కానీ నాగభైరవ వారి దారి వారిదే. వారి అభివ్యక్తి వారిదే. ఇంతకు ముందు ఏ కవీ చెప్పని రీతిలో కొన్ని భావాల్ని ప్రకటించిన ఆదినారాయణగారి ప్రతిభ ఈ కావ్యంలో వైవిధ్యాన్ని ప్రదర్శించింది. వైశిష్ట్యాన్ని ప్రతిబింబించింది. ఈ కావ్యరచన గావించటానికి దారితీసిన పరిస్థితుల్ని గూర్చి కవిగారు "ప్రపంచాన్ని నడిపించేది ఎవరైనా, కడుపు నింపి బ్రతికించేది మాత్రం కృషీవలుడే. హలాలతో పొలాలను దున్ని, పచ్చని పంటలు పండించే వ్యవసాయదారులే నిజమైన ప్రాణదాతలు... విపత్తుల కారణంగా అన్నదాతలు అన్ని విధాలుగా నష్టపోయి దిక్కుతోచక, దిక్కులేక ఆత్మహత్యలకు పాల్పడవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రైతుల ఆత్మహత్యల గురించి విన్నప్పుడు, పత్రికలలో ఆ వార్తలు చదివినప్పుడు మనసు కలత బారుతుంది. కళ్లు చెమ్మగిల్లుతాయి. ఆ బాధ వేదనలే రైతు గురించి ఈ దీర్ఘకవిత వ్రాయడానికి ప్రేరకాలు". అని చెప్పిన తీరు ఎవరినైనా కంటతడి పెట్టిస్తుంది.

మట్టిబండి అనే రచన పేరుకు దీర్ఘకవిత అయినా ఇందులో మహా కావ్య లక్షణాలున్నాయి. సాధారణ సంప్రదాయ రీతిలో కాకుండా "ఫ్లాష్ బ్యాక్" పద్ధతిలో కావ్యాన్ని రచించటం ద్వారా తమ విశిష్ట ప్రతిభను ప్రదర్శించారు. రైతు పొలాన్ని, ఎడ్లను అమ్మివేసిన తీరును వివరిస్తూ ప్రారంభించిన కవితలో మధ్యభాగంలో రైతు జీవితం, వ్యథల్ని చెప్పి ముగించబోయే సందర్భంలో పొలాన్ని అమ్మిన విషయాన్ని ప్రస్తావించటం ద్వారా తమ అసాధారణ కావ్యశిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మట్టిబండి అనే పేరు నలభై పుటల తర్వాత మాత్రమే ప్రకటించి తమ కవితా చాతుర్యాన్ని ప్రదర్శించారు.

కావ్యం మంగళంతో మొదలై, మంగళమధ్యమై, మంగళాంతం కావాలనే కావ్య సంప్రదాయానికి విరుద్ధంగా తాము రచిస్తున్న రైతు జీవితం ఆసాంతం

విషాదమయమని చాటటానికి "మా పొలాన్ని అమ్మేశాను – చితిని చేరేవరకు – బతుకులో భాగంగా ఉంటుందని భావిస్తూ వచ్చిన పొలాన్ని – భయపడుతూ – బాధపడుతూ అమ్మేశాను" (పుట1) – అని కావ్యాన్ని ప్రారంభించారు.

కావ్య ప్రారంభ వాక్యమే పాఠకుల హృదయాల్ని ద్రవింపజేస్తుంది. రైతు శరీరంలో ఒక భాగంలాంటిది పొలం. ఇప్పుడు పొలాన్ని అమ్మివేశానని చెప్పటం ద్వారా రైతు వికలాంగుడనయ్యానని చెప్పకనే చెప్పాడు. పొలాన్ని అమ్మటానికి రైతు భయపడ్డాడు, బాధపడ్డాడు. ఎందుకు భయం? ఇన్నాళ్లు తన జీవనాధారమైన పొలం తనది కాకుండా పోతుండటంతో రేపటి నుంచి తన పరిస్థితి ఏమిటి? అని ఆలోచించుకొంటే భయం. వారసత్వంగా వచ్చిన పొలాన్ని అమ్ముకోవటంవల్ల బాధ. మూడు తరాలపాటు ముప్పూటలా బువ్వపెట్టి బతికించిన పొలాన్ని అమ్ముకోవటంవల్ల బాధ. పండుగలకు, పబ్బాలకు, పురుళ్లకు, పుట్టినరోజులకు అన్నింటికి ఆసరాగా నిలబడ్డ పొలాన్ని అమ్మినందుకు బాధ. ఆనువంశిక నియమాన్ని అతిక్రమించినందుకు బాధ. సమాజంలో తనకొక గౌరవాన్ని కలిగించిన పొలాన్ని అమ్మినందుకు బాధ. అసలు పోయిన తర్వాత కొసరు ఎందుకని, పొలాన్ని అమ్మిన తర్వాత వ్యవసాయంలో సాయంగా నిలిచిన ఎడ్లను, బండిని అమ్మినందుకు బాధ. ఇంటపుట్టిన ఎడ్లను, తమ పిల్లలతో పాటు తమ తల్లిపాలు పంచుకుంటూ ఎదిగిన చంటి బిడ్డల్లాంటి, కంటి పాపల్లాంటి ఎడ్లను అమ్మినందుకు బాధ. ఇలా కావ్యారంభం కన్నీటి వరదగా మారిపోయింది. కవిభావుకతకు, వ్యవసాయంతో ఆయనకున్న అనుబంధానికి ప్రారంభం అక్షర సాక్ష్యమైంది.

తమ ఇంట పెరిగిన ఎడ్ల ఔన్నత్యాన్ని కవిగారు ఎంతో ప్రతిభావంతంగా చిత్రించారు. చిన్నపిల్లలు దరిచేరినా కొమ్ము విసరవని, ఆకలైతే తప్ప 'అంబా' అని అరవవని, పలుపు తాళ్లను తెంపవని, కట్టు గొయ్యల్ని పెరకవని, చిక్కాలు కట్టకపోయినా, పక్క చేలల్లో గడ్డిపరకలు కూడా ముట్టవని తమ ఎడ్ల గొప్పతనాన్ని తలచుకొన్నారు. ముల్లు గర్రకు, చెర్నాకోలకు పనిచెప్పవలసిన పనిలేకుండానే "ఆయ్" అని అదిలిస్తే చాలు బండిని ఇంటికి చేర్చేవని, ఎన్ని పొలాలు దున్నాయో, ఎన్ని కళ్లాల్లో ధాన్యాన్ని నూర్చాయో, ఎన్ని గాదెల పంటల్ని ఇంటికి చేర్చాయో అని ఎడ్ల నిజాయితీని, తమకు ఉపకరించిన తీరును స్మరించుకున్నారు.

**రైతుకి, ఎడ్లకు ఉన్న అనుబంధం :**

ఒక్కరోజు రైతు కనిపించకపోతే ఎడ్లు ఎంతో దిగులుపడేవి. చొప్ప ముట్టేవికావు, పచ్చగడ్డిని కొరికేవికావు. చిట్టుకలిపి కుడితి పెట్టినా మూచూసేవి కావని చెప్పటం ద్వారా రైతుకు, ఎడ్లకు ఉన్న అనుబంధాన్ని కవి స్పష్టం చేశారు.

రైతు కనిపించగానే ఎడ్లు గారాలు పోయేవి. ముట్టెల్ని రైతు భుజాల మీద చేర్చి కదలకుండా అలాగే ఉండిపోయేవి. రైతును కదలనిచ్చేవికావు. మూపుమీద చెయ్యివేసి నిమిరితే సేదదీరి, ఆదమరిచేవి. అలాంటి బిడ్డల్లాంటి ఎడ్లను, వాత్సల్యంతో పెనవేసుకొని పెంచుకున్న ఎడ్లను నిర్దయగా, నిర్దాక్షిణ్యంగా అమ్మివేసినందుకు రైతు గుండె పగిలిపోయింది. ఎడ్లను కొన్న ఆసామి వాటిని తోలుకుపోతుంటే చూడలేక తలదించుకున్న రైతు కళ్లల్లో నీళ్లు కమ్మాయి. ప్రాణం ఆపుకోలేక తిరిగిచూస్తే ఎడ్లు కనిపించలేదని చెప్పిన తీరు కరుణరస ప్లావితమైంది.

**రైతుకు బండితో ఉన్న బంధం :**

పొలం తాతగారి సంపాదన. బండి కూడా ఆయనే చేయించాడు. తాతను పాముకాటు వేస్తే పాముల నరసయ్య దగ్గరకు తీసుకువెళ్లింది ఆ బండే. అమ్మ పురుటి నొప్పులకు ఆసుపత్రికి తీసుకువెళ్లింది, పసిగుడ్డు అయిన కవిని, అమ్మతో పాటు ఇంటికి చేర్చింది ఆ బండే. తన ఇంటికి దీపమైన ఇల్లాలిని ఇంటికి చేర్చింది, సింగరకొండ తిరునాళ్లకు వెళ్లాటానికి సింగారమైంది ఆ బండే. రైతురంగాను ఊరేగించింది తమ బండేనని కవి బండికీ, తనకూ ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్న తీరు ప్రతిఒక్కరినీ బాల్యస్మృతుల్లో విహరింపచేస్తుంది.

**కవితాప్రతిభ :–** "వర్ణనా నిపుణుడైనవాడే కవి" అని ఆలంకారికుల అభిప్రాయం. అందుకే కొంతమంది వర్ణనమే కవిత్వమని, కవిత్వమే వర్ణనయని చెబుతారు. కవి నాగభైరవ ఆదినారాయణగారు తమ ఎడ్లను వర్ణిస్తూ తమదైన ప్రతిభను ప్రదర్శించారు. సంప్రదాయ కావ్యాల్లో ఇలాంటి వర్ణనల కోసం వెదకటం వృథా ప్రయాసే. తమ ఇంటి ఎడ్లను వర్ణిస్తూ కవి.

*ఎత్తయిన మూపురాలు / రాజసం కనిపించే నడకలు /*

***నడకకు లయబద్ధంగా ఊగే గంగడోళ్లు / కాటుక / దిద్దినట్లున్న కళ్లు / ఎంత అందంగా, హుందాగా ఉండేవో / ఒంగోలు జాతికి చెందిన ఎడ్లు కదా!*** *(పుట-3)* – అని చెప్పటంలో తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. పైన చెప్పిన అన్ని కవిత్వపు పంక్తులకు మకుటంగా ప్రకాశించింది చివరిపాదం. ఇంకా తమ ఎడ్ల ఔన్నత్యాన్ని వివరిస్తూ

***అపురూపమైన / ఆ వృషభాల రూపాలను చూస్తే / లేపాక్షి బసవన్న అయినా / లేచి నిలబడాల్సిందే! / తోకతోపాటు మోరపైకెత్తి / రంకె వేశాయంటే / కైలాసంలో నంది మీదున్న / పరమేశ్వరుడైనా సరే / పరమాశ్చర్యంతో / తలను దించి చూడాల్సిందే!*** *(పుటలు 3,4)* అని చెప్పిన తీరులో కవిభావుకత, ఆలంకారిక ప్రతిభ స్పష్టమవుతాయి. అతిశయోక్తి అలంకారం ఈ పంక్తుల్లో అద్భుతంగా ప్రకాశించింది.

***నేను అమ్మేసిన – ఈ పొలం, ఎడ్లు, బండి తమ రూపాలను రూపాయలుగా మార్చుకొని – ఋణదాతల గృహాలకు రెక్కలు కట్టుకొని ఎగిరిపోయాయి.*** *(పుట-8)* – అని కవి చెప్పిన తీరులో వారి అనన్య సాధ్యమైన కవితాభివ్యక్తి స్పష్టమవుతుంది. "రూపాలను రూపాయలుగా మార్చుకోవటం" అనటంలో ఎంత గాఢమైన ప్రతిభ ఉందో మనం గుర్తించవచ్చు.

పెళ్లయిన కొత్తలో తన కోసం అన్నాన్ని తెచ్చే ఇల్లాలిని తలచుకొని–

***ఈ చెట్టు కిందనే ఎదురుచూస్తూ***

***కళ్లను కాలిబాట కప్పగించేవాణ్ణి*** – *(పుట-15)*

అని చెప్పటం ఆదినారాయణగారికే చెల్లింది. సాధారణంగా ఎదురు చూడటం అనే భావాన్ని చెప్పటానికి 'కళ్లు కాయలుకాచేలా' అనే జాతీయాన్ని ప్రయోగిస్తారు. కానీ కవి తన కళ్లను కాలిబాటకు అప్పగించేవాడినని చెప్పటం ద్వారా బాట ఎంత దూరం ఉంటుందో అది కనిపించేంతవరకూ తన చూపుల్ని ప్రసరింప చేశానని స్పష్టం చేశారు. కవిగారు తమ అభిప్రాయ ప్రకటన కోసం ఈ సందర్భంలో ప్రయోగించిన పదాలు పాఠకులకు ఒక వింత అనుభూతిని కలిగించే రీతిలో ఇలా రచించారు.

***"అది" ఈ చెట్టు కిందనే / ఎంతో 'ఇది'గా / కొసరి కొసరి వడ్డిస్తుంటే / మనసంతా 'ఏదోలా' అయిపోయేది / ఎదగదుల్లో ఏదో తెలియని / సందడి మొదలయ్యేది*** *(పుట-15)* – ఇక్కడ కవిగారు ప్రయోగించిన "అది" "ఇది" "ఏదోలా" ఎదగదుల్లో అనే పదాలు వారి పదప్రయోగ దక్షతకు, భాషమీద వారికిగల అధికారానికి, విశిష్ట అభివ్యక్తికి తార్కాణాలు.

"తంపట"వేసిన వేరుశనగకాయల్ని తిన్నతీరును వర్ణిస్తూ–

***కాలిన కాయలను / 'చిటుక్కు' మనిపిస్తూ ఒలిచి***

***బెల్లంతో కలిపి / "గుటుక్కు"మనిపించే వాళ్లం"***

– *(పుట-16)*

ఇక్కడ కవిగారు ప్రయోగించిన "చిటుక్కు" "గుటుక్కు" పదాలు ధ్వన్యనుకరణ పదాలై పాఠకులకు వినిపిస్తున్నాయి.

**అపూర్వ భావుకత :** కవి ప్రతిభ నవనవోన్మేషంగా ఉండాలి. ఎప్పటి కప్పుడు కొత్త ఆలోచనల్ని ప్రకటించాలి. నూతన మార్గంలో తన భావాల్ని ప్రకటించాలి. సాహిత్యంలో అంతకు పూర్వం ఏ కవీ చెప్పని తీరులో తనదైన మార్గంలో భావప్రకటన చేయటం విశిష్ట ప్రతిభావంతుడైన కవికి మాత్రమే సాధ్యం.

రైతును త్రిమూర్తులుగా భావిస్తూ నాగభైరవవారు ప్రకటించిన భావాలు వారిని ఒక ఉన్నత శ్రేణి కవిగా నిలబెడుతున్నాయి. నాకు తెలిసి ఏ కవీ ఈ రీతిలో చెప్పినవారు లేరనిపిస్తుంది.

రైతును బ్రహ్మగా భావించిన నాగభైరవవారు ***"అతివృష్టి, అనావృష్టి / కాలనాగులై కాటేసినపుడు / తన సీరాన్ని సిరాలో ముంచి / తన లలాటంపై / తన ఆత్మహత్యను / తానే లిఖించుకునే విధాత రైతు"*** *(పుట-29)* – అని చెప్పిన తీరు వారిని ఉత్తమ కవిగా ప్రకటిస్తున్నది. తన 'నాగలిని' సిరాలో ముంచి, తన నుదిటి మీద తానే ఆత్మహత్యను లిఖించుకొనే రైతు "బ్రహ్మ" లక్షణాలను కలిగి ఉన్నాడని చెప్పటం నిజంగా అభినందనీయం. వాస్తవానికి బ్రహ్మ ఇతరుల రాతల్ని రాస్తూ ఉంటాడు. కానీ ఇక్కడ రైతు తన నుదుటి రాతను తానే రాసుకొన్నాడని చెప్పటం ద్వారా రైతు బ్రహ్మకంటే అధికుడనే భావనను కవి గలిగిస్తున్నారు.

కవి రైతును విష్ణుమూర్తిగా భావన చేసి ***"కరువులు కాటకాలు / కాటేస్తాయని తెలిసికూడా / కాడిని, మేడిని / కంచెను, మంచెను / గుండెలపై నిలుపుకునే / లక్ష్మీనారాయణుడు రైతు"*** *(పుట-28)* – అని చెప్పిన తీరు కూడా కవిభావుకతకు అద్దం పడుతున్నది. ఇక్కడ కవిగారు రైతును కేవలం నారాయణునిగా చెప్పకుండా, లక్ష్మిని తన గుండెల మీద

నిలుపుకొన్న లక్ష్మీనారాయణుడని చెప్పటం ద్వారా తమ పౌరాణికపరిజ్ఞానాన్ని, ఔచిత్యాన్ని ప్రదర్శించారు.

కవి, రైతును ఈశ్వరునిగా భావనచేస్తూ ***హాలాహలం అంగిట్లో / ఉందని తెలిసికూడా / అనునిత్యం అలుపెరుగక / హాలాలతో పొలాలను దున్నే / గరళకంఠుడు రైతు"*** *(పుట-28)* – అని రచించారు. కవిగారి భావనా వైచిత్రికి, వ్యుత్పత్తికి ఈ పంక్తులు సాక్ష్యంగా ఉన్నాయి. పరమేశ్వరుని గూర్చి చెప్పటానికి పార్వతీపతి, అద్రిరాజల్లుడు, చంద్రశేఖరుడు లాంటి విశేషణాలు ఎన్నో ఉన్నా ఇక్కడ కవిగారు "గరళకంఠుడు" అనే విశేషణాన్ని ప్రయోగించటం ద్వారా తమ పదప్రయోగ దక్షతను నిరూపించుకొన్నారు. 'గరళకంఠుడు' లోకకల్యాణం కోసం తన కంఠంలో విషాన్ని నిక్షిప్తం చేశాడు. అలాగే రైతు కష్టాల హాలాహలాన్ని తన కంఠంలో నింపుకొని దేశ ప్రజలకు ఆహారాన్ని అందిస్తున్నాడని స్ఫురింప చేశారు.

ఈ సందర్భంలోనే కవిగారు తమ పౌరాణిక పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తూ ***"తెచ్చుకుంటున్న అప్పులు / ఆసాంతం తీర్చలేక / ఏటేటా వడ్డీలు కట్టే – వడ్డికాసుల వేంకటేశ్వరుడు రైతు"*** *(పుట-29)* అని అప్పుల్లో మునిగిపోయిన వడ్డికాసుల వేంకటేశ్వరుడే రైతని చెప్పారు. వేంకటేశ్వరుడు తన కల్యాణం కోసం అప్పు చేస్తే రైతు లోకకల్యాణం కోసం అప్పులు చేస్తున్నట్లు భావించవచ్చు. రైతును క్రీస్తుగా భావించినవారిలో గుంటూరు శేషేంద్రశర్మ ఒకరు. ఆయన "రైతు నాగలి మోస్తున్నాడు – క్రీస్తు శిలువ మోసినట్లు" అని ఆధునిక మహాభారతంలో అంటారు. నాగభైరవవారు ఇంకా విపులంగా ***"కష్టాల శిలువ నెక్కిన / రైతన్న / దీనంగా వేలాడుతున్నాడు / ఏసుక్రీస్తులా / పునరుత్థానం గురించి / సరైన సమాధానం కనిపించని – సవాలక్ష సందేహాలు"*** – *(పుట – 28)* – అని అద్భుతంగా భావన చేశారు. క్రీస్తు పునరుత్థానం చెంది ఆయన అనుయాయులకు సంతోషం కలిగించాడు. కాని కష్టాల శిలువనెక్కిన రైతు ఆ కష్టాల నుంచి పునరుత్థానం చెందుతాడా లేదా? అని సవాలక్ష సందేహాలున్నాయని తమదైన ప్రతిభను ప్రకటించారు.

నాగభైరవ ఆదినారాయణగారు రైతునుగూర్చి భావనచేసిన తీరు అనన్యసామాన్యంగా, అపూర్వంగా ఉన్నదని చెప్పటానికి అనేక కవిత్వపు పంక్తులు ఉదాహరణ యోగ్యాలుగా ఉన్నాయి.

***"రైతంటే / సస్యమనే / అశ్వాన్ని అధిరోహించి / ఆకలి రాకాసినుండి / లోకాన్ని కాపాడే రౌతు"*** *(పుట – 20)* – రూపకాలంకారంలో సాగిన ఈ భావన నాగభైరవవారిది మాత్రమేనని నా అభిప్రాయం.

***"రైతంటే / ఏడాది పొడవునా / సాగు అనే యాగాన్ని ఆచరించే / గొప్ప ఋత్విక్కు"*** *(పుట – 21)* – సాధారణంగా యజ్ఞాలను కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే నిర్వహిస్తారు. కానీ రైతు మాత్రం ఏడాది పొడుగునా 'సాగు' అనే యాగాన్ని ఆచరిస్తున్నాడని చెప్పిన తీరు అపూర్వం.

***"రైతంటే అన్నప్రదాత / మన్నునుండి / పరబ్రహ్మ స్వరూపాన్ని / రూపొందించే విధాత"*** *(పుట – 21)* – రైతు లోకానికి అన్నాన్ని ప్రసాదిస్తాడు. "అన్నం పరబ్రహ్మ స్వరూపమ్" అని ఆర్యోక్తి. మట్టి నుంచి అన్నాన్ని సృష్టించే బ్రహ్మగా రైతును భావన చేసిన నాగభైరవవారి భావుక శక్తి ప్రశంసనీయం. రైతు ఆదిభిక్షువు అయిన పరమేశ్వరుని ఆకలినైనా తీర్చగల రక్షకుడని చెప్పటంలోనూ కవిగారు తమ విశిష్టతను ప్రకటించారు.

హాలికుడు ఏకవచనాన్ని బహువచనంగా మార్చగల మహామాంత్రికుడని చెప్పి దాన్ని ***"జడ్డిగం ద్వారా ఒక్క గింజను / జారవిడిచి / మొక్కను మొలకెత్తిస్తాడు / రంగురంగు పూలను / రకరకాల ధాన్యాలను / కల్పిస్తాడు"*** *(పుట – 21)* – అని వివరించి రైతులో నిక్షిప్తమైన ఇంద్రజాల విద్యను స్పష్టం చేశారు. హాలికుని మాంత్రికునిగా భావన చేసిన కవిశబ్దజాల జాంగలికునిగా కనిపిస్తారు.

ఇంకొక చోట కవిగారు రైతును గూర్చి వర్ణిస్తూ ***"విశాల విశ్వాన్ని / తిండి పెట్టి బతికిస్తున్నా / స్వాతిశయం ప్రదర్శించని / స్వాతిముత్యం రైతు"*** *(పుట – 22)* – అని అద్భుత భావన చేశారు. ***వర్షపు చినుకును ఒడిసిపట్టి / "విత్తునకు సత్తువను కూర్చి / పచ్చదనాన్ని పసిడిగా మార్చే – కార్మికుడు రైతు"*** *(పుట – 22)* – అనిచెప్పిన తీరులోనూ అపూర్వ భావం ఉంది. విత్తు, సత్తువ అనే శబ్దాల ప్రయోగంలోనూ, పచ్చదనాన్ని అంటే పచ్చని పొలాన్ని పసిడిగా అంటే బంగారు రంగులో ఉండే ధాన్యంగా మార్చగలిగిన కార్మికుడుగా అంటే ఎంతో కష్టించిన వ్యక్తిగా రైతును భావన చేశారు. బంజరు భూముల్ని సప్తవర్ణ నైవేద్యంగా, హృద్యంగా మార్చగలిగినవాడు సేద్యగాడని చెప్పారు! "విత్తనాన్ని – విత్తంగా మార్చగల – సత్తా ఉన్న – ఇంద్రజాలికుడు"గా రైతును భావించారు.

రైతు దానగుణాన్ని వివరిస్తూ తనకున్న సంపదను, ఎదుటివారికి దానం చెయ్యకుండా ఉండలేని తత్త్వం రైతుదని చెబుతూ ***"ఆస్తిలో, ఆదాయంలో / వామనత్వమే అయినా / రైతు అంతరంగం నిండా / బలితత్త్వమే"*** (పుట – 22) అని స్పష్టం చేశారు. ఇంకా రైతు "పనివాళ్లకు దానకర్ణుడైన తీరును, ఆకలితో వచ్చిన అతిథులకు అన్నమైన విషయాన్ని, యాచకులకు కబళమయ్యే తత్త్వాన్ని" వివరించారు. రైతు స్వాభిమానాన్ని ప్రకటించిన కవి తనకంటే పూర్వమున్న కర్షక కవులైన పోతన, ఏటుకూరి, దువ్వూరి, తుమ్మల వార్ల ప్రస్తావన చేసి "జైకిసాన్" నినాదాన్ని ఇచ్చిన లాల్‌బహదూర్ శాస్త్రిగారిని ప్రశంసించారు. "జైకిసాన్" నినాదం ద్వారా రైతుల ఔన్నత్యాన్ని ప్రకటించిన శాస్త్రిగారి ఆలోచనకు రైతులు మీసాలు మెలిపెట్టి, పంచెలు ఎగ గట్టి ఆనందంతో పొంగిపోయినట్లు నాగభైరవవారు చెప్పిన తీరు స్తవనీయంగా ఉంది.

**రైతుల ప్రస్తుత స్థితి :–** ఒకనాడు భారతదేశంలో గౌరవాన్ని పొందిన రైతు పరిస్థితి ప్రస్తుతం ఋతువులు గతులు తప్పటంతో ఛిన్నాభిన్నమైందని కవిగారు చెప్పారు. వర్షాలు రావటంలేదని చెప్పటానికి "మబ్బులు ముఖాలు చాటేస్తున్నాయని, ఆకాశంలో ఎంత వెదకినా వాటిజాడ కనిపించటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు వెయ్యటానికి భూమి పదును కావటంలేదు. నాగళ్లు సాగటంలేదు. నకిలీ విత్తనాలు నడివిధిలో నగ్నంగా నాట్యం చేస్తున్నా పట్టించుకొనే నాథుడు కనిపించటం లేదని తీవ్ర వేదనకు గురి అయ్యారు. మద్దతు ధరకావాలని గొంతెత్తి అరుస్తున్నా అధికారుల ముందు "బధిరశంఖారావమే" అయిందన్నారు. దళారీల దోపిడీవల్ల "సమస్యల పద్మవ్యూహంలో – రైతు అనే అభిమన్యుడు" ఒంటరి పోరాటం చేస్తున్నాడని చెప్పారు. రైతుకు అప్పులు తప్ప, ధాన్యపు కుప్పలు కనిపించటం లేదని, స్వేదాన్ని వర్షిస్తున్నా మోదానికి నోచుకోవటం లేదని రైతుల దైన్యాన్ని ప్రకటించారు. ప్రకృతి వైపరీత్యాలవల్ల రైతు తీవ్రంగా నష్టపోతున్న తీరును హృదయ విదారకంగా వివరించారు.

**కొడుకుల ఆలోచనలు :–** కవిగారికి ఇద్దరు పుత్రులు, ఒకడు హైదరాబాదులో ఉండి ఉద్యోగం చేస్తూ ఉండగా మరొకడు ఆయనతో పాటే వ్యవసాయం చేస్తున్నాడు. పెద్దవాడు అప్పుడప్పుడు ఆర్థికంగా ఆదుకొంటున్నా ఆదాయం కనిపించని వ్యవసాయం చేస్తూ ఎంతకాలం గడుపుతారని, వ్యవసాయాన్ని ఆపివేయవలసిందని సూచిస్తాడు. అంతే కాదు మూడు తరాలకింద కొన్న పొలం సొమ్ముతో హైదరాబాదులో ఒక స్థలం కొంటే అది నోట్లు ముద్రించే యంత్రమయ్యేదని చెప్పి, ఒకవేళ చిన్న వ్యాపారం మొదలు పెట్టినా ఎంతో కొంత ఎదిగి స్థిరపడి, సుఖపడేవాళ్లమని చెప్పాడు. ఇకనైనా వ్యవసాయానికి స్వస్తి చెప్పి నిర్ణయాన్ని కవిగారికే వదలి వెళ్లాడు.

చిన్నవాడు చదువుకున్నది కొద్దిగానే అయినా లోక జ్ఞానం బాగానే ఉన్నవాడు. మారిన పరిస్థితుల్లో వ్యవసాయం చేసేవారిని పెళ్లిచేసుకోవటానికి అమ్మాయిలు ముందుకు రాకపోవటంవల్ల చిన్నవాడిచేత మూడుముళ్లు వేయించాలనే ప్రయత్నం మూడు సంవత్సరాల నుంచి సాగుతూనే ఉంది. రైతు కుటుంబంలో పుట్టిన యువతులు కూడా రైతుగా జీవిస్తున్న యువకుల్ని పెళ్లిచేసుకోవటానికి ఇష్టపడటంలేదు. చిన్న కొడుకు తనకు పెళ్లిచెయ్యమని నిలదీస్తాడేమోనని తండ్రి వణికిపోతున్నాడు. ఇదీ రైతుకుటుంబ పరిస్థితి.

**ప్రస్తుత సమాజం :–** ఇప్పుడు వ్యవసాయం రైతుల పాలిటి ఉరికొయ్యగా, కష్టనష్టాల అంపశయ్యగా మారిపోయిందని కవి ఆవేదన, "వందల కోట్లు అప్పులు తీసుకొని ఎగగొట్టే బడాబాబులకు బ్యాంకులు అప్పులిస్తున్నాయిగాని, వ్యవసాయదారునికి అప్పు ఇవ్వాలంటే చుక్కలు చూపిస్తున్నాయి. కార్పరేట్ దిగ్గజాలకు ఋణమాఫీని ప్రకటించే బ్యాంకులు, ప్రకృతి వైపరీత్యాలతో పంటనాశనమైన పరిస్థితుల్లో కూడా రైతుల పట్ల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తున్న తీరును కవి కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. గిట్టుబాటు ధరలు నిర్ణయించే సంఘాల్లో రైతులకు ప్రాతినిధ్యం ఉండటం లేదు. రైతులు అమ్మిన ధాన్యానికి నెలలు గడుస్తున్నా డబ్బులు రాని పరిస్థితి. రైతులు హక్కుల సాధన కోసం పోరాటం చేస్తే లాఠీ దెబ్బల కానుకలు లభిస్తున్నాయి. కానుకలు సమర్పించనిదే సహకార సంఘాలు సహకరించటం లేదు. అప్పులు చెల్లించలేక రైతులు ఆత్మాభిమానంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు''. ఇంతటితో వ్యవసాయానికి ముగింపు పలకమని చెప్పిన కొడుకు

గీతాబోధ చేసిన శ్రీకృష్ణునిలా రైతుకు కనిపించాడు. కవి రైతులో పరకాయ ప్రవేశంగావించి రచించిన కన్నీటి కథ ***మట్టిబండి "ఎండకు పెట్లిపోయి / వానకు కరిగిపోయే / మట్టిబండిలా''*** *(పుట - 41)* - రైతు జీవితం మారిపోయిందని కావ్యనామ సార్థక్యాన్ని ప్రకటించారు.

**అలంకారికి ప్రతిభ :-** కావ్యం రూపంలో చిన్నదిగా కనిపిస్తున్నా మట్టిబండి లో ఎన్నో రత్నాలున్నాయి. మాణిక్యాలున్నాయి. మట్టిబండి ని స్వర్ణమయంగావించి ప్రకాశిస్తున్నాయి. అంత్యప్రాసలు కవిగారి శాబ్దిక వైదుష్యానికి ప్రతీకలుగా వెలుగొందుతున్నాయి.

***"పండగలకు పబ్బాలకు / అక్కరలకు / అవసరాలకు / పురుళ్లకు, పుట్టిన రోజులకు - అన్నింటికి, ఇంటికి"*** అన్నప్పుడు ఆదినారాయణగారి అంత్యప్రాస విన్యాసం 'ఔరా' అనిపిస్తుంది. ఇలాంటివి అసంఖ్యాకంగా ఈ దీర్ఘకవితలో చోటుచేసుకొన్నాయి.

***"వర్తమానంలో / వ్యాపకాలుగాని / భవిష్యత్తులో / వ్యామోహాలుకాని"*** ఉండే అవకాశం లేదు. అక్షర సమూహాన్ని అర్థభేదంతో ప్రయోగిస్తూ కవిగారు ''యమకం'' అలంకారాన్ని కూర్చిన తీరు మనోహరంగా ఉంది.

***మా అయ్య / నాగలి పట్టి దున్నితే "చాలు" / స్కేలు పెట్టి పెన్సిల్‌తో - గీత గీసినట్టుండేది "చాలు"*** - అని చెప్పినప్పుడు ముందుగా ప్రయోగించిన "చాలు"కు సరిపోతుంది అనే అర్థాన్ని - తర్వాత ప్రయోగించిన "చాలు"కు వరుస అనే అర్థాన్ని పొదిగించిన కవి ప్రతిభ ప్రశంసనీయం. మరోచోట

***ఇంతటితో ముగించు 'సాగు' / ఇంకోవృత్తిలో ముందుకు 'సాగు'*** - అని రచించారు. ఇక్కడ మొదటి సాగుకు వ్యవసాయం అనే అర్థాన్ని, రెండో 'సాగు'కు ముందుకు నడవమని అర్థాన్ని పొదిగించి యమకాలంకారాన్ని కూర్చారు.

అర్థాలంకారాల్లో ఉపమ, రూపకాలను బాగా ప్రయోగించిన కవిగారు ఉపమాలంకారాన్ని కుప్పలు పోశారు.

**ఉపమ :** ***"కాలం అలా వెలిమబ్బులా - కరిగిపోయేది"*** *(పుట - 12)*

ఒక్కొక్కడు ***"మదపు టేనుగును అదలించే / మావటీలాగా / ఐరావతాన్ని అధిరోహించిన / అమరపతిలా"*** అగుపించేవాడు (పుట-13)




***చిటారుకొమ్మన / మిఠాయి పొట్లాల్లా సొరపిందెలు*** *(పుట - 14)*
***గడ్డిపరకలపై పడిన / మంచు బిందువులు / ముత్యాల్లా కనిపించేవి*** *(పుట - 15)*
***"తుట్టెను కదిపితే / కుట్టే కందిరీగల్లా / జ్ఞాపకాలు నన్ను / చుట్టు ముడుతూనే ఉన్నాయి"***
*- (పుట - 20)*

ఇలా ఎన్నో ఉదాహరణలున్నాయి. అలాగే రూపకాలంకార ప్రయోగంలోనూ కవి తన దక్షతను ప్రదర్శించారు.

***"ఆ కుంట కంటబడితే / ఎన్నెన్ని జ్ఞాపకాల ఊటలో"*** *(పుట - 11)* - ఇక్కడ ఛేకానుప్రాసతో కూడిన రూపకం ఉంది.

***వసివాడని పసితనపు / పరిమళాలు గుప్పుమంటూ / గుర్తుకొస్తాయి*** *(పుట - 18)* - ఇలా ఎన్నో ఉన్నాయి.

విశిష్ట కావ్యశిల్పంతో రచించిన ఈ దీర్ఘకవితను ముగిస్తూ నాగభైరవవారు తమ ప్రత్యేకతను ప్రదర్శించారు. తాను పొలాన్ని అమ్మిన తీరును తెలుపుతూ కావ్యాన్ని మొదలు పెట్టి - అదే విషయంతో కావ్యాన్ని ముగింపులో చెప్పారు. ''బ్రతుకు తెరువు కోసం మరోదారి చూసుకోవాలని - పొలాన్ని అమ్మివేసినట్లు'' పొలం అమ్మటానికిగల కారణాన్ని స్పష్టం చేశారు - కావ్యాన్ని ముగిస్తూ.

***''రేపు / అన్నమో రామచంద్రా!'' అనే అరుపులు వినిపిస్తాయేమో! / "అలో లక్ష్మణా! అంటూ అసువులు బాసే / ఆకలిచావులు/ కనిపిస్తాయేమో! ఏమో! - ఏమో!"*** *(పుట - 42)* అని రచించిన తీరు గుండెల్ని పిండేస్తుంది. బాధతో కావ్యాన్ని ముగించిన కవి రేపటి తరానికి అలాంటి పరిస్థితిని తీసుకురావద్దని పరోక్షంగా ప్రబోధిస్తున్నట్లు భావించవచ్చు.

రైతును గూర్చి దీర్ఘకవితను రచించిన నాగభైరవ ఆదినారాయణగారు మహాకవిగా సాక్షాత్కరిస్తారు. అద్భుతమైన ఆలోచనలు, అపూర్వ భావాలు, అనన్య సామాన్యమైన అభివ్యక్తి నాగభైరవవారి త్రివిక్రమ స్వరూపాన్ని ప్రకటిస్తున్నాయి. కర్షకసాహిత్యంలో మట్టిబండి మేలిముత్యం.


డా. గుమ్మా సాంబశివరావు
విజయవాడ. ఫోన్: 984 926 5025.

# తెలంగాణ కవయిత్రులు

**– కరిమిండ్ల లావణ్య**

తెలంగాణలో మహిళలు రాసిన కవిత్వం 19వ శతాబ్దం పూర్వార్థం నుంచే కనబడుతున్నది. నిజాం పరిపాలన ప్రభావం మహిళల విద్యపై ఉన్నప్పటికీ చదువుకున్న మహిళలు వారి కవిత్వం ద్వారా మహిళలను చైతన్య పరచాలనే ప్రయత్నం ఆనాటి కవిత్వంలో కనిపిస్తున్నది.

19వ శతాబ్దానికి పూర్వం క్రీ॥శ॥ 1230 – 1300 ప్రాంతంలో నివసించిన కుప్పాంబిక *రంగనాథ రామాయణం* రాసిన గోన బుద్ధారెడ్డి కూతురు. ఈమె రాసిన పద్యాన్ని అయ్యలరాజు సంకలనం చేసిన గ్రంథంలో ఉన్నదని "తొలి తెలుగు కవయిత్రి కుప్పాంబిక" అనే వ్యాసంలో సంగిశెట్టి శ్రీనివాస్ అభిప్రాయపడ్డాడు. 1847లో వరిగి తాలూకాలోని ఇప్పటూరులో జన్మించిన రూప్‌ఖాన్‌పేట రత్నమ్మ (పెనుగోళ్ళ రత్నమాంబ దేశాయి) ఆధునిక కవయిత్రులలో మొదటి వ్యక్తిగా చెప్పవచ్చును. ఈమె వెంకటరమణ శతకం, శ్రీనివాస శతకం, బాలబోధ, శివకొరువంజి, దశావతార వర్ణన తదితర రచనలు చేసింది. గోలకొండ కవుల సంచికలో సంసార తరణము పేరుతో మూడు కంద పద్యాలు రాసింది. పాటల విషయానికొస్తే, మొదటగా మఠం మహంతమ్మ (హనుమంతమ్మ) మఠం మడివ్యాళయ్య (1833) మాదిరిగానే, ఆయన బాటలోనే అనేక పాటలు రాసింది. ఈమె నిజామాబాదు జిల్లాలోని బొర్లెం (బొర్గెం) గ్రామంలోని బసవేశ్వరునిపై పాటలు రాసింది.

***శ్రీ సదాశివచిత్త సరసిజవాస గురు నందీశ్వరా***
***వాసవాంచి గిరీశ సన్నుత దాసపాలక శ్రీకరా***
***వ్యాస భుజయుగ వార్ధి కుంభజ యేశ భువనాధీశ్వరా***
***భాసుర ప్రద బొరళా చల మందిరా బసవేశ్వరా***
***దయసేయు పుత్రసంతానం*** *(సేకరణ : ముంగిలి)*

1850 తర్వాత బిజినేపల్లి చెన్న కృష్ణమ్మ వనపర్తి సంస్థాన ప్రాంతంలో ప్రసిద్ధుడైన చంద్రమౌళీశ్వరస్వామి శిష్యురాలు. కపిలదేవహూతి సంవాద యక్షగానం, సత్యనారాయణ కథాకల్పం, బువ్వ బంతి పెండ్లి పాటలు, గురుభజన తత్త్వాలు రాసిందని ముంగిలిలో డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాశారు. తిరుమల బుక్కపట్నం కృష్ణమ్మ ఆత్మకూరు సంస్థాన విద్వాంసురాలు. ఈమె బుచ్చి వెంకటాచార్యుల కూతురు. సంస్కృతాంధ్రల్లో, జ్యోతిష్యంలో పండితురాలు.

హైదరాబాదులో అచలతత్త్వాన్ని ప్రచారం చేసిన జాలమాంబ అనేక కీర్తనలు రాసింది. సీస పద్యం ద్వారా తాను రాసిన కవిత్వంలోని తప్పులను చెప్పాలని అన్నది.

***సీ. గురుపుత్రులార మద్గురుమూర్తి స్తోత్రంబు***
***రచియింప బూను నావచనములను***
***వినలేద్దగలిగిన వినరయ్య వినిపింతు***
***తప్పులుండిన వాటి దాచబోక***
***దిద్దవలసినది మీ దేశికేంద్రుని మీద మీకు***
***భక్త్యున్నట్టె నాకు గలదు***
***గాని మీవలె నేను కవిత జేయగజాల***
***చాలనంచని విడజాలతోచి***
***నట్లు జేయుదు మీ రందరభయమిడిన***
***ననుచు విజ్ఞాపనమొనర్చిన్***
***యాజ్ఞిగొంటి భాగవత వంశ భవకృష్ణ యోగి***
***రాజ ధీ విశారద మాకదేశి కేంద్ర***

*(సేకరణ: ఇందుమతి కవిత్వం: సం॥ సంగిశెట్టి శ్రీనివాస్)*

1913 ప్రాంతంలో కవిత్వం రాసిన యస్. సుందరీ బాయి, గిడుతూరి రామానుజమ్మను ప్రస్తావిస్తూ సంగిశెట్టి శ్రీనివాస్ ఇలా అన్నాడు. "తెలంగాణ సోయితో జరిగిన పరిశోధనల్లో జాలమాంబ, సుందరీబాయిలు వెలుగులోకి



చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ

వచ్చారు". 1934లో వచ్చిన గోలకొండ కవుల సంచికలో బోళ్ళ ఆండాలమ్మ, పొనుగోటి ఆనందమాంబ, సోమరాజు ఇందుమతీబాయి, జ్ఞానమాంబ, రూబ్బానుపేట రత్నమ్మ, వి. లక్ష్మీదేవమ్మ, బి. లక్ష్మీనరసమ్మ, లక్ష్మీబాయి, రాణి సర్దేశాయి వేంకట లక్ష్మాయమ్మ, కె. సీతాపిరాట్టమ్మల కవిత్వం ఉంది.

వీరిలో లక్ష్మీనరసమ్మ హైద్రాబాదు వాస్తవ్యురాలు. స్త్రీల పాటలు, భక్తవత్సల శతకం రాసింది. పద్యరచనలు చేసినవారు నేమాని భారతీ రత్నాకరాంబ అలాగే 1935లో ఏసుక్రీస్తుపై గీతాల్ని కె. ఫ్లారెన్స్ రాసింది. ఆ గీతం ఈ విధంగా ఉంది.

*గీ. మా కొఱకు గాను నీపుత్రు మమతజేసి*
*పంపితివి, కాని, యాయన, బాధలు వడె*
*దల్లి మరియమ్మ యెంతగా దల్లడిలెనొ*
*చిన్ని కొమరుదేసు క్రీస్తు సిలువమోయ*

1933 నాటికే తెలంగాణ నుంచి సోమరాజు ఇందుమతీదేవి ప్రణయ కవిత్వం రాసింది. ఈ కావ్యం పేరు కావ్యావళి. వేణుగోపాల శతకం కూడా ఈమె రాసినదే. ఇంకా శకుంతల పరిణయం కావ్యం రాసింది. భర్తపై ఉన్న మమకారంతో, పతిభక్తితో, స్మరణతో ఇందుమతీదేవి ఇలా రాసింది. కాల్పనికోద్యమ ప్రభావం ఈమె కవిత్వంపై ఉంది. అందులో ఆత్మాశ్రయధోరణి కనిపిస్తుంది.

*అరసి దేనిని గూర్చి మాటాడుచున్న*
*చూడ్కులన్నిప్పి దృశ్యంబు జూచుచున్న*
*కడగి భోగ్యపదార్థముల్ గుడుచుచున్న*
*రుచ్యములుగావు మీదగు రూపుకన్న*

పొనుగోటి ఆనందమాంబ గోలకొండ కవుల సంచికలో స్త్రీ విద్య ఆవశ్యకతను చెప్పింది. ఆ కవిత్వంలో మహిళలనుద్దేశించి ఆనందమాంబ ఆనాటి పరిస్థితులను తెలియజెప్పింది.

*కాంతలు మాతృభాషపయి గౌరవముంచక నన్య భాష న*
*శ్రాంతము నెరవేర్చినంతటను సారములేదిక గొప్పయైన శ్రీ*
*మంతముగల్గి యున్నదని మంగళ సూత్రముబారవైచి య*
*త్యంత సుభూషణంబులను దాల్చినరీతిని యెంచి చూడగన్*

1919లో హన్మకొండలో పుట్టిన నందగిరి ఇందిరాదేవి 'ప్రేమమయి' అనే గేయం రాసింది. నవ్యకవితా రీతులను అభిమానించిన కవయిత్రి ఈమె. కాల్పనికోద్యమ ప్రభావంతో కవిత్వం రాసినవారు పర్సా జానకీదేవి. ఈమె రసాంజలి, నిలింపశ్రీ, మధురశ్రీ, కవితా ఖండికలను రాసింది. ఇల్లిందల సరస్వతీదేవి నీ బాంచన్ కాల్మొక్తా అని చెప్తూ ఆనాటి సామాజిక స్థితిగతులను వివరించింది.

1930లో మహబూబ్‌నగర్‌లో పుట్టిన పాకాల యశోదారెడ్డి "భావిక" ఉగాదికి ఉయ్యాల పేరుతో వచన కవిత్వం రాసింది. భావికలో రాసిన 'స్త్రీ' కవితలో యశోదారెడ్డి అభిప్రాయం ఇలా ఉంది.

*ఆ సౌందర్యంలో*
*ఎంత ఆవేదన – ఎంత ప్రశాంతి*
*ఎంత విశ్వాసం – ఎన్ని ఘాతుకాలు*
*ఎంత బడబానలం – ఎన్నెన్ని? అగ్ని పర్వతాలు!*
*ఎంత అమృతం – ఎంతెంత మధురిమ*
*ఎంత దైన్యం – ఎంత ఆవేదన – ఎంత కన్నీరు!*
*కుములుతున్న ఆ నిప్పు*
*ఎప్పుడు రాజుకుంటుందో?*

అభినవ మొల్లగా బిరుదు పొందిన చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ భద్రాచలం వాసి (1939). ఈమె రాసిన రామదాసు పద్య కావ్యానికి కరుణశ్రీ, ఉత్పల సత్యనారాయణాచార్య, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి తదితరులు ముందుమాట రాశారు. ఆరు ప్రకరణలలో 250 పద్యాలతో ఉన్న కావ్యమిది. కవయిత్రి రామదాసు జీవితాన్ని ఈ కావ్యంలో ప్రతిఫలింపజేసింది. మాతృభూమి చారిత్రక చంపూకావ్యం, కావ్యగౌతమి, తులసీ దళాలు, భక్తి గీతావళి, దివ్య గీతాంజలి కావ్యాల్ని రాసింది. "తెలుగు తల్లికి వెలుగు పారాణి" కవితలో కవులందరినీ ప్రస్తుతించింది.

*ఆదికవీంద్రుని యక్షర రమ్యతా*
*నారికేళరుచులు నవరసాలు*

*నన్నెచోడుని తెలివెన్నెల పదముల*
*జాను తెనుగు నెఱజాణతనము*
*పండితారాధ్యుని వలపల గిలకల*
*ప్రాసతమాషాల రాసలీల*
*పాల్కుర్కి కవిదేవి పల్కు కుల్కుల వీర*
*శైవ వాఙ్మయపాత్ర శతక మధువు*

* * *

*గోనబుద్ధుని ద్విపదల తేనెవాక*
*సోమనార్యుని రచనల సోయగాలు*
*చెలువమంతయుగల బోసి చెదరిపోని*
*వెలుగు పారాణి దిద్దెద తెలుగు తల్లి*

పాలమూరు జిల్లాకు చెందిన జొన్నవాడ రాఘవమ్మ (1928) ఆకాశవాణిలో దాదాపు 600 పాటలు రాసి పాడింది. రాధికా గీతాలు, భావ తరంగాలు సంపుటాలు వెలువరించింది. ఈమె గేయాల్లో దేశభక్తితో పాటు తెలంగాణ ఉద్యమ కవిత్వం కూడ ఉంది. సినారె ఈమె గేయాలను ఉద్దేశించి ఇలా అన్నాడు. "వేణు మాధవుని తలచుకొని, పులకించి, రవళించిన హృదయం జొన్నవాడ రాఘవమ్మది''.

కరీంనగర్ జిల్లాలో బుట్టారెడ్డిగూడెంలో పుట్టి, నిజామాబాదులో నివసించిన త్రిభువనాదేవి ప్రకృతిపై, దేశభక్తిపై, ఆధ్యాత్మికపరమైన పాటలు ఆశువుగా పాడింది. ఈ కవయిత్రికి 8-12-1960 నాడు నల్గొండలో జరిగిన సాహితీ సమావేశంలో స్వర్ణహస్తఘంటాకంకణం తొడిగి, ఉభయ భాషా ప్రవీణ బిరుదునిచ్చారు.

పోరాట పటిమను ప్రజల్లో నింపడానికి మల్లు స్వరాజ్యం పోరాట పాటలు రాసింది. వీరమట్టారెడ్డి ఉయ్యాలో / వీరమరణమును ఉయ్యాలో / నీవంటి వీరులు ఉయ్యాలో / మాకు వెల్గు జూప ఉయ్యాలో... అంటూ పోరాటంలో వీర యోధులను గురించిన చరిత్రను ప్రజలకు తెలియపరచింది. అలాగే తెన్నేటి సుధాదేవి ఉదయకాంత, అమ్మ కవితా సంపుటులను వెలువరించింది.

ఆదిలాబాదు నుండి 1978లో వెలువడిన శైవలిని కవిత్వ సంకలనంలో కుమారి పద్మజా సాయర్‌వార్ నిరీక్షణ కవిత రాసింది. ఆరేండ్ల పసిపిల్లవాడి కోసం నిరీక్షణ దీని సారాంశం. మత్తడి కవితా సంకలనంలో సుధ రాసిన ''ఎందుకు వ్రాస్తావు కవిత్వం'', సంధ్య ''ఛీ'', కర్రి విజయకుమారి "గవిని దాటిరా", ఆఫ్రీన్ "చమన్", సబ్బని శారద "గోస ఏం జెప్పుదు", అనిశెట్టి రజిత "అవ్వ ఆగమయ్యింది", షాజహానా "ఎత", సూర్యాధనంజయ "బంజారా బతుకు", జాజుల గౌరి "వేల వడగండ్ల వాన నా తెలంగాణ'', అనే కవితలు మహిళలు రాసినవి ఉన్నాయి. వీరంతా నేడు సీరియస్‌గా కవిత్వం రాస్తున్న తెలంగాణ మహిళలు.

''కుళ్ళు వ్యవస్థ'' కవిత ద్వారా సమాజంలోని భేదభావాలు పోవాలని కోరుకున్నది వోత్కుపల్లి దమయంతీదేవి. జ్యోతిర్మయి ఓ అమ్మ కథ చిత్రానికి చందమామ పాట రాసింది. కవయిత్రికి భావన, దీప్తి, దివ్వెలు, నవత కవితా సంపుటాలను ప్రచురించింది. "రేపటి చైతన్యం" కవితలో అడుగు ముందుకు వేసిన అక్రమాన్నీ / చిత్రంగా నుసిచేసే అగరువత్తిని నేను / విచిత్రంగా మసి చేసే వగరు చిగురును నేను / రేపటి చైతన్యం కోసం / తపిస్తున్న ఉన్మాదిని నేను / మానవతావాదిని నేను". జూపాక సుభద్ర కవిత్వంలో సమాజాన్ని శుద్ధి చేయాలనే తపనతో పాటు కొంత వ్యంగ్యం చోటుచేసుకుంటుంది. దళిత కవిత్వం రాస్తున్న నేటి మహిళా కవయిత్రుల్లో ముఖ్యమైనవారు. గద్ద సరోజనీదేవి, జాజుల గౌరి, కందాల లిల్లి, గోగు శ్యామల, మేరి మాదిగ, వి. నాగమణి, స్వాతి మార్గరేట్, మేరీ మార్గరేట్ నేడు దళిత కవిత్వం రాస్తున్న మహిళలు. చిత్తరువు దళిత కవితా సంకలనంలోనూ మహిళలు కవిత్వం రాసారు.

నేటి కవిత్వంలో పద్య కవిత్వం, అందులో ప్రధానంగా శతక పద్యాలు, వచన కవిత్వం దానిలో విభాగాలుగానున్న నానీలు, హైకూలు, రెక్కలు - లఘు కవిత్వంలో మహిళలు రాసిన కవితా సంపుటులు, కవితా సంకలనాలున్నాయి. తెలంగాణ ఉద్యమ సందర్భంగా వెలువడిన మత్తడి, పొక్కిలి, ఊపిరి, మిర్గం, జిగర్, జిల్లాల వారీగా వచ్చిన సంకలనాల్లో మహిళల కవిత్వం సమప్రాధాన్యతను నోచుకున్నది. ఉద్యమ కవిత్వంలో ''గాయాలే గేయాలై'' అమృతలత సంపాదకత్వంలో వెలువడింది. దీనిలో పూర్తిగా మహిళలే వారి వారి ఉద్యమ పోరును వినిపించారు. నేడు కవిత్వాన్ని రాస్తున్న కవయిత్రుల్లో అనిశెట్టి రజిత ఒకరు. ''నిర్భయాకాశం

కింద", నేనొక నల్లమబ్బునవుతా, చెమట చెట్టు, ఉసురు, అనగనగా కాలం, దస్తఖత్, గోరంత దీపాలు, నహ్వా ఓ నహ్వా, దీర్ఘ కవితలు – ఓ లచ్చవ్వ, మార్కెట్ స్మార్ట్ శ్రీమతి వీరి కవితా సంపుటాలు. "గులాబీలు జ్వలిస్తున్నాయి" కవితలో సహించుటయే తెలిసిన ఆ సొగసందనాలు / నేడు దహించుకపోతూ / జ్వలిస్తున్నాయి జ్వలిస్తున్నాయి / గులాబీలు విప్లవిస్తున్నాయి. ఉత్సాహ జ్వాలలు ఈమె కవిత్వంలో ముమ్మరంగా కనిపిస్తాయి.

గరిశకుర్తి శ్యామల రాసిన కోవెల దీపాలు, చాడ లలితాదేవి భవానీ శతకం, అమ్మకు అక్షరార్చన, ఏ సిరాతో రాయాలి?, బండ సరోజన రాసిన సప్తస్వరాలు, ఒక పూవు పూసింది, ఎర్రమందారం, గద్ద సరోజనీదేవి దేశభక్తి గేయాలు, జ్వలిత రాసిన అగ్నిలిపి, వెంకన్నగారి జ్యోతి రాసిన నా పల్లెటూరు శతకం, నెల్లుట్ల రమాదేవి మనసు భాష, గడ్డం శ్యామల రాసిన వాసంత సమీరాలు, దాసోజు పద్మావతి రాసిన అక్షరార్చన, (గజల్ గీతాల సంపుటి) అమ్మకు ప్రేమతో, కె. జ్యోత్స్నప్రభ రాసిన కలల పరిమళం, ఎన్. అరుణ రాసిన పాట చెట్టు, పరవస్తు కమల రాసిన నా జన్మభూమి భారతి, పర్యాద సరళ (ఖండ కావ్యం, శ్రీలక్ష్మీనృసింహ శతకం) తదితర కవయిత్రులు వారి వారి కవిత్వాన్ని రాస్తూ భావి కవయిత్రులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. పర్యాద సరళ "పాడుతా తీయగా" ఖండ కావ్యంలో "అంతా నాదమయం" కవితలోని ప్రకృతి పరవశింపజేసింది.

*సీ. ఆకాశవీధిలో ఆనందముగ సాగి*
*అందమ్ముగా హంసలాడినటుల*
*మేఘమాలికలపై మెరిసేటి కిరణాలు*
*మెరుపు తీగల ముగ్గు పరచి నటుల*
*జలతారు వలువల జలదాంగనలు గూడి*
*జలమాలికల దీర్చి సాగినటుల*
*మబ్బు తెరల మాటు మసలెడి జాబిల్లి*
*ఆనంద జలకమ్ము లాడినటుల*
*తే॥గీ॥ అంతరసగంగ ప్రవహించి అవనియందు*
*వంపు సొంపులతో జాలు వారినటుల*
*మధుర సంగీత, సాహిత్య సుధలు జిలికి*
*పాడుతా తీయగా సాగె పరవశించి*

ఎన్. అరుణ రాసిన పాటల చెట్టులో "లో చూపు" కవితలో "నిజానికి / ఓ సూర్యోదయ ఏకాంత నిశ్శబ్దంలో / కళ్ళు మూసుకొని చూడు / తెరచి చూస్తే / నువ్వెంత మిగిలావో తెలుస్తుంది" అని అంటారు.

గుమ్మన్నగారి బాలసరస్వతి, జలజ, శారదా హన్మాండ్లు, అడువాల సుజాత, త్రివేణి, యమ్. రత్నమాల, ఇస్రత్ సుల్తానా, కొండపల్లి నీహారిణి, సూర్యా ధనంజయ, షహనాజ్ ఫాతిమా, విజయలక్ష్మి, యం. అంజనాదేవి, మడుపు రత్నాదేవి, కొమర్రాజు రామలక్ష్మి, నాంపల్లి సుజాత, బండారు విజయ, మేరీ మార్గరేట్ తదితర కవయిత్రులు కవిత్వం రాస్తున్న నేటి సమాజ నిర్దేశకులు.

తెలంగాణ వచ్చిన తరువాత మట్టి ముద్ర, కొత్తసాలు వంటి కవితా సంకలనాలు వచ్చాయి. కొత్తసాలులో జూపాక సుభద్ర రాసిన "నా జగాలు మారే వుగాదులెన్నడో... కవితలో–

*సూర్య సెంద్రుల్ని, సుక్కల్ని దిక్కుల్ని*
*కలేసి తొక్కు నూరినా ఆకలారని శోకము నాది*
*అక్షరాలు దరిజేరని లోకము నాది*
*గీ పీడకు పాడెగట్టే పొద్దెప్పుడో*
*నా పుండు మానే పండుగేనాడో*
*నా జగాలు మారే వుగాదులెన్నడో*

అంటూ ప్రపంచం మారే రోజు త్వరలోనే రావాలనే ఆశాభావం వ్యక్తం చేసింది కవయిత్రి. కలల కలకల కవితలో జ్వలిత అన్ని కుల వృత్తులను ప్రస్తావించినా చివరకు "సర్వేజన సుఖినో భవంతు" – శుభం భూయాత్" అనే ముగింపు పలుకుతుంది. మనకు ఇక్కడ అర్థమయ్యేది ఒక్కటే. జనం మారాలి. ఈ మార్పు అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి.

ఒక్కొక్క దశకాన్ని చూసినపుడు కవిత్వ వస్తువులో మార్పులు సమాజానుగుణంగా మారినాయి. నేడు వచన కవిత్వానికి ప్రాధాన్యత పెరుగుతున్నా, శతకాలు రాసే మహిళలూ ఉన్నారు. వీరి కవిత్వంలో సమకాలీన ఉత్సాహ, ఉద్వేగాలే కవితా వస్తువుగా నిలుస్తున్నాయి.

ఆచార్య కలిమిండ్ల లావణ్య
నిజామాబాద్. ఫోన్: 984 841 0244

# చలం - బ్రాహ్మణీకం

– ముంగర జాషువా

చలం గారి గురించి క్రొత్తగా తెలుసుకోవలసిన అంశాలేమీ లేవని చాలామంది సాహితీవేత్తల, పాఠకుల అభిప్రాయం. అయినప్పటికి చలం నవలల్లో అతి విశిష్టమైన నవల బ్రాహ్మణీకం చదివేటప్పుడు కొన్ని సందేహాలు నాలో మొలకెత్తినవి. వాటిని మీ ముందు కొంత చర్చించాలనే ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

మానవ జీవితం గురించి, స్త్రీ పురుష సంబంధాల గురించి సమాజంలో రావలసిన మార్పుల గురించి చలం చేసిన ప్రయత్నం సామాన్యమైనదేమీ కాదు. ఒక వ్యక్తిగా, రచయితగా, ఆచరణవాదిగా నిర్విరామంగా ఆయన చేసిన సాహిత్య సృజన, సాహిత్య చరిత్రలో చలాన్ని అచలంగా నిలబెట్టిందనే విషయం క్రొత్తదేమీ కాదు.

చలం వ్రాసిన ఈ నవలల్లో "బ్రాహ్మణీకం" ఎంతో విశిష్టంగా కనిపిస్తుంది. ఆ నవల చదివిన తర్వాత చాలా రోజులు ఒక స్త్రీమూర్తి తన పిల్లవాడి ఆరోగ్యం కొరకు పడిన బాధ మనసునెంతో వ్యాకుల పరిచింది. మాతృత్వం యొక్క అంతిమ స్వరూపాన్ని కనులకు కట్టినట్లు చలంగారు సుందరమ్మ పాత్ర ద్వారా జీవం పోసినాడు. తన బిడ్డకు ఆరోగ్యం బాగాలేనప్పుడు సుందరమ్మ పడే వేదన, ఆ రోజుల్లో పేద కుటుంబాల్లో ఈ రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో నివసించే వేలాది, లక్షలాది అమ్మల మనోవేదనకు అద్దం పట్టినట్లుగా ఉంది. పేద తల్లులకు మాతృత్వం వరమా? శాపమా? అనే దశకు పాఠకులను తీసుకు వెళ్తుంది చలం 'బ్రాహ్మణీకం' నవల.

చలం బ్రాహ్మణీకం ఆనాటి అభ్యుదయవాదులకూ ఈనాటి అభ్యుదయ రచయితలకు ఎంతో స్ఫూర్తినిచ్చిందనే విషయం మరువకూడదు. అసలు సంపన్న బ్రాహణ కుటుంబాలలోని చాంధస వైఖరులను, మూఢనమ్మకాలను, ఆచార వ్యవహారాలను తూర్పార పట్టడంలో చలం సఫలీకృతుడైనాడనే విషయం అందరూ స్థూలంగా అంగీకరించిన విషయం. ఆ వంశం గురించి చెబుతూ చలం అంటారు "ఆ వంశం వాళ్లంతా గర్విష్ఠులు, అధికారవంతులు, ప్రపంచ సంబంధం పెట్టుకోరు. కాని పొలము, కాపులు, కరణాలు, పండితులు అందర్నీ అధికారవంతంగా నిర్లక్ష్యంగా, తక్కువగా చూసి మాట్లాడటం అలవాటయిపోయింది. ఆ ఊరివారు ఇచ్చిన గౌరవమే అట్లా మార్చింది వాళ్ళని. ఇతరులతో సంబంధం పెట్టుకోరు, యాచించరు. తమ సౌఖ్యాలను, ధనాన్ని, పొలాలను వదులుకొన్నారుగాని లౌకికాధికారుల్ని ఒక్కర్నీ యాచించలేదు" అని అనడంలో వారిలో పూర్తిగా 'భేషజం' అనేది పాదుకొని పోయి తమకు తాము ప్రత్యేక వ్యక్తులుగా సాక్షాత్తు దేవదూతలుగా వ్యవహరిస్తారని వ్యంజనాత్మకంగా చలం చెప్పారు.

తన వర్గం, వర్ణానికి చెందినవారిని సైతం చలం ఉపేక్షించలేదనే విషయం చీల్చిచెండాడడనే విషయంపై వాక్యాలవలన స్పష్టమౌతుంది. అయితే బ్రాహ్మణీకం నవలను పలుమార్లు చదివిన తరువాత కొన్ని సందేహాలు ఏర్పడినవి. ఆ సందేహాలకు జవాబు కోరే ఈ చర్చ.

చలం తన కథల్లోగాని, నవలల్లోగాని ఇచ్చే సందేశం ఒక్కమాటలో చెప్పాలంటే "ప్రేమకై ప్రేమించు, ప్రేమలేని బాంధవ్యాన్ని తృణీకరించు" అనేది – అయితే మిగతా నవలలన్నీ ఒక ఎత్తు – బ్రాహ్మణీకం ఒకటీ ఒక ఎత్తు. ఇందులో స్వేచ్ఛా ప్రణయం లేదు. ఒక సంపన్న బ్రాహ్మణ స్త్రీ వ్యధ. ఆమె కుటుంబ సభ్యులూ, ఆమె బంధువులు ప్రేమించామని మోసం చేసినవారూ, సమాజ దౌష్ట్యానికి ఆమె బలి అయిన తీరు ఎంతో వ్యధ కలిగిస్తుంది హృదయమున్నవారికి! అత్యంత సజీవమైన పాత్ర సుందరమ్మ పాత్ర. ఆ పాత్ర యొక్క వాస్తవ పాత్ర (Real Character) చలం దృష్టిలోకి వచ్చినదే అయివుంటుంది. లేకుంటే అంత బలమైన పాత్రలు ఊహా జగత్తు నుంచి

పుట్టవు. సుందరమ్మ ఒక సౌందర్య జ్వాల – సామాజిక, ఆర్థిక భద్రత కల్గిన జీవితం. ఆమె జీవితం సాఫీగా గడచిపోయే పరిస్థితి. అయితే ఎందువలన ఇన్ని మార్పులు, చేర్పులు, విష గుండాలు ఏర్పడినవి జీవితంలో అని అంటే, అది కేవలం ఆలోచనా రహిత కుటుంబ సాంప్రదాయ జీవితం, ఆచార వ్యవహారాల్లోని డొల్లతనం, సమాజ గమనాన్ని అర్థం చేసుకోలేకపోవడంతో ఆ సంపన్న బ్రాహ్మణ కుటుంబం నిలువునా నాశనం అయిపోయింది. అందులో ప్రధాన వ్యక్తి అయిన 'సుందరమ్మ' కూడా జీవచ్ఛవంలా మారి చివరకు దుర్భర పరిస్థితుల్లో మరణించింది. స్వయంకృతాపరాధంవలన బ్రాహ్మణీకంలో ఉన్న విధంగా బ్రాహ్మణ కుటుంబాలు ఇప్పుడు కూడా అనేకచోట్ల దర్శనమిస్తాయి. దీనికంతటికీ కారణం చలంగారు చెప్పినట్లుగా తమని తాము ప్రత్యేక వ్యక్తులుగా, శిష్టులుగా, పవిత్రీకరణ చెందిన జాతిగా వారి మనో మందిరాల్లో తిష్ట వేసుకున్న భావజాలం మాత్రమే!

చలం నవలల్లో అరుణ, శశిరేఖ, రాజేశ్వరిలాంటి పాత్రలు లైంగిక స్వేచ్ఛ తీసుకోవడానికి ప్రధాన కారణం; వారి చుట్టూ ఉన్న పురుష పాత్రలు కొంత 'అరసికతను' కలిగి ఉండటమూ లేక ప్రేమించే హృదయం లేకపోవడంవలన వారు 'స్వేచ్ఛాప్రణయాన్ని' నమ్ముకొన్నారు. అయితే బ్రాహ్మణీకంలో 'సుందరమ్మ' విషయంలో వేరు. ఈమె భర్త మైసూరులో సంస్కృత విద్యాభ్యాసం చేసిన పండితుడు, సౌమ్యుడు, మంచి రసికుడు కూడా! సుందరమ్మ భర్తను గురించి వర్ణిస్తూ చలంగారు ఒక మాట అన్నారు. "మైసూరు సంస్కృత పాఠశాలల్లో కళాశాలల్లో చదివిన భర్త కావ్యాలు చదివేటప్పుడు వాటిల్లోని కవితా సౌందర్యాన్నిగాని, వ్యాకరణాన్ని పట్టించుకోకుండా, ఆ కావ్యాలలోని శృంగార వర్ణనలు బాగా మనస్సుకు పట్టించుకొన్నవాడు. ఆ ప్రేరణతో భార్య ఈడేరగానే మామగారింటికి వచ్చి కార్యం చేసుకొని, భార్యను తన స్వగృహానికి తీసుకువెళ్ళి ప్రత్యేకంగా ఒక గది కట్టించుకొని, ఇంటిచుట్టూ ఉన్న ఆహ్లాదకర వాతావరణంతో ప్రపంచంతో సంబంధం తెంచుకొని, తను చదివిన కాళిదాసు, శంకరుని *సౌందర్యలహరి* లాంటి గ్రంథాలలోని శృంగార వర్ణనలు అన్నీ తన భార్యలో చూసుకుంటూ 'మోహభ్రాంతి'తో పూర్తిగా మునిగిపోయాడు. పగలూ, రేయీ అనే బేధభావం లేకుండా! ఇదే ఆయన కొంప ముంచింది. అతనికి లౌకిక వ్యవహారంపట్ల ఆసక్తి లేదు. ఆరోగ్యం ఏమైపోతుందో తెలియదు. ఈ విధంగా కొద్దికాలం జరిగాక అతని ఆస్తి, ఆరోగ్యం హారతి కర్పూరంలా హరించుకుపోతుంది. సుందరమ్మ తండ్రి కూడా అల్లుడి కర్మకు అల్లుడిని వదిలేశాడు.

సుందరమ్మ భర్త చనిపోతూ సుందరమ్మని పిలిచి ఈ విధంగా అంటాడు. "యాడవకు, కాలగతి మనమేం చెయ్యలేము. ఈ రెండేళ్ళ స్వర్గం తరువాత చావంటే వ్యసనం లేదు. నిన్ను వదలటమే విచారమల్లా. కానీ నిన్ను వదలను. నా చావు తరువాత కూడా నిన్నే అంటిపెట్టుకొని ఉంటాను. ప్రతి నిమిషం నీతోనే ఉంటాను. నీ జన్మానికి నేనే నీ భర్తని". సుందరమ్మ భర్త చివరి మాటల్లో పురుష సమాజం యొక్క అతి బలీయమైన స్వార్థం కనిపిస్తుంది. భర్త చనిపోయినా, తన ధ్యాసతోనో, తన ఆరాధనతోనే నీవు బ్రతకాలనే శాసనం పరోక్షంగా కనిపిస్తుంది. ఇటువంటి శాసనంవలన భర్త చనిపోయిన తరువాత దాదాపు 3 సంవత్సరాల పాటు ఆమె ఏకాంతంలో భర్త ధ్యానంలో ఒక తపస్వినిలా గడిపింది.

సుందరమ్మ తండ్రి ఆస్తి అన్యాక్రాంతమైపోయింది. భర్త ఆస్తి కూడా ఎవరిని అడగాలో, దానిని ఏ విధంగా పొందాలో తెలియని పరిస్థితుల్లో సుందరమ్మ, తన తల్లితో, తన దేవతా సామాగ్రితో పాటు వీధిన పడింది. స్త్రీ తెలివితేటలతో పాటు ఆస్తిహక్కును కలిగి ఉంటే ఎటువంటి పరిస్థితిలోనైనా భద్రతగా ఉంటుందనే సందేశాన్ని చలం చెప్పక చెప్పినట్లయింది సుందరమ్మ పాత్ర ద్వారా!

రైలు పెట్టెలోనే, ఆ మురికి వాతావరణంలో, ప్రక్కన కూర్చున్న కిరస్తానీలతో కూర్చుని "మేం బ్రాహ్మలం" అని చెప్పుకొన్నా లాభం లేకపోయింది. 'మేం బ్రాహ్మలం' అని చెప్పుకోవడంతోనే ఒక జాతి యొక్క శతాబ్దాల అహంకార వర్తనం బయటపడుతుంది. ఇటువంటి "బ్రహ్మాండమైన భేషజం" ఏ జాతికీ, ఏ మతానికీ లేదు. ఇదే కొంప ముంచుతుందని చలంగారి హెచ్చరిక! దాన్ని ఈనాటి కులీనులు సైతం పాటిస్తున్నట్లు కనిపించడం లేదు.

సుందరమ్మ, ఆమె తల్లికీ వెంకట్రామయ్య అనే బంధువు ఇంట్లో ఆశ్రయం కలుగుతుంది. వాళ్ల ఇంటిలో చంద్రశేఖర్ అనే పేద సంగీతం పంతులు, సంగీతంలోని

శృంగార కీర్తనల ద్వారా, ఆమెలోని కోర్కెలకు 'సెగ' తగిలించాలని చూస్తాడు. ఆ ఎత్తులేం పారవు. ఇక్కడ చలంగారు ఒక మాట అంటాడు. "భర్త చితిమీదనే ఆమె శృంగారభావం కూడా తగలబెట్టి వచ్చినట్లయింది" అని. దీంతో ఆమె ఎంత స్థిరచిత్తం కలిగిందో అర్థమౌతుంది.

ఎంత స్థిరచిత్తం, వైరాగ్యభావం ఉన్నా ఆ చంద్రశేఖర్ ఏ విధంగానైనా సుందరమ్మను లొంగదీసుకోవాలనే ఉద్దేశ్యంతో ఉన్నవాడు గనుక, ఆమెలోని 'భూతదయ'ను 'మానవత్వాన్ని' ఆసరాగా తీసుకొని ఆమెను లొంగదీసుకుంటాడు.

స్త్రీ గురించి ఎంతో వ్రాసినా చలం గారు ఇక్కడ ఒక వాక్యం "ఇంకో హృదయం తన మీద కోర్కె పడుతోందంటే స్వయంగా ఇష్టం లేకపోయినా స్త్రీ హృదయం సంతోషించకుండా ఉండటం సృష్టికే విరుద్ధం'' అని అన్నారు. ఇది నిజమేననిపిస్తుంది సుందరమ్మ పాత్రను నిశితంగా పరిశీలించిన తర్వాత!

మానవ జీవితం, సుఖదుఃఖాల సమ్మేళనం, ఎవరు ఉన్నత స్థితికి వచ్చినా, హీనస్థితికి జారిపోయినా అది వారివారి స్వయంకృతమే ఔతుందిగాని అన్యం కాదు. ఈ విషయాన్ని చలం తన పాత్రల ద్వారా రూపు కట్టించాడు. తనకు లొంగిపోయిన స్త్రీ గురించి పురుషుని దృక్పథం ఏ విధంగా ఉంటుందో ఒక్క బలమైన వాక్యం చలం కలం నుంచి వెలువడింది ఈ విధంగా. "తనకు లోబడిన స్త్రీని, ఆమెకెంత ఘనత ఉన్నా సరే, తక్కిన విధాల యెంత ఆధిక్యం ఆమెకు ఉన్నా సరే పురుషుడు గౌరవించడు". ఇది అక్షర సత్యం.

ఈ విధంగా సాగిన సుందరమ్మ, చంద్రశేఖర్‌ల చాటుమాటు వ్యవహారం, ఆమె గర్భవతి కావడంతో తెలుస్తుంది. ఆ ఇంటి యజమానికి వెంకట్రామయ్యకు తెలిసిపోతుంది. చంద్రశేఖర్ పారిపోతాడు. వెంకట్రామయ్య బెదిరింపులతో వాళ్ళ ఇద్దరికీ వివాహం అవుతుంది. సుందరమ్మను దేవతగా పూజిస్తానన్నవాడు, తన మోజు తీరగానే 'పనిమనిషి' స్థాయికి తీసుకువచ్చి, తను డబ్బు సంపాదించే యంత్రంగా మారిపోతాడు. ఆమెను నిర్లక్ష్యం చేయడం ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించడమూ సుందరమ్మ ఓర్పుతో భరించింది. ఇక్కడ చలం అంటాడిలా "తన వంశపు పూర్వ వనితల అణకువా, సత్రవ్రతము మొదలయిన గుణాలు ఆమెలో ఇమిడిపోయాయి''. ఇది చలం విశ్లేషణ. ఇందులో అంతరార్థం ఏమిటంటే తన సామాజిక వర్గానికి చెందిన స్త్రీల పాతివ్రత్యాన్ని ఆయన శ్లాఘించాడు. ఈ శ్లాఘన ద్వారా చలం యొక్క మారుమూలల్లో బ్రాహ్మణత్వం విశిష్టమైనదనే భావన వెల్లడవుతుంది.

సుందరమ్మకు పండంటి మగబిడ్డ పుడతాడు. ఆమెకు ఊరట కలుగుతుంది. ఆమె తనని తాను ఓదార్చుకొనే ఆసరా దొరుకుతుంది. ఆమెలో తల్లి ప్రేమ ఉవ్వెత్తున ఉబుకుతుంది. సుందరమ్మ ఆ పిల్లవాడిపై చూపించే ప్రేమే పాతకుడికి కంటతడి పెట్టిస్తుంది. చలంగారి మాటల్లో అయితే ఎంతో విశిష్టంగా ఉంటుంది. ఆయనంటారు "దేనికి కదలవలసి వచ్చినా ఆ బిడ్డతోనే బయలుదేరుతుంది. ఎవరైనా ఆమె ఆదుర్దాను చూస్తే కోపమూ, నవ్వు వస్తాయి. కిటికీలు, తలుపులు తెరవదు. గాలి రానీదు, ఆ బిడ్డ ఏడ్చినా భయమే, ఏడవక ఊరుకున్నా భయమే. ఆవలిస్తే ఏదో భయం, ఎక్కిళ్ళు వస్తే పెద్ద జబ్బని నిశ్చయం. కళ్ళ ఎటు దిప్పినా సందేహమే. సహజంగా, కోమలంగా విజృంభించి ఆవరించే సంతోషాస్పదమైన మాతృభావం ఇట్లే వంకరలు దిరిగి, ఆమెకు వెర్రులెత్తించింది. ఆ లేత తల్లికి దిక్కులేక, విద్యలేక, ధైర్యం లేక ఉత్త గుడ్డి ప్రేమతో, భయాలు కల్పించుకొని బాధపడుతుంది. ఒక నిరక్షరాస్య, సాంప్రదాయ, చాంధస, అనాథ, ఒంటరి, అసహాయ, దీనురాలైన తల్లి ఆవేదనను చలం వర్ణించడం హృదయ వాదులను కలచివేస్తుంది.

సుందరమ్మ బిడ్డకి జ్వరం వస్తుంది. పూజలు చేస్తుంది. ఏవో మందులు తెచ్చి నాటువైద్యం చేస్తుంది. ఏ దిక్కూలేని సుందరమ్మ వాటి ఫలితాలు ఎలా ఉంటాయో తెలుసుకోలేకపోయింది. బిడ్డకు ఏదో విధంగా కులాసా కలగ్గానే మొక్కు తీర్చాలని తాపత్రయ పడుతుంది. భర్తను చేజాపి డబ్బులను యాచిస్తుంది. మొక్కు తీర్చుకోవడానికి అతని మీద లేని మోహాన్ని చూపిస్తుంది. అయినా తన 'అవసరం' తీర్చుకొని డబ్బు ఇవ్వడు చంద్రశేఖరం. సుందరమ్మ అభిమానం చంపుకొని వెంకట్రామయ్యను అడిగి కొంత తీసుకొని, తన చీర తాకట్టు పెట్టుకొని పదిహేను రూపాయలు తీసుకొని మొక్కు తీర్చుకుందామని సంబారాలు సమకూర్చుకొని గుడికెళ్లితే పూజారి ఎవరు

ఏమంటారో అని నిరాకరిస్తాడు. నిరాకరించినట్లుండక ఆమెను బలాత్కరించబోతాడు. అక్కడ నుంచి తప్పించుకొని బయటపడుతుంది. మరలా ఆమె బిడ్డకు అనారోగ్యం కనిపిస్తుంది. భర్తను యాచిస్తుంది. ప్రయోజనం శూన్యం.

బిడ్డను బ్రతికించుకోవాలని ఒక గవళ్ళతన్ని డబ్బు కోసం ఆశ్రయిసుంది.

"ఎవరమ్మా మీరు" అని అంటాడు.

"మేం బ్రాహ్మలం" అని అంటుంది.

ఇక్కడ చలంగారి విశ్లేషణ ఎంతో ఉదాత్తంగా ఉంటుంది. 'బ్రాహ్మలం' అనే గర్వపు పలుకు యుగయుగాల బ్రాహ్మణ రక్తం, బ్రహ్మజ్ఞానుల అధికారయోగ్యత, ఆమె నోటి నుంచి పలికిందా? ఆ పలుకులో బ్రాహ్మణాధిక్యత, గర్వం, తృణీకారం, గంభీరంగా వినబడి గుండెల్లో ఝుల్లనిపించాయి.

ఆ రామయ్యకు బ్రాహ్మణులంటే కోపం. అతని ద్వేషం ఆవేశ జనితమైంది. అతని జీవితాశయం ఒక బ్రాహ్మణ స్త్రీతో సంభోగం చేయాలి. ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నిస్తే మాత్రం రామయ్య దగ్గర జవాబు లేదు.

సుందరమ్మ రామయ్యను డాక్టరనుకొని అతన్ని ఆశ్రయిస్తుంది. అయితే అతను చావటానికి సిద్ధంగా ఉన్న ఆ పసిపాప ప్రక్కన సగం చనిపోయిన సుందరమ్మను అనుభవిస్తాడు. అతను డాక్టరు కాదని అర్థమైంది సుందరమ్మకు! ఆమెలో పెనుతుఫాను బయలుదేరింది. ఆమెలో తరతరాలుగా జీర్ణించుకొనిపోయిన జపాలు, తపాలు, శ్రోత్రియం, ఆధ్యాత్మిక సంపద, ఆధిక్యత ఒక్కసారిగా మహోజ్జ్వల కాంతితో లేచినట్లయింది. శూద్రుడైన రామయ్య దేహానికి, హృదయానికి చేసిన గాయం తీవ్రమైపోయింది. ఒక్కసారిగా సగం చనిపోయిన సుందరమ్మ రక్తం, పెద్ద ఘోషతో మేల్కొని ఆమెలో నూతన విద్యుచ్ఛక్తి ప్రవహించింది. అతని వెనుక ఉన్న దీపం మంటలో ఆహుతి అయిపోతాడు రామయ్య."

ఇక్కడే చలంగారు ఏమి చెప్పాలనుకున్నాడనేది అర్థమైపోతుంది. రామయ్య యాదృచ్ఛికంగా కాలిపోయినా, సుందరమ్మ మేల్కొన్న నూతన ధర్మజ్వాలలో, పవిత్ర బ్రాహ్మణ తేజంతో రామయ్య కాలిపోయాడనే స్పృహను నిరాటంకంగా, నిరభ్యంతరంగా, వ్యక్తపరచి చలంగారు బ్రాహ్మణీకం యొక్క గొప్పతనాన్ని సమర్థించాడు. ఆధునిక దృక్పథం ఉన్నవారికి 'రామయ్య' చనిపోవడం యాదృచ్ఛికమైతే, సాంప్రదాయవాదుల దృష్టిలో 'రామయ్య' కాలిపోయి చనిపోవడం ఒక ధార్మిక బ్రాహ్మణ స్త్రీ శాపంగా కనిపిస్తుంది. సుందరమ్మ భర్త చనిపోయి రెండో భర్త చంద్రశేఖర్ హింసించినా, రామయ్య ఆమెను అనుభవించినా, ఆమెలోని సచ్ఛీలత, సౌజన్యం, పాతివ్రత్యం, బ్రాహ్మణికంలాంటి అనేక ధార్మిక లక్షణాలకు భంగం కలగలేదని నిరూపించడంలో చలం సఫలీకృతుడైనాడు.




చలం ఈ నవలను ముగిస్తూ "బ్రాహ్మణ కడపటి మహాత్మ్యం బ్రాహ్మణీకం ఈ కలియుగాన సుందరమ్మతో అంతమైందని" అంటాడు.

ఇక్కడే చలంగారి గురించి దీర్ఘంగా ఆలోచించాలి. ఈ వాక్యాలు అనేక అర్థాలనిస్తుంది.

ఒకటి సుందరమ్మలో మహోజ్జ్వలంగా వెలిగిన బ్రాహ్మణ తేజస్సు ముందు రామయ్య అంతరించాడు.

రెండు ఇంత ఉన్నతమైన బ్రాహ్మణీకం సుందరమ్మతో అంతమైందని అంటున్నాడు. ఇది ఒక హెచ్చరిక సజాతీయులకు.

మూడు వందల సం॥రాల నుంచి వస్తున్న బ్రాహ్మణత్వం యొక్క గొప్పదనాన్ని నిలవండిరా ఛాంధసుల్లారా అనేది.

నాలుగవది బ్రాహ్మణీకంలోనే ఔన్నత్యం ఉన్నదనే సందేశం అంతర్లీనంగా ఉంది.

ఇవన్నీ ఆలోచిస్తుంటే మహా రచయిత అయిన చలంగారి సహజాతం (instinct)లో బ్రాహ్మణత్వం మాయం కాలేదని స్పష్టమౌతుంది. ఏది ఏమైనా చలంగారు స్త్రీ స్వేచ్ఛ కోసం పడిన ఆరాటం, చేసిన పోరాటం సామాన్యమైనవి కావు. ఇంకెవ్వరూ చెయ్యలేనివి. స్త్రీ సమాజానికి చలం ప్రాతఃస్మరణీయుడు.

ముంగర జాషువా
నాగార్జునసాగర్. ఫోన్: 824 783 9312.

# ఖాకీవనం

## కె.ఎన్.వై. పతంజలి

మామూలు పాఠకుల్లోనే కాక, ఎందరో మేధావులు, రచయితల్లోనూ ఎంతగానో ప్రాచుర్యం పొందిన నవల 'ఖాకీవనం'. రచయిత కె.ఎన్.వై. పతంజలి. ఈ నవల ముందుగా చతుర మాసపత్రిక, నవంబర్ 1980లో ప్రచురింపబడింది. పూర్తిగా పోలీసు వ్యవస్థ గురించిన నవల.

మన సమాజంలో పోలీసు వ్యవస్థ ఓ విచిత్ర సమాహారం. నిర్ధారణగా ఏది ఏమిటో ఎంతమాత్రం అర్థంకాని శాఖ. పోలీసులంటే జనం నమ్ముతున్నారా? భయపడుతున్నారా? వాళ్లు మంచివాళ్లా? దుర్మార్గులా? సమాజసేవకులా? ప్రజల్ని హింసించేవాళ్లా? నిజాయితీపరులా? లంచ గొండులా? వాళ్లని నమ్మవచ్చా? లేదా? పోలీసులు సుఖపడుతున్నారా? సమయాసమయాలు లేని చాకిరీతో బాధపడుతున్నారా? వాళ్లకి విధి సక్రమంగా నిర్వర్తించే స్వాతంత్ర్యం ఉందా? లేదా? ఆత్మాభిమానం కొరవడి బాధపడుతున్నారా? అధికారం చెలాయించి ఆనందపడుతున్నారా?... ఇలాంటి చాలా ప్రశ్నలకి నిర్ధారణగా ఇదీ జవాబు అని చెప్పలేని ఓ మిశ్రమ వ్యవస్థ అది. దాని తీరు, నిర్వహణ కూడా అలాంటివే. పోలీసులంటే భయపడని సామాన్యులు చాలా తక్కువ శాతం.



కె.ఎన్.వై. పతంజలి

పూర్తిగా పోలీసు వ్యవస్థ మీద తెలుగులో ఇదికాక మరో నవల ఉంది అనుకోను. దుర్మార్గులు, దొంగతనాలు, రంకులు, లంచాలు, మోసాలు నిండిన ఇటువంటి వస్తువుతో నవల రాయాలనుకోవటం పతంజలి చేసిన సాహసం. రకరకాల ఘటనలే తప్ప, ఒక సూత్రంతో సాగే కథలేని ఇలాంటి నవలా రచనకి ప్రత్యేకమైన నేర్పుండాలి.

'ఖాకీవనం' నవలలో మురికివాడల బతుకు దగ్గర్నించీ, ఖద్దరు నాయకులవరకు పలు విషయాల్ని రచయిత పతంజలి చర్చించారు. కానీ ఆయన దృష్టి కేంద్రీకరణ అంతా ముఖ్యంగా పోలీసుల స్థితిగతులమీద... వారి మనస్తత్వం, ప్రవర్తనాసరళి మీద... అహంభావం, ఆత్మన్యూనతల మీద.

నవల ఆరంభమే ఓ సంక్లిష్ట సంఘటనతో జరుగుతుంది. ఎస్.పి. గారి భార్య వారింటికి డ్యూటీకి వచ్చిన సుందరయ్య అన్న కానిస్టేబుల్‌తో దొడ్డికెళ్లిన చంటిపిల్ల ముడ్డి కడిగించింది. మారుమాట లేకుండా ఆ పనిచేసిన సుందరయ్య మనసు చచ్చిపోయింది. ఉద్యోగ స్థితిని తిట్టుకున్నాడు. వీధి గేటు దగ్గర డ్యూటీలో ఉన్న ఆర్డర్లీ కానిస్టేబుళ్ల ముందు తన గోడు వెళ్లబోసుకున్నాడు. ఇంటి లోపలికి వినపడకుండా నలుగురూ ఎస్.పి.ని, ఆయన గయ్యాళి భార్యనీ నానా తిట్లు తిట్టుకున్నారు. చేతకాని స్థితిలో బలమైన ఆయుధం తిట్టే. ఎస్.పి. గారు ఇంటి పనులు చేయించుకోమన్నారు కాబట్టి ఆయన భార్య ఉచ్చం, నీచం అనకుండా అన్ని పనులూ చెపుతోంది. పదిరూపాయలిచ్చి మార్కెట్ నుంచి ఆరు రకాల చేపలు తెమ్మంది. ఇద్దరు కానిస్టేబుళ్లు వెళ్లి ఆ పది రూపాయలు కూడా ఖర్చు చేయకుండా ఎస్.పి.గారికని చెప్పి చేపలు దండుకొచ్చారు. పరువు తీసేశారని ఆ పనినీ తిట్టింది ఆవిడ. ఓ తీరూ తెన్నూ లేని పనులు వాళ్ల పాలిట నిత్య నరకం. ఎస్.పి. గారింటి దగ్గర కానిస్టేబుళ్లు డ్యూటీలో ఉండటం సాధారణమే! కానీ వాళ్లు ఏ పనుల కోసం? అన్నది నిర్ధారణ లేదు. రూలు వేరు, జరుగుతున్నది వేరు. అడిగేవాళ్లు, అడ్డుకునేవాళ్లు లేరు. కాబట్టి ఎవరి ఇష్టారాజ్యం వారిది. నవల ఆరంభంలోని ఈ సంఘటనతోనే పోలీసులు సగం చచ్చి ఉద్యోగాలు ఎలా చేస్తున్నారో? చూపించారు పతంజలి.

అందర్నీ పిలిచేది 'పీసీ' అని. అంటే 'పోలీసు కానిస్టేబుల్' అని! అందరివీ ఖాకీ యూనిఫారాలే! ఇక టోపీలు, లాఠీలు సరేసరి! కానీ లోలోపల అంతరంగాలలోనే భేదం.

పోలీసంటే తిరుగులేని అధికారమని, దొరికినవాళ్లందర్నీ భయపెట్టి, జులుం చేసి పొగరు ప్రదర్శించాలని అనుకునే కానిస్టేబుల్ ఒకడైతే... అధికారులు పెట్టే హింస భరించలేక వాళ్లు చెప్పినట్టు చెయ్యలేక, వాళ్ల ముందు నోరు రాక, పక్కకి వచ్చిన తర్వాత అడ్డమైన తిట్లూ తిట్టుకునే కానిస్టేబుల్ మరొకరు.

అధికారుల కనుసన్నల్లో మెలుగుతూ, నక్క వినయం చూపిస్తూ, వాళ్లకి తొత్తులా ఉంటూ, రకరకాలుగా కాకాపడుతూ, పబ్బం గడుపుకుని, ఏదో రకంగా జీవితాన్ని సుఖమయం చేసుకోవాలనుకునే సుబ్బారావులాంటివాళు ్ల మరికొందరు! ఎవరి తీరు ఏ రకమైనా అందరూ తమ తమ ఉద్యోగాల్ని తిట్టుకునేవారే! ఏం జరిగినా నోరు మూసుకు ఊరుకోవడం మంచిది. తప్పేదా? వదిలేదా? 'బూటు కట్టిన్నాడు పట్టిన ఈ శని, సర్వీసు ఉన్నంత కాలమూ వదలదు,' అన్నదే మెజారిటీ భావన.

ఈ రకం బాధ కొందరిదైతే మరికొందరిది మరోరకం. ఎటువంటి దుర్మార్గానికైనా వెనుకాడని కానిస్టేబులు తీరుకి భిన్నంగా పాపభీతితో సతమతమయ్యే నారాయణలాంటివారు కొందరు. భిన్నమైన వ్యవస్థలో విభిన్నమైన వ్యక్తులతో ఓ పటం మన కళ్ల ముందు నిలిపారు పతంజలి.

డి.ఐ.జి. బ్రహ్మానందం, ఎస్.పి. పార్థసారథి, డి.ఎస్.పి. కామేశ్వరావు, సి.ఐ. కాశీపతి ఇంకా చాలామంది కానిస్టేబుళ్లు... ఒకవైపు. పూరిగుడిసెలో బతికే గౌరి, దాని తండ్రి, దాని పెత్తండ్రి తాగుబోతు సూరీడు, పోలీసు రైడింగులో అవమాన పడిన కమలి, భాస్కర్, క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, పోలీసులకి మద్దతుగా నిలిచిన ఎస్.ఐ. ప్రకాశరావు పాత్రలు మరోవైపు.

పోలీసుల్లో అలజడి రేపి, వారిని ఆవేశపరచి, నిరసనని ప్రేరేపించి, చివరికి సమ్మెకి దిగేలా చేసిన సంఘటనలు రెండు. ఒకటి కానిస్టేబుల్ సుబ్బారావు మున్సిపల్ కార్మికుల మీద చెయ్యి చేసుకోటం, రెండోది చెరబట్టిన గౌరి దగ్గర్నుంచి అర్ధరాత్రి తిరిగి వస్తున్న సి.ఐ. కాశీపతిని కత్తితో పొడిచి హత్య చెయ్యటం.

పోలీసు దుర్మార్గం కరుడుకట్టిన వ్యక్తి కాశీపతి. మురికివాడలో నివసించే గౌరి అతని కంటపడింది. అప్పుడే సవత్తాడింది గౌరి. ఏపుగా, నదురుగా కనిపించింది కాశీపతికి. గౌరి తండ్రిని భయపెట్టి, పోలీసు జులుంతో హింసించి లొంగదీసుకున్నాడు. చేసేదేంలేక, తప్పని పరిస్థితిలో ఆ తండ్రే తన కూతురు గౌరిని, కాశీపతికి అప్పగించాడు. ఆ పిల్లని తీసుకొచ్చి వేరే ఇంట్లో పెట్టి, రోజూ తన కామం తీర్చుకుంటున్నాడు కాశీపతి. ఆ రోజు అలాగే తన కోరిక తీరాక, అర్ధరాత్రి మోటార్‌సైకిల్ మీద తన ఇంటికి బయలుదేరాడు. ఆ దారిలో కాపు కాసిన భాస్కర్ పాతపగతో కాశీపతిని ఆపి, రోడ్డు మీదే కత్తితో పొడిచి... పొడిచి చంపాడు. ఓ పోలీసు ఆఫీసరు హత్య. డి.ఐ.జి స్వయంగా రంగప్రవేశం చేశారు.

దీనికితోడు కానిస్టేబుల్ సుబ్బారావు పోలీసు పొగరుతో మునిసిపాలిటీ కార్మికుణ్ణి అనవసరంగా ఈడ్చికొట్టి, కిందపడిన అతని ఛాతీ మీద తన బూటు కాలితో తొక్కిపెట్టి... 'తెలిసిందిరా లంజకొడకా! పాకీ నాకొడకా! ఈ కాలిలాగే గట్టిగా నొక్కానంటే రక్తం కక్కుకుని మరీ చస్తావు. పోలీసోడంటే నీకు తమాష లాగుందిరా? జాగ్రత్త...!' అని తీవ్రంగా అవమానించాడు.

'పరదేశీ' అన్న ఆ కార్మికుడు ఆ తర్వాత చాలా గొడవ చేశాడు. తమ యూనియన్నంతా కదిపాడు. చెత్త లారీలు, ట్రక్కులు, ట్రాక్టర్లు, వందల సంఖ్యలో కార్మికులు, సుబ్బారావు పనిచేస్తున్న వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌ని ముట్టడించారు. సుబ్బారావుని సస్పెండ్ చేసేవరకూ గొడవ సద్దుమణగలేదు.

అదేరోజు రాత్రి కాపు వీధిలో 'చిన్నరవణ' అన్న లోకల్ వ్యవహర్తతో గొడవ పెట్టుకున్నారు పోలీసులు. రవణ మనుషులు వాళ్లని బాగా తన్ని పంపించారు.

పోలీసులకి తన్నులు, ఓ కానిస్టేబుల్ సస్పెన్షన్, ఓ పోలీసు ఆఫీసరు మర్డరు... పైగా ఊళ్లో డి.ఐ.జి! డి.ఐ.జి.గారి ఆర్డర్‌తో డి.ఎస్.పి. కామేశ్వరావు, పోలీసులు విజృంభించి, ఆ రాత్రి కాపువీధిలో నానా బీభత్సం సృష్టించారు. చిన్న రవణని అరెస్ట్ చేశారు. పోలీసుస్టేషన్‌లో అతను చచ్చిపోయాడు. 'కార్డియాక్ అరెస్ట్' అని అబద్ధం సర్టిఫికేట్‌తో కోర్టులో తప్పుడు కేసు ప్రొడ్యూస్ చేసి, కేసు మూసేశారు. మేజిస్ట్రేట్ తమకి అనుకూలంగా ఇచ్చిన తీర్పుతో ఇంకేం గొడవ ఉండదనుకున్నారు.

కానీ చిన్నరవణ మనుషులు రాజధానిలో అల్లరి లేవదీశారు. హోం మినిష్టర్‌కి, సి.ఎం.కి ఫిర్యాదు చేశారు.

మీడియాలో పెద్ద దుమారం లేచింది. కేసు తిరిగి ఎంక్వయిరీకి వచ్చింది. ఎస్.పి. ఎంక్వయిరీ ఆఫీసరుగా విచారణ చేసి, ఓ నాటకం ఆడాలని అనుకున్నారు పోలీసుశాఖవారు. ఆ రాత్రి కాపు వీధికి వెళ్లి జనాన్ని చితకబాదిన పందొమ్మిదిమంది కానిస్టేబుళ్లని సస్పెండ్ చెయ్యడం, ఈ నాటకంలో ఓ భాగం అన్నారు. ఈ చర్యకి నిరసనగా పోలీసులు ఎదురు తిరిగారు. ఎస్.ఐ. ప్రకాశరావు ఆధ్వర్యంలో ఎస్.పి. ఆఫీసు ముందు ఆందోళనకి దిగారు.

ఎ.ఎస్.పి.ని వాళ్లతో మాట్లాడి రమ్మని పంపించాడు ఎస్.పి. పార్థసారథి. ఆందోళనాకారులకి గంటసేపు నచ్చజెప్పిన ఎ.ఎస్.పి. తిరిగి వచ్చి, 'సార్! రాత్రి పన్నెండు గంటల్లోపల సస్పెన్షన్ ఆర్డర్లు విత్‌డ్రా చెయ్యకపోతే రేపు సమ్మె చేస్తారట సార్! సివిల్ పోలీసు, రిజర్వ్ పోలీసులు కూడా. అదీ వాళ్లు మీకు చెప్పమన్నది' అని చెప్పాడు.

ఈ లోపల హెడ్‌క్వార్టర్స్ నుంచి వచ్చిన మరో మెసేజ్ పట్టుకుని ఓ కానిస్టేబుల్ వచ్చాడు. ఎస్.పి. పార్థసారథి అది చదివాడు. 'ఇదంతా నా ఖర్మ! ఈ లంజాకొడుకులు రద్దు చేసుకోవద్దంటారు. మధ్య నేను చస్తున్నాను,' అనుకున్నాడు.

మర్నాడు పోలీసులు సమ్మెతో పాటు నిరాహారదీక్ష ప్రారంభించారు. ఐ.జి.కి స్వయంగా రాక తప్పలేదు. ఐ.జి. రాకతో పోలీసుల్లో సమ్మె ఉత్సాహం పెరిగింది. మరి ఒకటి రెండు రోజులు అలాగే దీక్ష కొనసాగిస్తే, సమ్మె మిగిలిన ప్రాంతాలకి విస్తరించి, ఉధృతమై, హోంమినిష్టర్‌ని కూడా కాళ్ల బేరానికి రప్పిస్తుందని ఎస్.ఐ. ప్రకాశరావు వాళ్లని ఉత్తేజపరిచాడు.

ఎస్.పి.ని, డీ.ఎస్.పి.ని దూరంగా ఉంచి, ఐ.జి. సమ్మెకారుల మధ్యకి వచ్చి ఉపన్యాసం ఆరంభించాడు. 'నో... మీరు ఇలా చెయ్యకూడదు. ఇది చట్టబద్ధం కాదు. దీనివల్ల మీకే నష్టం. యూనిఫాంలో ఉండి మీరిలా ఎలా ప్రవర్తించగలుగుతున్నారో? నాకు అర్థం కావడం లేదు. నా మాట వినండి. మీరు అనవసరంగా చెడిపోతారు. చేజేతులా ఉద్యోగాలు పాడుచేసుకోవద్దు'

ఐ.జి. మాట ఎవరూ వినలేదు సరికదా, ఓ కానిస్టేబుల్ వెనక నుంచి తోసేశాడు. ఐ.జి. వెళ్లి మరో కానిస్టేబుల్ మీద పడ్డాడు. 'అదేంటి సార్! మీద పడ్డారు!' అని అతను ఓ నెట్టు నెట్టాడు. అలా ఐ.జి. పని బంతాటగా మారింది. ఎస్.పి, డి.ఎస్.పి. వచ్చారు రక్షణగా. ఐ.జి. వెనుతిరక్క తప్పలేదు.

మర్నాడు సమ్మె ఉధృతమైంది. అలాగే ఐ.జి. తదితరుల పన్నాగాలు ఉధృతమయ్యాయి. సమ్మె మరికొన్ని ప్రాంతాలకి పాకింది. అధికారులు బి.ఎస్.ఎఫ్. బలగాల్ని పిలిపించారు. అర్ధరాత్రి దాడులు జరిగాయి. నిరాహారదీక్ష శిబిరంలో వాళ్లని అరెస్టు చేశారు. అలాగే ఆందోళన చేస్తున్న వారిని, అరవైమందికి పైగా అరెస్టు చేశారు. సమ్మెని అణిచెయ్యగలిగారు. పోలీసుల చేత పరేడ్ గ్రౌండ్‌లో పనిష్‌మెంట్ డ్రిల్ చేయించారు.

ఒకరికొకర్ని ఎదురెదురుగా నిలబెట్టి, చెంప చెళ్లుమనేలా ఒకరిచేత మరొకర్ని కొట్టించారు. గతిలేక తమవారిని తామే కొట్టడం ఘోర అవమానం. పోలీసుల ఆత్మాభిమానం ఈ రూపంలో మరోసారి దెబ్బతింది.

అంతా సద్దుమణిగాక డి.ఎస్.పి. కామేశ్వరరావు కంట్రోల్ రూమ్‌కి వచ్చినప్పుడు, అక్కడ డ్యూటీలో ఉన్న లక్ష్మణరావు సెల్యూట్ చెయ్యలేదు సరికదా, అధికారి కళ్లల్లోకి సూటిగా చూశాడు. లక్ష్మణరావే కాదు, మరో కానిస్టేబుల్ చూపులు అలాగే కనిపించాయి. ఆ అధికారికి. ఈ సందర్భంలో రచయిత పతంజలి 'అవే ఆచూపులు, అందులో అవే కత్తులు' అంటారు.

పోలీసు కలహాల్ని, ఘర్షణల్ని సమ్మెలాంటి చారిత్రక స్థాయిదాకా చిత్రీకరించటం మరోవిశేషం. ఈ నవలలోని పలు ఘటనలు ఆంధ్రదేశంలో జరగకపోయినా, మన దేశానికి చెందినవే అని, వివిధ వార్తాపత్రికల నుంచి సేకరించినవేనని, ఈ రచయిత నవలాంతంలో వివరణ ఇచ్చారు. నిస్సందేహంగా ఇదో విభ్రమన తెలుగు నవల.

* * *

*కెఎన్‌వై పతంజలి 29 మార్చి 2952న విజయనగరం జిల్లా అలమండ గ్రామంలో జన్మించారు. పదునైన కలం. చాలా పత్రికలలో పనిచేశారు. నవల, సినీ, ఫీచర్ రచయితగా, సంపాదకుడిగా ప్రసిద్ధులు. 11 మార్చి 2009న మరణించారు.*

వి. రాజారామమోహనరావు
హైదరాబాద్. ఫోన్: 939 473 8805.

# చదవండి...

**- మిసిమి**

**కతల చెట్టు:** తెలంగాణా బడి పిల్లల కతలు. సంకలనం. గత పదేండ్ల నుండి రంగినేని సుజాతా మోహన్‌రావు ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్, సిరిసిల్లలో ప్రతి సంవత్సరం పాఠశాలల్లో చదువుకొనే బాలల్లో 'బాల సాహితీవేత్తల'ను ప్రోత్సహించే దిశలో 'సృజనశాలలు', కథ, కవిత్వ రచనా కార్యశాలలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రస్థాయిలో పిల్లల కథలను ఆహ్వానించి, 75 కథలను ఎంపికచేసి, చివరకు కమిటీ ప్రచురణ కోసం సిఫారసు చేసిన కథలను 'కతల చెట్టు' తెలంగాణా బడి పిల్లల కతలుగా తీసుకు వచ్చారు. ఈ కథలతో పాటు విద్యార్థులు చిత్రాలు గీసి పంపారు. ఈ బాల రచయితలు 5 నుండి 10 వ తరగతి విద్యార్థులు. ఈ బాలల 'కతల చెట్టు' 'కతల కానుగ చెట్టు'లా రేపటి రచయితలైన మన బాల రచయితలకు, వారి రచనలకు ఎరువై నిలవాలని 'నారుమడై' పండాలని కోరుకుంటూ ఈ చిన్నారి రచయితల్ని ఆశీర్వదించండి.




*పేజీలు: 126, వెల: ₹ 100/-*

*ప్రతులకు: రంగినేని ఎస్.ఎమ్.ఇ.సి. ట్రస్ట్, కరీంనగర్ రోడ్, సిరిసిల్లా - 505 301. ఫోన్: 98490 12459, 92906 87853.*

**నాగలికి నా నమస్కారం:** సోమేపల్లి వెంకట సుబ్బయ్య ఇప్పటికే, నాలుగు నానీల సంపుటిలను వెలువరించిన సోమేపల్లి వెంకటసుబ్బయ్యగారు రాసిన ఐదవ నానీల సంపుటి 'నాగలికి నా నమస్కారం!' పల్లెల మట్టి వాసనను గ్లోబలైజేషన్ పేరిట కుదించుకుపోయిన ప్రపంచాన్ని వేడుకల ఆడంబరాల్లో జరిగే ఆహార పదార్థాల దుబారాలను భూమి నేడు వ్యాపార వస్తువుగా మారిన విధానాన్ని ఇలా ఎన్నో సామాజిక అంశాలపై తన నానీల చురకలు అంటించారు వెంకటసుబ్బయ్యగారు. ఒక రైతు, పొలం, శ్రమైక జీవనం, దానికి ఇవ్వాల్సిన గౌరవం మట్టిలో పుట్టి మట్టిలో కలిసిపోయే మనిషి కర్తవ్యం అని నిరూపితం చేసే వెన్నెముక ఈ 'నాగలికి నా నమస్కారం' నానీలు.




*పేజీలు: 47, వెల: ₹ 60/-*

*ప్రతులకు: సోమేపల్లి వెంకటసుబ్బయ్య, 16-8-451, 1వ అంతస్తు, శ్రీనివాస నిలయం, విజయపురి కాలని, '0' లైను (కట్ రోడ్), జె.కె.సి. కాలేజ్ రోడ్, గుంటూరు - 522006.*

**నా మాటల మూట:** ఉప్పల గోపాలరావు. చిన్ననాటినుండే వ్యవసాయ కార్మిక సంఘాల, రైతు సంఘాల ఉద్యమాలతో, విద్యార్థి సంఘాలతో, హేతువాద ఉద్యమాలతో సంబంధాలు, ప్రత్యేకంగా వ్యవసాయ కార్మికుల, రైతుల, రైస్‌మిల్ ఉద్యమాలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్న శ్రీ ఉప్పల గోపాలరావుగారికి ప్రతి సంఘటన మీద స్పందించి కరపత్రాలు వ్రాసి జనానికి పంచే అలవాటు ఉంది. సామాన్య ప్రజలకు ఏ విషయమైనా తేటతెల్లంగా తెలియజేయటమే తన సాహిత్య ప్రయోజనం అని గట్టిగా నమ్మి, ఆ ప్రయోజనం కోసం గోపాలరావుగారు రాసిన పుస్తకమే 'నా మాటల మూట'. మంచి పాలకులకు, మంచి పాలనా యంత్రాంగానికి మూలం ప్రజలే, ఆ స్పృహ ప్రజలలో పెరగాలి. ఆ దృష్టితోనే ప్రజలు, పాలకులు, పాలన, పాలనా యంత్రాంగాన్ని గురించి, ప్రజాస్వామ్యాన్ని గురించి, చట్టబద్ధ పాలన గురించి గోపాలరావుగారు 'నా మాటల మూట'లో రాశారు.




*పేజీలు: 62, వెల: అమూల్యం.*

*ప్రతులకు: శ్రీ ఉప్పల గోపాలరావు, బ్లాక్-15, ఫ్లాట్ నెం. 107, రైయిన్ ట్రీ పార్క్, మలేషియన్ టౌన్‌షిప్, కె.పి.హెచ్.బి., హైదరాబాద్ - 85.*
*ఫోన్: 040-66881517, 944 005 3099.*

**ప్రమిద:** రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించి, అనేక కష్టాలను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, వీటన్నింటికీ మూలాలు అన్వేషించే కార్యక్రమమే తన




కవిత్వం - తన అధ్యయనం, తన పరిశీలన అని నమ్మి మినీ కవిత్వ సిద్ధాంతకర్తగా సాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు రావి రంగారావుగారు. వారి సాహితీ సేవను స్మరించుకునేందుకు తీసుకు వచ్చిన సంపుటే ప్రమిద మాసపత్రిక వెలువరించిన 'రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక'. పిల్లలతో, విద్యార్థులతో, యువకులతో కవిత్వం రాయించటం రంగారావుగారి ప్రవృత్తి. 'మచిలీపట్నం సాహితీ మిత్రులు' స్థాపించి దాదాపు 30 ఏళ్లు నడిపించారు. మంచి కవిత్వాన్ని, మంచి వ్యక్తిత్వాన్ని స్పృశించాలంటే ఈ పుస్తకం చదవండి.

*పేజీలు: 191, వెల: ₹ 50/-*

*ప్రతులకు: 101, వసుంధర ఎన్‌క్లేవ్, నారాయణపురం, ఈడేపల్లి, మచిలీపట్నం - 521 001.*

*ఫోన్: 988 545 9193, 850 053 8318.*

**సిరివెన్నెల రసవాహిని:** సినీ గీత విశ్లేషణ. రచయితఫ డా. పైడిపాల. సిరివెన్నెల హృదయాన్ని అవగతం చేసుకుని రచయిత పైడిపాల రాసిన విశ్లేషణ ఈ పుస్తకం. క్లుప్తంగా పంచిన ఆలోచనాధార ఈ పుస్తకం. సిరివెన్నెల గేయ రచనల్లో ప్రత్యేకతలను పదహారు భాగాలుగా విభజించి సిరివెన్నెల సినీగీత




ధారను విశ్లేషిస్తారు పైడిపాల. సిరివెన్నెలను అభిమానించేవారికి పరవశం కలిగిస్తుందీ పుస్తకం. సినీగీతం విశ్లేషకులు పైడిపాల అలవోకగా చేసిన అక్షర హారాలు ఈ పుస్తకం.

*పేజీలు: 227, వెల: ₹ 250/-*

*ప్రతులకు: డా. పి.యస్. రెడ్డి (పైడిపాల), 11-20, కొంకాపల్లి, అమలాపురం - 533 201.*

*ఫోన్: 998 910 6162.*

**మేఘసందేశము:** సూర్యదేవర రవికుమార్. మహాకవి కాళిదాసు రచించిన 'మేఘసందేశము'ను డా. సూర్యదేవర రవికుమార్ గారు విభిన్నంగా అనువదించాడు. ఇందులోని శ్లోకాల నామాలను గీతికలుగా (పాటలుగా) తెనిగించారు. పల్లవి, చరణాలు అనే విభాగాల జోలికి పోకుండా ఒక్కొక్క శ్లోక భావాన్ని ఒక్కొక్క పాటగా వ్రాశారు.




రవికుమార్ గారు పద్యకావ్యాలతోపాటు గేయకృతుల్లో పాటలను సమీక్షించిన మంచి అనుభవం సంపాదించిన నేపథ్యంలో, ఆయా రచనా సందర్భాలలో తదనుగుణ పదాలను అప్రయత్నంగాను సప్రయత్నంగానూ నిలిపి విలువ పెంచే ప్రయత్నం చేశారు. ఈ చక్కటి ప్రయత్నాన్ని మీరు చదివి ఆశీర్వదించండి.

*పేజీలు: 63, వెల: ₹ 50/-*

*ప్రతులకు: సూర్యదేవర స్వరూపరాణి, ఎస్ 4, పరమేశ్వరి టవర్స్, 4వ లైను, లక్ష్మీపురం, గుంటూరు - 522 007.*

**సమాహారం:** శరత్‌చంద్ర కథలు. 'కథ కత్తిలా ఉండాలి. చదివితే గుండెల్లో దిగబడిపోవాలి. జీవితాంతం ఆ గాయం గుర్తుండిపోవాలంటాడు' ఓ రచయిత. దీనిని అక్షరాలా తన కథల ద్వారా నిజం చేసి చూపించిన రచయిత శరత్‌చంద్ర. ప్రభుత్వ ఉద్యోగిగా, ప్రజాజీవితంలో రాజకీయంగా ఎదిగి, జర్నలిస్టుగా




శరత్‌చంద్రగారిది బహుముఖ ప్రజ్ఞ. ఇది వ్యక్తుల జీవితాలను సమీపం నుంచి చూడటానికి, తద్వారా కథాకుసుమాలను వెలువరించడానికి దోహదపడింది. ఈ సంపుటి కథలన్నీ బహుమతి కథలవటం ఒక విశేషం.

*పేజీలు: 293, వెల: ₹ 200/-*

*ప్రతులకు: శరత్‌చంద్ర, ఇం.నెం. 13-6-434/డి/50, జ్యోతినగర్, పిల్లర్ నెం. 90, పి.వి.ఎన్.ఆర్. ఎక్స్‌ప్రెస్ హైవే, గోల్కొండ పోస్ట్, హైదరాబాద్-500 008 మరియు పాలపిట్ట బుక్స్ హైదరాబాద్. ఫోన్: 984 878 7284.*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi Publication

## మిసిమి ప్రచురణలు


**నోబెల్ వ్యాసాలు**


**మిసిమి** పార్థసారథి వ్యాసాలు


**చిత్రకళా నీరాజనం**


**నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు**


**పురస్కార సాహిత్యం**


**వ్యాస మంజూష**


**సారస్వత వ్యాసాలు**


చార్లీ చాప్లిన్


**రజ్జు సర్పభ్రాంతి**


**బైరన్**


**షెల్లీ జీవిత కథ**


దోసిట చినుకులు


**నృత్యభారతి**


పారిజాతం


సిద్ధార్థ


సప్తపర్ణి

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.